సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 290

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

శుక్రవారం 10-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

GRT JEWELLERS Since 1964

స్వర్ణ సంక్రాంతి



ప్రత్యేక ఆఫర్లు

బంగారు ఆభరణాల

20% తగ్గింపు* తరుగు (VA) పై

వజ్రాల ఆభరణాలు

25% వరకు తగ్గింపు* వజ్రాలు మరియు అన్‌కట్ వజ్రాల విలువపై (సాలిటైర్ మినహా)

వెండి వస్తువుల

25% తగ్గింపు* తరుగు (VA) పై

వెండి ఆభరణాల

10% తగ్గింపు* MRP పై

30% వరకు తగ్గింపు* ప్లాటినం ఆభరణాల మేకింగ్ ఛార్జీల పై

*ఈ ఆఫర్ బంగారు నాణేలు మరియు బార్లపై వర్తించదు. వెండి వస్తువులకు VA మరియు MC వర్తిస్తాయి
ఈ ఆఫర్‌ను ఇతర ఆఫర్లతోనూ కలపడంకుదరదు. నిబంధనలు మరియు షరతులు వర్తిస్తాయి.

HDFC BANK
Offer: 2% Cashback #Min. transaction: ₹75,000,Max cap : Rs. 5000.
Validity: 9th Jan to 19th Jan 2025. T&C apply.
Attractive offer on online purchase also.

Telangana I Andhra Pradesh I Karnataka I Tamil Nadu I Puducherry II Singapore

Store Locator

Shop online at: www.grtjewels.com I GRT LIVE VIDEO SHOPPING Shop from the comfort of your home

AMRITA VISHWA VIDYAPEETHAM
DEEMED TO BE UNIVERSITY UNDER SECTION 3 OF UGC ACT, 1956

WE MAKE YOU BE WHO YOU WANT TO BE

MBA PROGRAMS



Apply with
ACAT 2025
AMRITA COMMON APTITUDE TEST

Upto **100%** Scholarship* for ACAT Rank Holders	**93.62%** Placement in 2024	**₹21.90** L.P.A. Highest CTC

Specialization Offered:
AI & Business Analytics | Operations & Supply Chain
Finance | Marketing | Human Resource Management.

*Applicants registering for ACAT can opt for Amrita MBA Program through CAT/XAT/MAT/CMAT/GMAT/GRE.

*T&C apply

amrita.edu/mba 044 481 33344

B.TECH. PROGRAMS

APPLY FOR B.TECH. WITH SCORES FROM



AEEE
Amrita Entrance Examination - Engineering

Phase 1
Last Date to Register : January 25, 2025
Exam Dates : February 1 & 2, 2025

JEE MAINS 2025

Upto **75%** fee waiver* for toppers in AEEE & JEE Mains	**92%** Placements in 2024	**₹56.95** Lakh P.A. Highest CTC

amrita.edu/btech 044 462 76066

All Campus data*

AMARAVATI | AMRITAPURI | BENGALURU | CHENNAI | COIMBATORE | FARIDABAD | KOCHI | MYSURU | NAGERCOIL

nirf GOVT. OF INDIA 7TH RANKED UNIVERSITY IN INDIA | NAAC A++ ACCREDITED | CATEGORY 1 GRADED AUTONOMY UGC, GOVT. OF INDIA | No.1 IN INDIA THE IMPACT RANKINGS 2024 | NBA NATIONAL BOARD of ACCREDITATION | AACSB ACCREDITED ASB COIMBATORE CAMPUS | UB University at Buffalo MBA-MS Dual Degree An ASB Bengaluru collaboration

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 290

శుక్రవారం 10-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



'బయటి నేరగాళ్ల'కు చెక్

భారత్‌పోల్

-5లో



క్విక్ కామర్స్‌తో భారీ ఉపాధి

2027కి 5 లక్షల మంది అవసరం.. ఇండీడ్ ప్లాట్‌ఫామ్ నివేదిక వెల్లడి -17లో


బుద్ధుడిలోనే భవిష్యత్తు



భవిష్యత్తు అనేది యుద్ధంలో లేదు. బుద్ధుడిలో ఉందని ప్రపంచానికి చెప్పగల శక్తి భారత్‌కు ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸

..వారికి ఆ సౌకర్యం నిలిపేయాలి



రిజర్వేషన్ల ఫలాలు పొంది, ఇతరులతో సమానంగా పోటీ పడేస్థాయికి చేరిన వారికి కోటా తొలగించవచ్చని సుప్రీం చెప్పింది.

వివరాలు 6లో ▸

ఆరని అగ్నికీలలు



లాస్ ఏంజెలెస్‌లో అంటుకున్న అగ్గిరవ్వ దావానలంలా వ్యాపించి వేల ఎకరాల్లో అడవిని కాల్చిబూడిద చేస్తోంది.

వివరాలు 6లో ▸

మేడిగడ్డలో 'డిజైన్' లోపాలే!



మేడిగడ్డ బరాజ్ కుంగిపోవడానికి డిజైన్లు, డ్రాయింగ్స్‌లో లోపాలే కారణమని ఐఐటీ-రూర్కీ నిర్వహించిన మోడల్ స్టడీలో తేలింది.

వివరాలు 5లో ▸

'భూభారతి'కి గవర్నర్ ఆమోదం

భూహక్కుల కోసం ఉద్దేశించిన కొత్త రికార్డ్ ఆఫ్ రైట్స్ బిల్లు భూభారతి చట్టంగా మారింది. అసెంబ్లీ ఆమోదం పొందిన భూభారతి బిల్లును గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదించారు. దీంతో భూభారతి ఇక చట్టంగా అమల్లోకి వస్తుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.



- వివరాలు 7లో▶

బెన్‌ఫిట్ షోల అవసరం ఏముందో చెప్పండి

సినిమా టికెట్ల ధరల పెంపు, బెన్‌ఫిట్ షోలకు అనుమతివ్వడంతో తెలంగాణ సర్కార్ తీరుపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. బెన్‌ఫిట్ షోలకు, ఇష్టం వచ్చిన సమయాల్లో ప్రదర్శనకు ఎందుకు అనుమతి ఇస్తున్నారని, వాటి అవసరం ఏముందని ప్రశ్నించింది. ప్రజల భద్రత గురించి ఆలోచించాల్సిన అవసరం లేదా అని నిలదీసింది.



- వివరాలు 7లో▶

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE

Venco CHICKEN

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	114 kg	Dressed with Skin	197 kg
₹ 70	Retail Live Bird	138 kg	Skin Less	224 kg

Issued in the interest of consumers

అనుమతులు లేకుండా చెల్లింపులా?

ఫార్ములా-ఈ కార్ రేసు నిర్వహణలో నిబంధనలు ఎందుకు అతిక్రమించారు?



వంద కేసులు పెట్టినా ఎదుర్కొంటా...

2లో

తెలంగాణ కోసం చస్తాను తప్ప తలవంచేది లేదు

మీడియాతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- ఏసీబీ అధికారులు 82 ప్రశ్నలు తిప్పి తిప్పి అడిగారు
- ఫార్ములా ఈ వ్యవహారంలో పైసా అవినీతి లేదని చెప్పా
- గలీజు పనులు చేయడం రేవంత్‌కే అలవాటని పేర్కొన్నా.
- మళ్లీ ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరవుతా

- కేబినెట్, ఆర్థికశాఖ అనుమతి లేకుండా నిధులెలా మళ్లిస్తారు?
- హెచ్‌ఎండీఏ పాలకమండలి అనుమతి లేకుండా ప్రైవేటు సంస్థకు పెద్దమొత్తం ఎలా చెల్లిస్తారు?
- రూ.700 కోట్ల లాభం వచ్చిందని చెబుతున్నారు.. లెక్కలున్నాయా?.. 7 గంటల పాటు విచారణ

మాజీ మంత్రి కేటీఆర్‌పై ఏసీబీ ప్రశ్నల వర్షం

- అడిగిన ప్రశ్నలే మార్చి మార్చి అడగడంతో కేటీఆర్ అసహనం
- ప్రశ్నలు వృథా ప్రయాసేనని, ప్రభుత్వం అరెస్టు చేయమంటే చేసుకోవచ్చని వ్యాఖ్య!
- ప్రభుత్వానికి నష్టం చేకూర్చిన సీఎం రేవంత్‌రెడ్డిని ఈ కేసులో ఎందుకు భాగస్వామిగా చేర్చలేదని నిలదీత

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా-ఈ కార్ రేసు నిర్వహణకు ఎలా బీజం పడింది?, నిబంధనలు ఎందుకు అతిక్రమించాల్సి వచ్చింది?, ఒప్పందాలతో పాటు నగదు చెల్లింపులకు సంబంధించిన ఫైళ్ల నిర్వహణ ఎలా జరిగింది?, హెచ్‌ఎండీఏ పాలకమండలి అనుమతి లేకుండా, విదేశీ మారకద్రవ్య నిబంధనలు ఉల్లంఘించి ప్రైవేటు సంస్థకు పెద్దమొత్తం ఎలా చెల్లిస్తారు?, కేబినెట్, ఆర్థికశాఖ అనుమతి లేకుండా నిధుల మళ్లింపు ఎలా చేశారు?, ఫార్ములా-ఈ కార్ రేసు నిర్వహణతో రాష్ట్రానికి రూ.700 కోట్ల లాభం వచ్చినట్టు మీరు చెప్తున్నారు.. వాటి లెక్కలేవి?, రేసుకు సంబంధించిన ప్రకటనలతో ప్రభుత్వ సంస్థలకు ఏం లాభాలు వచ్చాయి?, టికెట్లు అమ్మడం ద్వారా వచ్చిన ఆదాయం ఎంత?..తదితర

మిగతా 2వ పేజీలో ▶

నిధుల మళ్లింపుపైనే **ఈడీ దృష్టి**

8 గంటలపాటు కొనసాగిన అర్వింద్‌కుమార్ విచారణ

- వివరాలు 2లో▶

బాబే మొదటి ముద్దాయి

తిరుపతిలో తొక్కిసలాట ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ధ్వజం



గురువారం తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మమ్మల్ని చంపేశారు

వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

- ఆరుగురు భక్తులు మరణించడానికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే.. టీటీడీ చరిత్రలో ఈ దుర్ఘటన మాయని మచ్చ
- పోలీసులంతా చంద్రబాబు కుప్పం పర్యటన సేవలో తరించారు
- తిరుపతిలో క్యూలైన్ల వద్ద భద్రతను గాలికొదిలేశారు.. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల గురించి ఎవరూ పట్టించుకోలేదు
- లక్షల మంది భక్తులు వస్తారని ముందు తెలియదా?

8లో


- అందరూ గుమిగూడేలా చేసి ఒక్కసారిగా గేట్లు తెరుస్తారా?
- క్రౌడ్ మేనేజ్‌మెంట్‌లో టీటీడీకి ఉన్న విశిష్టతను పాడు చేశారు.. బాబుతో పాటు టీటీడీ చైర్మన్, ఈవో, అదనపు ఈవో, ఎస్పీ, కలెక్టర్ అందరికీ ఈ పాపంలో భాగముంది
- దేవుడికి, భక్తులకు క్షమాపణ చెప్పాలన్న ఇంగిత జ్ఞానం కూడా లేదు.. బాబుకు తెలిసింది తాను చేసిన తప్పును ఇంకొకరి మీద మోపడమే



కరువు నేలకు జల సవ్వడి

పూర్తయిన బ్రాహ్మణ వెల్లెంల రిజర్వాయర్

పురోగతిలో కాల్వల తవ్వకం పనులు | రిజర్వాయర్‌లోకి ఇటీవలే నీటి విడుదల | 4 నియోజకవర్గాల్లో 94 గ్రామాలకు త్వరలో సాగునీరు | ఫ్లోరైడ్ సమస్యకూ శాశ్వత పరిష్కారం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కరువుకు శాశ్వత పరిష్కారం లభించబోతోంది. కృష్ణమ్మ జరజరా తరలివచ్చి కరువు నేల దాహార్తిని తీర్చనుంది. దాదాపు 100 గ్రామాలను సస్యశ్యామలం చేయనున్న ఉదయసముద్రం (బ్రాహ్మణ వెల్లెంల) ఎత్తిపోతల ప్రాజెక్టులో కీలకమైన రిజర్వాయర్ నిర్మాణం పూర్తైంది. నీటిని ఎత్తిపోసే ప్రక్రియ ఇటీవలే ప్రారంభమైంది. కాల్వల తవ్వకం పనులు కొనసాగుతున్నాయి. ఆ పనులు పూర్తికాగానే కరువు నేలపై కృష్ణమ్మ ఉరకలెత్తనుంది. ఈ ప్రాంతానికి సాగునీటిని అందించటంతోపాటు భూగర్భ జలాలు పెరిగి ఫ్లోరైడ్ సమస్యకూ పరిష్కారం లభించనుంది.



నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని పలు మండలాలకు జీవనాధారమైన ఈ ప్రాజెక్టును 2007లో ఎమ్మెల్యేగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టుబట్టి సాధించారు. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఒప్పించి మంజూరు చేయించారు. బ్రాహ్మణ వెల్లెంల గ్రామ శివారులో 2007లో ఈ ప్రాజెక్టుకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేయగా, రూ.699 కోట్లతో 2008లో ప్రాజెక్టుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2009లో పనులు ప్రారంభమయ్యాయి.

వైఎస్ చొరవతో ప్రాజెక్టు మంజూరు

ఉదయసముద్రం నుంచి అప్రోచ్ చానల్, సొరంగం, పంప్‌హౌస్ నిర్మాణం, మోటార్ల ట్రయల్ రన్, 486 ఎకరాల్లో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వంటి కీలక పనులు పూర్తయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఈ రిజర్వాయర్‌లోకి 0.302 టీఎంసీల నీటిని ఎత్తిపోసే పనులను ప్రారంభించారు.

ప్రాజెక్టు పూర్తి స్వరూపం ఇదీ..

ఏఎంఆర్‌పీలో భాగంగా నాగార్జునసాగర్ వెనుక జలాలు పానగల్‌లోని ఉదయ సముద్రం రిజర్వాయర్‌లోకి చేరుతున్నాయి. దాని పైభాగాన ఉన్న దండంపల్లి గ్రామం సమీపం నుంచి అప్రోచ్ చానల్ ప్రారంభమై 6.9 కిలోమీటర్ల దూరంలోని కట్టంగూరు మండలం పిట్టంపల్లి గ్రామం వద్దకు నీరు వస్తోంది. అక్కడి నుంచి 10.625 కిలోమీటర్ల పొడవున సొరంగం ద్వారా నీరు నార్కట్‌పల్లి మండలం చౌడంపల్లి గ్రామం వద్ద ఉన్న సర్జ్‌పూల్‌కు చేరుతుంది. అక్కడి నుంచి రెండు మోటార్లతో 86 మీటర్ల ఎత్తుకు పంపింగ్ చేసి 1.12 కిలోమీటర్ల పొడవున ఏర్పాటు చేసిన రెండు డెలివరీ పైపుల ద్వారా బ్రాహ్మణ వెల్లెంల రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ప్రధాన కుడి, ఎడమ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల పనులు కొంత వరకే అయ్యాయి. వాటికి సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపు, కాల్వల తవ్వకం, లైనింగ్ చేయాల్సి ఉంది.

నియోజకవర్గాలవారీగా ఆయకట్టు (ఎకరాల్లో)

నియోజకవర్గం	మండలం	మొత్తం
మునుగోడు	మునుగోడు	12,127
నల్లగొండ	నల్లగొండ	22,593
నకిరేకల్	నార్కట్‌పల్లి	33,518
నకిరేకల్	కట్టంగూర్	20,616
నకిరేకల్	రామన్నపేట	2,496
నకిరేకల్	చిట్యాల	5,866
తుంగతుర్తి	శాలిగౌరారం	2,784
మొత్తం		1,00,000



టన్నెల్ ద్వారా వచ్చి నీరు చేరే సర్జ్‌పూల్

క్లుప్తంగా...

16కు సీఎం విదేశీ పర్యటన వాయిదా



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 13 నుంచి విదేశీ పర్యటనకు వెళ్లాల్సి ఉండగా.. రెండ్రోజుల తర్వాత వెళ్లనున్నారు. ఈనెల 14న ఢిల్లీకి వెళ్లి 15న జరగనున్న ఏఐసీసీ కొత్త కార్యాలయం ప్రారంభోత్సవంలో సీఎం పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం కోసం ఆయన 13న వెళ్లాల్సిన ఆ్రస్టేలియా పర్యటనను విరమించుకున్నారు. 16న సీఎం స్విట్జర్లాండ్ పర్యటనకు వెళ్లి అక్కడి స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శిస్తారు. అనంతరం వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొంటారు. 24న రాష్ట్రానికి తిరిగి చేరుకుంటారు.

నేడు కలెక్టర్లతో సీఎం సమావేశం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో కలెక్టర్లతో సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఈ సమావేశంలో కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు.

19న రాష్ట్రానికి జస్టిస్ పీసీ ఘోష్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఈనెల 21 నుంచి క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను పునఃప్రారంభించనుంది. ఈ నెల 19న జస్టిస్ పినాకి చంద్రఘోష్ హైదరాబాద్‌కు రానుండగా, 21 నుంచి క్రాస్ ఎగ్జామినేషన్‌ను ప్రారంభించి నెలాఖరులోగా ప్రక్రియను ముగించే అవకాశం ఉంది. ఈ దఫా ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో పాటు.. నిర్మాణ సంస్థల ప్రతినిధులను తొలుత కమిషన్ ప్రశ్నించనుంది. ఆ తర్వాత మాజీ ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించనున్నట్టు తెలిసింది. ఈ నెలాఖరులోగా కమిషన్ విచారణను ముగించి.. వచ్చే నెల 28లోగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చే అవకాశం ఉంది.

తిరుపతి బాధితులను హైదరాబాద్‌కు పంపండి

దగ్గరుండి వైద్యం అందిస్తాం: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: తిరుపతి తొక్కిసలాట ఘటనలో గాయ పడిన వారికి ఆంధ్రప్రదేశ్‌లో వైద్యం అందించే పరిస్థితి లేకపోతే.. హైదరాబాద్‌కు పంపాలని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఆయన గురువారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. క్షతగాత్రులను హైదరాబాద్‌కు పంపితే.. తామే దగ్గరుండి చికిత్స చేయిస్తామని హామీ ఇచ్చారు. తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని, మృతుల కుటుంబాలకు శ్రీనివాస్ గౌడ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వంద కేసులు పెట్టినా ఎదుర్కొంటా

తెలంగాణ కోసం చస్తాను తప్ప తలవంచేది లేదు

- మీడియాతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఏసీబీ అధికారులు 82 ప్రశ్నలు తిప్పి తిప్పి అడిగారు
- ఫార్ములా–ఈ వ్యవహారంలో పైసా అవినీతి లేదని చెప్పినట్లు వెల్లడి



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బలవంతంగా పెట్టించిన కేసులో విషయం ఏమీ లేకపోవడంతో ఏసీబీ అధికారులు కూడా ఇబ్బందులు పడ్డారు. 'పాడిందే పాడరా' అన్నట్లు 82 ప్రశ్నలను తిప్పి తిప్పి అడిగారు. తెలంగాణ ఆరాధ్య దైవం, తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్ నాయకత్వంలో గడిచిన పదేళ్లుగా నిబద్ధతతో, పైసా అవినీతికి తావు లేకుండా పనిచేశా అని చెప్పా. ఏసీబీ మళ్లీ ఎన్నిసార్లు విచారణకు పిలిచినా వెళ్తా. ఇలాంటి కేసులు వంద పెట్టినా ఎదుర్కొంటా. ఏడాది కాలంగా లగచర్ల, హైడ్రా, విద్యుత్ చార్జీల పెంపు వంటి అనేక అంశాలపై కొట్లాడుతున్నాం. కేసులు పెట్టి మా కేడర్, ప్రజల దృష్టిని రేవంత్ మళ్లించలేరు. అవసరమైతే తెలంగాణ కోసం చస్తాను తప్ప ఇలాంటి కేసులకు తలవంచేది లేదు..' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు స్పష్టం చేశారు. ఫార్ములా ఈ రేస్ కేసులో ఏసీబీ నోటీసులతో విచారణకు హాజరైన కేటీఆర్.. గురువారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఉదయం విచారణకు వెళ్లే ముందు నందినగర్ నివాసం వద్ద కూడా ఆయన మాట్లాడారు.

అణా పైసా అవినీతి లేదని చెప్పా

'తెలంగాణకు పెట్టుబడులు తేవడం, ఎలక్ట్రిక్ వాహనాలకు రాష్ట్రాన్ని హబ్‌గా మార్చాలనే దూరదృష్టితో, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచడంతో పాటు ప్రపంచం దృష్టిని ఆకర్షించాలనే ఉద్దేశంతోనే కష్టపడి ఫార్ములా ఈ రేస్‌ను తెచ్చానని చెప్పా. ఇందులో అణాపైసా అవినీతి లేదని స్పష్టం చేశా. అలాంటి గలీజు పనులు చేయడం రేవంత్‌కు అలవాటు అని కుండబద్దలు కొట్టి చెప్పా. ఇక్కడ నుంచి డబ్బులు పంపాం.. డబ్బులు అందినట్లు ఎఫ్‌ఈఓ (ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్) వాళ్లు ధ్రువీకరించారు. ఇదే విషయాన్ని చెబితే ఏసీబీ అధికారులు నీళ్లు మింగుతున్నారు. ఓటుకు నోటు కేసులో జైలుకు వెళ్లిన రేవంత్ ఇతరులను కూడా పంపి పైశాచిక, శునకానందం పొందాలని చూస్తున్నాడు. రేవంత్ తరహాలో నేను లుచ్చా పనులు చేయలేదు. కేబినెట్‌లో ఉంటూ లాండ్ క్రూజర్లు కొనుగోలు చేయలేదు. బావ మరుదులకు కోట్లాది రూపాయల కాంట్రాక్టు ఇవ్వలేదు. రేవంత్ తరహాలో డబ్బు సంచులతో దొరకలేదు. పెట్టుబడులు తెచ్చేందుకు విదేశాలు తిరిగా. రేవంత్ పెట్టే కేసులకు భయపడేవారెవరూ తెలంగాణలో కానీ బీఆర్‌ఎస్‌లో కానీ లేరు..' అని కేటీఆర్ అన్నారు.

రేవంత్‌ను ఎవరూ సీఎంగా గుర్తించడం లేదు

'ఇదొక లొట్టపీసు కేసు.. ఆయనో లొట్టపీసు సీఎం. రాష్ట్రంలో రేవంత్‌ను ఎవరూ ముఖ్యమంత్రిగా గుర్తించడం లేదు. తనను గుర్తించని వారిపై కేసులు పెట్టి లోపలేస్తున్నడు. ఏడాది తర్వాత కూడా ఆయనను ఎవరూ సీఎంగా గుర్తు పట్టకపోతే నేనేం చేయాలి. కేసులకు భయపడేది లేదు, బాధపడేది లేదు. లేని అవినీతిని పట్టుకుందామని ప్రయత్నిస్తే ఎక్కడ దొరుకుతుంది? ఏసీబీకి రేవంత్ మళ్లీ ప్రశ్నలు పంపితే తిరిగి పిలుస్తారేమో. న్యాయస్థానాల మీద విశ్వాసం ఉంది. ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరవుతా. కేసీఆర్ సైనికులుగా ఈ ఏడాదంతా రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యాలు, ఆరు గ్యారంటీల అమలుపై నిలదీస్తూనే ఉంటాం. ఎంత కొట్టినా రైతు భరోసా, రూ.4 వేల ఆసరా పెన్షన్, మహిళలకు ప్రతి నెలా రూ.2,500, 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ గురించి మాట్లాడుతాం. పార్టీ నాయకులు, కార్యకర్తలకు కష్టం వస్తే మేమున్నామంటూ వచ్చిన వారందరికీ శిరసు వంచి నమస్కరిస్తున్నా..' అని కేటీఆర్ పేర్కొన్నారు.

అత్యవసర విచారణకు నో

- కేటీఆర్ పిటిషన్‌ను 15న విచారిస్తామన్న సుప్రీంకోర్టు
- 'ఫార్ములా–ఈ'పై హైకోర్టు తీర్పును రద్దు చేయాలన్న మాజీ మంత్రి
- 430 పేజీలతో పిటిషన్ దాఖలు



సాక్షి, న్యూఢిల్లీ: ఫార్ములా–ఈ రేసులో అక్రమాల ఆరోపణలతో ఏసీబీ నమోదు చేసిన కేసుకు సంబంధించి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. గురు, శుక్రవారాల్లో అత్యవసరంగా విచారించాలన్న కేటీఆర్ తరఫు న్యాయవాది మోహిత్‌రావు విజ్ఞప్తిని తోసిపుచ్చింది. సెలవుల అనంతరం ఈనెల 15వ తేదీన విచారించేందుకు అంగీకరించింది. రేసు కేసులో ఏసీబీ దాఖలు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టేయాలంటూ తాను దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేయడాన్ని సవాల్ చేస్తూ కేటీఆర్ సుప్రీంను ఆశ్రయించారు. ఆయన తరఫున మోహిత్‌రావు 430 పేజీలతో కూడిన పిటిషన్ దాఖలు చేశారు.

హైకోర్టు తీర్పును రద్దు చేసేలా ఉత్తర్వులు ఇవ్వండి

తమ క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు సానుకూలంగా తీర్పు ఇవ్వని నేపథ్యంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 136 ప్రకారం ఈ పిటిషన్‌ను దాఖలు చేస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. హైకోర్టు తీర్పును రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తన పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని కోరారు. ఈ మేరకు మోహిత్‌రావు రిజిస్ట్రార్ బెంచ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ రిక్వెస్ట్‌ను రిజిస్ట్రార్ గురువారం సీజేఐకు నివేదించగా..ఆయన ఈ కేసు విచారణకు ఈ నెల 15వ తేదీని కేటాయిస్తూ జాబితాలో లిస్ట్ చేశారు. శుక్రవారం విచారించాలని మరోసారి న్యాయవాది మోహిత్‌రావు ధర్మాసనాన్ని కోరినప్పటికీ, 15వ తేదీనే విచారిస్తామని సుప్రీం స్పష్టం చేసింది.

స్టాండింగ్ కౌన్సిల్ అభ్యంతరం

అత్యవసరంగా విచారణ చేపట్టాలని కేటీఆర్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి విజ్ఞప్తి చేస్తున్న సమయంలో.. తెలంగాణ ప్రభుత్వం తరఫు స్టాండింగ్ కౌన్సిల్ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో స్పందించిన సీజేఐ.. 15వ తేదీనే విచారణ చేపడతామని స్పష్టం చేశారు.

కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకొస్తారు: బీఆర్‌ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా ఈ రేస్ కేసులో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని బీఆర్‌ఎస్ నేతలు వ్యాఖ్యానించారు. గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ నేతలు గొంగిడి సునీత, శ్రీధర్‌రెడ్డి, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు మాట్లాడారు. న్యాయ వ్యవస్థపై సంపూర్ణ విశ్వాసం ఉందని తెలిపారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేయలేక కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని ఆరోపించారు. హైడ్రా, మూసీలలో తనకు అడ్డు పడుతున్నాడని కేటీఆర్‌పై రేవంత్ రెడ్డి రివెంజ్ తీసుకోవాలని చూస్తున్నాడని విమర్శించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తన సొంత నియోజకవర్గంలో భూ మాఫియా అవతారం ఎత్తి వందల ఎకరాల భూమిని కబ్జా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బండారం బయట పెట్టారని, అలాంటి వ్యక్తి కేటీఆర్ గురించి మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు.

ఆయన సైనికుడు కాదు.. యువరాజు

కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతల ధ్వజం

సాక్షి, హైదరాబాద్: కేటీఆర్ సైనికుడు కాదని, యువరాజు అని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తనకు డబ్బుపై వ్యామోహం లేదని కేటీఆర్ అంటున్నారని, కేసీఆర్ కుటుంబానికి డబ్బుపై వ్యామోహం లేదంటే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. పదేళ్లలో చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పులో రూ.లక్ష కోట్లు కేసీఆర్ కుటుంబమే తిన్నదని ఆ్రస్టేలియా పర్యటనలో ఉన్న ఆయన విడుదల చేసిన ప్రకటనలో ఆరోపించారు. గురువారం సీఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ అధికార అహంకారంతో కేటీఆర్ ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. పదేళ్లు మంత్రిగా చేసిన వ్యక్తి లొట్టపీసు కేసు, లొట్టపీసు సీఎం అని మాట్లాడుతున్నారని, కేటీఆర్ అసందర్భ ప్రేలాపనలు మానుకోవాలని హితవు పలికారు. జైలుకు వెళ్లేటప్పుడు కూడా కేటీఆర్ అహంకారాన్ని ప్రదర్శిస్తున్నాడని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మండిపడ్డారు. కేటీఆర్‌కు ఏ కోర్టులోనూ ఊరట కలగడం లేదంటే ఆయన తప్పు చేసినట్టు అర్థమవుతోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సీఎంను అడ్డగోలుగా విమర్శిస్తే సహించేది లేదని, తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

రోజంతా ఉత్కంఠ!

తెలంగాణ భవన్‌కు పెద్దసంఖ్యలో తరలివచ్చిన బీఆర్‌ఎస్ శ్రేణులు



ఏసీబీ విచారణకు హాజరై తిరిగి ఇంటికి చేరుకున్న కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఆయన సతీమణి శైలిమ, సోదరి కవిత

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ రేస్ కేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఏసీబీ విచారణకు హాజరు కావడం తీవ్ర ఉత్కంఠను రేపింది. ఆయన్ను అరెస్టు చేస్తారనే వార్తల నేపథ్యంలో..విచారణ అనంతరం ఆయన తిరిగి వచ్చేవరకు ఉత్కంఠ కొనసాగింది. ముఖ్య నేతలంతా పార్టీ కార్యాలయంలోనే ఉండి చర్చల్లో మునిగి తేలారు. గురువారం ఉదయం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నందినగర్ నివాసానికి చేరుకున్నారు. ఉదయాన్నే కొద్దిసేపు గృహ నిర్బంధంలో ఉన్న మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్సీ కవిత, పలువురు మాజీ మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలు కేటీఆర్‌ను కలిసి సంఘీభావం ప్రకటించారు. కేటీఆర్ ఏసీబీ కార్యాలయానికి వెళ్లిన తర్వాత నందినగర్ నుంచి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. సాయంత్రం కేటీఆర్ తిరిగి వచ్చేవరకు అక్కడే ఉన్న ఆయన.. పలువురు మాజీ మంత్రులు, సీనియర్ నేతలతో భేటీ అయ్యారు. పార్టీ నేతలు విడతల వారీగా మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పార్టీ కార్యకర్తలు, నాయకుల రాకతో తెలంగాణ భవన్‌లో హడావుడి నెలకొంది. సాయంత్రం తెలంగాణ భవన్‌కు వచ్చిన కేటీఆర్‌కు భారీ సంఖ్యలో నాయకులు స్వాగతం పలికారు. గుమ్మడికాయతో దిష్టితీసి, మంగళ హారతులు ఇచ్చారు. తర్వాత నందినగర్ నివాసానికి చేరుకున్న కేటీఆర్‌కు సతీమణి శైలిమ, సోదరి కవిత తిలకం దిద్ది స్వాగతం పలికారు. ఇలా వుండగా ఏసీబీ కార్యాలయానికి దారితీసే రహదారుల్లో 8 చోట్ల పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేశారు. సుమారుగా 400 మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. మరోవైపు రెండురోజులుగా నందినగర్ నివాసంలోనే బస చేసిన కేటీఆర్.. న్యాయవాదులతో సంప్రదింపులు జరిపారు. హైకోర్టు, సుప్రీంకోర్టులో తన తరఫున వాదిస్తున్న వారితో ఏసీబీ, ఈడీ విచారణను ఎదుర్కోవాల్సిన తీరుపై చర్చించారు.

నిధుల మళ్లింపుపైనే ఈడీ దృష్టి

ఎనిమిది గంటలపాటు కొనసాగిన అర్వింద్‌కుమార్ విచారణ



ఈడీ విచారణకు హాజరైన ఐఏఎస్ అర్వింద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా – ఈ కారు రేసు కేసు దర్యాప్తులో భాగంగా సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సుదీర్ఘంగా విచారించారు. బ్రిటన్ కంపెనీకి హెచ్‌ఎండీఏ నుంచి నిధుల మళ్లింపుపైనే ప్రధానంగా అర్వింద్‌కుమార్‌ను ఈడీ ప్రశ్నించినట్టు తెలిసింది. ఏసీబీ అధికారులు ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్న అంశాలు, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్‌ఎన్‌రెడ్డి విచారణ సందర్భంగా సేకరించిన అంశాల ఆధారంగా అర్వింద్‌కుమార్‌ను ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఈడీ సమన్ల మేరకు గురువారం ఉదయం 11.15 గంటలకు ఆయన బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి వచ్చారు. అప్పటి నుంచి రాత్రి 7.30 గంటల వరకు దాదాపు 8 గంటల పాటు ఈడీ అధికారులు ఆయనను ప్రశ్నించారు. హెచ్‌ఎండీఏకి చెందిన రూ.54.89 కోట్లను నిబంధనలకు విరుద్ధంగా బ్రిటన్‌కు చెందిన ఫార్ములా –ఈ ఆపరేషన్స్ (ఎఫ్‌ఈఓ) సంస్థకు ఎందుకు బదలాయించాల్సి వచ్చింది? హెచ్‌ఎండీఏ బోర్డు నిధుల ఖర్చు విషయంలో ఎలాంటి నిబంధనలు ఉంటాయి? ఫార్ములా–ఈ కారు రేసు సీజన్ 9,10 నిర్వహణ కోసం చేసుకున్న ఒప్పందాలు.. తదితర అంశాలపై విచారణ జరిపినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. విధి నిర్వహణలో భాగంగానే తాను అంతా చేసినట్టు అర్వింద్‌కుమార్ సమాధానమిచ్చినట్టు తెలిసింది. అవసరం అయితే మరోమారు విచారణకు రావాల్సి ఉంటుందని ఈడీ అధికారులు అర్వింద్‌కుమార్‌కు సూచించినట్టు సమాచారం.

ఇదండీ జగత్



▶ మొదటి పేజీ తరువాయి

అంశాలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావుపై ఏసీబీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. మంత్రిగా కేటీఆర్ తీసుకున్న నిర్ణయం, దాని తాలూకు కేబినెట్ ఆమోదం ఫైళ్ల సర్క్యులేషన్‌కు సంబంధించిన ప్రక్రియ, నిధుల బదిలీ..వంటి అంశాల కేంద్రంగా ఏసీబీ విచారణ కొనసాగినట్టు తెలిసింది. సుమారు 7 గంటల విచారణ సందర్భంగా అధికారులు పదేపదే ఒకే అంశంపై ప్రశ్నిస్తుండడంతో 'మీరు ఎన్ని గంటలు ఈ కార్యాలయంలో కూర్చోమన్నా కూర్చుంటా..మీకు కావాలి అంటే బ్రేక్ తీసుకోండి.. కానీ అడిగిన ప్రశ్నలే పలు రకాలుగా అడగడం వలన లాభం లేదు. ప్రభుత్వం ఒకవేళ నన్ను అరెస్టు చేయమని మీకు ఆదేశాలు ఇస్తే..ఈ ప్రశ్నలు అడగడం అనే వృథా ప్రయాస మానేసి ప్రభుత్వ ఆదేశాలు అమలు చేసుకోవచ్చు..' అని కేటీఆర్ అన్నట్టు తెలిసింది.

ఏసీబీ జేడీ ఆధ్వర్యంలో స్టేట్‌మెంట్ రికార్డ్

ఫార్ములా–ఈ కార్ రేసు నిర్వహణకు సంబంధించిన కేసులో ఏసీబీ అధికారులు నోటీసు ఇవ్వడంతో కేటీఆర్ గురువారం ఉదయం వారి ఎదుట విచారణకు హాజరయ్యారు. కోర్టు అనుమతి నేపథ్యంలో న్యాయవాది, మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ రామచందర్‌రావుతో కలిసి ఏసీబీ కార్యాలయానికి చేరుకున్నారు. కోర్టు ఆదేశం ప్రకారం..విచారణ సమయంలో న్యాయవాదికి కేటీఆర్ కనిపించేలా ఏర్పాటు చేశారు. జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ ఆధ్వర్యంలో మొత్తం ఐదుగురు సభ్యుల బృందం ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసింది.

బిజినెస్ రూల్స్ అధికారులు చూసుకుంటారు..

రేసు నిర్వహణ ఫైల్ కేబినెట్ ఆమోదానికి ఎందుకు పంపలేదు? అన్న అంశంపై ఏసీబీ అధికారులు పలుమార్లు ప్రశ్నించగా.. బిజినెస్ రూల్స్ గురించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులే చూసుకుంటారని కేటీఆర్ సమాధానం ఇచ్చినట్టు సమాచారం. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాన్ని ప్రశ్నించే హక్కు ఏసీబీకి లేదని ఆయన పేర్కొన్నారు. రేసు కొనసాగించకపోవడం వల్ల ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం వాటిల్లిందని.. ఒప్పందం రద్దుచేసి ప్రభుత్వానికి నష్టం చేకూర్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఈ కేసులో ఎందుకు భాగస్వామిగా చేర్చలేదని కేటీఆర్ ప్రశ్నించినట్లు సమాచారం. రేసు నిర్వహణకు కేబినెట్ ఆమోదం గురించి ఏసీబీ ప్రశ్నించినప్పుడు.. కేబినెట్ ఆమోదం లేకుండా రేసు రద్దు చేసినందుకు ముఖ్యమంత్రిని కూడా బాధ్యుల్ని చేయాల్సి వస్తుందని కేటీఆర్ అన్నట్టు తెలిసింది. ఈ రేసుకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ, రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పుడు తనకు ప్రభుత్వం కేటాయించిన అధికారిక ఈ–మెయిల్లో ఉన్నాయని.. ప్రస్తుతం ఆ అకౌంట్ కూడా రాష్ట్ర ప్రభుత్వం వద్దనే ఉందని స్పష్టం చేశారు. మంత్రిగా విధానపరమైన నిర్ణయం తీసుకునే అధికారం ప్రభుత్వంలో భాగమైన తనకు ముమ్మాటికీ ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మీరు తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన జీవోను ఏమైనా ఇచ్చిందా? అని ప్రశ్నించినప్పుడు.. సచివాలయ బిజినెస్ రూల్స్ అన్నీ సీఎస్ పరిధిలో ఉంటాయని, ఈ అంశానికి సంబంధించి ప్రభుత్వాన్నే అడగాలని కేటీఆర్ చెప్పినట్టు తెలిసింది. ఏస్ నెక్స్ట్ జెన్ సంస్థ మొదటిసారి రేసు నిర్వహించినప్పుడు పూర్తిగా డబ్బులు చెల్లించలేదంటూ.. ఆ సంస్థ ఆర్థిక వ్యవహారాల గురించి ప్రశ్నించినప్పుడు... ప్రైవేటు సంస్థ వివరాలు తనకు తెలియదని, ఆ అంశం తన పరిధిలోనిది కాదని కేటీఆర్ చెప్పినట్టు తెలిసింది.

అనుమతులు లేకుండా చెల్లింపులా?

పత్రాలతో హాజరు..రేసుతో లబ్ధిపై వివరణ

ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్‌లోని ఏసీబీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్న కేటీఆర్.. ఏసీబీ ప్రశ్నించేందుకు అవకాశం ఉన్న పలు అంశాలకు సంబంధించిన కొన్ని పత్రాలను తన వెంట తెచ్చుకున్నారు. ముందు ఏసీబీ సీఐయూ డీఎస్పీ, ఈ కేసు దర్యాప్తు అధికారి మాజిద్ అలీని కలిసి, దర్యాప్తునకు సంబంధించి నోటీసులు తీసుకున్నారు. అప్పటికే కేటీఆర్‌ను విచారించేందుకు సిద్ధంగా ఉన్న ఏసీబీ జేడీ బృందం.. ప్రత్యేక గదిలో కేటీఆర్‌ను ప్రశ్నించింది. కాగా ఫార్ములా ఈ రేసు నిర్వహించడానికి గల కారణాలు..రేసు నిర్వహణతో రాష్ట్రానికి ఎలాంటి లబ్ధి జరిగిందన్న అంశాలను కేటీఆర్ వివరించినట్టు తెలిసింది. రేసు నిర్వహణతో రాష్ట్రానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా జరిగిన లబ్ధికి సంబంధించి కొన్ని పత్రాలు కూడా అందజేసినట్లు సమాచారం. విచారణ మధ్యలో కాసేపు భోజన విరామం ఇచ్చారు. ఒకవైపు కేటీఆర్‌ను ప్రశ్నిస్తూనే, మరోవైపు దర్యాప్తులో భాగంగా సేకరించిన అంశాలను ఏసీబీ అధికారులు పరిశీలించినట్టు తెలిసింది. సాయంత్రం 5 గంటల వరకు కేటీఆర్‌ను ప్రశ్నించిన అధికారులు, అవసరమైతే మళ్లీ హాజరుకావాల్సి ఉంటుందని సూచించినట్టు తెలిసింది. కాగా సాయంత్రం 5.06 గంటల సమయంలో కేటీఆర్ ఏసీబీ కార్యాలయం నుంచి బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు.

అభ్యంతరం తెలిపిన డీసీపీ

కేటీఆర్ మీడియాతో మాట్లాడడంపై డీసీపీ విజయ్‌కుమార్ అభ్యంతరం తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. 'ట్రాఫిక్ ఇబ్బంది అవుతోంది.. ఇది మీడియా పాయింట్ కాదు..ఇక్కడ మీడియా సమావేశం పెట్టొద్దు..' అని డీసీపీ అనడంతో కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. 'నేను ఇక్కడ మాట్లాడితే ఏం నొచ్చింది. ఏం ఇబ్బంది అయ్యింది. మీడియాపై మీ దాడి ఏంది..? మీకు ఇంత భయం ఎందుకు?..' అంటూ నిలదీశారు. అయితే మీడియా ప్రతినిధులను పోలీసులు పక్కకు నెట్టేయడంతో కేటీఆర్ అక్కడి నుంచి నిష్క్రమించారు.

రేవంత్ రాసిచ్చిన నాలుగైదు ప్రశ్నలనే 40 రకాలుగా అడిగారు: మీడియాతో కేటీఆర్

'ఏసీబీ పెట్టింది చెత్త కేసు..ఇందులో విషయమే లేదు. నాలుగైదు ప్రశ్నలనే 40 రకాలుగా అడిగారు. కొత్తగా అడిగిందేమీ లేదు. రేవంత్ రాసిచ్చిన నాలుగైదు ప్రశ్నలనే అటూ ఇటూ తిప్పి అడిగారు. నాపై కేసు పెట్టి రేవంత్‌రెడ్డి ఏదైనా సాధించాలనుకుంటే అది మూర్ఖత్వమే అవుతుంది. పైసలు పంపాను అని నేనే చెబుతున్నా. డబ్బులు వచ్చాయని వాళ్లు (ఎఫ్‌ఈఓ) చెబుతున్నారు. ఇందులో అవినీతి ఎక్కడుందని ప్రశ్నిస్తే అధికారుల దగ్గర సమాధానమే లేదు. వాళ్లు అడిగిన అన్ని ప్రశ్నలకు నాకున్న అవగాహన మేరకు సమాధానమిచ్చా. ఎన్నిసార్లు పిలిచినా తప్పక వస్తానని చెప్పా..' అని కేటీఆర్ తెలిపారు.

చర్మకారులకు పాద'రక్ష'!



రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐలో చర్మకారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

కొత్త జీవితాన్నిస్తున్న కేవీఐసీ, ఎఫ్‌డీడీఐ
- చెప్పులు, షూ తయారీలో 25 రోజులు ఆధునిక శిక్షణ
- సొంతంగా యూనిట్లు పెట్టుకునేలా ప్రోత్సాహం

రాయదుర్గం: పురాతన పద్ధతుల్లో చెప్పులు కుడుతూ ఎదుగూ బొదుగూ లేకుండా బతుకుతున్న చర్మకారుల జీవితాలకు కొత్త 'కళ'ను అద్దుతోంది ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ). ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ)తో కలిసి చర్మకారులకు ఆధునిక పద్ధతులపై శిక్షణ ఇచ్చి సొంతంగా తయారీ యూనిట్లు నెలకొల్పుకునేందుకు చేయూతనందిస్తోంది.

ఆధునిక డిజైనింగ్‌పై శిక్షణ

చర్మకార వృత్తిని కొనసాగిస్తున్నవారితోపాటు వృత్తిని వదిలేసినా దానిపై ఆసక్తిగల వారిని కొందరిని ఎంపిక చేసి గత డిసెంబర్ 9 నుంచి ఈ జనవరి 3వ తేదీ వరకు మూడు విడతలలో 25 రోజుల పాటు రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐలో శిక్షణ ఇచ్చారు. ఆధునిక కాలానికి తగినట్లుగా చెప్పులు, షూల డిజైనింగ్.. వాటిని నాణ్యతతో తయారు చేయటంపై మెళకువలు నేర్పారు. ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరసింహుగారి తేజ్‌లోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ అబ్దుల్ రహమాన్, చంద్రమణి, కన్వర్‌సింగ్, ఇళయరాజా పర్యవేక్షణలో ఈ శిక్షణ కొనసాగింది. షూ తయారీలో శుద్ధి చేసిన చర్మాన్ని కటింగ్ చేసే ప్యాటర్న్, బాటమ్ ఫిట్టింగ్, అప్పర్ మేకింగ్, స్టిచ్చింగ్ వంటి అంశాలలో అవగాహన కల్పించారు. శిక్షణ పూర్తయిన తర్వాత వారు తయారు చేసిన ఉత్పత్తులతో ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు.

లిడ్‌క్యాప్‌కు పూర్వవైభవం తేవాలి

ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తూ చేతి వృత్తి కళాకారులను ప్రోత్సహించాలని ఇక్కడ శిక్షణ పొందినవారు కోరుతున్నారు. శిక్షణ పొందినవారు సొంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీపై రుణ సౌకర్యం, ఆధునిక యంత్రాలు అందించాలని విన్నవించారు. అలాగే లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (లిడ్‌క్యాప్)కు పూర్వవైభవం తీసుకొస్తే చర్మకారులకు మరింత మేలు జరుగుతుందని పేర్కొంటున్నారు.

ప్రత్యేక కోర్సులతో శిక్షణ

ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ క్యాంపస్‌లో నిష్ణాతులైన ఫ్యాకల్టీతో చర్మకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ప్రత్యేక కోర్సులను నిర్వహించి వీరికి శిక్షణ అందించాం. భవిష్యత్తులో కూడా మరిన్ని శిక్షణా కార్యక్రమాలు చేపట్టేందుకు ఫ్యాకల్టీ సిద్ధంగా ఉన్నారు.

– డాక్టర్ నరసింహుగారి తేజ్ లోహిత్‌రెడ్డి, ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్



నేను టూరిజమ్‌లో పీజీ చేసి పర్యాటక శాఖలో గైడ్‌గా పనిచేసే లైసెన్స్ పొందాను. అయితే వంశపారంపర్యంగా వచ్చిన చర్మకార వృత్తిలో కొనసాగాలనుకున్న నాకు.. ఎఫ్‌డీడీఐలో శిక్షణ తీసుకునే అవకాశం వచ్చింది. ప్రభుత్వం రుణ సౌకర్యం కల్పిస్తే సొంతంగా యూనిట్ పెట్టి నేను ఎదగటంతోపాటు కొంతమందికి ఉపాధి కల్పించాలన్నదే నా లక్ష్యం.

–క్రాంతి, శిక్షణ తీసుకున్న చర్మకార కళాకారుడు, సికింద్రాబాద్



మాదాపూర్‌లో పాత చెప్పులు కుడుతూ, చెప్పులు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించేవాణ్ణి. ఎఫ్‌డీడీఐ శిక్షణతో షూ కూడా తయారు చేయడం నేర్చుకున్నాను. అంతేకాదు ఏదో సాధించాలనే పట్టుదల వచ్చింది. ఇక్కడ శిక్షణ పొందిన మరికొందరితో కలిసి ఒక తయారీ యూనిట్ ఏర్పాటు చేసి ఉపాధి పొందడంతోపాటు నలుగురికి ఉపాధి కల్పించాలని ఉంది.

–పవన్‌కుమార్, చర్మకారుడు, మాదాపూర్



20 ఏళ్లుగా చర్మకార పనిచేస్తున్నా. సాధారణ చెప్పుల తయారీ, మరమ్మతులు, పాలిష్ వంటివి మాత్రమే చేయగలిగేవాణ్ణి. ఎఫ్‌డీడీఐలో శిక్షణ పొందాక రకరకాల డిజైన్లలో షూస్ తయారీతో పాటు కటింగ్, స్టిచ్చింగ్ చేసే స్థాయికి ఎదిగాను. ఇప్పటి తరంవారికి కూడా నచ్చేలా షూలు తయారు చేయగలననే నమ్మకం వచ్చింది. ప్రభుత్వం రుణం, యంత్రాలు అందిస్తే సొంతంగా యూనిట్ ఏర్పాటు చేసుకుంటా. ఇలాంటి శిక్షణ అందరికీ ఇస్తే మా కులవృత్తి కనుమరుగు కాకుండా ఉంటుంది.

–తుకారామ్, చర్మకారుడు, ఈసీఐఎల్

ఆరోగ్యశ్రీ సేవలు యథాతథం

- తెన్హా ప్రతినిధులతో ఆరోగ్యశ్రీ సీఈవో చర్చలు సఫలం
- రూ.120 కోట్ల బకాయిలు విడుదల చేసిన ప్రభుత్వం
- దశలవారీగా మిగతా బకాయిలు చెల్లిస్తామని హామీ
- సేవల బంద్ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్న తెన్హా



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం బకాయిలు చెల్లించని కారణంగా శుక్రవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయాలన్న నిర్ణయాన్ని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ఉపసంహరించుకున్నాయి. ప్రైవేటు ఆసుపత్రులకు బకాయిపడ్డ రూ.1,100 కోట్లలో రూ.120 కోట్లను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. వచ్చే నెలలో మరో విడత చెల్లింపులకు కూడా హామీ ఇచ్చింది. దీంతో ఆరోగ్యశ్రీ సేవలను యథాతథంగా కొనసాగించాలని తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (తెన్హా) నిర్ణయించింది. గురువారం తెన్హా ప్రతినిధులతో ఆరోగ్యశ్రీ సీఈవో శివశంకర్ లోతేటి చర్చలు జరిపారు. రోగులకు ఇబ్బంది కలిగించకుండా ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందించాలని కోరారు. రాష్ట్రంలోని 368 నెట్‌వర్క్ హాస్పిటల్స్‌కు రూ.1,100 కోట్ల మేర ప్రభుత్వం నుంచి బకాయిలు రావాల్సి ఉందని తెన్హా ప్రతినిధులు సీఈవో దృష్టికి తెచ్చారు. దీంతో బకాయిల్లో గురువారం రూ.120 కోట్లు విడుదల చేశామని, దశలవారీగా ఇతర బకాయిలను ప్రభుత్వం చెల్లిస్తుందని సీఈవో హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న రూ.730 కోట్లతో పాటు మొత్తం రూ.1,130 కోట్లను ఏడాది కాలంలో ప్రభుత్వం చెల్లించిందని వివరించారు. అలాగే 2013 నుంచి పెండింగ్‌లో ఉన్న ప్యాకేజీల రేట్లను సగటున 22 శాతం పెంచినట్లు గుర్తు చేశారు.

ఐఏఎస్‌లకు స్థానచలనం

- విద్యాశాఖ కార్యదర్శిగా యోగితా రాణా
- రవాణా శాఖ కమిషనర్‌గా సురేంద్ర మోహన్
- ఎన్.శ్రీధర్‌కు గనుల శాఖ అదనపు బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌లకు స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శిగా యోగితా రాణాను ప్రభుత్వం నియమించింది. గనులు, భూగర్భ ఖనిజాల శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌ను.. రవాణా శాఖ కమిషనర్‌గా బదిలీ చేసింది. ఆయన స్థానంలో గనులు, భూగర్భ ఖనిజాల శాఖ ముఖ్యకార్యదర్శిగా, ఎస్సీల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది.

మళ్లీ స్థానిక ఎన్నికలపై చర్చ

త్వరలోనే స్థానిక ఎన్నికలంటూ పీఏసీ భేటీలో సీఎం రేవంత్ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలపై మళ్లీ రాజకీయ చర్చ మొదలైంది. త్వరలోనే ఎన్నికలు ఉంటాయంటూ కాంగ్రెస్ పీఏసీ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి తాజాగా కామెంట్ చేసిన విషయం తెలిసిందే. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) ఇప్పటికే స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వ గ్రీన్‌సిగ్నల్ కోసం ఎదురుచూస్తోంది. వాస్తవానికి సంక్రాంతి పండుగ నాటికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి, 15, 20 రోజుల్లోనే మొదట జీపీ, ఆ తర్వాత మండల ఎన్నికలు నిర్వహిస్తారనే ఊహాగానాలు గతంలోనే వచ్చాయి. తాజాగా ఈ నెలాఖరులోగా రైతు భరోసా, ఇందిరమ్మ రైతు కూలీ భరోసా చెల్లింపు మొదలుపెట్టాక, ఎన్నికల షెడ్యూల్ ఇస్తే మంచిదనే సూచనలు అధికారపార్టీకి అందినట్టు తెలుస్తోంది. ఫిబ్రవరి మొదటివారంలోగా నోటిఫికేషన్ ఇచ్చి రెండువారాల్లో ఒక ఎన్నిక, మరో వారం, పదిరోజుల గడువు ఇచ్చి మరో ఎన్నిక పూర్తి చేస్తే అన్నివిధాలా బావుంటుందనే అభిప్రాయం అధికారవర్గాల్లో వినిపిస్తోంది. మార్చి నెలలో ఇంటర్, టెన్త్ పరీక్షలు ఉన్నందున అంతకు ముందే ఎన్నికలు జరిపితే మంచిదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఫిబ్రవరిలోనే మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు కూడా జరగాల్సి ఉన్నందున, పనిలో పనిగా స్థానిక ఎన్నికలు కూడా నిర్వహిస్తే మంచిదని భావిస్తున్నారు. ముందుగా పంచాయతీల ఎన్నికలు, ఆ తర్వాత మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఫిబ్రవరిలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు, ఆయా శాఖలకు సంబంధించి బడ్జెట్ నిధుల వ్యయం పూర్తిచేయాల్సి ఉన్నందున, వేసవి ముగిశాక లేదా మేలో ఈ ఎన్నికలు నిర్వహించే అవకాశం కూడా లేకపోలేదని కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడుతున్నారు.

స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై....

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంపుదలపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. అయితే రాష్ట్రవ్యాప్తంగా కులగణన సర్వే పూర్తయ్యింది. దీనికి సంబంధించిన నివేదికను ఇంకా ప్రభుత్వం విడుదల చేయలేదు. ఆయా అంశాలపై పరిశీలన చేపట్టిన డెడికేటెడ్ కమిషన్ బీసీలకు ఎంత శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే దానిపై ఇంకా నివేదికను సమర్పించలేదు. దీనిని పరిశీలించాక ఎంతశాతం బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలనేది రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసి ఎన్నికల నిర్వహణకు ఎస్‌ఈసీకి పంపించనుంది. ఈ ఉత్తర్వులు అందిన వెంటనే రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేసి ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తుంది.

సీఎం రేవంత్‌రెడ్డి పాస్‌పోర్ట్ రిలీజ్

- విదేశీ పర్యటనకు అనుమతి ఇచ్చిన ఏసీబీ కోర్టు
- గతంలో ఓటుకు నోటు కేసులో పాస్‌పోర్ట్ జప్తు

సిటీ కోర్టులు(హైదరాబాద్) : బ్రిస్బేన్, దావోస్‌తోపాటు పలు దేశాల్లో పర్యటించేందుకు వీలుగా సీఎం రేవంత్‌రెడ్డి పాస్‌పోర్ట్‌ను రిలీజ్ చేస్తూ నాంపల్లిలోని ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఓటుకు నోటు కేసులో నిందితుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి బెయిల్ కోసం గతంలో ఆయన తన పాస్‌పోర్ట్‌ను కోర్టులో అప్పగించారు. అయితే ఈ నెల 13 నుంచి 24 వరకు ఆయన వివిధ దేశాల్లో పర్యటించనున్న నేపథ్యంలో తన పాస్‌పోర్టును విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి తరఫు న్యాయవాది విశ్వేశ్వరరావు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసి బుధవారం వాదనలు వినిపించారు. ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం వార్షిక సమావేశంలో పాల్గొనాలని, దానితోపాటు మరిన్ని దేశాల పర్యటనలు ఉన్న నేపథ్యంలో ఆయన పాస్‌పోర్ట్ రిలీజ్ చేయాలని కోర్టును అభ్యర్థించారు. వాదనలు విన్న ఏసీబీ కోర్టు జడ్జి అఫ్రోజ్ అక్తర్ రేవంత్ పాస్‌పోర్ట్‌ను 6 నెలల పాటు రిలీజ్ చేస్తూ రూ.50 వేల సొంత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించారు. దీంతో పూచీకత్తును కోర్టులో సమర్పించిన తర్వాత పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి రేవంత్‌రెడ్డి పాస్‌పోర్ట్‌ను తెప్పించింది. అనంతరం సీఎం రేవంత్ తరఫున ఆయన సోదరుడు పాస్‌పోర్ట్ తీసుకుంటున్నట్టు కోర్టులో సంతకం చేశారు.

పంచాయతీ ఉద్యోగులకు ప్రతినెలా జీతాలు

- ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా చెల్లించండి
- ఇబ్బంది రాకుండా గ్రీన్ చానల్ ద్వారా ఇవ్వండి
- ఉపాధి బిల్లులు సకాలంలో కూలీలకు అందాలి
- పంచాయతీరాజ్ సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం



సమీక్షలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కేకే, జానారెడ్డి, కోమటిరెడ్డి, కొండా సురేఖ, సీతక్క

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలను ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఇకపై నెలనెలా చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో 92,351 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరికి ప్రతినెలా రూ.116 కోట్లు జీతాలుగా చెల్లించాల్సి ఉంది. ఈ జీతాల చెల్లింపులో ఆలస్యం జరగకుండా స్పష్టమైన విధానం అనుసరించాలని పంచాయతీరాజ్, ఆర్థిక శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. గ్రీన్ చానల్ ద్వారా వీరికి జీతాలు చెల్లించాలని సూచించారు. గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు.

కేంద్రం నుంచి నిధులు రాబట్టాలి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ఇచ్చే బిల్లులను సకాలంలో చెల్లించాలని సీఎం ఆదేశించారు. గతేడాది ఏప్రిల్ నుంచి దాదాపు 1.26 లక్షల ఉపాధి పనులు జరిగాయని.. వీటికి సంబంధించిన మొత్తం బిల్లులను త్వరగా చెల్లించాలని అధికారులకు సూచించారు. కేంద్రం నుంచి పంచాయతీలకు విడుదలయ్యే నిధులు ఎప్పటికప్పుడు గ్రామాల అభివృద్ధికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకాల ద్వారా కేంద్రం నుంచి రావాల్సిన నిధులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు రాబట్టుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. సమీక్షలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కేజీబీవీలలో జేఈఈ, నీట్ శిక్షణ

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు
- ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఆన్‌లైన్ శిక్షణను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

చందుర్తి/రుద్రంగి/వేములవాడ రూరల్: పేద విద్యార్థుల సమగ్రాభివృద్ధికి దేశంలోనే ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జేఈఈ, నీట్ పరీక్షలకు ఆన్‌లైన్ విద్యాబోధనను ప్రవేశపెడుతున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులు ఐఐటీ, నీట్ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఈ ఆన్‌లైన్ బోధన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి, రుద్రంగి, వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో (కేజీబీవీ)గురువారం జేఈఈ, నీట్ పరీక్షలకు సంబంధించిన ఆన్‌లైన్ బోధనను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందన్నారు. కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లాను ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ ఢిల్లీ, హైదరాబాద్, రాజస్తాన్‌లోని కోటాలో అందుబాటులో ఉన్న జేఈఈ, నీట్ పరీక్షలకు సంబంధించిన ఆన్‌లైన్ విద్యాబోధనను జిల్లాలోని కేజీబీవీలలో ప్రారంభించినట్లు వెల్లడించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, బియ్యం, పప్పుల్లో పురుగులు లేకుండా చూడాలని ఆదేశించారు.



తీర్పు దినాన్ని తిరస్కరించే వ్యక్తిని నీవు చూశావా?
అతడే అనాథలను కసరికొట్టేవాడు:
పేదవాళ్ళకు అన్నం పెట్టమని ప్రోత్సహించనివాడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 10 జనవరి 2025

క్షమార్హం కాని నేరం!

కోరి కొల్చినవారికి కొంగు బంగారమై కొలువుదీరిన కలియుగ ప్రత్యక్ష దైవం చెంత తిరుపతిలో బుధవారం ఒక మహాపరాధం జరిగిపోయింది. కేవలం పాలకుల చేతగానితనంవల్ల ఆరు నిండు ప్రాణాలు బలికావటం, 43 మందికి పైగా గాయపడటం చరిత్ర ఎరుగని విషాదం. శతాబ్దాలుగా ఏడుకొండలవాడి సన్నిధిలో ఎన్నడూ ఇటువంటి దారుణ ఉదంతం చోటుచేసుకున్నట్టు నమోదు కాలేదు. రాచరికం మొదలు ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థ వరకూ ఎందరెందరో పాలకులొచ్చారు. కానీ ఎప్పుడూ ఎవరూ ఇంత చేటు నిర్లక్ష్యం ప్రదర్శించిన దాఖలా లేదు. ఇదే దారుణమనుకుంటే... దుర్ఘటన జరిగింది మొదలుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వరసబెట్టి బాహాటంగా ప్రదర్శిస్తున్న అతి తెలివితేటలు ప్రజలను దిగ్భ్రాంతి పరుస్తున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా గురువారం బైరాగిపట్టెడ దగ్గర కెమెరాల కోసం 'ప్రజాకోర్టు' నిర్వహించి అధికారులపై ముఖ్యమంత్రి చంద్రబాబు విరుచుకుపడటమైనా... మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరామర్శకు వస్తున్నారని తెలిసి క్షతగాత్రులు కోలుకోకుండానే ఆదరాబాదరాగా ఆస్పత్రినుంచి వారిని పంపటానికి ప్రయత్నించిన తీరైనా బాబు వంచనాత్మక విన్యాసాలకు పరాకాష్ఠ. ఇవే కాదు... జరిగిన ఘోరంపై టీటీడీ చైర్మన్ మొదలుకొని మంత్రుల వరకూ ఒక్కొక్కరు వినిపిస్తున్న కథలు విస్తుగొలుపుతున్నాయి. ఇలాంటిదేదో జరుగుతుందని ముందే సమాచారం ఉన్నదని చైర్మన్‌గిరీ వెలగబెడుతున్న బీఆర్ నాయుడు చెబుతున్నారు. మరి వీరంతా కలిసి చేసిందేమిటి?

అసలు ఏమైంది ఈ ప్రభుత్వానికి? ఎందుకింత చేష్టలుడిగిపోయింది? వైకుంఠ ఏకాదశి పర్వదినం మొదలు వరసగా పదిరోజులపాటు వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుమలకు ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి మాత్రమేకాదు... దేశం నలుమూలల నుంచి కూడా భక్తులు పోటెత్తుతారని తెలుసు. అందుకోసం సీఎం కార్యాలయం మొదలుకొని టీటీడీలో అట్టడుగు సిబ్బందివరకూ పకడ్బందీ సమన్వయంతో ముందుకు సాగాలనీ తెలుసు. అంతక్రితం కేవలం రెండురోజులు మాత్రమే ఉండే వైకుంఠద్వార దర్శనాన్ని భక్తుల సంఖ్య నానాటికీ పెరగటాన్ని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పదిరోజులకు పెంచింది. భక్తులు సజావుగా దర్శనం చేసుకుని తరించటానికి వీలుగా 9 కేంద్రాల్లో పదేసి కౌంటర్లలో సర్వ దర్శనం టోకెన్ల జారీ ప్రక్రియ ప్రారంభించింది. 24 గంటలముందే తెల్లారుజామున అయిదు గంటలకు టోకెన్ల జారీ మొదలయ్యేది. కానీ దీన్నంతటినీ తలకిందులు చేసి ముందురోజు అర్ధరాత్రి నుంచీ వేచి వున్న భక్తులను ఒకచోట చేర్చి రాత్రి ఎప్పుడో టోకెన్లు ఇవ్వటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? తెల్లారుజాము నుంచి రాత్రి వరకూ సిబ్బంది ఏం చేసినట్టు? కనీసం టోకెన్ల కోసం ఆరుబయట పడిగాపులు పడుతున్న భక్తుల్లో పసిపిల్లల నుంచి వృద్ధుల వరకూ ఉన్నారన్న స్పృహ... వారికి తిండీ నీళ్లూ అందించాలన్న ఇంగితజ్ఞానం ఉండొద్దా? వచ్చిన వారిని వచ్చినట్టుగా క్యూలైన్లలో పంపి, వెంటవెంటనే టోకెన్లు జారీ చేయొద్దా? ఆధునిక సాంకేతికతలు అందుబాటులోకొచ్చాయి గనుక జిల్లాల్లోనే ఆన్‌లైన్‌లో టోకెన్లు అందించే ప్రక్రియ అమలుచేయొచ్చు. అదే జరిగితే భక్తులందరూ స్వామివారిని తనివితీరా వీక్షించి, సురక్షితంగా తమ తమ ఇళ్లకు చేరుకునేవారు. కానీ పక్షవాతం వచ్చిన చందంగా ఎవరికివారు చేష్టలుడిగి ఈ ఘోర ఉదంతానికి కారకులయ్యారు.

దీన్నంతటినీ కప్పిపుచ్చుకోవటానికి జిల్లా ఎస్పీని బదిలీ చేశారు. ఒక డీఎస్పీని సస్పెండ్ చేశారు. ఈవో, జేఈవోను వదిలేశారు. మరి శాంతిభద్రతల విభాగం దగ్గరుంచుకుని బాబు చేసిందేమిటి? ప్రమాణస్వీకారానికి ముందే తమ కనుసైగలతో ఊరూ వాడా దాడులూ, దౌర్జన్యాలూ, సామాన్య పౌరుల ఇళ్లు నేలమట్టం చేయించి మాఫియాలను తలపించే పాలనకు శ్రీకారం చుట్టిన పర్యవసానం కాదా ఈ ఉదంతం? తిరుమల లడ్డూలో జంతుకొవ్వు కలిసిందని తప్పుడు ప్రచారానికి పాల్పడలేదా? ఈ నేపథ్యంలో ఏ జిల్లాలోనైనా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది చిత్తశుద్ధితో, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించగలుగుతున్నారా? ఎన్ని కేసులుంటే అంత గొప్పగా నెత్తెక్కించుకుంటామని అధికారంలోకి రాకముందు టీడీపీ శ్రేణుల్లో నేరస్వభావాన్ని పెంచిన ఘనత వీరిది. ఇప్పుడు పోలీసులకూ అదే రంధి పట్టుకుంది. ఎంతమందిపై అక్రమ కేసులు పెడితే అంతగా నజరానాలు పొందొచ్చన్న దురాశ పుట్టింది. అందుకే వైఎస్సార్ కాంగ్రెస్ నేతలతోపాటు, సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు బనాయిస్తూ రాష్ట్రంలో ఈమూలనుంచి ఆ మూలకు తిప్పుతున్నారు. ఇక శాంతిభద్రతలు ఎటుపోతేనేం... పర్వదినాలకు వచ్చే భక్తులు ఏమై పోతేనేం! దేవుడంటే భయభక్తుల్లేవు... ప్రజలంటే వెరపు లేదు! ఈ దుఃస్థితికి ఎన్డీయే కూటమి పాలకులు సామూహికంగా సిగ్గుపడాలి. విశాఖలో స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తుపై ఒక్క మాటైనా మాట్లాడని ప్రధాని మెప్పు పొందటానికి బాబు, పవన్, లోకేశ్‌లు అగచాట్లు పడితే... అక్రమ కేసుల పరంపరతో ఆ ముగ్గురి దగ్గరా మార్కులు కొట్టేద్దామని అధికార యంత్రాంగం పాట్లు పడుతోంది. వెరసి ఇలాంటి దారుణాలు రివాజయ్యాయి. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడినవారి కుటుంబ సభ్యులు చెబుతున్న విషయాలు వింటే గుండె తరుక్కుపోతుంది. 2015లో తన ఏలుబడిలో, తన వల్ల, తన సమక్షంలో గోదావరి పుష్కరాల్లో 29 మంది భక్తుల మరణానికి దారితీసిన ఉదంతాన్ని బాబు సోమయాజులు కమిషన్‌తో కప్పెట్టటాన్ని ఎవరూ మరిచిపోరు. కనుక తిరుపతి ఉదంతంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలి. టీటీడీ చైర్మన్‌తో సహా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

కూలీల బాగే వ్యవసాయ బాగు

విశ్లేషణ



డా॥ దొంతి నరసింహా రెడ్డి

అనేక కారణాల వల్ల వ్యవసాయ కూలీలు ఊర్లో ఉండి పని చేసుకుని బతికే అవకాశాలు తగ్గుతున్నాయి. వ్యవసాయంలో వస్తున్న ఆధునిక మార్పులు పని అవకాశాలను తగ్గించాయి. వాతావరణ మార్పుల వల్ల సంభవిస్తున్న తీవ్రమైన ఎండలు, విపరీతమైన వర్షాలు వ్యవసాయ కూలీల సాధారణ పనికి ఆటంకంగా మారాయి. వ్యవసాయేతర అవసరాల కొరకు భూసేకరణ జరిగి, భూమి వినియోగం మారినప్పుడు, దాని ప్రభావం వ్యవసాయ ఉత్పత్తి మీద, వ్యవసాయ కూలీల మీద ఉంటుంది. వ్యవసాయంలో రైతులు, వ్యవసాయ కూలీల మధ్య అనుబంధం ఉంటేనే సుస్థిర వ్యవసాయం సాధ్యం. ఈ అనుబంధానికి తగిన ప్రభుత్వ మద్దతు, ఉపశమనం కలిగించే పథకాలు ఉంటేనే వ్యవసాయం స్వతంత్రంగా నిలబడగలుగుతుంది.

వ్యవసాయంలో 2018–19 నాటికి సగటు రోజువారీ ఆదాయం 27 రూపాయలు మాత్రమే. ఆర్థిక సర్వే 2021–22 ప్రకారం, 2019 నాటికి వ్యవసాయ కుటుంబ సగటు నెలవారీ ఆదాయం రూ.10,218. రైతు ఆదాయమే అంత తక్కువ ఉండగా, వ్యవసాయ కూలీ ఆదాయం అంతకంటే ఘోరంగా ఉన్నది. ఉపాధి హామీ పథకంలో సగటు రోజు కూలీ రూ.179.70 చూపించి రైతు కన్నా వాళ్లకు ఎక్కువ వస్తుంది అనుకుంటారు. పథకంలో అమలు అవుతున్న పని దినాలు చాలా తక్కువ. కూలీల వలసలు తగ్గకపోవడమే దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. సగటు రైతు ఆర్థిక పరిస్థితే బాగాలేనప్పుడు సగటు రైతు కూలీ పరిస్థితి మెరుగ్గా ఉండే అవకాశం లేదు. వ్యవసాయ కూలీలకు సంవత్సరం మొత్తం పని ఉండదు. కూలీ సరిపోక చాలా కుటుంబాలు పిల్లలను బడికి కాకుండా పనికి పంపిస్తున్నాయి. భారతదేశంలో బాల కార్మికుల సంఖ్య వివిధ అంచనాల ప్రకారం 1.75 నుండి 4.4 కోట్లు.

అప్రకటిత నిర్లక్ష్యం

2011 జనాభా లెక్కల ప్రకారం, దేశంలో మొత్తం వ్యవసాయ కార్మికుల సంఖ్య 2001లో ఉన్న 23.41 కోట్ల (12.73 కోట్ల సాగుదారులు, 10.68 కోట్ల వ్యవసాయ కూలీలు) నుండి 2011లో 26.31 కోట్లకు (11.88 కోట్ల సాగుదారులు, 14.4 కోట్ల వ్యవసాయ కూలీలు) పెరిగింది. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదిక ప్రకారం, భారతదేశంలోని మొత్తం శ్రామికశక్తిలో 45.5 శాతం మంది 2021–22 నాటికి వ్యవసాయ కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నారు. దేశంలోని శ్రామిక శక్తి ఉపాధిలో వ్యవసాయ రంగం వాటా 2020–21లో 46.5 శాతం ఉండగా, 2021–22 నాటికి 45.5 శాతానికి తగ్గింది.

పల్లెలలో సాగుదారులు, వ్యవసాయ కూలీలు ఎక్కువగా ఉన్నారు. వారి సంఖ్యను తగ్గించాలని గత 40 యేండ్ల నుంచి ప్రభుత్వం కంకణం కట్టుకున్నది. కొందరు అపర మేధావులు కూడా ఉత్పాదకత పేరు మీద, ఇంకేవో లెక్కల ఆధారంగా వ్యవసాయంలో ఇంత మంది ఉండొద్దు, తగ్గించే కార్యక్రమాలు చేపట్టమని ప్రభుత్వానికి పదేపదే చెబుతుంటారు. వ్యవసాయ కూలీలను నిర్లక్ష్యం చేసే అప్రకటిత ప్రభుత్వ విధానం ఆ కోణం నుంచే వచ్చింది. రైతులు, కూలీల సంఖ్య తగ్గించాలనుకునేవారు వారికి ఇతర మార్గాల ఏర్పాటు గురించి ఆలోచనలు చేయడం లేదు.

వ్యవసాయమే ఆధారంగా ఉండే పల్లెలలో వ్యవసాయం ఆదాయాన్ని బట్టి, అందులో ఉన్న మార్పులను బట్టి ఇతర వృత్తుల మీద ప్రభావం ఉంటున్నది. రోడ్లు, విమానాశ్రయం, పరిశ్రమలు తదితర వ్యవసాయేతర అవసరాలకు కొరకు భూసేకరణ జరిగి, భూమి ఉపయోగం మారినప్పుడు, ఆ ఊర్లో ఆ మేరకు వ్యవసాయం తగ్గుతుంది. దాని ప్రభావం వ్యవసాయ ఉత్పత్తి మీద, వ్యవసాయ



కూలీల మీద ఉంటుంది. బహుళ పంటలు ఉంటే నిరంతరం పని ఉంటుంది. ఒక్కటే పంట ఉంటే విత్తనాలప్పుడు, కోతలప్పుడు తప్పితే పని ఉండదు. ఇదివరకు రైతులు పండించి కొంత తమ దగ్గర పెట్టుకుని మిగతాది మార్కెట్‌కు తరలించేవారు. ఇప్పుడు మొత్తం నేరుగా మార్కెట్‌కు తరలిస్తున్నారు. రైసు మిల్లులు అధునాతనం అయినాక వాటి సగటు సామర్థ్యం పెరిగింది, కూలీ పని తగ్గింది.

తగ్గుతున్న పని

కాంట్రాక్ట్ వ్యవసాయం, యాంత్రీకరణ, రసాయనీకరణ తర్వాత ఇప్పుడు ప్రభుత్వం డిజిటలీకరణ అంటున్నది. సబ్సిడీలు ఇచ్చి తెస్తున్న ఈ మార్పులు ఖర్చులను పెంచడంతో పాటు వ్యవసాయ కూలీలకు పని అవకాశాలు తగ్గించాయి. కూలీ రేట్లు పెరిగినందువల్ల కలుపును చంపే రసాయనాల వాడకం పెరిగిందని చాలా మంది నమ్ముతున్నారు. అది పెస్టిసైడ్ కంపెనీల మార్కెట్ మాయ మాత్రమే. సగటు పంట ఖర్చు పెరుగుదలలో విత్తనాలు, ఎరువులు, కీటకనాశక రసాయనాలు వగైరా అన్ని పెరిగినాయి. వాటి ధరల మీద, నాణ్యత మీద, వాటి కొరకు అయ్యే రవాణా, ఇతర ఖర్చుల మీద రైతులకు నియంత్రణ లేదు. పట్టణవాసులు ఐస్‌క్రీమ్, సబ్బులు, సినిమా టికెట్ కొనేటప్పుడు, హోటల్ బిల్లు కట్టేటప్పుడు పెద్దగా ఆలోచించరు. కానీ, కొత్తిమీర కట్ట రేటు పెరిగితే తెగ బాధపడతారు. అట్లాగే, రైతు బయట సరుకుల రేటు, వాటి కొరకు చేసే అప్పులు, వాటి మీద వడ్డీలు, తన ప్రయాణం, సరుకుల రవాణా వగైరా ఖర్చులను లెక్కలోకి తీసుకోడు. కానీ ఊర్లో ఉండే కూలీకి ఎంత ఇవ్వాలి అని మాత్రం ఆలోచిస్తాడు. కూలీ గురించి రైతుకు ఉన్న చింత బయటి నుంచి కొనుక్కొస్తున్న వాటి మీద ఉండటం లేదు. ఎందుకంటే కూలీ ఒక్కటే తన పరిధిలో ఉంటుంది.

వ్యవసాయం సంక్షోభంలో ఉన్నది. రైతు సంక్షోభంలో ఉన్నాడు. వ్యవసాయ కూలీలు సంక్షోభంలో ఉన్నారు. పాడి పశువుల పరిస్థితి భిన్నంగా లేదు. పల్లెలు మొత్తం ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయి. ఊర్లోకి రూపాయి రాకడ కంటే పోకడ ఎక్కువ అయినందున సగటు గ్రామీణ కుటుంబం అప్పులలో ఉన్నది. అందుకే వ్యవసాయ కూలీలు వలస పోతున్నారు. స్థానిక వ్యవసాయ కూలీలను కోల్పోతే వారి స్థానంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వలస కార్మికులు శారీరక శ్రమ చేయగలుగుతారేమో కానీ రైతుకు పూర్తి మద్దతు రాదు. స్థానిక వాతావరణాన్ని బట్టి ఉండే నైపుణ్యం, జ్ఞానం, అనుభవం ఉన్న స్థానిక వ్యవసాయ కూలీలు రైతుకు అనేక రూపాలలో మద్దతు ఇవ్వగలుగుతారు. వలస వచ్చిన కూలీలు ఆఫీసుకు వచ్చి పోతున్నట్లు వ్యవహరిస్తారు. వ్యవసాయంలో రైతులు, వ్యవసాయ కూలీల మధ్య అనుబంధం ఉంటేనే సుస్థిర వ్యవసాయం సాధ్యం. ఈ అనుబంధానికి తగిన ప్రభుత్వ మద్దతు, సానుకూల విధానాలు, ఉపశమనం కలిగించే పథకాలు, సంక్షేమ నిధులు ఇస్తేనే భారత వ్యవసాయం స్వతంత్రంగా నిలబడగలుగుతుంది. లేకపోతే, మన ఆహార భద్రత ఆందోళన కలిగించకమానదు.

కూలీలు కేంద్రంగా విధానం

ఆధునిక వ్యవసాయంలో విపరీతంగా వాడుతున్న ప్రమాదకర కీటకనాశక రసాయనాల వల్ల, వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయ కూలీల ఆరోగ్యం ప్రమాదంలో పడింది. తీవ్రమైన ఎండలు, విపరీతమైన వర్షాలు వ్యవసాయ కూలీల సాధారణ పనికి ఆటంకంగా మారాయి. భారత వాతావరణ శాఖ ప్రకారం, పిడుగుపాటు వల్ల ప్రతి సంవత్సరం సుమారు 2,000 మంది చనిపోతున్నారు. భారతదేశపు మొట్టమొదటి వార్షిక ఉరుములు మెరుపుల నివేదిక (2019–2020) ప్రకారం, పిడుగుపాటు మరణాలకు ప్రధాన కారణం చెట్టు కింద నిలబడటం. ఇది మొత్తం పిడుగుపాటు మరణాలలో 71 శాతం. అత్యధిక సంఖ్యలో వ్యవసాయ కూలీలు ఆరు బయట పని చేస్తూ ఉంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా ఆయా కుటుంబాలకు ఉపశమనం కల్పించటానికి ఒక్క అడుగు కూడా వేయలేదు.

2021లో భారతదేశం ప్రకృతి వైపరీత్యాల వల్ల దాదాపు రూ. 27 వేల కోట్ల నష్టం అయ్యిందని ఒక అంచనా. ఇందులో వ్యవసాయ కూలీల జీవనోపాధికి వచ్చిన నష్టం కలుపలేదు. వీరిని కూడా నష్టాల అంచనాలలో, నష్ట నివారణ చర్యలలో ముఖ్యంగా పరిగణించాలని అంతర్జాతీయ కార్మిక సంస్థ కూడా చెప్పింది. ఈ సంస్థ తయారు చేసిన విధి విధానాలు భారతదేశంలో అమలు చేయడానికి ఒక జాతీయ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చెయ్యాలి. జాతీయ బడ్జెట్‌లో దీనికి అవసరమైన కేటాయింపులు చేయాలి. వ్యవసాయ కూలీలు కేంద్రంగా సుస్థిర అభివృద్ధి, పర్యావరణ అనుకూల గ్రామీణ విధానాలు తయారు చెయ్యాలి.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

సోషల్ మీడియా

వ్యూహాత్మక అడుగు



తాలిబన్లతో ఇండియా సంబంధం నెరపడాన్ని అఫ్గానిస్తాన్‌లో పాకిస్తాన్‌ను ఎదుర్కొనే ప్రయత్నంగా కొందరు చూస్తుండొచ్చు, కానీ దాన్ని ఇంకా సరళంగా అర్థం చేసుకోవచ్చు. అఫ్గాన్ భూభాగాన్ని భారత వ్యతిరేక తీవ్రవాదులు వాడకుండా ఒప్పించే ప్రయోజనం దాని వల్ల నెరవేరుతుంది. – మైకేల్ కుగెల్‌మాన్, విదేశాంగ విధాన నిపుణుడు

సర్వనాశనం



కార్చిచ్చులో పసిఫిక్ పలిసేడ్స్ (అమెరికా)లోని మా ఇల్లు మొత్తం కాలిపోయింది. మా నాన్న బర్గర్లు అమ్మే 'ద బీచ్‌సైడ్ కెఫె' సహా మా పొరుగున ఉన్నవన్నీ క్షణాల్లో బూడిదయ్యాయి. ఈ బాధను నేను భరించలేను. ఈ వేదనను మాటల్లో చెప్పలేను.

– జెన్నిఫర్ బెగాకిస్, పరిశోధకురాలు

ఆందోళన వల్లే...



ఇరాన్ తన రాజధానిని మాక్రాన్‌కు మార్చనుంది. ప్రజా తిరుగుబాటు పట్ల ఆందోళన ఉన్నప్పుడే ఇలాంటి ఎత్తు వేస్తారు. కఠిన ఆంక్షలతల తర్వాత కూడా ధార్మిక చట్టాలను అక్కడి యువత బహిరంగంగా ఉల్లంఘిస్తోంది. 200 ఏళ్ల క్రితం తెహ్రాన్‌ను ఆఘా మహమ్మద్ ఖాన్ ఇరాన్ రాజధాని చేశారు.

– ఇంతియాజ్ మహమూద్, వ్యాఖ్యాత

ఉద్యోగాలుండవా?



'సేల్స్‌ఫోర్స్' సంస్థ 2025లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను ఉద్యోగంలోకి తీసుకోదని ఆ సంస్థ సీఈఓ మార్క్ బెనియాఫ్ ఇప్పటికే ప్రకటించారు. అయితే, కృత్రిమ మేధ ప్రభావం అప్పుడే మొదలైందన్నమాట! – అమిత్ శాండిలియా, కాలమిస్ట్

ఒక్కడు



నా స్నేహితుడు ప్రీతీశ్ నంది (కవి, సంపాదకుడు, నిర్మాత, రాజ్యసభ సభ్యుడు) మరణం నన్ను తీవ్రంగా బాధించింది. ఆయన లాంటి మనిషి ఇంకెవరూ ఉండరు. ఆయన ఇంకోవైపు సరదా పార్టీ మొదలుపెట్టే ఉంటారు.

– మహువా మొయిత్రా, తృణమూల్ ఎంపీ

జగన్ హయాం ఆర్థిక ప్రగతికి కితాబు

సందర్భం



వి.వి.ఆర్. కృష్ణంరాజు

ప్రపంచ చెస్ మాజీ ఛాంపియన్ గ్యారీ కాస్పరోవ్ రష్యాలో రాజకీయ అణచివేతలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ, అనేక పుస్తకాలు రచించారు. ప్రస్తుత రష్యా పాలకుల చేత ఉగ్రవాదిగా కూడా ముద్ర వేయించుకున్నారు. రష్యాలో నిరంతరం జరుగుతున్న తప్పుడు ప్రచారానికి వ్యతిరేకంగా ప్రపంచ వేదికలపై తన గళాన్ని తరచుగా వినిపిస్తున్నారు. ఒక సందర్భంలో ఆయన 'తప్పుడు వార్తలను ప్రచారం చేసేవారి లక్ష్యం మనల్ని పెడతోవ పట్టించి వారి అజెండాను మనపై రుద్దడమే కాదు, నిజాలను తెలుసుకోవాలన్న మన ఆలోచనలను శాశ్వతంగా నాశనం చేయడం కూడా' అంటారు. ప్రస్తుత సమాజంలో తప్పుడు కథనాలు, ప్రకటనలు ప్రజల మేధను కలుషితం చేస్తున్నాయి. వారు తప్పుడు నిర్ణయాలు తీసుకునేలా చేస్తున్నాయి. దీనికి ఒక ఉదాహరణ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు.

గత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఎంతో మేలు చేసినప్పటికీ, ఇచ్చిన వాగ్దానాలు నిలుపుకొన్నప్పటికీ, అద్భుతమైన ఆర్థిక ప్రగతి సాధించినప్పటికీ; ప్రత్యర్థి రాజకీయ పార్టీలు, వారి అనుకూల మీడియా నిరంతరం చేసిన తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మారు. ఫలితంగా మంచి చేసే ప్రభుత్వాన్ని చేజేతులా గద్దెదించి, కూటమి నిప్పుల కుంపటిని నెత్తిన పెట్టుకున్నారు. దీని దుష్ఫలితాలను ఆంధ్రులు ఇప్పుడు అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వాగ్దానాలు అమలు చేయలేక చేతులెత్తేసి దాని నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి నెలకో వివాదాన్ని సృష్టిస్తోంది. అంతేగాక గత ప్రభుత్వం అస్తవ్యస్త విధానాల కారణంగా రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందంటూ తప్పుడు ప్రచారాన్ని కొనసాగిస్తోంది.

కూటమి నేతలు నిత్యం తప్పుడు ప్రచారాలు చేస్తూ జగన్ ప్రభుత్వ హయాంలో ఆర్థిక వృద్ధి కుంటుపడిందనీ, తాము ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నామనీ అంటున్నారు. అయితే వీరి అవాస్తవ ప్రచారాన్ని గతంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, రిజర్వ్ బ్యాంకు నివేదికలు పటాపంచలు చేశాయి. జగన్ హయాంలో కుప్పలు తెప్పలుగా అప్పులు చేశారనీ, అప్పుల భారం రూ. 14 లక్షల కోట్లకు చేరిందనీ... ఎన్నికల సమయంలోనూ, తర్వాత కూడా కూటమి నేతలు ప్రచారం చేశారు. అయితే ఈ అప్పులు రూ. 7.5 లక్షల కోట్లు మాత్రమేనని కేంద్ర ప్రభుత్వ సంస్థలు నిర్ధారించాయి. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతిని సాధించిందంటూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన తాజా నివేదిక 'హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్'లో పేర్కొంది.





వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతిని సాధించిందంటూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన తాజా నివేదిక 'హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్'లో పేర్కొంది.

కోవిడ్ కారణంగా రెండేళ్ళపాటు దేశం ఆర్థిక ఒడుదుడుకులకు లోనయినప్పటికీ ఆంధ్రప్రదేశ్ మాత్రం జగన్ పాలనలో అనేక రంగాల్లో రెండంకెల వృద్ధిలో దూసుకుపోయింది. 2022–23లో దేశ స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు సుమారు 8 శాతం ఉంటే ఆ ఏడాది ఏపీలో 11.43 శాతం నమోదయ్యింది. జగన్ హయాంలో నాలుగేళ్ళ సగటు వృద్ధి 12.70గా నమోదయ్యింది. ఇది దేశంలోనే అత్యధిక వృద్ధి రేట్లలో ఒకటి. 2018–19 ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 2018–31 మార్చి 2019) చంద్రబాబు నాయుడు హయాంలో రూ. 7.90 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ) విలువ జగన్ ప్రభుత్వ హయాంలో రూ. 13.17 లక్షల కోట్లకు పెరిగినట్లు రిజర్వ్ బ్యాంక్ తాజా నివేదికలో తెలిపింది.

రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం 2018–19లో రూ. 1,54,031 కాగా, 2023–24లో అది రూ. 2,42,479 పెరిగింది. తయారీ రంగం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సమకూరిన నికర స్థూల విలువ 2018–19లో రూ. 67.30 వేల కోట్లు కాగా, 2023–24లో జగన్ ప్రభుత్వ హయాం నాటికి రూ. 1.29 లక్షల కోట్లకు పెరిగింది. అలాగే ఆహార పంటల సాగు విస్తీర్ణం తగ్గి, వాణిజ్య పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. ఫలితంగా రైతుల ఆదాయాలు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగాయి. 2018–19లో రూ. 9.97 లక్షల కోట్లుగా ఉన్న వ్యవసాయ రంగం నికర విలువ 2023–24లో రూ. 16.82 లక్షల కోట్లకు పెరిగింది. 2018–19లో రూ. 56.10 వేల కోట్లుగా ఉన్న నిర్మాణ రంగం నికర విలువ 2023–24లో రూ. 95.74 వేల కోట్లకు పెరిగింది.

జగన్ పాలనలో పారిశ్రామిక వేత్తలు పారిపోయారంటూ విష ప్రచారం చేశారు. అయితే పారిశ్రామిక రంగం నికర విలువ 2018–19లో రూ. 1.57 లక్షల కోట్లు కాగా, అది 2023–24లో రూ. 2.82 లక్షల కోట్లకు పెరిగింది. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల నికర విలువ 2018–19లో రూ. 32.43 వేల కోట్లు కాగా, 2023–24 నాటికి రూ. 56.59 వేల కోట్లకు పెరిగింది. సేవా రంగం నికర విలువ 2018–19లో రూ. 2.96 లక్షల కోట్లు కాగా, అది 2023–24లో రూ. 4.67 లక్షల కోట్లకు పెరిగింది. ఆర్బీఐ తాజా నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ మైనింగ్ రంగం గత ప్రభుత్వ హయాంలో 38.41 శాతం, నిర్మాణ రంగంలో 26.75 శాతం, మత్స్య రంగంలో 25.92 శాతం, పారిశ్రామిక రంగంలో 25.58 శాతం, తయారీ రంగంలో 24.84 శాతం, ఆతిథ్య రంగంలో 22.70 శాతం, సర్వీస్ సెక్టార్‌లో 18.91 శాతం, వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 14.50 శాతం వృద్ధి సాధించి దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించింది.

రిజర్వ్ బ్యాంక్ నివేదిక ప్రకారం జగన్ ప్రభుత్వ హయాంలో యేటా 50 లక్షల టన్నుల చేపలు – రొయ్యల ఉత్పత్తులతో, 1.76 కోట్ల టన్నుల పండ్ల ఉత్పత్తితో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఆయిల్ పామ్ సాగులో కూడా ఏపీ దేశంలోనే అగ్ర స్థానంలో ఉంది. దేశ ఎగుమతుల్లో సుమారు 11 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే జరిగాయి. ఏపీ నుంచి సుమారు రెండువేల రకాల ఉత్పత్తులు దేశ విదేశాలకు ఎగుమతి అయ్యాయి.

జగన్ పాలనలో మహిళలు, పేదలు కనివిని ఎరుగని రీతిలో సంక్షేమ ఫలాలు అనుభవించారు. పారిశ్రామిక, వ్యవసాయ, సేవా రంగాల్లో రాష్ట్రం దేశానికే దిశానిర్దేశం చేసింది. కాని జగన్ రాజకీయ ప్రత్యర్థుల అబద్ధపు ప్రచారం ప్రజలను ప్రభావితం చేసింది. ఇప్పుడు ప్రజలు తాము మోసపోయామని వాపోతున్నారు. అధికారం కోసం వెంపర్లాడే వారు, వారి అడుగులకు మడుగులొత్తే మీడియా వర్గాలు నిజాన్ని ఫణంగా పెట్టి చెప్పే ప్రతి అబద్ధానికి ఏదో ఒక రోజు మూల్యం చెల్లించ వలసి ఉంటుంది.

వ్యాసకర్త ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్
మొబైల్: 89859 41411

ఎరుక ముఖ్యం

మనిషికి తన బాహ్య దృష్టికి కనపడేది సమస్తమైన జ్ఞానం కాదనీ, దానికి తోడుగా జ్ఞాన దృష్టితో చూడగలిగే స్థితికి చేరి తెలుసుకునేదే సంపూర్ణ జ్ఞానమనీ... అధ్యాత్మిక బోధనలో సారాంశంగా చెబుతారు. బాహ్య దృష్టికి కనపడేది భౌతిక రూపం మాత్రమే. అయినప్పటికీ వ్యక్తి రూపం, అలంకరణ అనేవి మొదటి చూపులో ఆ వ్యక్తిపై ఏర్పడే అభిప్రాయాన్ని ప్రభావితం చేస్తాయి. అందు చేతనే ప్రతి వ్యక్తికీ తాను ప్రపంచానికి ఎలా కనబడుతున్నాడో చూసుకోవాలన్న కోరిక చాలా బలంగా ఉంటుంది. అద్దం మనిషికి ఆ కోరికను తీర్చే ఒకే ఒక్క ఉపకరణం. నిలువుటద్దంలో తనను తాను చూసుకుని, తాను ఆశించినట్లుగా తన రూపం ఉన్నదో లేదో నిర్ధారించుకుని, అవసరమైతే ఆపై కావాల్సిన సర్దుబాట్లను చేసుకుని తృప్తిపడతాడు మనిషి. అయితే, అద్దంలో కనపడే సంగతులకు హద్దులున్నాయనీ, అద్దంలో కనపడేది మాత్రమే సర్వమని తలపోయడం సరైనది కాదని 'కాకుస్థ విజయము' కావ్యం, ప్రథమాశ్వాసంలోని ఒక తేటగీతి పద్యంలో, జ్ఞాన బోధలోని సారాంశాన్ని సరళమైన భాషలో సంక్షిప్తీకరించి చెప్పాడు ఆ కావ్యకర్త మట్లి అనంతభూపాలుడు.

జ్యోతిర్మయం

దర్పణంబు లేక తన మోము గనరాదు
దాననైన వెన్ను గాన రాదు
కన్నులోప్పు నెంత గననోపు జెప్పుడా
యెఱుక చూప కాంచు నెల్లయవియు

అద్దంలో చూసుకోకపోతే మనిషికి తన ముఖమే తనకు కనిపించదు. అద్దం ఎదురుగా ఉన్నప్పటికీ అందులో శరీరపు ముందు భాగమే తప్ప, వెనుక భాగం కనపడదు. అంటే, శారీరకంగా కూడా అద్దంలో మనిషి తనను తాను వీక్షించుకోగలిగేది అర్ధ భాగమే కాని పూర్తిగా కాదు. పద్మముల వంటి అందమైన పెద్ద పెద్ద కనులు ఉన్నప్పటికీ, ఆ కన్నులతో ఎంత బాగా ప్రయత్నించినా తనను తాను ఎంత చూసుకోగలడో తెలిసిపోతున్నది కదా! వాస్తవం అలా ఉన్నప్పుడు, వేదాంత దృష్టితో తనను గురించి తాను తెలుసుకోవడానికి అద్దం ఏమి ఉపయోగపడుతుంది గనుక? అందుకు అది ఒక నిరుపయోగమైన సాధనం అనడంలో సందేహించ వలసింది ఏమీ లేదు. కనుకనే 'ఎరుక' అనబడే జ్ఞాన దృష్టిని కలిగి ఉండడం మనిషికి అవసరం. అది ఉన్నవాడు మాత్రమే అన్నిటినీ గురించిన సమాచారాన్ని సమగ్రంగా చూడగలడు అని సారాంశం!

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.ఏకాదశి ఉ.9.44 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** కృత్తిక ప.1.42 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** తె..4.53 నుండి 6.24 వరకు (తెల్లవారితే శనివారం), **దుర్ముహూర్తం:** ఉ.8.50 నుండి 9.34 వరకు, తదుపరి ప.12.30 నుండి 1.14 వరకు, **అమృత ఘడియలు:** ఉ.11.24నుండి 12.55 వరకు, వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.38.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899



విదేశీ లింకులున్న కేసుల పరిష్కారానికి మార్గం సుగమం

- ప్రత్యేకంగా పోర్టల్ రూపొందించిన సీబీఐ
- ఇంటర్‌పోల్‌తో సంప్రదింపులు ఇక ఈజీ
- పోర్టల్ వినియోగంపై త్వరలో అధికారులకు మార్గనిర్దేశం

'బయటి నేరగాళ్ల'కు చెక్ భారత్‌పోల్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా చోటు చేసుకున్న అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆ విభాగం మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు కీలకపాత్ర పోషించారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం అమెరికాలో ఉన్న ఆయన్ను రప్పించడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఇంటర్‌పోల్ సాయంతో రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించడానికి 8 నెలలుగా ప్రయత్నాలు చేస్తోంది. కేవలం ఈ ఒక్క కేసులోనే కాదు దేశ వ్యాప్తంగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు, పోలీసు విభాగాలు అనునిత్యం ఏదో ఒక కేసులో నిందితుల ఆచూకీ కనుగొనడం, వారిని రప్పించే క్రమంలో ఇంటర్‌పోల్ సాయం కోరుతుంటాయి. ఇంటర్ పోల్‌గా పిలిచే ఇంటర్నేషనల్ క్రిమినల్ పోలీస్ ఆర్గనైజేషన్ ప్రపంచ వ్యాప్తంగా పోలీసు వ్యవస్థల మధ్య సహకారానికి, నేరాల నియంత్రణకు కృషి చేస్తుంది. అయితే ఏదైనా పోలీసు విభాగం దీన్ని ఆశ్రయించడం అనేది ప్రస్తుతం ఓ సుదీర్ఘ, క్లిష్టతరమైన ప్రక్రియగా ఉంది. దీన్ని సులభతరం చేయడానికి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టి గేషన్ (సీబీఐ) అధీనంలోని నేషనల్ సెంట్రల్ బ్యూరో (ఎన్‌సీబీ) ఫర్ ఇంటర్‌పోల్ ఓ పోర్టల్‌ను రూపొందించింది. అదే భారత్‌పోల్. ఈ పోర్టల్‌ను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రెండురోజుల క్రితం ఢిల్లీలో ఆవిష్కరించారు.

➤ ఒకప్పుడు దేశ వ్యాప్తంగా నమోదయ్యే కేసుల్లో విదేశాలతో లింకు ఉన్నవి అత్యంత అరుదుగా తెరపైకి వచ్చేవి. కానీ ప్రస్తుతం సైబర్ నేరాలు, భారీ ఆర్థిక నేరాలు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాలు, మనుషుల అక్రమ రవాణా తదితర కేసులతో పాటు వ్యవస్థీకృత నేరాల్లో 'విదేశీ లింకులు' సర్వసాధారణం అయ్యాయి. సూత్రధారులు విదేశాల్లో ఉండి ఇక్కడ నేరాలు చేయించడమో, ఇక్కడ నేరం చేసిన వారు విదేశాలకు పారిపోవడమో జరుగుతోంది. దీంతో పోలీసులు, దర్యాప్తు ఏజెన్సీలు ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించడం అనివార్యంగా మారుతోంది. 195 దేశాల సభ్యత్వం కలిగిన ఇంటర్‌పోల్ ద్వారానే రెడ్ కార్నర్ సహా వివిధ రకాలైన నోటీసుల జారీ సాధ్యమవుతుంది.

అనేక కేసుల్లో విదేశీ లింకులు

భారత్‌పోల్.. 5 ఉపయోగాలు

1. దేశంలోని అన్ని ఏజెన్సీలు, పోలీసు విభాగాలతో పాటు కొన్ని విదేశీ ఏజెన్సీలు సైతం ఈ పోర్టల్ ద్వారా సంప్రదింపులు జరిపే అవకాశం ఉంది.
2. వివిధ వ్యవస్థీకృత నేరాలు, నేరగాళ్లకు సంబంధించిన వివరాల్ని ఇందులో పొందుపరిచారు.
3. బ్రాడ్ కాస్ట్ విధానంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వాంటెడ్ నేరగాళ్ల వివరాలను తేలిగ్గా ఇచ్చిపుచ్చుకునే ఆస్కారం ఏర్పడింది.
4. వ్యవస్థీకృత నేరాలు, నేరగాళ్ల సమాచారం, నేరం చేసే విధానం, ప్రభావం ఉన్న ప్రాంతాలు తదితరాలను తేలిగ్గా గుర్తించేలా ఈ పోర్టల్ రూపొందింది.
5. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టం కంటే సమర్థంగా నేరగాళ్ల కదలికలు, వివరాలు తెలుసుకునేందుకు భారత్‌పోల్ ఉపయోగపడనుంది.

అంత ఈజీ కాదు..

అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి హైదరాబాద్ పంజగుట్ట పోలీసుల వ్యయప్రయాసలు ఇంటర్‌పోల్ వ్యవహారానికి ఓ తాజా ఉదాహరణ. ఫోన్ ట్యాపింగ్ కేసు వినతి తొలుత వెస్ట్‌జోన్ డీసీపీ ద్వారా నగర పోలీసు కమిషనర్‌కు వెళ్లింది. పోలీసు కమిషనర్ రాష్ట్ర నోడల్ ఏజెన్సీ సీఐడీకి సిఫారసు చేశారు. అక్కడి నుంచి దేశంలో ఇంటర్‌పోల్‌కు నోడల్ ఏజెన్సీగా ఉన్న సీబీఐకి చేరింది. అక్కడి నుంచి ఇంటర్‌పోల్‌కు సదరు విజ్ఞప్తి చేరాల్సి ఉండగా.. అనేక వివరణలు, సందేహాలు, సమస్యలు ప్రక్రియ ముందుకు సాగేందుకు ఆటంకంగా మారాయి. ఈ కారణంగానే కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసినా, 8 నెలలుగా హైదరాబాద్ పోలీసులు రకరకాలుగా ప్రయ త్నాలు చేస్తున్నా ఇప్పటికీ ప్రభాకర్‌రావుపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయించే ప్రయత్నం సఫలం కాలేదు. దేశంలోని అనేక ఏజెన్సీలు, పోలీసు విభాగాలు ఈ సమస్య ఎదుర్కొంటున్నాయి. దీనికి పరిష్కారంలో భాగంగానే భారత్‌పోల్ తెరపైకి వచ్చింది.

ఇకపై సులభంగా..

ఈ పోర్టల్ ద్వారా దేశంలోని అన్ని పోలీసు విభాగాలు, ఏజెన్సీలకు ఇంటర్‌పోల్‌తో సంప్రదింపులు సులువు అయ్యేందుకు అవకాశం ఏర్పడింది. వివిధ రకాలైన కార్నర్ నోటీసుల జారీ ప్రక్రియ, అందుకు అవసరమైన పత్రాలు, నమూనాలను ఈ పోర్టల్‌లో పొందుపరిచారు. అధికారులకు వచ్చే సందేహాలు, వాటికి సమాధానాలను ఆన్‌లైన్‌లో పొందేలా డిజైన్ చేశారు. ఈ పోర్టల్ వినియోగంపై త్వరలో సీబీఐ దేశ వ్యాప్తంగా పోలీసులు, ఏజెన్సీలకు సమగ్ర శిక్షణ ఇవ్వనుంది.

టీచర్ మందలించిందని టెన్త్ విద్యార్థి ఆత్మహత్య

రహమత్‌నగర్: టీచర్ మందలించడంతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయకనగర్ బస్తీలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. రహమత్‌నగర్ డివిజన్ వినాయకనగర్‌లో నివాసముంటున్న భూమయ్య, కొంతకాలంగా ఆరోగ్యం బాగాలేకపోవడంతో తన సొంత ఊరు మహబూబ్‌నగర్‌కు భార్యతో కలిసి వెళ్లాడు. భూమయ్య కుమారుడు శ్రావణ్ కుమార్ (15) బోరబండలోని నాట్కో పాఠశాలలో టెన్త్ చదువుతున్నాడు. శ్రావణ్ పాఠశాలకు తరచూ గైర్హాజరవుతుండటంతో టీచర్ అతన్ని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన శ్రావణ్ గురువారం ఇంట్లో ఉరి వేసుకుని మరణించాడు. స్థానికుల సమాచారం మేరకు బోరబండ అడ్మిన్ ఎస్సై నాగూల్ మీరా సంఘటన స్థలాన్ని సందర్శించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
e-NIT No. 01 (2వ పిలుపు)/2024-25, తేది:28-12-2024 యొక్క ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు రద్దు ప్రకటన.
e-NIT No. 01 (2వ పిలుపు)/2024-25, తేది: 28-12-2024 ప్రకారం కోరబడిన టెండర్లు "పరిపాలనా కారణాల" వలన రద్దు చేయబడినవి.
సం/- ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B), నేషనల్ హైవేస్, Admn, CRIF, LWE, RSW, PPP, EAP & Member, COT.
DIPR RO No.8938-PP/CL/Advt/1/2024-25, Dt: 09.01.2025

తెలంగాణ ప్రభుత్వం
(బీమా వైద్య సేవలు)
నాచారం, హైదరాబాద్ వద్ద గల ESI హాస్పిటల్ సనత్‌నగర్
నం./ESI/HL/SNR/Stores/2025, **ప్రకటన** తేది : 07.01.2025
ఎమర్జెన్సీ లోకల్ పర్చేజ్ కొరకు మెడిసిన్స్, సర్జికల్స్ మరియు కన్స్యూమబుల్స్ సరఫరా మరియు జనరల్ ఐటమ్స్/ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్ సరఫరా మరియు మరమ్మతుల కొరకు వెండర్లుగా ప్రైవేట్ బిజినెస్‌లు/ట్రేడ్ డీలర్స్ మరియు అధీకృత ఏజెన్సీల ఎంప్యానెల్‌మెంట్ కొరకు ఆసక్తి వ్యక్తీకరణ కొరకు ప్రకటన. ఎంప్యానెల్‌మెంట్ ఒక సంవత్సర కాలానికి ఉంటుంది. ఇది పరస్పర సమ్మతి మరియు పనితీరు ఆధారంగా మరొక సంవత్సరంపాటు తదుపరిగా పొడిగించబడవచ్చు. పొడిగించిన షెడ్యూల్ దిగువ విధంగా ఉంటుంది : EOI దాఖలు ప్రారంభ తేది : 10.01.2025. EOI దాఖలు ముగింపు తేది : 01.02.2025, 15.00 గం. వరకు. EOI దాఖలు చేయాల్సిన చిరునామా : ESI హాస్పిటల్, సనత్‌నగర్, లోకేటెడ్ ఎట్ నాచారం, హైదరాబాద్. పూర్తి ప్రకటన, అర్హత ప్రమాణాలు మరియు ఇతర వివరాలను స్టోర్ సెక్షన్, ESI హాస్పిటల్, నాచారం నుండి అన్ని పని రోజులలో ఉ. 11.00 గం. నుండి సా.4.00 గం. వరకు పొందవచ్చును. సంప్రదించుటకు నం. 7893000995, 8801444525.
DIPR RO No.8931-PP/CL/Advt/1/2024-25, Dt. 09.01.2025 సం/- మెడికల్ సూపరింటెండెంట్

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
పని పేరు : పరిగి మున్సిపాలిటీ-TUFIDC అసిస్టెన్స్ క్రింద పరిగి మున్సిపాలిటీలో సుందరీకరణ నిమిత్తం జంక్షన్లు మరియు ఎంట్రన్స్ ఆర్చ్‌ల అభివృద్ధి చేయుట. NIT No. & తేది : 54/SE/Unit III/Parigi/Junction & Arch/60L/2024-25, తేది:08.01.2025 (2వ పిలుపు), అంచనా విలువ: రూ. 60.00 లక్షలు. బిడ్ల దాఖలుకు ప్రారంభ తేది : 10.01.2025న ఉ.10.30 గం.నుండి. బిడ్ల దాఖలుకు ముగింపు తేది : 21.01.2025న సా.4.30 గం.వరకు. సంబంధిత అధికారి పేరు: ఎమ్. చిన్నారావు, చిరునామా : సూపరింటెండింగ్ ఇంజినీర్ (PH) కార్యాలయము యూనిట్-III,మహబూబ్‌నగర్, మెయిల్ ఐడి : se.unit3.tufidc@gmail.com, సంప్రదింపు నం.: 9550249221. తదుపరి వివరాలను "ఇ" ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in లో చూడవచ్చును. తదుపరి ఏదైనా స్పష్టీకరణలు అవసరమైతే SE(PH) కార్యాలయం, యూనిట్-III, మహబూబ్‌నగర్ కార్యాలయమును కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (PH), యూనిట్-III, మహబూబ్‌నగర్ @ హైదరాబాద్
DIPR RO No.8910-PP/CL/Advt/1/2024-25, Dt. 09.01.2025

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ
ఇ-ప్రొక్యూర్‌మెంట్/ఓపెన్ టెండరు పేపర్ ప్రకటన RRZ-11/2024-25
CE/OP/RR జోన్ యొక్క వికారాబాద్ సర్కిల్‌లో ధారూర్‌పల్లి SS కు ఆల్టర్‌నేట్ సోర్స్ & రాజేంద్రనగర్ సర్కిల్ యొక్క 33KV ఎండి పల్లి ఫీడర్ బైఫరికేషన్ కొరకు వరుసగా స్పెసిఫికేషన్ నం.లు 46 (SC కి కేటాయించబడినది) & 24A (ST కి కేటాయించబడినది)/2024-25తో టెండర్ల కొరకు అర్హతగల కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుచున్నవి. పూర్తి ప్రకటన స్పెసిఫికేషన్ మరియు డిజిటల్ సర్టిఫికెట్‌కు సంబంధించి తదుపరి వివరాల కోసం www.tender.telangana.gov.in ను దర్శించండి.
సం/- చీఫ్ ఇంజినీర్, ఆపరేషన్, రంగారెడ్డి జోన్, KPHB కాలనీ, హైదరాబాద్
DIPR RO No.8899-PP/CL/Advt/1/2024-25, Dt: 09.01.2025

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీసంస్థ
టెండరు ప్రకటన నం. P-02/24-25 ఆఫ్ స్పెసిఫికేషన్ నం.లు 08, 09, 10 (రీకాల్) & P-03 స్పెసిఫికేషన్ నం.లు 11, 12/24-25
నల్గొండ సర్కిల్‌కు వివిధ నాన్ సెంట్రలైజ్డ్ మెటీరియల్స్ సరఫరా కొరకు అర్హతగల అమ్మకందార్ల నుండి టెండర్లు కోరబడుచున్నవి. వివరాలు https://tgsouthernpower.orgలో లభిస్తాయి. ఫోన్ నం.9440814343. చివరి తేది: 18.01.2025
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, ఆపరేషన్ సర్కిల్, నల్గొండ
DIPR RO No.8883-PP/CL/Advt/1/2024-25, Dt: 09.01.2025

సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
(భారత ప్రభుత్వ సంస్థ)
P.B.No. 8066, బెంగళూరు – 560 080
Advt.No. CPRI/R&D/EOI/2024
CPRI/01/2025
విద్యుత్ మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం క్రింద ఒక స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ-సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (CPRI)-నో కాస్ట్ ప్రాతిపదికపై CPRI పేటెంటెడ్ టెక్నాలజీస్ లైసెన్సింగ్ కొరకు ఎంటర్‌ప్రెన్యూర్స్, స్టార్టప్స్ మరియు ఇండస్ట్రీస్ నుండి "ఆసక్తి వ్యక్తీకరణ" కోరుతోంది. వివరాలు మరియు దరఖాస్తు నమూనా కొరకు వెబ్‌సైట్ (www.cpri.in/en/content/patents) చూడగలరు.
CBC 34104/12/0013/2425

తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ
సంక్షిప్త ఇ-టెండరు ప్రకటన
Rc.No.Proc./002/VTGCET-2025/2024 తేది: 08-01-2025
2025-26 విద్యా సంవత్సరానికి గాను TGSWREIS & TGTWREISలో 6వ తరగతి నుండి 9వ తరగతులలో బ్యాక్‌లాగ్ ఖాళీలు మరియు TGSWREIS, TGTWREIS, MJPTGBCWREIS & TGREIS లో ప్రవేశం కొరకు 5వ తరగతి ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించుట కోసం OMR షీట్స్ ప్రింటింగ్ అండ్ స్కానింగ్, నామినల్ రోల్స్ మరియు ఫోటో ఐడి అటెండెన్స్ షీట్స్ ప్రింటింగ్ కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా TGSWREI సంస్థ ఇ-టెండర్లు కోరుతోంది. టెండరు డాక్యుమెంట్లు వెబ్‌సైట్ https://tender.telangana.gov.inలో లభిస్తాయి. టెండరు దాఖలు తేది: 10-01-2025, టెండర్లు దాఖలుకు చివరి తేది: 23-01-2025న మ.2.00 గం. వరకు. శాంపిల్‌తో పాటు సాంకేతిక బిడ్ హార్డ్ కాపీ దాఖలు: 23-01-2025న మ.3.00 గం. వరకు. సాంకేతిక బిడ్లు తెరుచు తేది: 23-01-2025న సా.4.00 గం.కు.
సం/- డా. వి.ఎస్. అలగు వర్షిణి, సెక్రటరీ
DIPR RO No.8914-PP/CL/Advt/1/2024-25, Dt: 09.01.2025

తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ
టెండరు ప్రకటన
ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా 01-04-2025 నుండి 31-03-2026 వరకు హైదరాబాద్ రేంజ్ నందు గల ప్రతి జైలు నందు ఆహార/డైట్/నిత్యావసర వస్తువుల (ఇతరములు)కు సంబంధించిన టెండర్లు అన్ని జైళ్లలో వివిధ తేదీలలో జరుపబడును. కావున సంబంధిత సమాచారం కొరకు క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించగలరు. ఫోన్ నంబర్లు: 9290809077/ 8686669001.

క్ర.సం.	కార్యాలయము పేరు	టెండర్లు స్వీకరించు తేది:
1.	పర్యవేక్షణాధికారి, కేంద్రకారాగారము, చర్లపల్లి వారు తమ కారాగారము, కేంద్రకారాగారము, హైదరాబాద్ ఖైదీల వ్యవసాయ క్షేత్రము, చర్లపల్లి మరియు ప్రత్యేక మహిళా కారాగారము, హైదరాబాద్ కొరకు ఉమ్మడి టెండర్లు కోరుచున్నారు.	29-01-2025
2.	పర్యవేక్షణాధికారి, కేంద్రకారాగారము, సంగారెడ్డి వారు తమ కారాగారము మరియు జిల్లాలోని ఉప కారాగారముల కొరకు ఉమ్మడి టెండర్లు కోరుచున్నారు.	25-01-2025
3.	పర్యవేక్షణాధికారి, జిల్లా కారాగారము, నల్గొండ వారు తమ కారాగారము మరియు జిల్లాలోని ఉప కారాగారముల కొరకు ఉమ్మడి టెండర్లు కోరుచున్నారు.	24-01-2025
4.	పర్యవేక్షణాధికారి, జిల్లా కారాగారము, మహబూబ్‌నగర్ వారు తమ కారాగారము మరియు జిల్లాలోని ఉప కారాగారముల కొరకు ఉమ్మడి టెండర్లు కోరుచున్నారు.	23-01-2025
5.	జిల్లా ఉప కారాగారముల అధికారి, నల్గొండ వారు జిల్లాలోని ఉప కారాగారముల కొరకు ఉమ్మడి టెండర్లు కోరుచున్నారు.	22-01-2025
6.	జిల్లా ఉప కారాగారముల అధికారి, సంగారెడ్డి వారు జిల్లాలోని ఉప కారాగారముల కొరకు ఉమ్మడి టెండర్లు కోరుచున్నారు.	21-01-2025
7.	జిల్లా ఉప కారాగారముల అధికారి, రంగారెడ్డి వారు జిల్లాలోని ఉప కారాగారముల కొరకు ఉమ్మడి టెండర్లు కోరుచున్నారు.	20-01-2025

టెండరుకు సంబంధించి పూర్తి వివరములు సంబంధిత జైలు అధికారుల నుండి వారి కార్యాలయములలో పొందవచ్చును.
సం/- కారాగారముల ఉపశాఖాధికారి, హైదరాబాద్ ప్రాంతము, హైదరాబాద్
DIPR RO No.8889-PP/CL/Advt/1/2024-25, Dt.09.01.2025

క్లుప్తంగా...

108@బేబీస్


108 అంబులెన్స్‌లో తల్లీబిడ్డ

కమలాపూర్: 108@బేబీస్.. శీర్షిక చూడగానే 108 మంది పిల్లలు అనుకుంటున్నారా?.. కాదండోయ్. ఒక మహిళ రెండు కాన్పు లూ 108 వాహనంలోనే జరిగాయి. దీంతో ఆ పిల్లలను అందరూ 108@బేబీస్ అని అంటున్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన వక్కల అఖిల.. రెండో కాన్పు పురిటి నొప్పులతో బాధపడుతుండటంతో బుధవారం అర్ధరాత్రి సమయంలో 108కు ఫోన్ చేశారు. దీంతో నడికూడ మండలానికి చెందిన 108 వాహనంలో ఆమెను హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమ ధ్యంలో పైలట్ వెంకటేశ్ సాయంతో ఈఆర్ సీపీ డాక్టర్ కాశిరెడ్డి సూచనలతో ఈఎంటీ వక్కల సంజీవ్ సుఖ ప్రసవం చేశారు. అఖిలకు పండంటి బాబు జన్మించాడు. కాగా, ఏడాదిన్నర క్రితం అఖిల మొదటి ప్రసవం కూడా ఇలానే 108 వాహనంలోనే చేశారు. అప్పుడు ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అందుకే ఆ ఇద్దరు పిల్లలు 108@బేబీస్ అన్నమాట.

జీజీహెచ్‌లో శిశువు మృతి

- గైనిక్ వైద్యులు లేకపోవడంతో రాత్రంతా నొప్పులు పడిన గర్భిణి
- వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువుల ఆందోళన

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శిశువు మృతి చెందడంతో బంధువులు ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబీకులు ఆరోపించారు. పాల్వంచ మండల కేంద్రానికి చెందిన భవానికి బాన్సువాడ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సాయిలుతో వివాహం జరిగింది. మొదటి కాన్పు కోసం ఆమె తన స్వగ్రామం పాల్వంచకు వచ్చింది. ఈ క్రమంలో బుధవారం పురిటి నొప్పులు రావడంతో జీజీహెచ్ ఆస్పత్రికి మధ్యాహ్నం 2 గంటలకు ప్రసవం కోసం తీసుకువచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు సాధారణ ప్రసవం అయ్యే అవకాశం ఉందని కాన్పు గదిలో ఉంచారు. అయితే భవానికి తీవ్రంగా పురిటి నొప్పులు వస్తుండటంతో ఆమె అవస్థను చూడలేని బంధువులు ఆపరేషన్ చేయాలని బుధవారం సాయంత్రం నుంచి రాత్రి 1 గంట వరకు ప్రసవం గదిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని వేడుకున్నారు. అయితే ఆ రోజు నైట్ డ్యూటీలో గైనిక్ వైద్యులు ఎవరూ లేరని తెలిసింది. భవానికి నొప్పులు ఎక్కువ కావడంతో గురువారం తెల్లవారుజామున 4 గంటలకు సాధారణ కాన్పు కాగా, ఆడపిల్ల జన్మించింది. అయితే గర్భంలోనే శిశువు మృతి చెందింది. సిజేరియన్ చేసి ఉంటే శిశువు బతికేదని, ఇది వైద్యుల నిర్లక్ష్యమంటూ బంధువులు ఆస్పత్రిలో ఆందోళన చేశారు. గురువారం ఉదయం విధులకు హాజరైన వైద్యాధికారులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఈ విషయమై ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఫరీదాను సంప్రదించగా, భవానికి సాధారణ కాన్పు అయ్యే అవకాశాలు ఉండటంతోనే ప్రయత్నించామని, గర్భంలో యూటీఐ ఇన్‌ఫెక్షన్ కారణంగా శిశువు మృతి చెందిందని భావిస్తున్నామని చెప్పారు. ఇలాంటి కేసులు చాలా తక్కువగా ఉంటాయని, ఆస్పత్రిలో గైనిక్ వైద్యుల కొరత కూడా తీవ్రంగా ఉందని తెలిపారు.

మేడిగడ్డలో 'డిజైన్' లోపాలే!

- బరాజ్ డిజైన్లలో ఎనర్జీ డిస్సిపేషన్‌ను పరిగణనలోకి తీసుకోలేదు
- ఐఐటీ-రూర్కీ ఆధ్వర్యంలో నిర్వహించి మోడల్ స్టడీలో నిర్ధారణ
- ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీకి నివేదిక పంపిన నీటిపారుదలశాఖ



సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బరాజ్ కుంగిపోవడానికి డిజైన్లు, డ్రాయింగ్స్‌లో లోపాలే కారణమని ఐఐటీ-రూర్కీ తాజాగా నిర్వహించిన మోడల్ స్టడీలో తేలింది. బరాజ్‌ను 2019 జూన్ 21న ప్రారంభించగా, అదే ఏడాది వచ్చిన వరదల్లో బరాజ్ దిగువన రక్షణ కోసం నిర్మించిన కాంక్రీట్ బ్లాక్‌లు కొట్టుకుపోయాయి. బరాజ్ గేట్లను ఎత్తినప్పుడు భీకర వేగంతో వరద కిందకు దూకుతుంది. ఆ సమయంలో వరదలో ఉండే భీకర శక్తిని నిర్వీర్యం(ఎనర్జీ డిస్సిపేషన్) చేసేందుకు తగిన నిర్మాణాలను డిజైన్లలో ప్రతిపాదించలేదు. దీంతో ఆ శక్తి ధాటికి దిగువన ఉన్న కాంక్రీట్ బ్లాకులు కొట్టుకుపోయి భారీ గుంతలు ఏర్పడ్డాయి. బరాజ్‌ను ప్రారంభించిన తొలి ఏడాదే కాంక్రీట్ బ్లాకులు కొట్టుకుపోయినా, పునరుద్ధరించలేదు. ఆ తర్వాత బరాజ్‌కు 2020-23 మధ్యకాలంలో వరుసగా నాలుగేళ్ల పాటు వరదలు రాగా, 'ఎనర్జీ డిస్సిపేషన్'ఏర్పాట్లు లేక బరాజ్ దిగువన మట్టి క్రమంగా కొట్టుకుపోయి గుంతలు మరింతగా లోతుగా మారాయి. నిరంతర వరదలతో బరాజ్ ర్యాఫ్ట్(పునాది) కింద రక్షణగా నిర్మించిన సికెంట్ పైల్స్ వరకు ఈ గుంతలు విస్తరించాయి. దీంతో సికెంట్ పైల్స్ దెబ్బతినడంతో ర్యాఫ్ట్ కింద నుంచి ఇసుక కొట్టుకుపోయి బుంగలు ఏర్పడడానికి దారితీశాయి. దీనిద్వారా నీళ్లు బయటకు లీకైనట్టు గుర్తించినా, వాటిని పూడ్చివేసే విషయంలో తాత్సారం చేశారు. దీంతో కాలం గడిచిన కొద్దీ బుంగల తీవ్రత పెరిగి బరాజ్ కుంగిపోవడానికి దారితీసిందని ఐఐటీ-రూర్కీ నిర్వహించిన మోడల్ స్టడీస్‌లో తేలింది. నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ విజ్ఞప్తి మేరకు నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, ఈఎన్‌సీ(ఓఅండ్ఎం) బి.నాగేంద్రరావు, ఇతర ఇంజనీర్ల సమక్షంలో ఐఐటీ రూర్కీ నిపుణులు ఈ పరీక్షలు నిర్వహించారు.

టెయిల్ పాండ్ ఉంటే ....

మేడిగడ్డ బరాజ్ దిగువన తగిన స్థాయిలో నీరు నిల్వ ఉండేలా టెయిల్‌పాండ్ నిర్మాణం లేకపోవడమే అసలు లోపమని మోడల్ స్టడీలో తేలింది. బరాజ్ గేట్ల నుంచి భీకర వేగంతో వరద దిగువన టెయిల్‌పాండ్‌లోని నీళ్లలో దూకినప్పుడు అందులోని శక్తి విభజనకులోనై అన్నివైపులా వ్యాప్తి చెంది చివరకు నిర్వీర్యమైపోతుంది. దీనినే ఎనర్జీ డిస్సిపేషన్ అంటారు. మేడి గడ్డ బరాజ్ గేట్లను దిగువన తగిన స్థాయిలో నీరు నిల్వ ఉండేలా టెయిల్‌పాండ్ నిర్మాణాన్ని డిజైన్లలో ప్రతిపాదించలేదని నీటిపారుదలశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. వరదలు తక్కు వగా ఉన్నప్పుడు బరాజ్ గేట్లను తక్కువ ఎత్తులో పైకి లేపి వచ్చిన వరదను వచ్చినట్టు కిందకు వదులుతారు. ఆ సమయంలో సైతం బరాజ్‌లో గరిష్ట మట్టం మేరకు నిల్వలుండడంతో గేట్ల నుంచి బయటకు వచ్చే వరదలో తీవ్రమైన పీడన శక్తి ఉంటుంది. గేట్లను 10-30 సెంటీమీటర్లు మాత్రమే పైకి ఎత్తినా, సెకనుకు ఏకంగా 30 మీటర్ల వరకు భీకర వేగంతో వరద బయటకు వస్తోందని మోడల్ స్టడీలో తేలినట్టు తెలిసింది. దీంతోనే బరాజ్ దిగువన రక్షణగా ఉండాల్సిన సీసీ బ్లాకులు కొట్టుకు పోయి వాటి స్థానంలో గుంతలు ఏర్పడ్డాయని, ఆ తర్వాత గుంతలు లోతుగా మారి పునాదులను దెబ్బతీశాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి ఐఐటీ రూర్కీ మోడల్ స్టడీస్ నివేదికను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీకి రాష్ట్ర నీటిపారుదల శాఖ సమర్పించింది.

భూమికి బదులు భూమి ఇవ్వాలి

- చౌటుప్పల్‌లో రీజినల్ రింగ్‌రోడ్డు భూనిర్వాసితుల ధర్నా


ఆర్డీవో కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేస్తున్న ట్రిపుల్‌ఆర్ భూనిర్వాసితులు

చౌటుప్పల్: ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణంలో అటవీ శాఖకు ప్రభుత్వం ఇస్తున్న మాదిరిగానే రీజినల్ రింగ్‌రోడ్డు నిర్వాసితులకు కూడా భూమికి బదులు భూమి పరిహారంగా ఇవ్వాలని ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితుల సంఘం కన్వీనర్ చింతల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకే ప్రాజెక్టులో అటవీశాఖ భూములకు ఒక చట్టం, నిర్వాసితులకు మరో చట్టం ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. రీజినల్ రింగ్‌రోడ్డు నిర్వాసితులు గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని, కుదరని పక్షంలో భూమికి బదులు భూమి పరిహారంగా ఇవ్వాలని, లేదంటే బహిరంగ మార్కెట్ ప్రకారంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల ధర్నా నేపథ్యంలో పోలీసులు వారిని కార్యాలయం మెయిన్ గేట్ వద్దనే అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే రైతులు ఒక్కసారి లోపలికి ప్రవేశించారు. ప్రధాన ద్వారం ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ ధరకు మూడురెట్లు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

డిగ్రీ ఫెయిల్.. డాక్టర్‌గా బిల్డప్


రవీందర్

కామారెడ్డి టౌన్: అతను డిగ్రీలో ఫెయిల్ అయ్యాడు. ఓ ఆర్ఎంపీ వద్ద కొంతకాలం పనిచేసి ప్రాక్టీస్ విధానం తెలుసుకున్నాడు. నకిలీ సరిఫికెట్లు సృష్టించి ఎండీ జనరల్ మెడిసిన్ ఫిజీషియన్‌గా అవతారమెత్తాడు. రెండేళ్లుగా ప్రైవేట్ ఆస్పత్రులలో ఎండీ జనరల్ ఫిజీషియన్‌గా పనిచేస్తూ డాక్టర్‌గా చెలామణి అయ్యాడు. అయితే ఈ నెల 8న కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో రిజిస్ట్రార్ ఆఫ్ తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తరపున డాక్టర్ లాలయ్య కుమార్ ఫిర్యాదు చేయడంతో పోలీసుల దర్యాప్తులో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆ నకిలీ వైద్యుడిని అరెస్టు చేశారు. గురువారం ఏఎస్పీ బి.చైతన్యరెడ్డి ఈ వివరాలను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన ముల్కల రవీందర్ డిగ్రీ ఫెయిల్ అయ్యాడు. అయితే కుటుంబ సభ్యులకు తాను గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతు న్నట్లు నమ్మించాడు. ఈ క్రమంలో మందమర్రిలో ఓ ఆర్ఎంపీ వద్ద కొంతకాలం పనిచేశాడు. అనంతరం మెడికల్ కౌన్సిల్ వెబ్‌సైట్ నుంచి ఎల్.రవీందర్ రెడ్డి అనే వైద్యుడి పేరుపై ఉన్న సర్టిఫికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని నకిలీ సర్టిఫికెట్‌లను సృష్టించాడు. తర్వాత మార్చి 2023 నుంచి డిసెంబర్ 2024 వరకు వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫిజీషియన్‌గా పనిచేశాడు. అలాగే ఖానాపూర్‌లోని షణ్ముఖ ఆస్పత్రిలో పిల్లల వైద్యుడిగా పని చేయడానికి ఈ నెల 6న అడ్వాన్స్‌గా రూ.2 లక్షలు తీసుకున్నాడు. ఈ క్రమంలో గురువారం రవీందర్‌ను పోలీసులు అరెస్టు చేసి ఫేక్ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నారు.

పెళ్లి కావడం లేదన్న బెంగతో..

- ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య


కమలాకర్

ఆత్మకూరు: పెళ్లి కావడం లేదన్న బెంగతో ఒక ప్రభుత్వ ఉద్యోగి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం హౌజ్‌బుజుర్గు గ్రామంలో గురువారం జరిగిన ఈ సంఘటనపై సీఐ సంతోష్ కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన మండల కమలాకర్ (37) మిషన్ భగీరథలో హెల్పర్‌గా పని చేస్తున్నారు. కుటుంబసభ్యులు కొన్ని సంవత్సరాలుగా అతనికి వివాహ సంబంధాలు చూస్తున్నప్పటికీ.. కుదరడం లేదు. దీంతో ఇక తనకు వివాహం కాదేమోనని కమలాకర్ కొద్ది రోజులుగా దిగాలుగా ఉంటున్నాడు. తల్లి బుధవారం మరో కుమారుడి వద్దకు వెళ్లగా.. అదేరోజు రాత్రి కమలాకర్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని తల్లి సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోష్ తెలిపారు.

యాసంగిలోనూ వరిసాగే ఎక్కువ

- సాధారణ సాగు విస్తీర్ణం 63 లక్షల ఎకరాలు
- ఈసారి 75 లక్షల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా
- ఇందులో వరి సాగయ్యేది 63 లక్షల ఎకరాల్లో ...



సాక్షి, హైదరాబాద్: ఈ యాసంగి సీజన్‌లోనూ రైతులు వరిసాగుకే మొగ్గు చూపుతున్నారు. సీజన్ ప్రారంభమై నెలరోజులు కాగా, ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 25.61 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులోనూ ఆయా జిల్లాల్లో 26 శాతం నుంచి 50 శాతం వరకు వరి సాగవడం గమనార్హం. యాసంగిలో సాధారణ సాగు విస్తీర్ణం 63.54 లక్షల ఎక రాలు కాగా, పెరిగిన నీటివసతి, సన్నవడ్లకు రూ. 500 బోనస్‌తో 79 లక్షల ఎకరాల వరకు సాగవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అందులో అత్యధికంగా 63 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని భావి స్తోంది. ఇందుకు అనుగుణంగా వ్యవసాయశాఖ ఏర్పా ట్లు చేసింది. ఈ నెలాఖరు వరకు పూర్తిస్థాయిలో పంటల సాగు పూర్తవుతుందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి.

ఏడు జిల్లాల్లో 75 శాతం పూర్తి కావొచ్చిన పంటల సాగు

కూరగాయలు, జొన్న, వేరుశనగ, మొక్కజొన్న, శనగ, కందులు, పొగాకు వంటి పంటలు వేసే జిల్లాల్లో..ఇప్పటి వరకు 51శాతం నుంచి 75శాతం వరకు పంటల సాగు పూర్తయింది.

- ఆదిలాబాద్, నిర్మల్, జనగాం, నిజామాబాద్, ఖమ్మం, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పంటలు వేగంగా సాగవుతున్నాయి.
- 25 శాతం కన్నా తక్కువగా మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, మెదక్, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, రంగారెడ్డి, మేడ్చల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో పంటలు సాగయ్యాయి.
- ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో వరి సాగు ఆలస్యమవుతోంది. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల్లో వరిసాగు విస్తీర్ణం తగ్గనుండగా, ఆరుతడి పంటలు ఎక్కువగా సాగవనున్నాయి.
- మరో 12 జిల్లాల్లో 25 శాతం కన్నా అధికంగా 50 శాతం లోపు పంటలు సాగైనట్టు వ్యవసాయశాఖ పేర్కొంది.


3.65 లక్షల టన్నుల యూరియా వినియోగం..

ఈ యాసంగి సీజన్‌లో 19.60 లక్షల మెట్రిక్ టన్నుల మేర వివిధ రకాల ఎరువులు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా, దశల వారీగా సరఫరా అయినట్టు మార్క్‌ఫెడ్ తెలిపింది. ఇప్పటి వరకు 3.65 లక్షల టన్నుల యూరియా, 1.10 లక్షల టన్నుల డీఏపీ, 3.79 లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 24వేల టన్నుల పొటాష్, 19వేల టన్నుల సూపర్ ఫాస్ఫేట్‌ను రైతులు కొనుగోలు చేశారు. 3.61 లక్షల టన్నుల యూరియా, 24వేల టన్నుల డీఏపీ, 2.15 లక్షల టన్నుల కాంప్లెక్స్, 38వేల టన్నుల పొటాష్ , 17వేల టన్నుల సూపర్ ఫాస్ఫేట్ రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉన్నట్టు మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (Hg) నార్త్ డివిజన్ కార్యాలయం,
తెలంగాణ హౌసింగ్ బోర్డ్ : SR నగర్: హైదరాబాద్ -38
వేలం ప్రకటన
నోటిఫికేషన్ నం.114/Auction Notification/EE(N)/2025 తేది: 09-01-2025
తెలంగాణ హౌసింగ్ బోర్డ్, హైదరాబాద్ & రంగారెడ్డిలోని వివిధ కాలనీలు/ప్రదేశాల వద్ద ఇళ్ళు/ప్లాట్ల ప్రక్కన గల 7నం. ఖాళీ స్ట్రిప్ పీసులను "ఎక్కడ ఎలా ఉన్నవి అదే స్థితిలో" విక్రయించుటకు హౌసింగ్ బోర్డ్ కమ్యూనిటీ హాల్, ఫేజ్-I మరియు II, KPHB కాలనీ, టెంపుల్ బస్టాప్ దగ్గర, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 30-01-2025న ఉ.11.30 గంటల నుండి బహిరంగ వేలం నిర్వహించుటకు ప్రతిపాదించినది. అనుకోని కారణాల వలన వేలం తేది సెలవు రోజు అయితే మరుసటి పనిరోజున వేలం నిర్వహించబడుతుంది. వేలం వేయబడే ఖాళీ స్ట్రిప్ పీసుల వివరాలు దిగువ విధంగా ఉన్నాయి.

క్ర.సం.	ప్రదేశం	ఇం.నం/ ప్లాట్ నం.	భూమి విస్తీర్ణం చ.గజాలలో	20-12-2024న కమిటీ ప్రతిపాదించిన సర్కారు ధర (రూ)	VC & HC, TGHB ఆమోదించిన సర్కారు ధర (రూ)
1	గచ్చిబౌలి	ఇం.నం.49/MIG ప్రక్కన, గచ్చిబౌలి	95.62	1,50,000.00	1,50,000.00
2	కూకట్‌పల్లి	ఇం.నం.651EWS వెనుకవైపు, ఫేజ్-I & II KPHB	44.44	1,25,000.00	1,25,000.00
3	బాలాజీనగర్	ఇం.నం.MIG105 ఎదుట, O.P. నం. 4/7 & 4/8 బాలాజీనగర్	87.98	1,25,000.00	1,25,000.00
4	బాలాజీనగర్	ఇం.నం.MIG106 ఎదుట, O.P. నం. 5/9 & 5/10 బాలాజీనగర్	92.36	1,25,000.00	1,25,000.00
5	భరత్‌నగర్	ఇం.నం.113/HIG/డూప్లెక్స్ ప్రక్కన భరత్‌నగర్	94.44	1,25,000.00	1,25,000.00
6	భరత్‌నగర్	ఇం.నం.186/MIG, 187/MIG, 188/MIG వెనుక వైపు, భరత్‌నగర్	55.25	1,25,000.00	1,25,000.00
7	గచ్చిబౌలి	ఇం.నం.85, 86 & 87 HIG-A ఎదుట ఫేజ్- IV క్రింద, గచ్చిబౌలి	96.00	1,50,000.00	1,50,000.00

పై వేలంలో పాల్గొనుటకు ఆసక్తిగల వ్యక్తి "Director (EDS), E-Seva, C/o. EE(Hg), North, TGHB" వారికి ఏదైనా జాతీయ బ్యాంక్ షెడ్యూల్డ్ బ్యాంక్ నుండి డి.డి(డిమాండ్ డ్రాఫ్ట్) రూపంలో బయానా రూ.2,00,000/- (రెండు లక్షల రూపాయలు మాత్రమే) మొత్తాన్ని డిపాజిట్ చేయాలి మరియు దానిని వేలం ప్రారంభ తేదీన ఉ.11.00 గం.లోగా దాఖలు చేయాలి.
తదుపరి వివరాల కొరకు వెబ్‌సైట్ www.tghb.cgg.gov.in చూడండి లేదా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నార్త్ డివిజన్, ఫోన్ నం. 9989334835 మరియు అసిస్టెంట్ ఎస్టేట్ ఆఫీసర్, ఫోన్ నం. 9100266052, తెలంగాణ హౌసింగ్ బోర్డ్, నార్త్ డివిజన్, అసిస్టెంట్ ఇంజనీర్, ఫోన్ నం.7396521697 వారిని కార్యాలయ వేళలలో ఏపని రోజునైనా సంప్రదించవచ్చు.
బయానా డిడిలు వేలం తేదీన ఉ.10.00 గం. నుండి ఉ.11.00 గం.వరకు స్వీకరించబడతాయి.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (Hg), నార్త్ డివిజన్ TGHB: హైదరాబాద్
DIPR RO No.8943-PP/CL/Advt/1/2024-25, Dt. 09-01-2025



కార్చిచ్చుపై ప్రెస్‌మీట్‌లో

ముత్తాతనయ్యానని జో బైడెన్ ప్రకటన

సర్వత్రా విమర్శలు

లాస్ ఏంజెలెస్: అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు ఇబ్బందికర అనుభవం ఎదురైంది. లాస్ ఏంజెలెస్‌తో పాటు దక్షిణ కాలిఫోర్నియా మొత్తాన్ని భీకర కార్చిచ్చు చుట్టుముట్టి పెను నష్టం చేస్తున్న విషయం తెలిసిందే. దాని ధాటికి ఇప్పటికే లక్షన్నర మందికి పైగా నిరాశ్రయులయ్యారు. ఇళ్లతో పాటు సర్వం బుగ్గి పాలై భారీగా ఆస్తి నష్టం జరిగింది. ముఖ్యంగా లాస్ ఏంజెలెస్‌లో హాలీవుడ్ తారలతో పాటు ప్రముఖులుండే అతి సంపన్న ఆవాసాలు పెద్ద సంఖ్యలో అగ్నికి ఆహుతిగా మారాయి. ఈ విపత్తుపై స్థానిక శాంటా మోనికాలో బైడెన్ బుధవారం మీడియాతో మాట్లాడారు. ఆ సందర్భంగా ఉన్నట్టుండి వ్యక్తిగత ప్రకటన చేశారు. తనకు ముని మనవడు పుట్టాడని చెప్పుకొచ్చారు. 'ఈ ప్రతికూల వార్తల నడుమ ఒక శుభవార్త. ఈ రోజే నేను ముత్తాత అయ్యాను. చాలా కారణాలతో నాకీ రోజు గుర్తుండిపోతుంది' అని అన్నారు. దీనిపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. 'పేరుకేమో అగ్ర రాజ్య అధ్యక్షుడు. కనీసం ఎక్కడేం మాట్లాడాలో తెలియదా?' అంటూ నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లాస్ ఏంజెలెస్ మంటల్లో బైడెన్ కుమారుని ఇల్లు కూడా బుగ్గిగా మారినట్టు వార్తలొచ్చాయి. 'అది పూర్తిగా కాలిపోయిందని తొలుత చెప్పారు. బానే ఉందని ఇప్పుడంటున్నారు' అంటూ ఈ వార్తలపై బైడెన్ స్పందించారు.

ప్రెస్ మీట్‌కు ముందే...

మీడియా సమావేశానికి ముందే బైడెన్ స్థానిక ఆస్పత్రిలో ముని మనవడిని చూసి వచ్చారు. ఆ ఫొటోలు విపరీతంగా షేర్ అవుతున్నాయి. పదవిలో ఉండగా ముత్తాత అయిన తొలి అమెరికా అధ్యక్షునిగా కూడా 82 ఏళ్ల బైడెన్ రికార్డు సృష్టించడం విశేషం. పెద్ద వయసులో అధ్యక్షుడు అయిన రికార్డు ఆయన పేరిటే ఉండటం తెలిసిందే. 77 ఏళ్ల వయసులో అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. 78 ఏళ్ల ట్రంప్ ఇప్పుడా రికార్డును తిరగరా యనున్నారు. ఈ నెల 20న ట్రంప్ రెండోసారి అధ్యక్షునిగా ప్రమాణస్వీకారం చేయనుండటం తెలిసిందే.

ఆరని అగ్నికీలలు





లాస్ ఏంజెలెస్‌లో కాలిబూడిదైన వేలాది ఎకరాలు

- ప్రాణభయంతో సర్వస్వం వదిలి వెళ్లిపోతున్న స్థానికులు, సెలబ్రిటీలు
- విద్యుత్ సరఫరా స్తంభించడంతో అంధకారంలో లక్షలాది కుటుంబాలు
- హాలీవుడ్ సినీతారలు, సంపన్నుల ఇళ్లు భస్మీపటలం
- ప్రఖ్యాత హాలీవుడ్ సైన్‌బోర్డ్‌కూ సెగలు !
- అగ్నికి ఆహుతైన ఐదు ప్రాణాలు
- అత్యయిక స్థితి విధించిన బైడెన్ సర్కార్

లాస్ ఏంజెలెస్: ప్రకృతి రమణీయతకు పట్టుగొమ్మలైన లాస్ ఏంజెలెస్ అటవీప్రాంతాలు ఇప్పుడు అగ్నికీలల్లో మాడి మసైపోతున్నాయి. వర్షాలు పడక ఎండిపోయిన అటవీప్రాంతంలో అంటుకున్న అగ్గిరవ్వ దావానంలా వ్యాపించి ఇప్పుడు వేల ఎకరాల్లో అడవిని కాల్చిబూడిద చేస్తోంది. పసిఫిక్ తీర ప్రాంతం మొదలు పాసడేనా వరకు మొత్తం ఐదు వేర్వేరు ప్రాంతాల్లో అగ్ని రాజుకుని వేల ఎకరాలకు వేగంగా వ్యాపించి వందల ఇళ్లు, ఆఫీస్ కార్యాలయాలు, దుకాణాలు, పాఠశాలలను భస్మీపటం చేసింది. ఈ ఘటనల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. పసిఫిక్ పాలిసాడ్స్, అల్టాడేనా ప్రాంతాల్లో దావాగ్ని భీకరంగా ఎగసిపడుతూ 17,234 ఎకరాల అటవీప్రాంతాన్ని ఇప్పటికే కాల్చేసింది. ఈటన్ ప్రాంతంలో 10,600 ఎకరాలకుపైగా అటవీభూములు దగ్ధమయ్యాయి. హర్స్ట్ ప్రాంతంలో 855 ఎకరాలు, లిడియా ప్రాంతంలో 348 ఎకరాల మేర అడవి ఇప్పటికే అగ్నికి ఆహుతైంది. పసిఫిక్ పాలిసాడ్స్ ప్రాంతంలోని మలీబూ తీరం వెంటే హాలీవుడ్ సినీ దిగ్గజాల విలాసవంత నివాసాలున్నాయి. ఇందులో ఇప్పటికే చాలామటుకు కాలిబూడిదయ్యాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్‌కు చెందిన ఇంటినీ కార్చిచ్చు దహించివేసింది. దావాగ్నిలో దహనమైన నివాసాల్లో చాలా మంది హాలీవుడ్ ప్రముఖుల ఇళ్లు ఉన్నాయి. లాస్ ఏంజెలెస్ చరిత్రలో ఎన్నడూలేనంతటి భీకర అగ్నిజ్వాలల ధాటికి 1,79,700 మంది స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికార యంత్రాంగం సూచించింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయి రాత్రిళ్లు లక్షలాది కుటుంబాలు అంధకారంలో గడిపాయి. దాదాపు 3,10,000 మంది కరెంట్ కష్టాలను ఎదుర్కొంటున్నారు. పెనుగాలులతో వినాశకర స్థాయిలో విజృంభిస్తున్న మంటలను అదుపులోకి తేవడం అగ్నిమాపక సిబ్బందికి చాలా కష్టంగా మారింది. మంటలను అదుపుచేయడం మా వల్ల కాదని కొందరు అగ్నిమాపక సిబ్బంది ఇప్పటికే చేతులెత్తేశారని స్థానిక మీడియాలో వార్తలొచ్చాయి. ఉన్న మంటలకు తోడు కొత్తగా బుధవారం సాయంత్రం హాలీవుడ్ హిల్స్‌లో కొత్తగా అగ్గిరాజుకుని స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. సన్‌సెట్ ఫైర్‌గా పిలుస్తున్న ఈ దావాగ్ని మాత్రమే అత్యల్పంగా 43 ఎకరాలను దహించింది. టీసీఎల్ చైనీస్ థియేటర్ మొదలు ప్రఖ్యాత మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియం ఉన్న వీధులనూ అగ్నికీలలు ఆక్రమించాయి. ఎన్నో సినిమాల్లో కనిపించిన ఫేమస్ పాలిసాడ్స్ చార్టర్ హైస్కూల్ భవనం కాలిపోయింది. సన్‌సెట్ బోల్‌వార్డ్‌సహా ఎన్నో కొండ అంచు కాలనీల్లో ఖరీదైన ఇళ్లను మంటలు నేలమట్టంచేశాయి.

ప్రముఖుల ఇళ్లు నేలమట్టం

హాలీవుడ్ సినీరంగ ప్రముఖుల ఇళ్లు మంటల్లో చిక్కుకున్నాయి. మ్యాండీ మూర్, క్యారీ ఎల్వీస్, ప్యారిస్ హిల్టన్, స్టీవెన్ స్పీల్‌బర్గ్, టామ్ హ్యాంక్స్, బెన్ ఎఫ్లెక్, ఆడమ్ శాండ్లర్, యూజిన్ లేవీ, బిల్లి క్రిస్టల్, జాన్ గుడ్‌మాన్, విల్ రోజరెస్, జేమ్స్ లీ కరీస్, జేమ్స్ ఉడ్స్ సహా చాలా మంది ప్రముఖుల ఇళ్లు తగలబడ్డాయి. ''వీధుల్లో ఎక్కడ చూసినా కాలిన చెక్క ఇళ్ల చెత్తతో నిండిన స్విమ్మింగ్ పూల్స్ కనిపిస్తున్నాయి. యుద్ధంలో బాంబు దాడుల్లో దగ్ధమైన జనావాసాల్లా ఉన్నాయి''అని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశాయి. దక్షిణ కాలిఫోర్నియా ప్రాంతంలో మే నెల నుంచి చూస్తే కేవలం 0.1 అంగుళాల వర్షపాతమే నమోదైంది. ఎండిపోయిన పర్వత సానువుల అడవీ ప్రాంతం గుండా గంటకు 80 మైళ్ల వేగంతో వీస్తున్న గాలులు ఈ మంటలను మరింత ఎగదోస్తున్నాయి. ఇప్పట్లో వర్షాలు పడకపోతే శీతాకాలమంతా దావానలం దారుణ పరిస్థితులను ఎదుర్కోక తప్పదని వెస్టర్న్ ఫైర్ చీఫ్ అసోసియేషన్ హెచ్చరించింది. పాసడీనా, పసిఫిక్ పాలిసాడ్స్‌లో భీకర మంటల భయంతో పలు హాలీవుడ్ స్టూడియోలు మూతపడ్డాయి. యూనివర్సల్ స్టూడియోస్ తమ థీమ్ పార్క్‌ను మూసేసింది. '' వింత వింత కుందేలు బొమ్మలతో బన్నీ హౌజ్‌గా ప్రపంచ వ్యాప్తంగా పేరుతెచ్చుకున్న మా మ్యూజియం బుగ్గిపాలైంది. గిన్నిస్ ప్రపంచరికార్డు సృష్టిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద బన్నీ భవనం నెలకొల్పడానికి మాకు 40 ఏళ్లు పట్టింది. అది ఇప్పుడు నిమిషాల్లో కాలిపోయింది'' అని ఆల్టాడేనాలోని స్టీవ్ లుబాన్‌స్కీ, కాండేస్ దంపతులు కన్నీటిపర్యంతమయ్యారు. తమ కార్లు, వస్తువులకు ఏమాత్రం ఇన్సూరెన్స్ వస్తుందోనని చాలా మంది దిగాలుగా కనిపించారు.

ఉచితాలు.. సాయాలు

సర్వం కోల్పోయిన స్థానికులను ఆదుకునేందుకు కొన్ని కంపెనీలు ముందుకొచ్చాయి. సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తక్కువ ధరకే వాహనాల్లో రైడ్ అందిస్తామని ఉబర్, లిఫ్ట్ సంస్థలు తెలిపాయి. ఉచితంగా స్నానాల గదులు, లాకర్ రూమ్, వై-ఫై సౌకర్యాలు అందిస్తామని ప్లానెట్ ఫిట్‌నెస్ తెలిపింది. తమ గదుల్లో ఉచితంగా ఉండొచ్చని ఎయిర్‌బీఎన్‌బీ పేర్కొంది. హోటళ్లలో డిస్కౌంట్‌కే గదులిస్తామని విసిట్ అనహీమ్ వెల్లడించింది. అపరిమిత డేటా, కాల్, టెక్స్ట్ ఆఫర్ ఉచితంగా ఇస్తామని ఏటీ అండ్ టీ, వెరిజాన్ సంస్థలు ప్రకటించాయి.


పాలిసాడ్స్‌లో మంటల్లో చిక్కుకుపోయిన ఓ విలాసవంత భవనం

ఆస్కార్‌కూ సెగ

కార్చిచ్చు సెగ ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డులనూ తాకింది. దీంతో అకాడమీలో నామినేషన్ల ప్రక్రియ ఆలస్యమైంది. వాస్తవానికి బుధవారం నుంచి 14వ తేదీదాకా నామినేషన్ ప్రక్రియ కొనసాగాలి. అగ్నికీలలు వ్యాపించడంతో ఓటింగ్ ఆలస్యమైంది. షెడ్యూల్ ప్రకారం జనవరి 17వ తేదీన ప్రకటించాల్సిన ఆస్కార్ నామినేషన్లను జనవరి 19కు వాయిదా వేశారు.

చేతివాటం చూపిన దొంగలు

ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు ఇళ్లు వదిలిపోతుండటంతో దొంగలు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దగ్ధమవుతున్న ఇళ్లలో దొంగతనాలు చేస్తున్నారు. ఇలా లూటీ చేస్తున్న 20 మందిని అరెస్ట్‌చేసినట్లు పోలీసులు తెలిపారు. కార్చిచ్చు ఘటనల్లో ఇప్పటిదాకా 4 లక్షల కోట్ల రూపాయల సంపద అగ్నికి ఆహుతైందని బైడెన్ సర్కార్ ప్రాథమిక అంచనావేసింది. తన చిట్టచివరి అధికారిక పర్యటనలో భాగంగా ఇటలీకి వెళ్దామనుకున్న బైడెన్ ఈ అనూహ్య ఘటనతో పర్యటనను అర్ధంతరంగా రద్దుచేసుకున్నారు. పరిస్థితిని స్వయంగా సమీక్షిస్తున్నారు. మరోవైపు కార్చిచ్చు ఉదంతంలో సరిగా స్పందించని కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కాబోయే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిమాండ్ చేశారు.

అంతరిక్షం నుంచి చూసినా కనిపిస్తున్న అగ్నికీలలు

ప్రైవేట్ శాటిలైట్ ఛాయాచిత్రాల సేవలందించే మ్యాక్సర్ టెక్నాలజీస్ తదితర ఉపగ్రహ సేవా సంస్థలు తీసిన ఫొటోలు ఇప్పుడు విశ్వవ్యాప్తంగా సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. ఫొటోల్లో.. కాలిఫోర్నియాలోని మాలిబు తీరపట్టణ ప్రాంత శాటిలైట్ ఫొటోల్లో ఇప్పుడంతా కాలిబూడిదైన ఇళ్లే కనిపిస్తున్నాయి. ఆకాశమంతా దట్టంగా కమ్ముకున్న పొగలతో నిండిపోయింది. ఈస్ట్ ఆల్టాడీనా డ్రైవ్ ప్రాంతమంతా బూడిదతో నిండిపోయింది. శక్తివంతమైన శాంటా ఆనా వేడి పవనాలు తూర్పులోని ఎడారి గాలిని తీరప్రాంత పర్వతాలపైకి ఎగదోస్తూ మంటలను మరింత ప్రజ్వరిల్లేలా చేస్తున్నాయి.

యుద్ధంలో కాదు.. బుద్ధుడిలోనే భవిష్యత్తు

'ప్రవాసీ భారతీయ దివస్'లో ప్రధాని మోదీ స్పష్టీకరణ

- మనందరి జీవితాల్లో ప్రజాస్వామ్యం ఒక అంతర్భాగం

భువనేశ్వర్: ఘనమైన వారసత్వం, సంస్కృతీ సంప్రదాయాలు కలిగిన భారత్ వైపు ప్రపంచ దేశాలు ఆసక్తిగా చూస్తున్నాయని, నేడు మనం చెప్పే మాట వింటున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. భవిష్యత్తు అనేది యుద్ధంలో లేదు, బుద్ధుడిలో ఉందని ప్రపంచానికి చెప్పగల శక్తి భారత్‌కు ఉందని తెలిపారు. గురువారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో 18వ ప్రవాసీ భారతీయ దివస్ వేడుకల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి లాంటిదని, మనందరి జీవితాల్లో ప్రజాస్వామ్యం ఒక అంతర్భాగమని స్పష్టంచేశారు. ప్రపంచ స్థాయిలో మన దేశ ప్రతిష్ట ఎంతగానో పెరిగిందని అన్నారు. కేవలం మన మనోగతమే కాకుండా గ్లోబల్ సౌత్ దేశాల అభిప్రాయాలను సైతం ప్రపంచ వేదికపై బలంగా వినిపించగలుగుతున్నామని వెల్లడించారు. ఆయుధ బలంతో సామ్రాజ్యాలు విస్తరిస్తున్న కాలంలో అశోక చక్రవర్తి శాంతి మార్గంలో నడిచారని గుర్తుచేశారు. మన వారసత్వ బలానికి ఇదొక ప్రతీక అని వెల్లడించారు. యుద్ధంలో కాకుండా బుద్ధుడి బోధనల్లోనే భవిష్యత్తు ఉందని భారత్ నమ్ముతున్నట్లు స్పష్టంచేశారు. ప్రధానమంత్రి మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

మీ వల్లే తలెత్తుకొని ఉండగలుగుతున్నా..

''ప్రవాస భారతీయులను మన దేశానికి రాయబారులుగా పరిగణిస్తున్నాం. వైవిధ్యం గురించి మనకు ఇంకెవరో చెప్పాల్సిన అవసరం లేదు. వైవిధ్యంపై మన జీవితాలు నడుస్తున్నాయి. భారతీయులు ఎక్కడికి వెళ్లినా అక్కడి సమాజంతో హృదయపూర్వకంగా మమేకమవుతూ ఉంటారు. ఇతర దేశాల నియమ నిబంధనలు మనం చక్కగా గౌరవిస్తాం. మనకు ఉద్యోగం, ఉపాధి కల్పించిన దేశానికి నిజాయితీగా సేవ చేయడం, ఆ దేశ ప్రగతిలో పాలుపంచుకోవడం మనకు అలవాటు. విదేశాల్లో ఉన్నప్పటికీ మన హృదయం భారతీయతతో నిండి ఉంటుంది. భారత్ కోసమే మన గుండె చప్పుడు వినిపిస్తుంది. ప్రవాస భారతీయులు మన దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేస్తున్నారు. వారి వల్లే విదేశాలకు వెళ్లినప్పుడు నేను తలెత్తుకొని ఉండగలుగుతున్నా.


ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న మోదీ

మనది యువ భారత్: 1947లో భారత్‌కు స్వాతంత్ర్యం రావడంలో ప్రవాస భారతీయులు కీలక పాత్ర పోషించారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలన్న లక్ష్య సాధనకు సహకరించాలని మిమ్మల్ని కోరుతున్నా. మనది యువ భారత్. ఇక్కడ యువ జనాభా అధికం. అంతేకాదు నైపుణ్యం కలిగిన యువత మన దగ్గర ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా నైపుణ్యాల డిమాండ్‌ను తీర్చగల సత్తా ఇండియాకు ఉంది. డిజిటల్ టెక్నాలజీలో మనం ముందంజలో ఉన్నాం. ఆధునిక యుద్ధ విమానాలు, రవాణా విమానాలను మన దేశంలోనే తయారు చేసుకుంటున్నాం. 'మేడ్ ఇన్ ఇండియా' విమానాల్లో మీరంతా ప్రవాసీ భారతీయ దివస్‌కు వచ్చే రోజు దగ్గర్లోనే ఉంది. భారతదేశ ఆసలైన చరిత్రను విదేశాల్లో చాటి చెప్పండి'' అని ప్రధాని మోదీ సూచించారు.

ప్రపంచానికి ఆయుర్వేదం ఇచ్చిన భారత్: క్రిస్టినా క్లారా

ప్రపంచ నాగరికత అభివృద్ధిలో భారత్ వెలకట్టలేని అత్యున్నత పాత్ర పోషించిందని ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశాధ్యక్షురాలు క్రిస్టిన్ కార్లా ప్రశంసించారు. ప్రవాసీ భారతీయ దివస్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె గురువారం మాట్లాడారు. గణితం, వైద్యం, సముద్రయానం వంటి రంగాల అభివృద్ధికి భారత్ దోహదపడిందని చెప్పారు. భారత్ అందించిన ఆయుర్వేదం ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతోందని అన్నారు. క్రిస్టిన్ క్లారాకు భారత ప్రభుత్వం ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డు ప్రకటించింది.

న్యూఢిల్లీ నుంచి మాత్రమే పోటీ చేస్తా

కేజ్రీవాల్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: త్వరలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక్క స్థానం నుంచి పోటీ చేస్తానని ఆప్ కన్వీనర్, మాజీ సీఎం కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఓటమి భయంతో తాను న్యూఢిల్లీతోపాటు మరో నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానంటూ బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై గురువారం మీడియా సమావేశంలో స్పందించారు. గత ఎన్నికల్లో పోటీ చేసినట్లే వచ్చే ఎన్నికల్లో కూడా న్యూఢిల్లీ సీటు నుంచి మాత్రమే మళ్లీ ఉంటానన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ప్రతిపక్ష ఇండియా కూటమితో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో ఈసారి పోటీ ఆప్, బీజేపీల మధ్యే ప్రధానంగా ఉండనుందన్నారు. కేజ్రీవాల్‌కు ఈ దఫా ఓటమి తప్పదు, అందుకే మరో చోటు నుంచి పోటీ చేస్తారంటూ బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ 'ఎక్స్'లో చేసిన వ్యాఖ్యలకు పైవిధంగా బదులిచ్చారు. న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి కేజ్రీవాల్‌తోపాటు ఢిల్లీ మాజీ సీఎం సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్ వర్మ బీజేపీ నుంచి, మాజీ సీఎం షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ కాంగ్రెస్ టిక్కెట్‌పై పోటీ చేస్తుండటం తెలిసిందే.

ఉత్తరాఖండ్‌లో ఈ నెల నుంచే యూసీసీ

ప్రకటించిన సీఎం పుష్కర్ సింగ్ ధామి



బరెల్లీ: దేశంలోనే ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ)ని మొట్టమొదటి సారిగా అమలు చేసే రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలవనుంది. తమ రాష్ట్రంలో ఈ జనవరిలోనే ఉమ్మడి పౌర స్మృతిని అమల్లోకి తేనున్నట్లు సీఎం పుష్కర్ సింగ్ ధామి ప్రకటించారు. గురువారం బరెల్లీలో ఆయన 29వ ఉత్తరాయణి మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..దేశానికి జీవజలాలను అందించే పవిత్ర శారద, గంగ, సరస్వతి, కావేరీ నదుల వంటిదే యూసీసీ కూడా అని ఆయన పేర్కొన్నారు. యూసీసీని దేశవ్యాప్తంగా అమలు చేయాలన్నది బీజేపీ ఎజెండాగా ఎప్పటి నుంచో ఉందని గుర్తు చేశారు. యూసీసీ బిల్లుకు గతేడాది ఫిబ్రవరిలో ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఆమోదం తెలపగా మార్చిలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంతకంతో చట్టంగా మారింది.

ఒకసారి రిజర్వేషన్లు పొందిన వారికి...

ఆ సౌకర్యం నిలిపేయాలి

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- అది శాసన, కార్యనిర్వహక నిర్ణయమని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికే ఆ ఫలాలు పొంది, ఆ కారణంగా ఇతరులతో సమానంగా పోటీ పడే స్థాయికి చేరినవారికి రిజర్వేషన్లను తొలగించవచ్చని అభిప్రాయపడింది. అయితే ఇది శాసన, కార్యనిర్వహక వ్యవస్థలు తీసుకోవాల్సిన నిర్ణయమని స్పష్టం చేసింది. ఎస్సీల్లో క్రీమీ లేయర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీల ధర్మాసనం గురువారం ఈ మేరకు పేర్కొంది. ఎస్సీల్లో క్రీమీ లేయర్ ఏర్పాటు చేసే అధికారం రాజ్యాంగపరంగా రాష్ట్రాలకు ఉందంటూ గత ఆగస్టులో ఏడుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం వెలువరించిన మెజారిటీ తీర్పును జస్టిస్ గవాయ్ ఈ సందర్భంగా ఉటంకించారు. ఎస్సీల్లోని వెనకబడ్డ కులాలకు లబ్ధి చేకూర్చేందుకు వీలుగా వారికి ఉద్దేశించిన రిజర్వేషన్లలో ఉప వర్గీకరణ చేయొచ్చని ఆ తీర్పు స్పష్టం చేసింది. ఆ ధర్మాసనంలో జస్టిస్ గవాయ్ కూడా సభ్యుడే. మెజారిటీ నిర్ణయంతో సమ్మతిస్తూనే నాడు ఆయన విడిగా తీర్పు వెలువరించారు. ఎస్సీలతో పాటు ఎస్టీల్లో కూడా క్రీమీ లేయర్‌కు రిజర్వేషన్లను నిలిపేయాలని అందులో స్పష్టం చేశారు. ఇందుకోసం రాష్ట్రాలు విధిగా ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలని కూడా ఆదేశించారు. ఆ తీర్పును తాజా కేసు విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ ప్రస్తావించారు. 'ఒకసారి లబ్ధి పొందినవారికి రిజర్వేషన్లను తొలగించాలి. గత 75 ఏళ్ల పరిణామాలను బేరీజు వేసిన మీదట ఈ అభిప్రాయం వెలువరిస్తున్నాం' అని పేర్కొన్నారు. రాజ్యాంగ ధర్మాసనం ఆదేశించి ఆరు నెలలు గడిచినా ఎస్సీ, ఎస్టీల్లో క్రీమీ లేయర్ గుర్తింపునకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. 'ప్రభుత్వాలు ఆ పని చేయవు. చివరికి అత్యున్నత న్యాయస్థానమే జోక్యం చేసుకోవాల్సి వస్తుంది' అన్నారు. ఆ వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు. 'ఆ పని చేసేందుకు శాసన, కార్యనిర్వాహక విభాగాలు ఉన్నాయి. రాజ్యాంగ ధర్మాసనం తీర్పు అమలయ్యేలా వాళ్లు చట్టం చేయాలి' అని పునరుద్ఘాటించింది. అయితే సంబంధిత వర్గాలనే ఆశ్రయిస్తామని పిటిషనర్ తెలపడంతో కేసును ఉపసంహరించుకునేందుకు అనుమతించింది.

పారాలింపియన్లు, సర్పంచులు, చేతివృత్తుల వారు..

గణతంత్ర వేడుకలకు 10 వేల మందికి ఆహ్వానం

సాక్షి, న్యూఢిల్లీ: 76వ గణతంత్ర వేడుకల్లో ప్రత్యేక అతిథులుగా పదివేల మంది హాజరుకానున్నారు. 26వ తేదీన ఢిల్లీ కర్తవ్య పథ్‌లో జరిగే పరేడ్‌కు 'స్వర్ణిమ్ భారత్'వాస్తు శిల్పులు, పారాలింపియన్లు, వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారిని ఆహ్వానిస్తున్నట్లు గురువారం పేర్కొంది. వీరిలో ఉత్తమ పనితీరు కనబరిచిన గ్రామ సర్పంచ్‌లు, చేనేత నిపుణులు, విపత్తు సహాయక సిబ్బంది, అటవీ, వన్యమృగ సంరక్షణ కేంద్రాల ఉద్యోగులు తదితరులు ఉంటారని తెలిపింది. ఎంపిక చేసిన ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆరు ప్రధాన పథకాల్లో లక్ష్యాలను సాధించిన పంచాయతీ సర్పంచిలు, ఈ శాన్య రాష్ట్రాలు, బెస్ట్ స్టార్టప్‌లు, రహదారి నిర్మాణ కార్మికులు కూడా ఆహ్వానితుల జాబితాలో ఉన్నారు. వీరందరికీ ఢిల్లీలోని పలు ప్రముఖ ప్రదేశాలైన జాతీయ యుద్ధ స్మారకం, ప్రధానమంత్రి సంగ్రహాలయ వంటివాటిని సందర్శించేందుకు వీలు కల్పిస్తారు.

చదువు ఖర్చులు తల్లిదండ్రుల నుంచి పొందడం

కుమార్తెల హక్కు: సుప్రీం

న్యూఢిల్లీ: కుమార్తెలు తమ చదువులకయ్యే ఖర్చులను తల్లిదండ్రుల నుంచి పొందడం చట్టబద్ధమని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఆడబిడ్డలను చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని పేర్కొంది. విద్యాభ్యాసానికి అయ్యే సొమ్మును పొందడం ఆడపిల్లల చట్టబద్ధమైన హక్కు అని తేల్చిచెప్పింది. పెద్దలు తమ స్థోమత మేరకు కుమార్తెలకు చదువులు చదివించాలని వెల్లడించింది. విడిపోయిన దంపతుల కుమార్తెకు సంబంధించిన ఓ కేసులో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఇటీవల ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది. సదరు దంపతులు 26 ఏళ్ల క్రితం విడిపోయారు. వారికి ఒక కుమార్తె ఉంది. మనోవర్తి కింద భార్యకు రూ.73 లక్షలు ఇవ్వడానికి భర్త అంగీకరించాడు. ఇందులో కుమార్తె చదువులకు అయ్యే ఖర్చు రూ.43 లక్షలు కలిపే ఉంది. కుమార్తె ఐర్లాండ్‌లో చదువుతోంది. తండ్రి ఇచ్చిన సొమ్ము తీసుకొనేందుకు నిరాకరించింది. తన సొంత డబ్బుతో చదువుకోగలనని, ఇంకొకరి సాయం అవసరం లేదని తేల్చిచెప్పింది. దీంతో ఆమె తండ్రి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తనకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని, కన్నబిడ్డను చదివించుకోగలనని, చదువుకయ్యే సొమ్మును తన కుమార్తె తీసుకొనేలా ఆదేశాలివ్వాలని కోరుతూ వ్యాజ్యం దాఖలు చేశాడు. దీనిపై ధర్మాసనం ఈ నెల 2వ తేదీన విచారణ చేపట్టింది. చదువులకయ్యే ఖర్చును తల్లిదండ్రుల నుంచి పొందే హక్కు కుమార్తెకు ఉందని వెల్లడించింది. తండ్రి నుంచి ఆ డబ్బు తీసుకోవడం ఇష్టం లేకపోతే తల్లికి ఇవ్వాలని సూచించింది.

'జేఈఈ-అడ్వాన్స్‌డ్'పై పిటిషన్ విచారిస్తాం: సుప్రీం

న్యూఢిల్లీ: జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ)-అడ్వాన్స్‌డ్ రాసేందుకు గరిష్ట ప్రయత్నాల సంఖ్యను మూడు నుంచి రెండుకు తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ వ్యాజ్యాన్ని విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం గురువారం అంగీకరించింది. సంబంధిత పిటిషన్ జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిహ్‌తో కూడిన ధర్మాసనం ముందుకువచ్చింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన జేఈఈ-అడ్వాన్స్‌డ్ ప్రయత్నాలను మూడు నుంచి రెండుకు తగ్గించడంతో విద్యార్థులు నష్టపోతారని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు ధర్మాసనం అంగీకారం తెలిపింది.

'స్వలింగ వివాహాల'పై తీర్పు సరైనదే: సుప్రీం



న్యూఢిల్లీ: దేశంలో స్వలింగ వివాహాల విషయంలో సుప్రీంకోర్టు తన వైఖరిని మరోసారి కుండబద్దలు కొట్టినట్లు తేల్చేసింది. స్వలింగ వివాహాలకు చట్టపరంగా ఎలాంటి గుర్తింపు ఇవ్వలేమంటూ గతంలో ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించేందుకు నిరాకరించింది. ఈ తీర్పును మళ్లీ క్షుణ్నంగా పరిశీలించాలంటూ దాఖలైన పిటిషన్లను విచారణకు స్వీకరించలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. స్వలింగ వివాహాలకు చట్టపరంగా గుర్తింపు ఇవ్వడానికి రాజ్యాంగబద్ధంగా ఎలాంటి ఆధారం లేదని 2023 అక్టోబర్‌లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. దీనిపై పలువురు సామాజిక కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్, ఇంటర్‌సెక్స్ తదితర వర్గాలు ఆందోళనకు దిగాయి. స్వలింగ వివాహాలపై అప్పట్లో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రివ్యూ పిటిషన్లు దాఖలు చేశారు. జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం గురువారం ఆయా పిటిషన్లను పరిశీలించింది. 2023 నాటి తీర్పులో ఎలాంటి పొరపాటు లేదని తేల్చిచెప్పింది. అప్పటి తీర్పులో వెల్లడించిన అభిప్రాయాలు చట్టానికి అనుగుణంగానే ఉన్నాయని వివరించింది. ఆ తీర్పులో కలుగజేసుకోవాల్సిన అవసరం లేదని ఉద్ఘాటించింది. రివ్యూ పిటిషన్లను డిస్మిస్ చేస్తున్నట్లు ధర్మాసనం స్పష్టంచేసింది.

భూభారతి బిల్లుకు గవర్నర్ ఆమోదం

ఒకటి రెండు రోజుల్లో గెజిట్‌లో ప్రచురణ

మార్గదర్శకాల రూపకల్పన పనిలో రెవెన్యూ శాఖ

వీలైనంత త్వరగా అమల్లోకి చట్టం: మంత్రి పొంగులేటి



గవర్నర్ ఆమోదించిన భూభారతి బిల్లు ప్రతిని మంత్రి పొంగులేటికి అందజేస్తున్న నవీన్‌మిత్తల్

సాక్షి, హైదరాబాద్: కొత్త రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్) బిల్లు భూభారతి చట్టంగా మారింది. అసెంబ్లీ ఆమోదం పొందిన భూభారతి బిల్లును రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదించారు. దీంతో భూభారతి ఇక చట్టంగా అమల్లోకి వస్తుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గవర్నర్ ఆమోదించిన భూభారతి బిల్లు ప్రతిని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ గురువారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి సచివాలయంలో అందజేశారు. ఈ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒకటిరెండు రోజుల్లో గెజిట్‌లో ప్రచురించనుందని సమాచారం. భూభారతి ఏ తేదీ నుంచి అమల్లోకి వస్తుందనే విషయాన్ని ప్రభుత్వం విడిగా నోటిఫై చేయాల్సి ఉంటుంది. మరోవైపు చట్టం మార్గ దర్శకాల రూపకల్పన విషయంలో రెవెన్యూ శాఖ వడివడిగా ముందుకెళుతోంది. మార్గదర్శ కాలు రూపొందించేందుకు మరో నెల సమ యం పడుతుందని తెలుస్తోంది. మార్గదర్శ కాలు సిద్ధం కాగానే చట్టం అమల్లోకి వస్తుందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం: పొంగులేటి

భూభారతి బిల్లును గవర్నర్ ఆమోదించిన నేపథ్యంలో వీలున్నంత త్వరగా చట్టాన్ని అమల్లోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. గురువారం సచివాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడుతూ.. భూభారతి రూపకల్పనలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు సమగ్రమైన రెవెన్యూ సేవలను అందించాలన్న ఆలోచనతో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని, భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా దీనిని రూపొందించామని తెలిపారు. తెలంగాణ ప్రజల భూమి హక్కులు, రికార్డుల్లోని సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చర్యల్లో భూభారతి కీలక మజిలీ అని భూ చట్టాల నిపుణుడు ఎం.సునీల్‌కుమార్ అన్నారు. చట్టం అమల్లో ప్రజలను భాగస్వాములను చేస్తే రైతుల సమస్యలు పరిష్కరించటంలో సమర్థంగా పనిచేస్తుందని అభిప్రాయపడ్డారు.



కనుల పండువగా రామయ్య జల విహారం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం భద్రగిరి రామయ్య తెప్పోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో దర్బార్ సేవ నిర్వహించాక పల్లకీలో ఆసీనుడైన సీతా సమేత రామచంద్రస్వామి వారిని మేళతాళాల నడుమ గోదావరి తీరానికి తీసుకెళ్లారు. అక్కడ హంసాకృతిలో అలంకరించిన పడవలో సీతారాములను కొలువుదీర్చారు. రాత్రి 7–05 గంటలకు ఆరు పరిక్రమణలతో తెప్పోత్సవాన్ని పూర్తి చేశారు. సీతారామచంద్రస్వామి వారు భక్తులకు శుక్రవారం ఉత్తర ద్వారంలో దర్శనమివ్వనున్నారు. తెప్పోత్సవంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజ్ పాల్గొన్నారు.

లిక్కర్ బకాయిలు రూ. 2వేల కోట్లకు పైనే!

గత ప్రభుత్వ హయాం నుంచే కొనసాగుతున్న వైనం.. కొత్త ప్రభుత్వంలో తాజా బిల్లులకే చెల్లింపులు

ఆరు నెలల క్రితమే ఎక్సైజ్ శాఖకు యూబీ కంపెనీ లేఖ.. తాజాగా బీర్ల సరఫరా నిలిపివేతకు నిర్ణయం

ప్రభుత్వం ముందున్నది రెండే మార్గాలంటున్న ఎక్సైజ్ వర్గాలు



సాక్షి, హైదరాబాద్: మద్యం సరఫరా చేసే కంపెనీలకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ చెల్లించాల్సిన బకాయిలు రూ.2 వేల కోట్లకు పైగానే ఉన్నట్టు తెలుస్తోంది. లిక్కర్‌తో పాటు బీర్లు తయారు చేసే కంపెనీలన్నింటికీ కలిపి ఈ మేరకు బకాయిలు ఉన్నాయని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. గత ప్రభుత్వ హయాం నుంచే ఈ బకాయిలు కొనసాగుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒప్పందం మేరకు 45 రోజులకు బిల్లులు చెల్లిస్తున్నారే కానీ పాత బకాయిలు మాత్రం విడుదల చేయడం లేదని పేర్కొంటున్నాయి. బకాయిలు కొనసాగుతుండడాన్ని కంపెనీలు భరించలేకపోతున్నాయని, ఈ నేపథ్యంలోనే యూబీ కంపెనీ పరిణామం చోటు చేసుకుందని తెలుస్తోంది. యూబీతో పాటు బీర్లు సరఫరా చేసే ఏబీ, ఇతర లిక్కర్ కంపెనీలు కూడా బిల్లుల ఉక్కిరిబిక్కిరిలోనే ఉన్నాయనే చర్చ ఎక్సైజ్ వర్గాల్లో జరుగుతోంది. తమకు బకాయిలు చెల్లించని కారణంగా సరఫరా నిలిపివేస్తామంటూ ఆరు నెలల క్రితమే యూబీ కంపెనీ నుంచి ఎక్సైజ్ శాఖకు లేఖ వచ్చినట్టు తెలుస్తోంది. అయితే తాము ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత బిల్లులు క్రమం తప్పకుండా విడుదల చేస్తున్నందున ప్రభుత్వం ధీమాతో ఉందని సమాచారం.

యూబీ లేఖతోనే తెరపైకి 'సోం'!

సరఫరా నిలిపివేస్తామంటూ యూబీ లేఖ రాసిన నేపథ్యంలోనే ఎక్సైజ్ వర్గాలు ముందుచూపుతో మరో డిస్టిలరీకి అనుమతినిచ్చే ప్రతిపాదన చేసినట్టు తెలుస్తోంది. లిక్కర్ కంపెనీలకు ఉండే 'రాజకీయ' సంబంధాల కారణంగా, యూబీకి చెక్ పెట్టాలనే యోచనతో ప్రభుత్వం కూడా ప్రోత్సహించిందని, ఈ పరిస్థితుల్లోనే సోం డిస్టిలరీస్ అనే మరో బీర్ల కంపెనీ తెరపైకి వచ్చిందనే చర్చ జరుగుతోంది. అయితే ఈ డిస్టిలరీకి అనుమతుల వ్యవహారం రాజకీయ రంగు పులుముకోవడంతో సదరు ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. అయితే ఇప్పుడు యూబీ నిర్ణయం నేపథ్యంలో.. ఆ కంపెనీ అడిగిన విధంగా మద్యం సరఫరా చేసే కంపెనీల బేసిక్ ధరలను పెంచడం లేదంటే బీర్ల తయారీ కోసం సోం డిస్టిలరీస్ లాంటి కంపెనీలకు అనుమతులివ్వడం తప్ప ప్రభుత్వానికి మరో ప్రత్యామ్నాయం లేదని అధికారులు అంటున్నారు.

ఇతర మద్యం బ్రాండ్లకు కొరత!

యూబీ కంపెనీ నిర్ణయంతో కింగ్‌ఫిషర్ బీర్లు డిపోలకు రావడం నిలిచిపోయింది. దీంతో బుధవారం నాటికి డిపోల నుంచి తీసుకున్న బీర్లు మాత్రమే ప్రస్తుతం వైన్‌షాపుల్లో అందుబాటులో ఉన్నాయి. ఈ బీర్లు వారం వరకు సరిపోతాయని, అప్పటికి పరిష్కారం రాకపోతే కింగ్ ఫిషర్ బీర్ల కొరత ఏర్పడుతుందని ఎక్సైజ్ వర్గాలంటున్నాయి. ఇదిలావుంటే ఇతర మద్యం బ్రాండ్లకు ఇప్పటికే మార్కెట్‌లో కొరత వచ్చిందని తెలుస్తోంది. సియా గ్రామ్స్ అనే కంపెనీ తయారు చేసే 100 పైపర్స్, బ్లెండర్స్ ప్రైడ్, రాయల్‌స్టాగ్ లాంటి ప్రీమియం బ్రాండ్ల సరఫరా నిలిచిపోయిందని సమాచారం. దీంతో ఇప్పటికే మార్కెట్‌లో ఆయా బ్రాండ్లు దొరకడం లేదని వైన్‌షాపుల యజమానులు చెపుతున్నారు. అయితే ఇందుకు వికారాబాద్ జిల్లాలోని ఒక డిస్టిలరీని ప్రభుత్వం మూసివేయడమే కారణమని, ఈ డిస్టిలరీలోనే సియాగ్రామ్స్ ప్రీమియం బ్రాండ్లు తయారవుతాయని, అందుకే ఆయా బ్రాండ్లు మార్కెట్‌లోకి రావడం లేదని ఎక్సైజ్ వర్గాలు వెల్లడించాయి.

లోపలకు వచ్చినంత మాత్రాన దాడి చేస్తారా?

సినీనటుడు మోహన్‌బాబును ప్రశ్నించిన సుప్రీంకోర్టు

- జర్నలిస్ట్‌పై దాడి కేసులో విచారణ వచ్చేనెల 13వ తేదీకి వాయిదా
- అప్పటి వరకూ మోహన్‌బాబుపై బలవంతపు చర్యలొద్దు
- రాష్ట్ర పోలీసులకు సుప్రీంకోర్టు ఆదేశాలు



సాక్షి, న్యూఢిల్లీ: 'ఇంటి లోపలకు వచ్చినంత మాత్రాన జర్నలిస్ట్‌పై దాడి చేస్తారా'అంటూ సినీనటుడు మంచు మోహన్‌బాబును సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. మరోపక్క మోహన్‌బాబుపై కఠిన చర్యలు తీసుకోవద్దంటూ రాష్ట్ర పోలీసులకు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. గతేడాది డిసెంబర్ 10న జల్‌పల్లిలోని తన నివాసం వద్ద జర్నలిస్ట్‌పై దాడి కేసులో మోహన్‌బాబుకు హైకోర్టులో ముందస్తు బెయిల్ రాలేదు. దీంతో ఆయన డిసెంబర్ 24న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను గురువారం జస్టిస్ సుధాంశు దులియా, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. జర్నలిస్ట్‌పై దాడి జరిగిన సందర్భాన్ని మోహన్‌బాబు తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ ధర్మాసనానికి తెలిపారు. క్షణికావేశంలో మోహన్‌బాబు జర్నలిస్ట్ మైక్ లాక్కొని, అదే మైక్‌ను విసిరారన్నారు. అయితే ఈ ఘటనపై బహిరంగ క్షమాపణలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని, అవసరమైతే బాధిత జర్నలిస్ట్‌కు నష్టపరిహారం చెల్లించేందుకు సుముఖంగా ఉన్నారని అభ్యర్థించారు.

దవడ విరగడంతో.. పైపు ద్వారా ఆహారం

మోహన్‌బాబు దాడి చేయడం వల్లే జర్నలిస్ట్ దవడ విరిగిందని ఆయన తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని కోరేందుకే మోహన్‌బాబు కుటుంబ సభ్యులతో కలిసి ఆస్పత్రికి వెళ్లారని ధర్మాసనానికి గుర్తు చేశారు. ఈ సందర్భంగా ముకుల్ రోహత్గీ జోక్యం చేసుకొని మోహన్‌బాబు జర్నలిస్ట్‌ను బెదిరించలేదని, అయినా హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారన్నారు. మోహన్‌బాబు ఇంటిపైకి 20–30 మంది వచ్చారని, ఇది అతిక్రమణ కిందకు వస్తుందని చెప్పారు. మోహన్‌బాబు పేరున్న నటుడని, ఎవరినైనా చంపడం, బాధపెట్టడం ఆయనకు ఇష్టం లేదని ముకుల్ రోహత్గీ ధర్మాసనానికి తెలిపారు.

ప్రతివాదులకు నోటీసులు జారీ

ఈ వాదనలపై జస్టిస్ దులియా స్పందిస్తూ..ఎవరైనా ఇంటిలోపలకు వచ్చినంత మాత్రాన దాడి చేస్తారా అని మోహన్‌బాబు తరపు అడ్వొకేట్ రోహత్గీని ప్రశ్నించారు. అయితే ఇరుపక్షాలు వాదనలు విన్న ధర్మాసనం..ప్రతివాదిగా ఉన్న బాధితుడు పరిహారం కోరుకుంటున్నారా చెప్పాలని కోరింది. దీనిపై జర్నలిస్ట్ న్యాయవాదితో మాట్లాడి, ఆయనకు ఏం కావాలో చేస్తానని ముకుల్ రోహత్గీ కోర్టుకు తెలిపారు. దీంతో తదుపరి విచారణ వరకు మోహన్‌బాబుపై బలవంతపు చర్యలు వద్దని పోలీసులను ఆదేశించింది. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఈ కేసులో ప్రతివాదులుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి, జర్నలిస్ట్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే నెల 13కు వాయిదా వేస్తున్నట్టు వెల్లడించింది.

అబ్బురపర్చిన మన విద్యార్థులు

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో అద్భుత ప్రతిభ

'ఇన్‌స్పైర్‌లో జాతీయస్థాయికి 29 ఎగ్జిబిట్లు

జడ్చర్ల/జడ్చర్ల టౌన్: రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో జడ్చర్ల మండలం పోలేపల్లి ఎస్వీకేఎంలో మూడు రోజులపాటు అట్టహాసంగా నిర్వహించిన ఇన్‌స్పైర్ 2023–24, ఆర్‌ఎస్‌బీవీపీ 2024–25 రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ముగిసింది. ఇన్‌స్పైర్ విభాగంలో 298 ప్రదర్శనలు రావాల్సి ఉండగా.. 290 వచ్చాయి. వీటిలో 10% చొప్పున 29 ప్రదర్శనలు జాతీయస్థాయికి ఎంపికయ్యాయి. ఆర్‌ఎస్‌బీవీపీలో 530 ప్రదర్శనలకు 517 వచ్చాయి. వీటిలో 35 ప్రదర్శనలు ఈ నెల 20 నుంచి పాండిచ్చేరిలో జరిగే సదరన్ ఇండియా సౌత్ ఫెస్ట్–2025కు ఎంపికయ్యాయి. అదేవిధంగా ఉపాధ్యాయుల నుంచి 40 ప్రదర్శనలు రాగా.. నాలుగు జాతీయస్థాయికి ఎంపికయ్యాయి. ఆర్‌ఎస్‌బీవీపీలో మొత్తం 7 అంశాల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేయగా.. రెండు అంశాల్లో జూనియర్స్ విభాగంలో విజేతలను ప్రకటించారు. మొత్తంగా ఇన్‌స్పైర్, ఆర్‌ఎస్‌బీవీపీతో పాటు అదనంగా 46 అవార్డులను ప్రకటించారు. అయితే అవార్డులు అందుకున్న విద్యార్థులను రాష్ట్ర విజేతలుగా మాత్రమే పరిగణిస్తారు. వీరి ప్రదర్శనలు జాతీయ స్థాయికి వెళ్లవు. విజేతలకు కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ రమేశ్, డీఈఓ ప్రవీణ్ కుమార్, డీఎస్‌ఓ శ్రీనివాసులు, ఎంఈఓ మంజులాదేవి బహుమతులు ప్రదానం చేశారు.

జాతీయస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు, విద్యార్థుల వివరాలు సాక్షి ప్లస్ (ఈ-పేపర్)లో

పోలీస్‌స్టేషన్ల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ

క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించిన డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: పోలీసుల పనితీరుపై ప్రజా స్పందన తెలుసుకునేందుకు తెలంగాణ పోలీసులు వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలీస్ స్టేషన్లకు పలు సమస్యలపై వచ్చే ప్రజల విషయంలో పోలీసు స్టేషన్లలో అధికారులు ఏవిధంగా స్పందిస్తున్నారు? వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదుర య్యాయన్నది పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చేలా క్యూఆర్ కోడ్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. డీజీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో డీజీపీ జితేందర్ ఈ క్యూఆర్ పోస్టర్లను మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ప్రజలు తమ ఫోన్ల ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పోలీసుల తీరుపై అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు. ఈ క్యూఆర్ కోడ్ ప్రతి పోలీసు స్టేషన్‌లో అందుబాటులో ఉంటుందని, కోడ్‌ను స్కాన్ చేస్తే తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఓపెన్ అవుతుందని తెలిపారు. టైప్ చేయడం రానివారు వాయిస్ ద్వారా కూడా వారి అభిప్రాయా లను పంపవచ్చని చెప్పారు. ఈ విధానంతో పోలీసుల పని తీరు నేరుగా ప్రజల ద్వారా తెలుసుకొనే అవకాశం పోలీసు ఉన్నతాధికారులకు ఉంటుందని డీజీపీ వెల్లడించారు. ఈ అభిప్రాయ సేకరణ పిటిషన్ తీసుకోవడం, ఎఫ్ఐఆర్ నమోదు, ఈ–చలాన్, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ అంశాల్లో సేకరిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఐజీలు రమేశ్, సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్‌నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న డీజీపీ జితేందర్, డీజీ శిఖాగోయల్

ఇందిరమ్మ ఇళ్ల ఫిర్యాదుల కోసం వెబ్‌సైట్

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, సేవలను మరింత పారదర్శకంగా అందించడానికి ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. ఫిర్యాదుల కోసం ఇంది రమ్మ ఇళ్ల గ్రీవెన్స్ మాడ్యూల్‌ను తెచ్చినట్లు రెవె న్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. గురువారం సచివాల యంలోని తన కార్యాలయంలో ఈ గ్రీవెన్స్ మాడ్యూల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఏమైనా సమస్యలు ఎదురైతే indirammaindlu.telangana.gov.inకు ఫిర్యాదు చేయవచ్చని, ఆ ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుని, వివరాలను ఫిర్యాదుదారు మొబైల్‌కు మెసేజ్ రూపంలో పంపిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన ఈనెల 8వ తేదీనాటికి 32 జిల్లాలలో 95% పూర్తికాగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 88% పూర్తయిందన్నారు. త్వరలో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి ఇళ్ల నిర్మాణం కార్యాచరణపై దృష్టి సారిస్తా మన్నారు. మొదటి విడతలో నివాస స్థలం ఉన్నవారికి, రెండో దశలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లను మంజూరు చేస్తామన్నారు, మొదటి విడతలో వికలాంగులు, ఒంటరి మహిళలు, అనాథలు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లు, సఫాయి కర్మచారులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ పాల్గొన్నారు.

బెనిఫిట్ షో అవసరమేముందో చెప్పండి

సినిమా టికెట్ల ధరల పెంపుపై హైకోర్టు అసహనం.. అలా మెమోలు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్న


వేకువజాము, అర్ధరాత్రి అనుమతులు ఇస్తారా?

ప్రజల భద్రతపై ఆలోచించాలి కదా అని వ్యాఖ్య

'గేమ్‌ఛేంజర్' టికెట్ల ధర పెంపుపై పిటిషన్

నేడు విచారణ చేపడతామన్న జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సినిమా టికెట్ల ధరల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వడంలో సర్కార్ తీరుపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ప్రముఖ చిత్రాలకు బెనిఫిట్ షోలకు, ఇష్టం వచ్చిన సమయాల్లో ప్రదర్శనకు ఎందుకు అనుమతి ఇస్తున్నారని, వాటి అవసరం ఏముందని ప్రశ్నించింది. ప్రజల భద్రత గురించి కనీసం ఆలోచించాల్సిన అవసరం లేదా అని నిలదీసింది. 16 ఏళ్లలోపు పిల్లలను అర్ధరాత్రి, తెల్లవారుజాము ప్రదర్శనలకు అను మతించకూడదని సూచించింది. ఇలాంటి అంశాల్లో ఒక్క చిత్రంపై ఇలా పిటిషన్ దాఖలు చేయడం కాకుండా.. ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. తదుపరి విచారణను నేటికి వాయిదా వేసింది. దిల్ రాజు నిర్మాతగా శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ నటించిన గేమ్‌ఛేంజర్ సినిమా టికెట్ ధరల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. జనవరి 10న మల్టీప్లెక్స్ థియేటర్లలో ఒక్కో టికెట్‌పై అదనంగా రూ. 150, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒక్కో టికెట్‌పై అదనంగా రూ. 100 చొప్పున పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది. జనవరి 11 నుంచి రోజూ 5 షోల నిర్వహణకు అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 11 నుంచి 19 వరకూ మల్టీప్లెక్సులలో టికెట్‌పై అదనంగా రూ. 100, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్‌పై అదనంగా రూ. 50 రూపాయల చొప్పున ధరలు పెంచుకోడానికి సర్కార్ అనుమతిచ్చింది. అర్ధరాత్రి బెనిఫిట్ షోలకు మాత్రం సర్కార్ నిరాకరించింది. ఇదిలా ఉండగా, ఈనెల 8న ఇచ్చిన టికెట్ ధరల పెంపు ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కూరగాయల వ్యాపారి గొర్ల భరత్‌రాజ్ లంచ్ మోషన్ రూపంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జనవరి 10న ఉదయం 4.30 గంటల నుంచి సినిమా ప్రదర్శనకు అనుమతివ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.



పిల్‌గా విచారణ చేయాల్సిన అంశం...

ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. టికెట్ ధరల పెంపు నిబంధనలకు విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. గేమ్‌ఛేంజర్ సినిమా టికెట్ ధరల పెంపు ఉత్తర్వులను నిలుపుదల చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయం సినిమా రెగ్యులేషన్స్ రూల్స్ 1970, సినిమాస్ లైసెన్సింగ్ షరతులకు విరుద్ధమని తెలిపారు. పుష్ప–2 బెనిఫిట్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి తర్వాత.. ఇకపై రాష్ట్రంలో బెనిఫిట్ షోలకు అనుమతి ఉండదని డిసెంబర్ 21న అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారన్నారు. కనీసం పక్షం రోజులైనా కాకముందే వేకువజామున 4 గంటలకే షో నిర్వహించుకునేలా అనుమతులు ఇచ్చారన్నారు. ప్రజలకు చెప్పేదొకటి.. చేసేదొకటి అన్న తీరుగా సర్కార్ వ్యవహారం ఉందని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ అంశంపై పిల్ వేస్తే మరింత అనుకూలంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. పిటిషనర్ న్యాయవాది కోరడంతో విచారణ నేటికి వాయిదా వేశారు. కాగా, తగినంత పార్కింగ్ లేకపోవడం, స్క్రీనింగ్‌ల మధ్య తక్కువ సమయం వంటి ఇబ్బందులపైనా న్యాయమూర్తి వ్యాఖ్యలు చేశారు. ఇది ప్రజల తొక్కిసలాటకు దారితీస్తుందని పేర్కొన్నారు.

హక్కులు హరించడమే..: హైకోర్టు

'సినిమా ప్రదర్శనకు సమయపాలన ఉండాలి. అర్ధరాత్రి, వేకువజామున అనుమతులు ఇవ్వడం మానవ హక్కుల ఉల్లంఘన లాంటిదే. ఇది ప్రజల నిద్రపోయే హక్కును హరించడమే అవుతుంది. ఇలా ఎప్పటికప్పుడు చిత్రాలకు వెళ్లే వాడి ఆరోగ్యం ఏమవుతుంది?' 'పిటిషనర్లు కూడా చిత్రం విడుదలకు ముందు పిటిషన్ వేసి ఇక తర్వాత పట్టించుకోవడం లేదు. వేళాపాళా లేని షోలకు 16 ఏళ్లలోపు చిన్నారులను కూడా రద్దీ ఉండే చిత్రాలకు తీసుకొస్తున్నారు.. సర్కార్ కూడా అనుమతిస్తోంది. ఇది సమంజసం కాదు. ప్రజలు బయటకు వెళ్లడానికి, లోనికి రావడానికి స్క్రీనింగ్‌ల మధ్య సమయం ఉండాలి'

కొంచెమైనా.. ముంచేస్తుంది!




అతిగా మద్యం తాగడం ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరమని అందరికీ తెలిసిందే. కానీ కొందరు వైద్యులు, సైంటిస్టులు, డైటీషియన్లు వంటివారు రోజూ స్వల్ప మొత్తంలో ఆల్కహాల్ తీసుకోవడం వల్ల లాభం ఉంటుందని, గుండె జబ్బులను దూరం పెడుతుందని చెబుతూ ఉంటారు. కానీ దీనికి పక్కా ఆధారాలేమీ లేవని, రోజూ కాస్తంత ఆల్కహాల్ తీసుకున్నా కేన్సర్ బారినపడే ముప్పు పెరిగిపోతుందని అమెరికా సర్జన్ జనరల్ వివేక్ మూర్తి స్పష్టం చేస్తున్నారు. దీనికి సంబంధించి పలు అధ్యయనాలు, గణాంకాల్లో తేలిన అంశాలను ఆధారంగా చూపుతున్నారు. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులపై అవి కేన్సర్‌కు దారితీస్తాయంటూ ఎలా హెచ్చరికలు ముద్రిస్తారో.. అలా ఆల్కహాల్ ఉత్పత్తులపైనా ముద్రించాలని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఆయన నివేదిక ప్రకారం..


ఆల్కహాల్‌కు కేన్సర్‌కు లింకేమిటి?

తగిన జాగ్రత్తలు తీసుకుని నివారించుకునే అవకాశమున్న కేన్సర్లలో.. పొగాకు, ఊబకాయం తర్వాత ఎక్కువగా నమోదవుతున్నవి ఆల్కహాల్ కారణంగానే. ప్రపంచ ఆరోగ్య సంస్థ కేన్సర్ రీసెర్చ్ విభాగం కూడా ఆల్కహాల్‌ను ప్రధానమైన కేన్సర్ కారకాల్లో (గ్రూప్ 1 కార్సినోజెన్) ఒకటిగా గుర్తించడం గమనార్హం.

- అమెరికాలో ఏటా ఆల్కహాల్ కారణంగా కేన్సర్ బారినపడి మరణిస్తున్నవారు.. 20 వేల మంది
- 2020లో ప్రపంచవ్యాప్తంగా ఆల్కహాల్ వినియోగం కారణంగా నమోదైన కేన్సర్ కేసులు... 7.4 లక్షల మంది.



(ఒక డ్రింక్ అంటే సుమారుగా.. 330 మిల్లీలీటర్ల బీరు లేదా 35 మిల్లీలీటర్ల విస్కీ)



7 ఆల్కహాల్‌తో రకాల కేన్సర్ల ముప్పు

పొగాకు నేరుగా కేన్సర్లకు కారణమైతే.. ఆల్కహాల్ ఏడు రకాల కేన్సర్లకు దారితీస్తుంది. మన దేశంలో కాలేయ కేన్సర్‌కు ముఖ్య కారణంగా ఆల్కహాల్ నిలుస్తోంది. ఇక ఆల్కహాల్, పొగాకు ఉత్పత్తులు రెండూ కలిస్తే కేన్సర్ల ముప్పు మరింత తీవ్రమవుతుందని కేన్సర్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

ఆల్కహాల్ కేన్సర్‌కు దారితీసేదిలా..

1. శరీరంలో ఆల్కహాల్ అసిటాల్డిహైడ్‌గా మారుతుంది. ఇది మన కణాల్లోని డీఎన్‌ఏను దెబ్బతీసి, కేన్సర్ ముప్పును పెంచుతుంది.
2. ఆల్కహాల్ శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను పెంచుతుంది. ఇది శరీరంలో కణాలు, ప్రొటీన్లు, డీఎన్‌ఏను దెబ్బతీసి కేన్సర్‌కు కారణమయ్యే ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమవుతుంది.
3. ఆల్కహాల్ కారణంగా శరీరంలో వివిధ హార్మోన్లలో విపరీతమైన హెచ్చుతగ్గులు వస్తాయి. ఇది కేన్సర్‌కు దారితీస్తుంది. ముఖ్యంగా మహిళల్లో ఈస్ట్రోజన్ హార్మోన్‌పై ప్రభావం పడి రొమ్ము కేన్సర్ ముప్పు పెరుగుతుంది.
4. కేన్సర్‌కు కారణమయ్యే పదార్థాలను (కార్సినోజెన్లు) శరీరం ఎక్కువగా సంగ్రహించడానికి ఆల్కహాల్ కారణమవుతుంది.



ఎంత తాగితే.. అతిగా తాగినట్టు?

ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన పలు అధ్యయనాల మేరకు.. రోజూ కనీసం ఒక డ్రింక్ ఆల్కహాల్ తాగేవారిలో కేన్సర్ల ముప్పు 10 నుంచి 40% వరకు పెరుగుతుంది. డ్రింక్స్ సంఖ్య పెరిగిన కొద్దీ.. ముప్పు అదే స్థాయిలో పెరుగుతూ పోతుంది.

అక్కడి అధ్యయనం మనకెందుకు?

ప్రపంచంలోనే అత్యధిక జనాభాకు తోడు ఆల్కహాల్ వినియోగం కూడా ఎక్కువగానే ఉండటంతో.. భారత్‌లోనూ ఈ కేన్సర్ల ముప్పు ఎక్కువ. 'ది లాన్సెట్ అంకాలజీ' జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధన వివరాల మేరకు... 2020లో భారత్‌లో కొత్తగా 62,100 ఆల్కహాల్ ఆధారిత కేన్సర్ కేసులు నమోదయ్యాయి. మొత్తం కేన్సర్ కేసుల్లో ఇవి 5 శాతానికన్నా ఎక్కువే కావడం గమనార్హం.

మన దేశంలో కొన్నేళ్లుగా పెరిగిపోతున్న ఊబకాయం సమస్యకు తోడుఆల్కహాల్, పొగాకు ఉత్పత్తుల వినియోగం ఈ పరిస్థితికి దారితీస్తోందని అంకాలజీ నిపుణులు చెబుతున్నారు.

మరి ఈ కేన్సర్ల ముప్పు నుంచి బయటపడేదెలా?



రోజూ స్వల్ప మొత్తంలో ఆల్కహాల్ తీసుకున్నా కేన్సర్ ముప్పు తప్పదని ఈ అధ్యయనం తేల్చింది. అంటే ఈ ముప్పు నుంచి బయటపడటానికి ఉన్న ఏకైక మార్గం... ఆల్కహాల్‌కు పూర్తిగా దూరంగా ఉండటమేనని అంకాలజీ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక్కసారిగా అలవాటు మానుకోలేనివారు.. స్వల్పంగా తీసుకుంటూ మానేయాలని, అదే సమయంలో సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులకు కచ్చితంగా దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

–సాక్షి, సెంట్రల్ డెస్క్

చంద్రబాబే మొదటి ముద్దాయి

తిరుపతిలో తొక్కిసలాట ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి
వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ధ్వజం

వైష్ణవులందరికీ మార్గదర్శకంగా నిలిచే ఆలయం తిరుమల. గతంలో లక్షలాది మంది భక్తులు వచ్చినా సంతోషంగా దర్శనం చేయించి పంపించగలిగాం. ఆలయాల నిర్వహణలో చంద్రబాబుకు శాస్త్రం తెలియదు. ఆచరణలు తెలియవు. దేవుడిపై భయం లేదు. భక్తీ లేదు. భయమూ, భక్తి ఉన్న వాడెవడైనా తిరుమల శ్రీవారి ప్రసాదంపై ఇష్టమొచ్చినట్టుగా అబద్ధాలు చెప్పగలుగుతాడా? టీటీడీ ప్రతిష్టను దిగజార్చే కార్యక్రమం ముఖ్యమంత్రి అనేవాడు చేస్తాడా? ఈ ఘటనలో ముమ్మాటికీ చంద్రబాబే మొదటి ముద్దాయి.


వైఎస్ జగన్‌కు తన గోడును వెళ్లబోసుకుంటున్న బాధితురాలు

తొక్కిసలాట ఒక ప్రాంతంలో జరగలేదు. రకరకాల ప్రదేశాల్లో జరిగింది. ఆయా ప్రాంతాల్లో పోలీస్ ఫోర్స్ లేకపోవడం, కనీస ఏర్పాట్లు లేకపోవడం స్పష్టంగా కన్పిస్తోంది. ఆయా ప్రాంతాల్లో అంబులెన్స్‌లను ప్రోటోకాల్ ప్రకారం పెట్టాలన్న బాధ్యత కూడా లేదు. తొక్కిసలాట తర్వాత అంబులెన్స్ రావడానికి, క్షతగాత్రులను తీసుకెళ్లడానికి ముక్కాలు గంట (45 నిమిషాలు) పట్టిందని బాధితులు చెబుతున్నారు. అది కూడా అప్పుడొకటి.. అప్పుడొకటి వచ్చాయని చెప్పారు. కొంత మంది వాళ్లంతట వాళ్లే కిందా మీద పడి వచ్చామని చెప్పారు. మరికొంత మంది రోడ్డున పోయే వారి సాయంతో వచ్చామని చెబుతున్నారు. ఈ రకమైన పరిస్థితులుండడం ఎంత దారుణం?

సాక్షి, అమరావతి : వైకుంఠ ఏకాదశి రోజున శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వచ్చిన ఆరుగురు భక్తులు తిరుపతిలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో చనిపోవడం దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) చరిత్రలో ఇలాంటి ఘటన గతంలో ఎన్నడూ జరగలేదని గుర్తు చేశారు. టీటీడీ చరిత్రలో ఇది మాయని మచ్చగా నిలుస్తుందన్నారు. ఈ ఘటనలో ముమ్మాటికీ మొదటి ముద్దాయి చంద్రబాబేనని స్పష్టం చేశారు. తొక్కిసలాటలో గాయపడి, పద్మావతి మెడికల్ కాలేజ్ ఆస్పత్రి (స్విమ్స్)లో చికిత్స పొందుతున్న బాధితులను గురువారం రాత్రి ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పవిత్ర టీటీడీలో ఇలాంటి పరిస్థితులకు దారితీసిన కారణాలను అందరూ ఆలోచించాలన్నారు. తొక్కిసలాట ఘటనలో ఆశ్చర్యం కలిగించే విషయాలు బయటకు వచ్చాయని చెప్పారు. 'మనం వైకుంఠ ఏకాదశిని ఏటా జరుపుకొంటాం. ఆ రోజు లక్షలాది మంది భక్తులు వెంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తారు. ఆ రోజు ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే పుణ్యం వస్తుందని తరలివస్తారు. 10వ తేదీన వైకుంఠ ఏకాదశి. ఈ విషయాలన్నీ తెలిసీ.. ప్రభుత్వం ఎందుకు టికెట్లు ఇచ్చే కొంటర్ల దగ్గర భద్రత చర్యలు, ప్రొటోకాల్స్ పాటించలేదు? అసలు చంద్రబాబుకు 10న వైకుంఠ ఏకాదశి అని తెలుసు కదా? అయినా కూడా కుప్పంలో తన ప్రోగ్రాం పెట్టుకున్నాడు. 6వ తేదీ నుంచి 8వ తేదీ మధ్యాహ్నం వరకు కుప్పంలోనే ఉన్నారు. పోలీసు శాఖ మొత్తం ఆయన్ను ప్రసన్నం చేసుకునేందుకు కుప్పం తరలిపోయింది. 8వ తేదీ రాత్రి 8.30 గంటలకు టికెట్లు ఇచ్చే కార్యక్రమంలో తొక్కిసలాట ఘటన జరిగింది. లక్షల మంది భక్తులు వస్తారని తెలిసినప్పుడు, కుప్పంలో చంద్రబాబు పర్యటన ఉందని తెలిసినప్పుడు పోలీసులు ఎందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు? అందరూ చంద్రబాబు పర్యటనలో మునిగి పోవడం వల్లే ఈ దుర్ఘటన చోటుచేసుకుంది' అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఒక్క సారిగా గేట్లు తెరవడంతో..

బైరాగిపట్టెడ కౌంటర్‌కు ఎదురుగా ఉన్న పార్కులో ఉదయం 8 గంటల నుంచి భక్తులను గుంపుగా నిలబెట్టారు. రాత్రి 8.30 గంటలకు కౌంటర్ వద్దకు తీసుకొచ్చి గేట్లు తెరిచారు. ఒక్కసారిగా గేట్లు తెరవడంతోనే తొక్కిసలాట జరిగిందని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు చెబుతున్నారు. చీకట్లో.. పార్కులో నిలబెట్టిన భక్తులకు ఉదయం నుంచి ఏమైనా ఇచ్చారా? వచ్చిన భక్తులను వచ్చినట్టు ఎందుకు క్యూలైన్లలోకి పంపించలేదు? అన్ని సెంటర్లలోనూ ఇదే పరిస్థితి. ఆయా సెంటర్లలో లైన్లలోకి పంపించడానికి పోలీసులు ఎక్కడా లేరు. అందుకే గుంపుగా నిలబెట్టి ఒకేసారి విడిచిపెట్టే కార్యక్రమం చేశారు. ఇప్పుడు పోలీసులు.. చంద్రబాబు దిక్కుమాలిన అబద్ధాలు అడుతున్నారు. ఈ తొక్కిసలాట ఘటన ఒక చోటే జరిగినట్టు చెబుతున్నారు. విష్ణు నివాసం దగ్గర ఒకరు చనిపోయినట్టు, బైరాగిపట్టెడలో ఐదుగురు చనిపోయినట్టు ఎఫ్ఐఆర్‌లలో నమోదైంది. ఆస్పత్రిలో బాధితులతో మాట్లాడినప్పుడు వివిధ కౌంటర్ల దగ్గర తొక్కిసలాటల్లో గాయపడినట్టు చెబుతున్నారు. చంద్రబాబుకు ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశికి లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసి కూడా కుప్పంలో 6,7,8 తేదీల్లో ప్రోగ్రామ్స్ పెట్టుకున్నారు. పోలీసులు మొత్తాన్ని తన దగ్గరకే పిలిపించుకున్నారు. తిరుపతిలో మాత్రం భక్తుల కోసం ప్రత్యామ్నాయ భద్రత ఏర్పాట్లను గాలికి వదిలేశారు. ఫలితంగా భారీ తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. దేవుడి దయతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి ఎటువంటి ప్రాణాపాయం లేదు. రుయా, స్విమ్స్ ఆస్పత్రులను కలుపుకొంటే దాదాపు 50 నుంచి 60 మంది భక్తులు తొక్కిసలాటలో గాయపడినట్టు సమాచారం. ఒక్క స్విమ్స్‌లోనే 35 మంది ఉన్నట్టు తెలుస్తోంది.

భక్తుల భద్రత, వసతులపై చిత్తశుద్ధి ఏదీ?

మొట్టమొదటి సారిగా తిరుపతిలో ఇలాంటి దురదృష్టకర ఘటన చోటు చేసకుంది. దారుణమైన పరిస్థితుల్లో వ్యవస్థను నడిపిస్తున్నారు. ఇక్కడి కలెక్టర్, ఎస్పీ, పోలీసులు, టీటీడీ పెద్దలు తిరుమల తిరుపతి దేవస్థానం విశిష్టత తెలియకుండా ప్రవర్తించారు. దశాబ్దాలుగా టీటీడీలో ప్రొటోకాల్స్ ఉన్నా, వీళ్లెవ్వరూ పట్టించుకోలేదు. తిరుపతికి లక్షలాది మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో వారి భద్రత, వసతుల కల్పన గురించి ఆలోచించలేదు. ఉదయం 9 గంటలకు వస్తే కనీసం నీళ్లు కూడా ఇవ్వలేదని బాధితులు వాపోతున్నారు. అక్కడ మనుషులు ఉన్నారని వీళ్లు పట్టించుకుంటే కదా! మా ప్రభుత్వంలో ఐదేళ్లలో గొప్పగా భక్తులకు దైవ దర్శన సేవలందించాం. అలాంటిది ఈ రోజు భక్తులను క్యూలో నిలబెట్టేవారు లేరు. వారి ఆకలి, దప్పికలను కూడా గాలికి వదిలేశారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

ఇది ప్రభుత్వం చేసిన తప్పు. ప్రభుత్వమే దీనికి పూర్తి బాధ్యత తీసుకోవాలి. చనిపోయిన వ్యక్తుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి.. ప్రభుత్వం తప్పిదంగా ఒప్పుకుంటూ ఉచిత వైద్యం అందించాలి. వారు డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లేటప్పుడు కనీసం రూ.5 లక్షలు అందించాలని చంద్రబాబును డిమాండ్ చేస్తున్నాం. ఈ ఘటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు, హోం మంత్రి, దేవదాయ శాఖ మంత్రి, టీటీడీ చైర్మన్, ఈవో, అడిషనల్ ఈవో, ఎస్పీ, కలెక్టర్, రెవెన్యూ అధికారులు అందరూ బాధ్యత వహించాల్సిందే. మొత్తం పోలీసు శాఖను తిరుపతిలో లేకుండా చేసి.. పలచగా అక్కడక్కడా బందోబస్తు పెట్టి, భక్తుల మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

చిన్న కేసుగా పక్కన పడేసే కుట్ర

భక్తులు మృతి చెందిన ఘటనపై ఎఫ్ఐఆర్‌లో పేలవమైన సెక్షన్లు నమోదు చేశారు. ఇందులో 194 బీఎన్ఎస్ సెక్షన్ కింద కేసు పెట్టారు. దొమ్మీ జరిగి ఇద్దరు కొట్టుకుంటే పెట్టే సెక్షన్లతో కేసు నమోదు చేస్తారా? ఇది ఇద్దరు కొట్టుకుంటే జరిగిన ఘటనా? ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జరిగితే.. 105 బీఎన్ఎస్ సెక్షన్ పెట్టాల్సింది పోయి.. కావాలని కేసును నీరు గార్చేందుకు కుట్రలు చేస్తున్నారు. ఇంత పెద్ద ఘటనను ఒక చిన్న కేసుగా.. తీసి పక్కన పడేసేందుకు దారుణంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారంటే.. వీళ్లకు అసలు మానవత్వం లేదు. చిత్తశుద్ధి కూడా లేదు. బాగా చేయాలనే ఆలోచన అసలే లేదు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం జరుగుతోంది. చంద్రబాబు తప్పుడు వ్యాఖ్యలు చేసి టీటీడీ లడ్డూ విషయంలో ఒక అబద్ధాన్ని సృష్టించారు. దానికి రెక్కలు కట్టి తిరుపతి వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని సైతం అప్రతిష్టపాలు చేసిన చరిత్ర చంద్రబాబుది. ఇదే పెద్ద మనిషి తన చర్యలతో మరోసారి టీటీడీలో బ్లాక్ మార్కుగా నిలిచిపోయే ఘటనకు కారణమయ్యాడు. దశాబ్దాలుగా తిరుపతికి ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడికి వచ్చిన లక్షలాది మంది భక్తులకు సురక్షితంగా భగవంతుడి దర్శనం కల్పించడం. అందుకే క్రౌడ్ మేనేజ్‌మెంట్‌లో టీటీడీకి ఉన్న విశిష్టత ఎక్కడా లేదు. అలాంటి పరిస్థితి నుంచి ఇప్పుడు టీటీడీలోకి అడుగుపెట్టాలంటే.. అది కూడా చంద్రబాబు లాంటి పాలకుడు ఉన్నప్పుడు ఎలాంటి దారుణమైన పరిస్థితులు ఉంటాయో చూపించారు.

ఈ ఘటనకు చంద్రబాబు, టీటీడీ చైర్మన్, ఈవో, అదనపు ఈవో, ఎస్పీ, కలెక్టర్.. బాధ్యత వహించాలి. ఇందులో వీరందరి తప్పు ఉంది. చంద్రబాబు నాయుడుకు ఈ పాపం తగలక మానదు. ఎందుకంటే తప్పు చేసిన తర్వాత కనీసం తప్పు చేశానంటూ దేవుడికి, భక్తులకు క్షమాపణ చెప్పాలన్న ఇంగిత జ్ఞానం కూడా లేదు. సిన్సియార్టీ లేదు. చిత్తశుద్ధి అంతకంటే లేదు. తాను చేసిన తప్పును ఇంకొకరి మీద మోపడమే ఆయనకు తెలుసు.

తప్పంతా చంద్రబాబుదే

- చంద్రబాబు.. ఓ షో పుటప్ చేసి, చిన్న స్థాయి అధికారులను బాధ్యులను చేస్తూ వారిని బదిలీ, సస్పెండ్ చేసే శిక్షలతో సరిపెట్టే కార్యక్రమం చేస్తుండటం బాధాకరం. ఈ ఘటనలో చంద్రబాబు చేసిన తప్పు కన్పించడం లేదా? 6వ తేదీ నుంచి 8వ తేదీ మధ్యాహ్నం వరకు కుప్పంలో పర్యటించ లేదా? పోలీసులందరినీ తన చుట్టూ పెట్టుకోలేదా? భక్తుల కోసం పోలీసుల కేటాయింపు లేకపోవడం వాస్తవం కాదా? జిల్లా ఎస్పీ.. చంద్రబాబును ప్రసన్నం చేసుకునేందుకే తాపత్రయ పడ్డారే తప్ప, లక్షల మంది భక్తులకు సెక్యూరిటీ కల్పించాలని ఆలోచించ లేదు. ఈ విషయంలో ఎస్పీది తప్పు కాదా?
- కలెక్టర్‌ది కూడా తప్పు ఉంది. కనీసం అక్కడున్న వారిని క్యూలైన్‌లలో నిలబెట్టే కార్యక్రమంపై ప్రొటోకాల్ ప్రకారం ఆదేశాలు ఇచ్చేందుకు రివ్యూలు కూడా చేయక పోవడం తప్పు కాదా? కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు కూడా ఇవ్వాలనే ఆలోచన చేయలేదు. అక్కడకు వచ్చిన భక్తులకు కనీసం తాగేందుకు నీళ్లు కూడా ఇవ్వలేదు. తినడానికి తిండి లేదు. ఇలా గంటల తరబడి భక్తులు పార్కుల్లో ఉండేలా చేశారు. అన్ని కౌంటర్ల వద్ద పోలీసులు లేకుండా చేయడంలో కలెక్టర్‌ది తప్పు కాదా?
- వైకుంఠ ఏకాదశి దర్శనం కోసం ఎంత మందిని ప్రవేశింప చేయాలనే నిర్ణయం తీసుకున్నది ఈవో, అదనపు ఈవో. వీరందరినీ అజమాయిషీ చేసేది టీటీడీ చైర్మన్. వీరందరిదీ తప్పు కాదా? టోకెన్ల జారీపై రివ్యూలు తీసుకోకుండా ఇంత మంది చావులకు కారణం మీరు కాదా? మొత్తానికి ఈ ఘటనలో మొదటి ముద్దాయి చంద్రబాబే.

గోదావరి పుష్కరాల్లో 29 మందిని పొట్టన పెట్టుకున్నారు..

- గతంలో గోదావరి పుష్కరాల సమయంలో 29 మందిని పొట్టన పెట్టుకున్న ఘతన ఈ చంద్రబాబుది కాదా? తన షూటింగ్ కోసం అందర్నీ ఒకచోట పెట్టాడు. షూటింగ్ బాగా రావాలని చెప్పి గేట్లు ఒకేసారి ఎత్తాడు. తొక్కిసలాటలో 29 మంది చనిపోయారు.
- తిరుపతి ఘటనలో జరిగిన వాస్తవాలు ప్రజలకు చెప్పకూడదని చంద్రబాబు నాయుడు ఎంత దారుణమైన స్థాయికి దిగజారిపోయాడంటే.. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులను నేను రాకముందే ఇక్కడ నుంచి షిఫ్ట్ చేసే కార్యక్రమం చేశారు. దీనికి మీరే సాక్ష్యం. గాయపడిన వారు చాలా మంది మేము పోము.. మా పరిస్థితి ఇంకా బాగోలేదు.. మమ్మల్ని ఎక్కడకు పంపిస్తారు.. మేము ఎందుకు పోవాలని భీష్మించుకొని ఆస్పత్రిలో ఉండిపోయారు.

దేవుడి పవిత్రతను దెబ్బ తీయడానికి వాళ్లే చేశారేమో..!?



పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనం సరైనదికాదు

- తిరుపతిలో టోకెన్లు ఇస్తారనే విషయం నాకు తెలియదు
- తిరుపతిలో ఘటన స్థలాన్ని పరిశీలించి, క్షతగాత్రులను పరామర్శించిన ఏపీ సీఎం చంద్రబాబు

చిత్తూరు అర్బన్/తిరుపతి అర్బన్: 'తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనను వాళ్లే చేశారేమో..! దేవుడి పవిత్రతను దెబ్బతీయడానికి ఇలా చేశారని అనుమానం ఉంది. నా 45 ఏళ్ల రాజకీయ జీవితంలో వైకుంఠ ఏకాదశి రోజున శ్రీవారిని దర్శించుకోవడానికి తిరుపతిలో టోకెన్లు ఇస్తారనే విషయం నాకు తెలియదు' అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. వైకుంఠ ఏకాదశి టోకెన్ల క్యూలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని చంద్రబాబు గురువారం పరిశీలించారు. గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. అసలు గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్లే ఇలాంటి ఘనటలు జరుగుతున్నాయన్నారు. వైకుంఠ ఏకాదశి రోజు మాత్రమే భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించాలని, అలాకాదంటే మరుసటి రోజు మధ్యాహ్నం వరకు ఏకాదశి దర్శనం ఉంటుందన్నారు. పది రోజుల పాటు వైకుంఠ దర్శనం కల్పించడం ఎంత వరకు సమంజసమన్నారు. తిరుమలలో మొదటి నుంచి ఉన్న సంప్రదాయాలను మార్చడం మంచిది కాదన్నారు. ఇంతకు మునుపు వైకుంఠం దర్శనానికి తిరుమలలో మాత్రమే టోకెన్లు ఇచ్చేవాళ్లని, తిరుపతిలో టోకెన్లు ఇవ్వడం తన జీవితంలో చూడలేదని చెప్పారు. వైకుంఠ ద్వార దర్శనంపై వరసగా సమీక్షలు నిర్వహించినప్పటికీ, అన్నింటా నేను కల్పించుకోలేనని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని ఈవోకు చెప్పానని, ఆయన చూసుకోవాలని తెలిపారు. బీఆర్ నాయుడుకు ఇందులో అనుభవం లేదు కదా అన్నారు. ఇక్కడ విధుల్లో ఉన్న డీఎస్పీ రమణకుమార్, టీటీడీ గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డి ఘటన స్థలంలో ఉండి కూడా పర్యవేక్షణలో విఫలమయ్యారని, వారిద్దరిని సస్పెండ్ చేస్తున్నామని ప్రకటించారు. ఘటనకు బాధ్యులుగా గుర్తించి తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీధర్, టీటీడీ జేఈవో గౌతమిని బదిలీ చేస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను టీటీడీ ద్వారా అందిస్తామన్నారు.

తప్పు జరిగింది.. క్షమించండి

- టీటీడీ ఈవో, అదనపు ఈవో, చైర్మన్ బాధ్యత వహించాలి
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



తిరుపతి తుడా/చంద్రగిరి/తిరుపతి సిటీ: తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనకు ప్రభుత్వం తరఫున క్షమాపణలు చెబుతున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పారు. 'పుణ్యక్షేత్రంలో తప్పు జరిగింది. ఇందుకు పూర్తి బాధ్యత తీసుకుంటాం. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎంగా నేను ఈ ఘటన బాధ్యతల నుంచి తప్పుకోవడంలేదు. క్షమాపణలు కోరుతున్నాం. చనిపోయిన వారి కుటుంబాలకు అండగా ఉంటాం' అని చెప్పారు. గురువారం సాయంత్రం తిరుపతి వచ్చిన పవన్ మీడియాతో మాట్లాడుతూ.. అధికారుల తప్పిదాల వల్ల ఆరుగురు ప్రాణాలు కోల్పోయారన్నారు. టోకెన్ల జారీ సమయాన్ని చెప్పిన దానికన్నా ముందుకు తేవడంలో ఎవరి హస్తం ఉందో తేలాలన్నారు. తొక్కిసలాట ఘటనకు టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, టీటీడీ చైర్మన్ బాధ్యత వహించాలని చెప్పారు. మృతుల కుటుంబాలకు టీటీడీ బోర్డు, పోలీసులు క్షమాపణ చెప్పాలని అన్నారు.

భక్తులే పరస్పరం గొడవపడి చనిపోయారట!

అదేం పెద్ద దుర్ఘటన కాదని వక్రభాష్యం

సాక్షి, అమరావతి: 'అబ్బే ఇదేం అంత పెద్ద దుర్ఘటన కాదు.. అంతగా ఏమీ పట్టించుకోవాల్సిన అవసరం లేదు.. తూతూ మంత్రంగా కేసు పెట్టి ముగించేద్దాం' తిరుపతి ఘటనపై ఇదీ చంద్రబాబు ప్రభుత్వ పన్నాగం. భక్తులు పరస్పరం ఘర్షణ పడినట్టుగా కేసుగా నమోదు చేసి క్లోజ్ చేసేయండన్న ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు పోలీసు శాఖ వెంటనే జీ హుజూర్ అనడం విస్తుగొలుపుతోంది. యావత్ దేశాన్ని తీవ్రంగా కలచి వేసిన తిరుపతి దుర్ఘటనను చిన్నదిగా చూపేందుకు చంద్రబాబు ప్రభుత్వం రంగంలోకి దిగింది. ప్రభుత్వ వైఫల్యంతోనే ఆరుగురు భక్తులు దుర్మరణం చెందిన తీవ్రమైన దుర్ఘటనను అత్యంత ఉదాసీనంగా పరిగణిస్తూ నామ మాత్రపు సెక్షన్ల కింద కేసు నమోదు చేయడమే అందుకు తార్కాణం. భక్తులు పరస్పరం ఘర్షణ పడటంతోనే మరణించారని ఆ కేసు నమోదు ద్వారా ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించినట్లయింది. పోలీసులు గురువారం నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రభుత్వ కుట్రకు పరాకాష్టగా నిలుస్తోంది. చంద్రబాబు ఆదేశాల మేరకు వాస్తవాలతో నిమిత్తం లేకుండా కేసును నీరుగార్చేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. బీఎన్ఎస్ సెక్షన్ 194 కింద కేసు నమోదు చేశారు. ఆ సెక్షన్ ప్రకారం.. ఇద్దరు లేదా అంత కంటే ఎక్కువ మంది వ్యక్తులు పరస్పరం ఘర్షణ పడినట్టు లెక్క. అంటే అందులో ప్రభుత్వంగానీ, పోలీసుల వైఫల్యంగానీ ఏమీ లేదన్నట్టుగా పరిగణించాలి. వాస్తవానికి బీఎన్ఎస్ సెక్షన్ 105 కింద కేసు నమోదు చేయాలని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఉద్దేశ పూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరించి వ్యక్తుల ప్రాణాలను బలిగొన్న నేరాలకు ఈ సెక్షన్ వర్తిస్తుంది. లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసినా, తగినంత మంది పోలీసులను వియోగించక పోవడం, ఇతర ఏర్పాట్లు చేయకపోవడం ద్వారా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నది విస్పష్టం. అందుకే సెక్షన్ 105 కింద కేసు నమోదు చేయాలని నిపుణులు పట్టుబడుతున్నారు. సామాన్యుల ప్రాణాలు పోవడానికి బాధ్యులైన వారికి ఈ సెక్షన్ కింద ఐదేళ్ల నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. అందుకే ప్రభుత్వం ఈ సెక్షన్ కింద కాకుండా నామమాత్రంగా కేసు నమోదు చేయించిందని నిపుణులు విమర్శిస్తున్నారు.

నిర్లక్ష్యమే చంపేసింది

తిరుపతి తుడా/తిరుపతి సిటీ/చంద్రగిరి : మితిమీరిన ప్రచారం, అవగాహన రాహిత్యం, భద్రత ఏర్పాట్ల వైఫల్యం భక్తులకు శాపంగా మారింది. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పది రోజుల పాటు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్లు టీటీడీ ప్రకటించింది. ఇందుకోసం తిరుపతి కేంద్రంగా భక్తులకు టోకెన్లను జారీ చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో టీటీడీ చైర్మన్, అధికారులు నెల రోజుల నుంచి సమావేశాలు, సమీక్షలు నిర్వహించారు. తరచూ కౌంటర్ల ఏర్పాట్లను పరిశీలిస్తూ, సామాన్య భక్తులకు దర్శనం కల్పించడమే ముఖ్య ఉద్దేశమంటూ ఊదరగొట్టారు. అతి ప్రచారం కారణంగా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తిరుపతికి పోటెత్తారు. భక్తుల రద్దీని అంచనా వేయడంలో టీటీడీ పూర్తిగా విఫలమైంది. ఆ స్థాయిలో ఏర్పాట్లు లేకపోవడంతో కౌంటర్ల వద్ద తీవ్ర గందరగోళం నెలకొంది. గురువారం ఉదయం 5 గంటల నుంచి మూడు రోజులకు సంబంధించి 1.20 లక్షల టోకెన్లను జారీ చేస్తామని ముందుగానే ప్రకటించడంతో సుమారు నాలుగు లక్షల మందికి పైగా భక్తులు తిరుపతి చేరుకున్నారు. బుధవారం తెల్లవారుజాము 5 గంటల నుంచే కౌంటర్ల వద్ద బారులు తీరారు. సాయంత్రానికి మరింత మంది తోడవ్వడంతో క్యూలైన్ల వద్ద రద్దీ పోటెత్తింది. సరిగ్గా ఇదే సమయంలో అధికారులు అనాలోచిత నిర్ణయంతో బుధవారం రాత్రి 8 గంటల నుంచే టోకెన్ల జారీ ప్రారంభించారు. దీంతో వేలాదిగా భక్తులు కౌంటర్ల వద్దకు పరుగులు పెట్టడం.. తోపులాట చోటుచేసుకోవడం.. ఆరుగురు మృతి చెందడం.. పదుల సంఖ్యలో భక్తులు గాయపడటం తెలిసిందే.

అరుపులు, కేకలు.. నరకయాతన

శ్రీనివాసం సముదాయం వద్ద టోకెన్లు తీసుకునేందుకు వేచి ఉన్న భక్తుల్లో సేలంకు చెందిన మల్లిక తీవ్ర అస్వస్థతకు గురైంది. భక్తుల రద్దీతో తోపులాటలో భాగంగా ఆమెకు ఊపిరాడక అపస్మారక స్థితిలోకి చేరుకోవడంతో క్యూలైన్ నుంచి బయటకు తీసుకొచ్చినట్లు భర్త కృష్ణన్ తెలిపారు. తొలుత అంబులెన్స్‌లో స్థానిక డీబీఆర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి విషమించడంతో రుయాకు తరలించే క్రమంలో ఆమె మార్గం మధ్యలో మృతి చెందింది. ఈ ఘటన చోటు చేసుకున్న నిమిషాల వ్యవధిలోని


మాకెవరు దిక్కు.. రోదిస్తున్న బాధితుల కుటుంబ సభ్యులు

టీటీడీ గ్లోబల్ ప్రచారం కారణంగా పోటెత్తిన భక్తులు

భక్తుల రద్దీని అంచనా వేయడంలో సర్కారు వైఫల్యం

సత్యనారాయణపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలోనూ తోపులాట చోటు చేసుకుంది. అయితే ఇక్కడ పరిస్థితి కొంత సేపటికి అదుపులోకి రావడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం రాత్రి 8.25 గంటల ప్రాంతంలో బైరాగిపట్టెడలోని రామానాయుడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కూలైన్ల వద్ద భారీ తోపులాట చోటు చేసుకుంది. దీనికి తోడు అదే సమయంలో తొక్కిసలాటలో కిందపడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిన లావణ్య స్వాతిని బయటకు తీసుకొచ్చే క్రమంలో వెలుపలదారి గేట్లను పోలీసులు తెరవడం మరింతగా తొక్కిసలాటకు కారణమైంది. అక్కడ పోలీసు బందోబస్తు లేకపోవడంతో వందలాది మంది భక్తులు అక్కడి నుంచి తోసుకొచ్చారు. ఈ క్రమంలో తీవ్ర స్థాయిలో తొక్కిసలాట జరిగింది. ముందు వరుసలోని భక్తులు కిందపడి పోవడంతో.. వెనుక ఉన్న వారు వారిని తొక్కుకుంటూ వెళ్లడంతో ఒక్కసారిగా అరుపులు, కేకలు, ఆర్తనాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. అక్కడ ఏం జరుగుతోందో తెలియక వెనుక, ముందు ఉన్న వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తమను తాము రక్షించుకోవడానికి వెలుపలకు పరుగులు పెట్టారు. ఈ క్రమంలో కింద పడిన వారిని సైతం తొక్కుకుంటూ తమ కుటుంబ సభ్యులను కాపాడేయత్నంలో ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు.

నీళ్లు లేవు.. టాయ్‌లెట్లు లేవు.. ఇవేం ఏర్పాట్లు?

కౌంటర్ల వద్ద తాగునీరు, పాలు, అల్పాహారం అందించాలన్న కనీస ఆలోచన కూడా టీటీడీకి రాకపోవడం దుర్మార్గం అని భక్తులు మండిపడ్డారు. చాలా మంది భక్తులు ఆకలితో అలమటించి, నీరసించిపోయారు. క్యూలోంచి పక్కకు వెళితే వెనుకబడిపోతామనే భయంతో చాలా మంది అక్కడి నుంచి కదల్లేదు. చంటి పిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు గంటల తరబడి వేచి ఉండటంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మహిళలకు కనీసం మొబైల్ టాయ్‌లెట్లను సైతం ఏర్పాటు చేయకపోవడంతో వారు నరకయాతన అనుభవించారు. ఇన్ని ఇబ్బందులు ప్రత్యక్షంగా కళ్లకు కనిపిస్తుంటే.. ఏర్పాట్లు ఘనంగా చేశామని టీటీడీ చైర్మన్ మీడియాకు పదే పదే ఎందుకు చెప్పారని భక్తులు నిలదీశారు. దైవ దర్శనానికి వస్తే ప్రాణాలు తీశారని మండిపడ్డారు.

వైఎస్ జగన్ పర్యటనకు అడుగడుగునా అడ్డంకులు


కారు దిగి ఆస్పత్రి వైపు నడిచి వెలుతున్న వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, తిరుపతి : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి పర్యటనను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టించింది. అత్యంత ఆదరణ కలిగిన నేత, మాజీ ముఖ్యమంత్రి అయిన వైఎస్ జగన్‌కు ఎటువంటి భద్రత ఏర్పాట్లు చేయలేదు. అంతటితో ఆగక.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పరామర్శ ముగిసినప్పటికీ.. వైఎస్ జగన్ ఆస్పత్రి వద్దకు వెళ్లకుండా కావాలనే అడ్డుకున్నారు. తొక్కిసలాటలో గాయపడిన వారిని పరామర్శించేందుకు వైఎస్ జగన్ గురువారం సాయంత్రం 4.50 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన స్విమ్స్‌కు బయలుదేరారు. అంతలో కూటమి ప్రభుత్వ పెద్దలు క్షతగాత్రులను మరో ఆస్పత్రికి తరలించాలని కుట్ర పన్నారు. ఇందులో భాగంగా జగన్ ఆలస్యంగా చేరేలా కాన్వాయ్‌ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం దాటగానే ఇసుక ట్రాక్టర్లు, లారీలను రోడ్డుపై ఆపేశారు. ట్రాఫిక్ సమస్య ఏమోనని కాన్వాయ్‌ని ఆపారు. వెంటనే డీఎస్పీ శ్రీనివాసరావు మాజీ వైఎస్ జగన్ వద్దకు వచ్చి.. ఇటుగా వెళ్లటానికి అనుమతి లేదు.. తొక్కిసలాట జరిగిన బైరాగిపట్టెడకు వెళ్లాలని ఆదేశించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించడానికి తాను వచ్చానని, వారి వద్దకు వెళ్తానని తేల్చి చెప్పారు. అందుకు డీఎస్పీ ససేమిరా అన్నారు. దీంతో తాను నడుచుకుంటూ ఆసుపత్రికి వెళ్తానని జగన్ వాహనంలోంచి కిందకు దిగారు. నడుచుకుంటూ తిరుపతి వైపు పయనమయ్యారు. జగన్ వచ్చారని తెలిసి స్థానికులు పెద్దఎత్తున తరలి వచ్చారు. కిలోమీటర్ దూరం నడిచాక.. తిరుపతి వైపు వెళ్తున్న ఓ కారులో వైఎస్ జగన్ వెళ్లారు.

1 లైను లేదు.. పాడూ లేదు...



వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి..

2 పోలీసులు పట్టించుకోకపోవడం వల్లే..



వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి..

3 పోలీసులు సక్రమంగా సహకరించలేదు



వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి..

4 మా మాత కోసం ఎంత వెదికానో...



వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి..

5 మొగుడు పెళ్లాం వచ్చాం.. మొగుడు ఎల్లిపోయాడు



వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి..

6 నీళ్లు లేవు.. కరెంటు లేదు..



వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి..

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 10 । జనవరి । 2025



సిటీ పోలీసు అలర్ట్

ఏసీబీ విచారణకు హాజరైన కేటీఆర్



- బీఆర్ఎస్ నాయకుల కదలికలపై నిఘా
- ఎక్కడికక్కడ పటిష్ట బందోబస్తు ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: ఫార్ములా ఈ–కారు రేస్ కేసులో నిందితుడిగా ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో నగర పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. చాలామంది బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నివసిస్తున్నారు. దీంతో ఆ అధికారులు సైతం అప్రమత్తమయ్యారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు బందోబస్తు కొనసాగింది. బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి సమీపంలోనే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయమైన తెలంగాణ భవన్ ఉంది. దీంతో పోలీసులు ఈ రెండింటికీ మధ్య ఉన్న ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. అడుగడుగునా బలగాలను మోహరించారు. తెలంగాణ భవన్‌కు వచ్చిపోయే నాయకులు, కార్యకర్తలపై నిఘా వేసి ఉంచారు. అలాగే నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉంటున్న కీలక బీఆర్ఎస్ నాయకుల కదలికల్నీ గమనించారు. ఇటీవల గాంధీభవన్–బీజేపీ కార్యాలయం వద్ద చోటు చేసుకున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకున్న ఉన్నతాధికారులు మరింత అప్రమత్తమయ్యారు.



వైకుంఠ ఏకాదశికి ఆలయాల ముస్తాబు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా నగరంలోని వైష్ణవాలయాలు అందంగా ముస్తాబయ్యాయి. హిమాయత్ నగర్‌లోని టీటీడీ శ్రీవారి దేవాలయాన్ని తీరొక్క పుష్పాలు, పండ్లతో ఇలా సుందరంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



దద్దరిల్లిన బల్దియా



బిల్లులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్ల ధర్నా

- ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తం
- కమిషనర్ కార్యాలయ ముట్టడికి యత్నం
- తన చాంబర్ నుంచి మేయర్ చాంబర్‌కు వెళ్లిన కమిషనర్



జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ప్లకార్డులు చేబూని ధర్నా చేస్తున్న కాంట్రాక్టర్లు

సాక్షి, సిటీబ్యూరో: ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ బిల్లుల తాలూకు నిధులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం కాంట్రాక్టర్లు నిర్వహించిన ధర్నాతో కాసేపు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయ ప్రాంగణం దద్దరిల్లింది. మధ్యాహ్నం 'నో పేమెంట్–నో వర్క్స్' ప్లకార్డులతో కమిషనర్ ప్రవేశ ద్వారం వద్ద కాంట్రాక్టర్లు ధర్నాకు దిగారు. తమ బిల్లులు వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. ఇదే సమయంలో ఇద్దరు కాంట్రాక్టర్లు ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సహచర కాంట్రాక్టర్లు వారించి వారి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. కమిషనర్ కార్యాలయంవైపు దూసుకువెళ్లేందుకు ప్రయత్నించిన వారిని భద్రతా సిబ్బంది, పోలీసులు అడ్డుకున్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన కమిషనర్ తన చాంబర్ నుంచి మొదటి అంతస్తులోని మేయర్ చాంబర్‌లోకి వెళ్లి కాంట్రాక్టర్ల అసోసియేషన్ నాయకులతో మాట్లాడేందుకు పిలిచారు. గత జనవరి నుంచి పెండింగ్‌లో ఉన్న తమ బకాయిలను సంక్రాంతిలోగా చెల్లించకపోతే.. ఈ నెల 20 నుంచి అన్ని పనులు నిలిపివేసి, సమ్మెలోకి వెళ్తామన్న నేతలకు కమిషనర్ నచ్చచెప్పారు. జూలై వరకు బిల్లుల్ని పండగలోగా చెల్లించడంతోపాటు రెండు మూడు నెలల్లో పరిస్థితుల్ని చక్కదిద్ది మిగతా బిల్లుల చెల్లింపులు చేస్తామని కమిషనర్ ఇలంబర్తి హామీ ఇచ్చినట్లు సమావేశానంతరం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌సింగ్ తెలిపారు. జీహెచ్ఎంసీకి నెలకు రూ.500 కోట్లు ఇచ్చేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అందులో రూ. 200 కోట్లు కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని కమిషనర్ తెలిపినట్లు పేర్కొన్నారు.

కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల బకాయిలు దాదాపు రూ. 1500 కోట్లు ఉన్నాయని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. వడ్డీలకు అప్పులు తెచ్చిన వారు బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఎదురవుతున్నాయని అన్నారు. బిల్లుల చెల్లింపులకు ముందు ఇంజినీర్లు, జోనల్, డిప్యూటీ కమిషనర్లు పనులను తనిఖీ చేయాలని ఇటీవల కమిషనర్ సర్క్యులర్ జారీ చేయడాన్ని ప్రస్తావిస్తూ, పనుల తనిఖీల పేరిట అధికారులు జాప్యం చేస్తే సహించబోమన్నారు. అధికారులు తనిఖీలు చేసేందుకు కూడా నిర్ణీత గడువు విధించాలని, ఆలోగా వారు తనిఖీలు చేయకపోయినా బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

'అపార్' కష్టాలు!

ఆధార్‌లో తప్పుల తడకగా వివరాలు

- యూడైస్‌లో జనరేట్ కాని నంబర్లు
- ఆధార్ కేంద్రాలకు ఉరుకులు పరుగులు

మహా నగరంలో విద్యార్థులు ఇలా..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
హైదరాబాద్	2,946	8,09,220
రంగారెడ్డి	3,055	7,15,905
మేడ్చల్ మల్కాజిగిరి	2,191	7,19.517



సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వ జాతీయ నూతన విద్యా విధానం– 2020లో భాగంగా వన్ నేషన్– వన్ స్టూడెంట్ ఐడీ పేరిట తెచ్చిన ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదులో సమస్యలతో కష్టాలు తప్పడం లేదు. ఆధార్ కార్డులో వివరాల తప్పుల తడకగా ఉండటంతో ప్రధాన సమస్య గా తయారైంది. ఆధార్ తరహాలో విద్యార్థుల అకడమిక్ వివరాలతో పాటు వారి ధ్రువీకరణ పత్రాలను డిజిటల్‌గా భద్రపరిచేలా 12 అంకెలతో కూడిన అపార్ కార్డుకు రూపకల్పన చేశారు. విద్యార్థుల వివరాలు అడ్మిషన్ రిజిస్ట్రేషన్‌తో పాటు యూడైస్‌లో నమోదైన అనంతరం సంబంధిత కోడ్ ఆధారంగా విద్యార్థి సమగ్ర వివరాలన్నీ వస్తాయి. అపార్ నమోదు సమయంలో ఆధార్‌ను వినియోగించడం, అందులో వివరాలు తప్పుగా ఉండడంతో సమస్యలు తలెత్తుతు న్నాయి. పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు, అడ్మిషన్ రిజిస్టర్, యూడైస్‌లతో వేర్వేరుగా ఉండడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నెల 10 లోగా సమగ్ర వివరాలు సమర్పించాలంటూ విద్యాసంస్థలు నోటీసులు, మొబైల్ నంబర్లకు సందేశాలు పంపిస్తుండటంతో తల్లిదండ్రులు బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌లలో తప్పులను సరి చేసుకునేందుకు ఆధార్ సెంటర్లకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

అపార్ కార్డు కీలకం..

- సాధారణంగా విద్యార్థుల వివరాలు, పాఠశాల రికార్డులో ఒకలా, ఆధార్ కార్డులో మరోలా ఉంటాయి. కేంద్రం జారీ చేస్తున్న అపార్ కార్డులో విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు అందులో నమోదై ఉంటాయి. ఒకసారి అపార్ కార్డు ఇస్తే విద్యార్థి చదువు పూర్తై, ఉద్యోగం సాధించే వరకు ఇదే నంబర్ కార్డు ఉంటుంది. శాశ్వత డిజిటల్ గుర్తింపు సంఖ్యతో దేశంలో ఎక్కడ చదవాలన్నా ఉపాధి అవకాశాలకు సంబంధించి ఈ కార్డు కీలకం కానుంది.
- ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ.. దీనినే వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ కార్డు అని కూడా పిలుస్తారు. పేరు, పుట్టిన తేదీ జెండర్, ఫొటో, క్యూఆర్ కోడ్, ఆధార్, 12 అంకెల గుర్తింపు నంబరు, విద్యార్థి మార్కులు, ఉపకార వేతనం, వ్యక్తిగత, విద్యా సంబంధిత వివరాలన్నీ అపార్ డిజిటల్ కార్డులో భద్రంగా ఉంటాయి. స్కాన్ చేస్తే మొత్తం వివరాలన్నీ తెలుసుకునేలా అపార్‌ను రూపొందించారు.

పర్మనెంట్ ఐడీ..

అపార్ ఐడీ కార్డు జీవిత కాల ఐడీ నంబర్. ఈ కార్డు విద్యార్థుల విద్యా ప్రమాణాలు, విజయాలను నమోదు చేయడంతో పాటు ట్రాక్ చేస్తుంది. అలాగే.. ఒక స్కూల్ నుంచి మరో స్కూల్‌కు బదిలీ కావడాన్ని సులభతరం చేస్తుంది. ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు ప్రతి విద్యార్థికీ స్కూల్స్, కాలేజీలు అపార్ కార్డును జారీ చేస్తున్నాయి.

జనావాసాల్లో పతంగులు ఎగరేయొద్దు

డీజేల వినియోగం పైనా నిషేధం

- నిర్దేశిత వేళల్లోనే స్పీకర్లు వాడాలి
- ఉత్తర్వులు జారీ చేసిన కొత్వాల్



సాక్షి, సిటీబ్యూరో: సంక్రాంతి నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ కీలక నిర్ణయం తీసుకున్నారు. జనసమ్మర్ధ ప్రాంతాల్లో పతంగులు ఎగరవేయడాన్ని నిషేధిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 13వ తేదీ ఉదయం 6 నుంచి 15వ తేదీ ఉదయం 6 వరకు ఇవి అమలులో ఉంటాయి. దీంతో పాటు పిల్లలు పతంగులు ఎగరవేసే సమయంలో తల్లిదండ్రులూ కొన్ని అంశాలపై దృష్టి పెట్టాలని ఆనంద్ సూచించారు. విద్యుత్ తీగలకు సమీపంలో, పిట్టగోడలు లేని డాబాలపైనా ఎగరవేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తెగిన పతంగుల కోసం రోడ్లపై, ప్రమాదకర ప్రాంతాల్లోనూ పిల్లలు పరుగులు పెట్టకుండా శ్రద్ధ వహించాలని ఆయన కోరా రు. భోగి మంటల నేపథ్యంలో యజమానుల అను మతి లేకుండా చెక్క, ఇతర వస్తువులు తీసుకోవద్దని స్పష్టం చేశారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో పోలీసుల అనుమతి లేకుండా లౌడ్‌స్పీకర్లు, డీజేల వినియోగాన్ని నిషేధించారు. అనుమతి ఉన్నప్ప టికీ లౌడ్‌స్పీకర్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం తదితరాలను రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు వినియోగించడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు.

అత్తే హతమార్చింది

కోడల్ని చంపి.. అనుమానం రాకుండా నటించి..

- మట్టికుప్పల కింద కూరుకుపోయిన మృతదేహం
- శంషాబాద్ మండలం సాతంరాయిలో ఘటన
- రెండు నెలల తర్వాత వెలుగు చూసిన దారుణం



మట్టి దిబ్బల కింద నుంచి దోలి మృతదేహాన్ని వెలికి తీస్తున్న జేసీబీ, (ఇన్‌సెట్‌లో) హతురాలు దోలి (ఫైల్)

శంషాబాద్ రూరల్: అత్త చేతిలో కోడలు దారుణ హత్యకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, హతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం రామంజాపూర్ తండాకు చెందిన ముడావత్ సూర్య అలియాస్ సురేష్‌కు, అదే తండాకు చెందిన దోలి (40)తో ఇరవై ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. సురేష్ డీసీఎం వాహన డ్రైవర్‌గా పని చేస్తుండగా.. దోలి కూలీ పని చేస్తుండేది. సురేష్ తల్లిదండ్రులు తులసి, అనంతి కొన్నేళ్ల నుంచి సాతంరాయి వద్ద ఉన్న వ్యవసాయ క్షేత్రంలో పని చేస్తూ అక్కడే నివాసముంటున్నారు. సురేష్ చిన్నకొడుకు మనోహర్ వీరి వద్దనే ఉండేవాడు. సురేష్ దంపతులు, పెద్ద కొడుకుతో కలిసి రామంజాపూర్ తండాలో నివసిస్తున్నారు. సురేష్ తరచూ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో గత నవంబర్ 10న దోలి అదృశ్యమైంది. అదే నెల 14న శంషాబాద్ పోలీసులకు భర్త ఫిర్యాదు చేశాడు.

అత్త వద్దకు వెళ్లి..

భర్తతో గొడవ పడిన దోలి సాతంరాయిలో ఉన్న అత్తామామల వద్దకు వెళ్లింది. అదే రోజు రాత్రి వ్యవసాయ క్షేత్రానికి ఎదురుగా ఉన్న నిర్మానుష్య ప్రదేశానికి బెంగళూరు జాతీయ రహదారి దాటి ఇద్దరు వెళ్లారు. అక్కడ ఇద్దరు కలిసి కల్లు తాగారు. మత్తులో ఉన్న దోలిని హత్య చేసిన తులసి అక్కడి నుంచి ఏమీ తెలియనట్లు ఇంటికి వెళ్లింది. తర్వాత కోడలి కోసం కుటుంబ సభ్యులతో కలిసి వెతికినట్లు నటించి తనపై అనుమానం రాకుండా చూసుకుంది. నిర్మానుష్య ప్రదేశంలోని దోలి మృతదేహం ఉన్న ప్రాంతంలో కొంత కాలంగా వెంచర్ నిర్వాహకులు భారీగా మట్టిని పోగు చేస్తున్నారు. లారీల్లో వేరే చోట నుంచి తెచ్చిన మట్టిని పోస్తున్నారు. ఈ మట్టి కుప్పల కింద మృతదేహం కూరుకుపోవడంతో ఎవరికీ కనిపించలేదు.

మృతురాలి కుమారుడికి సందేహం రావడంతో..

రెండు రోజుల క్రితం మృతురాలి పెద్ద కుమారుడు తండా నుంచి సాతంరాయిలోని నానమ్మ తులసి వద్దకు వచ్చాడు. కోడలిని హత్య చేసిన భయంతో ఉన్న తులసి.. మనవడితో మాట్లాడిన తీరు అనుమానాలను రేకెత్తించింది. దీంతో అతను తండాకు వచ్చి తన మేనమామ హరికి విషయం చెప్పాడు. కుటుంబ సభ్యులు సాతంరాయిలో తులసి వద్దకు వెళ్లి మృతురాలి చిన్న కొడుకు మనోహర్‌తో మాట్లాడారు. తన తల్లి ఇక్కడికి వచ్చిన విషయం ఎవరికి చెప్పవద్దని.. లేదంటే చంపేస్తానని నాన్నమ్మ బెదిరించినట్లు చెప్పడంతో.. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. తులసిని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో హత్య విషయం వెలుగు చూసింది. దీంతో గురువారం పోలీసులు రాజేంద్రనగర్ ఎమ్మార్వో రాములు పర్యవేక్షణలో ఘటనా స్థలంలో మట్టి దిబ్బల కింద మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. దోలి హత్యకు తులసి భర్త అనంతితో పాటు ఇతని సోదరుడు హనుమ సహకరించినట్లు తెలిసింది. హత్యకు గల కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కాళ్లూ.. చేతులు కట్టేసి.. ఫ్యాన్‌కు ఉరేశారు

యువకుడి దారుణ హత్య

- జీడిమెట్ల ఠాణా పరిధిలో ఘటన



శివకుమార్‌రెడ్డి (ఫైల్)

జీడిమెట్ల: కాళ్లు, చేతులు కట్టేసి.. నోట్లో దుస్తులు కుక్కి ఓ యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ చెప్పిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా తొండూరు మండలం గోటూరు గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి కుమారుడు లింగాల శివకుమార్‌రెడ్డి (26) నాలుగు నెలల క్రితం నగరానికి వచ్చి కుత్బుల్లాపూర్‌లోని అయోధ్యనగర్‌లో అదే గ్రామానికే చెందిన ప్రసాద్‌రెడ్డితో కలిసి ఉంటూ ర్యాపిడో నడుపుతున్నాడు. బుధవారం రాత్రి ప్రసాద్‌రెడ్డి విధులకు వెళ్లగా గదిలో శివకుమార్‌రెడ్డి ఒక్కడే ఉన్నాడు. గురువారం ఉదయం విధుల ముగించుకుని గదికి వచ్చిన ప్రసాద్‌రెడ్డి తలుపు తట్టి ఎంత పిలిచినా శివకుమార్ పలకలేదు. దీంతో అనుమానం వచ్చి ఇంటి యజమాని తిరుపతి కార్పెంటర్ సహాయంతో తలుపులు తెరవగా శివకుమార్‌రెడ్డి నైలాన్ తాడుతో ఫ్యాన్‌కు ఉరితో మృతి చెంది ఉన్నాడు. వెంటనే మృతుడి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. శివకుమార్‌రెడ్డి చిన్నాన్న విశ్వకళాధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

గది లోపలి నుంచి తాడుతో కిటికీకి కట్టి..

శివకుమార్‌రెడ్డిని గుర్తు తెలియని వ్యక్తులు అత్యంత దారుణంగా చంపి ఉరి వేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు తెలివిగా తలుపు గడియకు తాడు కట్టి గది లోపలి నుంచి గడియ పడేలా తాడును కిటికీలోంచి లాగారు. గడియకు కట్టి ఉన్న తాడు అలాగే ఉండిపోయింది. గదిలో ఉన్న దుప్పట్లు, వస్తువులను బట్టి చూస్తే ఎలాంటి పెనుగులాట జరిగిన ఆనవాళ్లు లేవని పోలీసులు గుర్తించారు. శివకుమార్ రెడ్డి మెడకు నైలాన్ తాడుతో ఉరి వేసి చంపినట్లు భావిస్తున్నారు. ఈ హత్యకు కుటుంబ తగాదాలా? లేక ఇతరేతర కారణాలు ఉన్నాయా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మీ- టికెట్ మొబైల్ అప్లికేషన్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వివిధ సేవలకు టికెట్ బుకింగ్ సులభతరం చేసేందుకు ఐటీఈ అండ్‌సీ రూపొందించిన 'మీ– టికెట్' మొబైల్ అప్లికేషన్‌ను గురువారం మంత్రి శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. మెట్రో రైలు, టీజీ ఆర్టీసీ, దాదాపు 130 పబ్లిక్ పార్కులు, ఫారెస్ట్ అర్బన్ పార్కులు, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, మున్సిపల్ పార్కులు, జూ పార్కు, బొటానికల్ గార్డెన్ల ఎంట్రీ, 15 ప్రధాన దేవాలయాలకు ఆలయ దర్శన, సేవా టికెట్లను బుక్ చేసుకోవచ్చు. బోటింగ్ టికెట్లు వంటి దాదాపు 54 పర్యాటక ప్రదేశాలు, జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాళ్లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లకు అన్ని బుకింగ్‌లను కోసం యాప్ ఉపయోగించి బుక్ చేసుకోవచ్చు. ప్రతీ స్థానానికి ఒక ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ ఉంటుంది. దీనిని మీ టికెట్ యాప్ ఉపయోగించి బుకింగ్ టికెట్ల కోసం స్కాన్ చేయాలి. టికెట్ల సంఖ్య, టికెట్ల రకం వివరాలు తెలుసుకొని జీపే, ఫోన్ పే తదితర యూపీఏ అప్లికేషన్లను ఉపయోగించి చెల్లింపులు చేయొచ్చు. కార్యక్రమంలో తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ మల్సూర్, కమిషనర్ రవి కిరణ్ పాల్గొన్నారు.

జూన్‌లో 'ఒవైసీ' ఫ్లై ఓవర్

పనులు పూర్తి

స్పష్టం చేసిన జీహెచ్ఎంసీ ప్రాజెక్టుల విభాగం

సాక్షి ఎఫెక్ట్..



సాక్షి, సిటీబ్యూరో: ఎస్సార్‌డీపీ (వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం)లో భాగంగా నల్లగొండ క్రాస్‌రోడ్స్– ఒవైసీ జంక్షన్ వరకు నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనుల్ని జూన్ నెలాఖరులోగా పూర్తి చేస్తామని జీహెచ్ఎంసీ పేర్కొంది. 'జాప్యం ఖరీదు రూ.100 కోట్లు' శీర్షికన గురువారం 'సాక్షి'లో వెలువడిన కథనానికి జీహెచ్ఎంసీ స్పందించింది. జూన్ 30 నాటికి పనులు పూర్తి చేస్తామని వివరణనిచ్చింది. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యల గురించి తెలిపింది. ఫ్లై ఓవర్ పొడవు 3.38 కిలోమీటర్లు కాగా, క్షేత్ర స్థాయిలో పనులకు ఆటంకాలు లేని ప్రాంతాల్లో ఇప్పటి వరకు 50 శాతం పనులు పూర్తయినట్లు సంబంధిత ప్రాజెక్ట్ విభాగం పేర్కొంది. మొత్తం 88 ఫౌండేషన్లకుగాను 86 ఫౌండేషన్ల పనులు పూర్తయ్యాయని, ప్రార్థనాస్థలానికి చెందిన భూసేకరణ పూర్తికాకపోవడంతో మిగతా రెండు ఫౌండేషన్ల పనులు జరగలేదని తెలిపింది. 88 పియర్స్‌కుగాను 88 పియర్స్ పనులు పూర్తయ్యాయని, అలాగే 43 పియర్‌క్యాప్స్ పనులు జరిగినట్లు తెలిపింది. మిగతా వాటి ఫ్యాబ్రికేషన్ పనులు జరుగుతున్నాయని తెలపడంతోపాటు సైదాబాద్ జంక్షన్– యాదగిరి థియేటర్ మధ్య 23 ఆస్తులకు సంబంధించిన భూసేకరణ జరగనందున పనుల్లో ఆలస్యమవుతోందని వెల్లడించింది. భూసేకరణ పూర్తి కాకపోవడంతోనే స్పాన్స్ అమరిక పనులు కూడా పూర్తి కాలేదని తెలిపింది. ఈ పనులకు 149 ఆస్తుల సేకరణ జరగాల్సి ఉండగా, 126 ఆస్తుల సేకరణ జరిగిందని, మిగతా 23 ఆస్తుల సేకరణ ప్రక్రియ జరుగుతోందని వివరించింది. వాటిల్లో ఐదు మతపరమైన ఆస్తులున్నట్లు పేర్కొంది. వాటి సేకరణ కోసం టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలు సమన్వయంతో సంబంధీకులతో సంప్రదింపులు జరుపుతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు.. అయిదు ఆస్తులకు సంబంధించి కోర్టు కేసులున్నట్లు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యల్ని ఏకరువు పెట్టింది. ట్రాఫిక్ రద్దీ వల్ల డెక్‌స్లాబ్ పనులు పగలు చేయడం సాధ్యం కాదని, రాత్రుళ్లు మాత్రమే చేస్తున్నందున పనులు నెమ్మదిగా జరుగుతున్నట్లు తెలిపింది. ఏదేమైనప్పటికీ, అన్ని అవరోధాల్ని, ఎదురవుతున్న సమస్యల్ని పరిష్కరించుకుంటూ జూన్ నెలాఖరు వరకు పూర్తి చేయగలమని వివరణనిచ్చింది.

చలితో గజగజ!

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో చలిపులి వణికిస్తోంది. రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. తెల్లవారుజామున పొగమంచు రోడ్లను కమ్మేస్తోంది. పగటిపూట చల్లని గాలులతో గరిష్ట ఉష్ణోగ్రత 29 డిగ్రీలకు దాటడం లేదు. సగటున కనిష్ట ఉష్ణోగ్రతలు 13.6 డిగ్రీలుగా నమోదైంది. శివార్లలో మాత్రం అత్యల్పంగా రికార్డు స్థాయిలో 9.6 డిగ్రీలు నమోదైంది. సగటు కంటే 4 నుంచి 5 డిగ్రీల వరకు మైనస్‌లో పడిపోయింది. వారం రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.

కనిష్ట ఉష్ణోగ్రతలు ఇలా

ప్రాంతం	డిగ్రీలు
పటాన్‌చెరు	9.6
హెచ్‌సీయూ	9.7
మౌలాలి	10.1
రాజేంద్రనగర్	10.2
రాంచంద్రాపురం	10.4
గచ్చిబౌలి	11.2
దుండిగల్	12.4
హకీంపేట	13.3



నూతనోత్సాహంతో పని చేయండి

- ఎస్టీఎఫ్ పనితీరు బాగుంది...
- గంజాయి,డ్రగ్స్,ఇతర మత్తుపదార్థాలపై నిఘా పెట్టండి
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: కొత్త సంవత్సరంలో మరింత ఉత్సాహంతో పని చేయాలని ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి అన్నారు. ఎస్టీఎఫ్ పని తీరు బాగుందని, గతేడాది ఆశించినదానికంటే రెట్టింపు ఫలితాలు లభించాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం అబ్కారీ భవన్‌లోని సమావేశ మందిరంలో ఎస్టీఎఫ్ పనితీరుపై సమీక్షించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గంజాయి, ,డ్రగ్స్‌తో పాటు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, ఇతర మత్తు పదార్థాలపై నిఘా పెంచాలని సూచించారు. పదే పదే నేరాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు.వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే రైళ్లలో నిరంతరం తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. పబ్బుల్లో డ్రగ్స్ వినియోగంపైన దృష్టి సారించి దాడులు నిర్వహించాలన్నారు. మత్తుపదార్థాల వ్యాప్తిని అరికట్టేందుకు అంతర్రాష్ట్ర ఆపరేషన్‌లను చేపట్టాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో ఏ,బీ,సీ,డీ టీమ్‌లు ఉన్నాయి. నాలుగు టీమ్‌లకు సివిల్ పోలీస్ విభాగం నుంచి ఇద్దరు డీఎస్పీలు ఒక అడిషనల్ ఎస్పీ, మరో టీమ్‌లో ఇద్దరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ స్థాయి అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ నాలుగు టీమ్‌లలో 78 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాలకనుగుణంగా విధులు నిర్వహించాలని జాయింట్ కమిషనర్ ఖురేషీ అన్నారు. పాత కేసుల్లో కరుడుగట్టిన నిందితుల సమాచారాన్ని నాలుగు టీమ్‌లకు అందజేయాలని అసిస్టెంట్ కమిషనర్ ప్రణవిని డైరెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఎక్సైజ్ అధికారులు నంద్యాల అంజిరెడ్డి, ప్రదీప్‌రావు,తుల శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బోర్డు సభ్యుడిగా రామకృష్ణ కొనసాగింపు

ఉత్తర్వులు జారీ చేసిన రక్షణ శాఖ

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు (సీఎస్ఎమ్) రామకృష్ణ పదవీ కాలాన్ని కేంద్రం మరో ఏడాదిపాటు పొడిగించింది. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చేనెల 10వ తేదీతో ప్రస్తుత వెరీడ్ బోర్డు ముగియనుండగా, బోర్డు పదవీ కాలాన్ని మరో ఏడాది పాటు పొడిగిస్తూ గత నెల 31న కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ముగ్గురు సభ్యుల వేరీడ్ బోర్డులో కంటోన్మెంట్ బోర్డ్ అధ్యక్షుడు, సీఈఓ ఇద్దరు అధికారులతో పాటు కేంద్రం నియమించిన సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు మూడో మెంబర్ గా కొనసాగుతారు. 2022 నవంబర్ నెలాఖరున రామకృష్ణ తొలిసారిగా సివిలియన్ నామినేటెడ్ సభ్యుడిగా నియమితులయ్యారు. నాటి నుంచి కేంద్రం వెరీడ్ పదవీ కాలాన్ని పొడిగించిన ప్రతిసారి రామకృష్ణ నే సభ్యుడిగా కొనసాగిస్తూ వస్తోంది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పెద్దలు ముఖ్యంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తనపై నమ్మకంతో పదవీ కాలాన్ని పొడిగించడం పట్ల ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

TRAINING

Hairdressing Academy Basic to Advanced Course only 5000/ Srinagar Colony, Sri Krishna Nagar, Hyd 7013622053/ 7997777542 [SCA25001125]

Real Estate

BUILDING & CONSTRUCTION

కేవలం 1650/-లకే Per Sft. నాణ్యమైన మెటీరియల్‌తో, 100% వాస్తు, క్వాలిటీ ఇంజినీర్లచే మీకు నచ్చిన రీతిలో ఇండ్లు, బిల్డింగ్‌లు కట్టి ఇవ్వబడును. 63033 22780 [HA-99493]

LAND FOR SALE

మన తెలంగాణలో కొల్లాపూర్ తిరుపతి హైవే & బెంగుళూర్ హైవేలో ఫాంలాండ్ శ్రీగంధం మొక్కలతో, 1/2 అర ఎకరము భూమి కేవలం 15 లక్షలు మాత్రమే. 9177619716 [SCA25001060]

PLOT FOR SALE

కేవలం గజం Rs.6,999/- మాత్రమే, DTCP లేఔట్ @ షాద్‌నగర్, రంగారెడ్డి గూడ, బెంగళూర్ హైవే & గజం Rs. 23,000/- HMDA లేఔట్ @ రుద్రారం, ముంబై హైవే సంప్ర: 7981301969 [H-783651]

Sangareddy Sadhashivpet Shadnagar / Kadthal HMDA, DTCP Layout Plots for Sale : 9989333244 [SCA25001122]

Open Plot for Sale at Nagole 1km from Lucky Restaurant 200 sq yards 30x60 South Face. Call : 8686299996 [SCA25001044]

All 121+242+363+605 Per Sq.y 3,655 Outrate Total amount. Yadagiri gutta to Mothkur Road Sarvepalli side Farmland.EMI 4,400Avbl. 9666458910 [HA-1028]

Services

ASTROLOGY

VAASTU

ఇల్లు, స్థలాలు, కమర్షియల్ కాంప్లెక్సులు, మీ ఇంటి డ్రాయింగుల వాస్తు సలహాలు కోసం సంప్రదించండి. డా॥ కంచాల హనుమంతరావు, వాస్తు సిద్ధాంతి. ఫోన్ : 92466 24248 [V- SCA25001130]

BUSINESS SERVICE

మీ బంగారం బ్యాంక్‌లో, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 [SCA25001126]

మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్.9100329739 [H-800523]

FOR LONG LEASE
@ Banjara Hills Road No. 11
Two cellars, Ground and upper four floors. Each floor – 6200 sft.. Build to suit super structure for hospital building is available for long lease. Cellars excavation completed. Construction is ready to start. Possession within 15 months.
Interested parties may contact on
9160222230
9030013359

INVESTMENT

(అత్తాపూర్) 2 లక్షలు పెట్టుబడి పెట్టగలిగే సూపర్ స్టాకిస్ట్ కావలెను. క్రింద నంబర్‌కి వాట్సాప్‌లో మెసేజ్ చేయండి: 9652438769 [SCA25001127]

PERSONAL CARE

CHANGE OF NAME

I, Rudrasi Grace Sulakshana Sugandhi, D/o Madda Ranjan Kumar, W/o Rudrasi Suresh. R/o 8-13/2/1, Fno G-3, Sai Residency, Road No 3, Priya bar & rest. Hemanagar, Boduppal, Uppal, K.V Ranga Reddy. Telangana. Henceforth I change my name to Madda Grace Sulakshana Sugandhi for all purposes. [HA-07671]

I, NIDDENA HARIBABU S/o N VASANTH RAO H.No:30-142/11 Creative Nagar, Old Safilguda, Nr. AS Rao Nagar, Malkajgiri (M) Medchal - Malkajgiri. Dist, Telangana. changed my daughter name from NIDDENA HONEY to NIDDENA HARSHITHA For all Record purpose [SCA25–1131]

LOST

I, T. Srichand S/o. Late Tahilram Jessaram, R/o. Plot No.46, Text Book Colony, Behind Name Estate, Karkhana, Secunderabad, Telangana have lost my original sale deed document No.284/1960, Registered at S.R.O. Secunderabad, while travelling in Auto from Karkhana to PG Road. If anyone finds please return the same to the above address or call 7893099114, 9949099114 [HA-99514]

Wanted

సైట్ ఎగ్జిక్యూటివ్స్, DCM & CAR డ్రైవర్స్, సూపర్‌వైజర్స్, హౌస్ కీపింగ్ & టెంట్ హౌస్ బాయ్స్ కావలెను. లక్డీకపూల్ 1239 పిల్లర్ దగ్గర. ఫోన్ : 9100222333, 9290448422 [SCA25001132]

తుర్కయాంజల్ (బ్రాహ్మణపల్లి రోడ్) లో గల ఫార్మా కంపెనీలో 1-2 సం॥ అనుభవం గల అకౌంటెంట్లు BA/B.Com/MBA చేసిన వారు కావలెను. 7032640251 [HA-1707]

తుర్కయాంజల్ (బ్రాహ్మణపల్లి రోడ్) లో ఫార్మా కంపెనీ కొరకు అనుభవము గల డ్రైవర్లు కావలెను. ఫోన్ : 7032640251 [HA-1709]

MASQATI DAIRY MILK
Masqati Dairy Products Limited
REQUIRED
- Veterinary Doctor
- M.Sc. Microbiology - (Male)
- Engineer (Mechanical/Electrical/Civil)
- MBA - Marketing only
- B.Com Computers with Tally
- Diploma / ITI Fitter / Mechanical / Electrical
Interested Candidates Walk-in Interview on only on Sundays 12th & 19th January 2025 between 10 am to 5 pm
at Survey No. 227, Sagar Road, Turkayamjal, Rangareddy District.

ఆడ, మగ వర్కర్లు కావలెను. జీడిమెట్లలోని ప్రముఖ విప్లవి లాండ్రి సర్వీస్‌లో పనిచేయుటకు కావలెను. ✆ 98661 40253, 91000 07188 [B-6050]

రావూస్ సెక్యూరిటీ & హౌస్ కీపింగ్ ECIL, RTC X రోడ్స్‌లో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీ : 18K, 8hrs. 8686512852/9666249852 [SCA25001116]

జల్సా హోమ్స్ గరికపాటి టవర్స్, శంషాబాద్‌లో పనిచేయుటకు ఫ్రెషర్స్ /అనుభవం గల అకౌంటెంట్ & సివిల్ ఇంజనీర్ కావలెను. సంప్ర : 9966683700 [HA-2238]

గుజరాత్‌లోని మార్వాడి యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ నందు పని చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Q: డిగ్రీ. 9440096691, 9705216479 [SCA25001045]

వర్క్‌ఫ్రమ్‌హోమ్ ఆపర్చునిటీ, ఇంట్లో పని చూసుకుంటూ తీరిక సమయంలో Online లో వర్క్ చేసుకోవచ్చు.2 or 3గం॥ 20K-30K. వః 20-50సం॥ ✆8500348714,9515730117 [G-795849]

Wanted Lady Graduate Who Studied in English Medium To Teach Telugu To 5th Class Students at home. at Ramanthapur Ph: 9848884252. [HA-1057]

Wanted Commercial Vehicle Driver for Ashok leyland in Shamirpet Turkapally Contact number 9866176688 [HA-6209]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్
సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

అరెస్టు కాదు.. అంతం చేస్తాం..!

- పంథా మార్చిన 'డిజిటల్' సైబర్ నేరగాళ్లు
- నగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగిని టార్గెట్ చేసి రూ.20 లక్షలు వసూలు



సాక్షి, సిటీబ్యూరో: పాస్‌పోర్ట్స్, డ్రగ్స్, మనీలాండరింగ్ పేరుతో ఫోన్లు చేసి బెదిరించి డబ్బు దండుకునే సైబర్ నేరగాళ్లు తమ పంథా మార్చారు. బాధితులతో పాటు వారి సంతానాన్నీ డిజిటల్ అరెస్టుకు బదులుగా కిడ్నాప్ చేసి చంపేస్తామంటూ బెదిరిస్తున్నారు. ఈ-కేటుగాళ్ల బారినపడి రూ.20 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఆశ్రయించాడు. ఆయన ఫిర్యాదుతో ఈ కొత్త పంథా వెలుగులోకి వచ్చింది.

ఒకే పార్శిల్‌లో రకరకాల వస్తువులంటూ...

నగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగికి (61) ఇటీవల ఓ ఫోన్‌కాల్ వచ్చింది. ఎదుటి వ్యక్తులు తాము ఇంటర్నేషనల్ డీహెచ్ఎల్ ఎక్స్‌ప్రెస్ కొరియర్ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నట్లు చెప్పారు. మీ పార్శిల్ రిజెక్ట్ అయిందని, పూర్తి వివరాలు కావాలంటే '1' నొక్కాలని సూచించారు. బాధితుడు అలా చేయడంతో లైన్‌లోకి వచ్చిన మరో వ్యక్తి మీ ఆధార్ కార్డు ఆధారంగా బ్యాంకాక్‌కు ఓ పార్శిల్ బుక్ అయిందని చెప్పాడు. అందులో ఐదు పాస్‌పోర్టులు, మూడు ఏటీఎం కార్డులు, బ్యాంకు పత్రాలు, నాలుగు కేజీల వస్త్రాలతో పాటు 140 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ కూడా ఉన్నట్లు గుర్తించామని భయపెట్టాడు. ఆ పార్శిల్‌కు తనకు ఎలాంటి సంబంధం లేదంటూ బాధితుడు చెప్పడంతో... అలాగైతే తాము ఫోన్‌ను ఢిల్లీ సైబర్ సెల్ అధికారులకు బదిలీ చేస్తామని వారితో మాట్లాడాలని సూచించారు.

కిడ్నాప్ చేస్తాం... చంపేస్తామంటూ...

సైబర్ సెల్ అధికారుల మాదిరిగా మాట్లాడిన సైబర్ నేరగాళ్లు మీ ఆధార్ దుర్వినియోగంపై ఫిర్యాదు చేయాలని ఓ పక్క ఉచిత సలహా ఇస్తూనే... అదే ఆధార్ వినియోగించి నాలుగు బ్యాంకు ఖాతాలు తెరిచారని, వాటి ద్వారా భారీ మనీలాండరింగ్ జరిగినట్లు వెలుగులోకి వచ్చిందని మరో కథ మొదలెట్టారు. ఆపై వాట్సాప్ వీడియో కాల్ ద్వారా బాధితుడితో మాట్లాడిన సైబర్ నేరగాడు ఢిల్లీ పోలీసుగా నమ్మబలికాడు. మీపై నిఘా ఉందంటూ చెప్పి ప్రతి గంటకూ తమను సంప్రదించాలని స్పష్టం చేశాడు. ఇప్పటి వరకు జరిగిన స్కాముల్లో నేరగాళ్లు బాధితులను డిజిటల్ అరెస్టు చేసి ఈ విషయం ఎవరికీ చెప్పకుండా రహస్యంగా ఉంచాలని బెదిరించే వాళ్లు. ఈసారి మాత్రం రహస్యంగా ఉంచకపోతే మీతో పాటు కుటుంబీకులను కిడ్నాప్ చేయడం లేదా హత్య చేయడం జరుగుతుందని తీవ్రంగా భయపెట్టారు.

సీబీఐ, ఆర్బీఐ పేర్లతో నకిలీ లేఖలు..

అనంతరం సైబర్ నేరగాళ్లు బాధితుడికి సీబీఐ, ఆర్బీఐ పేర్లతో ఉన్న రెండు నకిలీ లేఖలను వాట్సాప్ ద్వారా పంపారు. వాటిలో బాధితుడికి మనీలాండరింగ్‌తో పాటు ఫోర్జరీ కేసులతో సంబంధం ఉన్నట్లు ఉంది. వీటి నుంచి విముక్తి పొందాలంటే తాము చెప్పినట్లు చేయాలని భయపట్టారు. బాధితుడు అంగీకరించడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఖాతా వివరాలు పంపి అందులో కొంత నగదు బదిలీ చేయించుకున్నారు. మళ్లీ ఫోన్ చేసిన కేటుగాళ్లు మరికొంత మొత్తం డిమాండ్ చేయడంతో బాధితుడు తాను తన విధి నిర్వహణలో బిజీగా ఉన్నట్లు చెప్పాడు. దీంతో విచక్షణ కోల్పోయిన నేరగాళ్లు తీవ్రస్థాయిలో బెదిరింపులు, వేధింపులకు పాల్పడ్డారు. బాధితుడి కుమారుడికీ ముప్పు వాటిల్లుతుందని భయపెట్టి డబ్బులు డిమాండ్ చేశారు. ఈసారి ఫెడరల్ బ్యాంక్‌ఖాతా వివరాలు ఇవ్వడంతో బాధితుడు తన ఫిక్స్‌డ్ డిపాజిట్లు సైతం బ్రేక్ చేసి నగదు చెల్లించాడు. ఇలా మొత్తం రూ.20 లక్షలు చెల్లించిన తర్వాత కూడా నేరగాళ్ల డిమాండ్లు ఆగలేదు. బయటికి వెళ్లిన అతడి కుమారుడు తిరిగి వచ్చి, ఈ విషయం తెలుసుకుని సైబర్ మోసంగా చెప్పాడు. దీంతో బాధితుడు సైబర్ ఠాణాను ఆశ్రయించడంతో కేసు నమోదైంది.

తాగునీటి డిమాండ్‌ను సమర్థంగా ఎదుర్కోవాలి



సమీక్ష నిర్వహిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగు నీటి డిమాండ్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జలమండలి ప్రధాన కార్యాలయంలో వేసవిలో నీటి డిమాండ్‌ను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత వేసవిలో అధికంగా ట్యాంకర్లు బుక్ చేసుకున్న ప్రాంతాల అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ట్యాంకర్ బుకింగ్, నీటి సరఫరా, డెలివరీ తదితర వివరాలను పరిశీలించారు. ఈ సారి నీటి డిమాండ్ ను మరింత సమర్థంగా ఎదుర్కోవాలని సూచించారు. అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే ట్యాంకర్లు, ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్లు, నీటి మోతాదు పెంచుతామన్నారు. గతంలో అధికంగా ట్యాంకర్లు బుక్ చేసిన వినియోగదారులను సర్వే చేసి గుర్తించామని, వీరి ప్రాంగణాల్లో బోర్లు, భూగర్భ జలాలు ఎండిపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఇలాంటి వినియోగదారుల ఇళ్లల్లో సర్వే చేపట్టామని తెలిపిన వారు.. ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ట్యాంకర్ల యజమానులతో సమావేశమయ్యారు. వేసవిలో ట్యాంకర్ల పరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్. ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్. ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, సీజీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హీరో నాగార్జున పరువునష్టం కేసు వాయిదా

- పిటిషనర్ నాగార్జున, ప్రతివాది మంత్రి కొండా సురేఖ గైర్హాజరు
- 16కు విచారణ వాయిదా

సిటీ కోర్టులు : రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసుపై గురువారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌లో విచారణ జరిగింది. విచారణకు పిటిషనర్ నాగార్జున, ప్రతివాది మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడంతో విచారణను ఈనెల 16కు వేస్తున్నట్లు జడ్జి శ్రీదేవి తెలిపారు. సినీ అగ్రహీరో నాగార్జున కుమారుడైన హీరో నాగచైతన్య-సమంత విడాకుల విషయంపై మంత్రి కొండా సురేఖ అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారని, ఆమె వ్యాఖ్యలతో తన కుటుంబ పరువు పోయిందని నాగార్జున నాంపల్లిలో కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై ఇదివరకే విచారణ చేపట్టిన కోర్టు పిటిషనర్‌తోపాటు సాక్షుల వాగ్మూలం రికార్డు చేసిన న్యాయస్థానం ప్రతివాది అయిన మంత్రి కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. అప్పటినుంచి ఆమె ప్రభుత్వ కార్యకలాపాల కారణంగానే కోర్టుకు హాజరుకాలేదని ఆమె తరుపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో విచారణను వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు.

చీటింగ్ కేసులో ఓక్స్‌వాగన్ మాజీ మేనేజర్ అరెస్టు

లంగర్‌హౌస్: ఓక్స్‌వాగన్ షో రూంలో రూ.80 లక్షలు కాజేసిన మాజీ మేనేజర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లాకు చెందిన మహేష్ లాలాపేటలో ఉంటూ ఓక్స్‌వాగన్ కార్ల షోరూంలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. లంగర్‌హౌస్, ఎల్బీనగర్ బ్రాంచ్‌లకు ఒకేసారి మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. కార్ల అమ్మకాలతో పాటు వివిధ పనుల్లో చేతివాటం ప్రదర్శించి దాదాపు రూ.80 లక్షలు కాజేశాడు. ఇటీవల సంస్థ సీఈఓగా నియమితులైన క్రిష్ణప్రసాద్ రెండు షోరూంల రికార్డులను పరిశీలించగా భారీ మొత్తంలో అవకతవకలు జరిగినట్లు అనుమానం రావడంతో పోలీసులను ఆశ్రయించాడు. అయితే సివిల్ వివాదం కావడంతో పోలీసులు కోర్టును సంప్రదించారు. కోర్టు అనుమతితో గురువారం నిందితుడు మహేష్‌ను అరెస్టు చేశారు.

పోలీస్ అకాడమీలో చైల్డ్ కేర్ సెంటర్ ప్రారంభం



చిన్నారులతో మాట్లాడుతున్న అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్

బండ్లగూడ: తెలంగాణ పోలీస్ అకాడమీలో చైల్డ్ కేర్ సెంటర్‌ను గురువారం అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్ ప్రారంభించారు. అకాడమీలో పని చేస్తున్న మహిళలు, అకాడమీ సిబ్బంది పిల్లలకు ఉపయోగపడే విధంగా, అమినిటీస్ బ్లాక్‌లో ఈ సదుపాయాన్ని కల్పించారు. రెండు నుంచి ఐదేళ్ల వయస్సు గల పిల్లలు ఆడుకునేందుకు అనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టారు. అనంతరం అడ్మినిస్ట్రేటివ్ కేబిన్స్, ఏఎస్ఐ ప్రీ ప్రమోషనల్ ట్రెనీలకు ఐ చెకప్ క్యాంప్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్ మాట్లాడుతూ అకాడమీ సిబ్బందిపై పని భారాన్ని తగ్గించడంతో పాటు ప్రశాంతంగా కుటుంబ బాధ్యతలను నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మినిస్టీరియల్ సిబ్బంది పని చేయడానికి అనుకూలంగా ఉండేందుకు నూతన క్యాబిన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జేడీ మురళీధర్, డీడీలు ఎన్. వెంకటేశ్వర్లు, పి.శ్రీరామమూర్తి, సునీతమోహన్, సి.నర్మద, అడిషనల్ డైరెక్టర్స్, డీఎస్పీలు, ఆర్ఐలు, అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.

నుమాయిష్‌లో జైళ్ల శాఖ స్టాల్ ఏర్పాటు



మై నేషన్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యా మిశ్రా

సైదాబాద్: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో కొనసాగుతున్న 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన-నుమాయిష్ 2025లో తెలంగాణ జైళ్ల శాఖ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. 'మై నేషన్' పేరుతో ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌ను గురువారం తెలంగాణ జైళ్ల శాఖ డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రా ప్రారంభించారు. నుమాయిష్‌లో 1 నుండి 5 వరకు నంబర్లతో ఏర్పాటు చేసిన స్టాల్‌ను డీజీపీ, జైళ్ల శాఖ కార్యదర్శి బీ సురేందర్‌రెడ్డి, డీఐజీ డాక్టర్ శ్రీనివాస్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు జైళ్లకు చెందిన ఖైదీలు తయారుచేసిన పలు రకాల ఉత్పత్తులను ఈ స్టాల్‌లో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఖైదీల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించి వారు తయారు చేసిన వస్తువులను అమ్మడం ద్వారా ఖైదీల సామాజిక పునరేకీకరణ సులభతరం అవుతుందన్నారు. ఖైదీల వ్యక్తిగత అభివృద్ధి, ఆర్థిక స్వాతంత్ర్యం కోసం మార్గాలను అందించడం ద్వారా వారి పునరావాసానికి జైళ్ల శాఖ కృషి చేస్తుందన్నారు. నుమాయిష్-2024లోనూ ఏర్పాటు చేసిన మై నేషన్ స్టాల్ రూ. 20,96,133 అమ్మకాలు సాధించడమే కాకుండా, ప్రభుత్వ రంగం నుండి ఉత్తమ ప్రదర్శన స్టాల్ అవార్డును సొంతం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు శివకుమార్ గౌడ్, రామచంద్రం పాల్గొన్నారు.

సృజన్‌రెడ్డి పరువు నష్టం కేసు వాయిదా

- కేటీఆర్ తరుపున వకాలత్ దాఖలు చేసిన న్యాయవాదులు
- ఫిబ్రవరి 5కు విచారణ వాయిదా

సిటీ కోర్టులు : మాజీ మంత్రి కేటీఆర్‌పై ప్రముఖ వ్యాపారవేత్త సూదిని సృజన్ రెడ్డి దాఖలు చేసిన పరువునష్టం కేసుపై గురువారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరిగింది. తన పరువుకు భంగం కలిగేలా మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు చేశారని ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సృజన్ రెడ్డి పరువు నష్టం కేసు దాఖలు చేశారు. అయితే ఈ కేసులో ఇప్పటికే కేటీఆర్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. గురువారం ఆయన తరుపు న్యాయవాదులు జి.కిరణ్‌కుమార్, జక్కుల లక్ష్మణ్ వకాలత్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాస్థానం ఇరువురి వాదనలు వినిపించేందుకు విచారణను ఫిబ్రవరి 5కు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. షోధా కన్‌స్ట్రక్షన్ సంస్థలో తనకు ఎలాంటి షేర్లు లేవని, తాను ఆ సంస్థకు డైరెక్టర్‌ను కూడా కాదని, అయినా సదరు సంస్థతో తనకు సబంధం ఉన్నట్లు ప్రచారం చేస్తూ కేటీఆర్ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన బావ అయినందున షోధా కంపెనీకి రూ.2 కోట్ల లాభాన్ని ఇచ్చారని, ఎలాంటి అర్హతలేని కాంట్రాక్టులకు పొందారని కేటీఆర్ తప్పుడు వ్యాఖ్యలు చేశారని తెలిపారు. భారతీయ హ్యామ్ పైప్ కంపెనీ జాయింట్ వెంచర్ పేరుతో రూ.1,137.77 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారని కేటీఆర్ పలు పత్రికలు, టీవీ చానెళ్లలో ప్రచారం చేశారని అందుకు సంబందించిన క్లిప్పింగ్‌లను కూడా కోర్టుకు సమర్పించినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. తనపై నిరాధారమైన వ్యాఖ్యలు చేయడంతో సమాజంలో తన పరువుకు భంగం కలిగించినందున వెంటనే కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన పిటిషన్‌లో కోరారు. సృజన్‌రెడ్డి తరుపున న్యాయవాది వెంకటేశ్వర్లు హాజరయ్యారు. కేటీఆర్ తరుపు న్యాయవాదులు వకాలత్ దాఖలు చేయడంతో విచారణను వచ్చే నెల 5కు వాయిదా వేస్తున్నట్లు జడ్జి శ్రీదేవి తెలిపారు.

పరువు నష్టం కేసులో సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు

17కు విచారణ వాయిదా

సిటీ కోర్టులు : సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ పార్టీ దాఖలు చేసిన పరువునష్టం కేసుపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు(స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో విచారణ జరిగింది. విచారణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గైర్హాజరుకావడంతో ఆయన తరుపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. దీంతో విచారణ ఈనెల 17కు వాయిదా పడింది. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మే 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రకాశం స్టేడియంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని అసత్యపు ఆరోపణలు చేశారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. రేవంత్‌రెడ్డి ప్రజలను రెచ్చగొట్టే ఆరోపణలు చేయడంతోపాటు వారికి తప్పుడు సంకేతాలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు సీఎం గైర్హాజరు కావడంతో విచారణను వాయిదా వేసింది.

నేటి నుంచి 34వ సీనియర్ సెపక్ తక్రా ఛాంపియన్‌షిప్

సాక్షి, సిటీబ్యూరో: సెపక్ తక్రా 34వ నేషనల్ ఛాంపియన్‌షిప్- 2024 పోటీలు శుక్రవారం నుంచి 5 రోజులపాటు హనుమకొండలో నిర్వహిస్తున్నట్లు సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ కుమార్ వెల్లడించారు. ఈ జాతీయ స్థాయి పోటీలు జనవరి 10 నుంచి 14వ తేదీ వరకు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియంలలో కొనసాగుతాయన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలోని 28 రాష్ట్రాల నుంచి మహిళలు, పురుషుల జట్లు- పోటీపడబోతున్నాయన్నారు. తెలంగాణతోపాటు దేశం అంతటా సెపక్‌తక్రాను ప్రోత్సహించడంలో ఈ టోర్నమెంట్ ఒక మైలురాయి అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టీమ్ ఈవెంట్, రేగు ఈవెంట్, డబుల్ ఈవెంట్, క్వాడ్ ఈవెంట్ నాలుగు విభాగాలలో మ్యాచ్‌లను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

వైకుంఠ ఏకాదశికి చిలుకూరులో ఏర్పాట్లు

మొయినాబాద్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం చిలుకూరు బాలాజీ దేవాలయానికి భారీగా భక్తులు తరలిరానున్నారు. ఇక్కడి ఆలయానికి వైకుంఠ ద్వారం లేకున్నా ఏటా వైకుంఠ ఏకాదశి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఈసారి కూడా అదే స్థాయిలో వచ్చే అవకాశం ఉండడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకుడు రంగరాజన్ తెలిపారు. ధనుర్మాసం, వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారికి విశిష్ట పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

విహారయాత్రలో విషాదం

వేవ్ పూల్‌లో పడి విద్యార్థి దుర్మరణం



ఫైజాన్ మృతదేహం

శంకర్‌పల్లి: విహారయాత్రలో విషాదం చోటుచేసుకుంది. అప్పటి వరకు అందరితో పాటు అల్లరి చేస్తూ ఆడుకుంటున్న బాలుడు.. ఒక్కసారిగా కుప్పకూలి విగతజీవిగా మారాడు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ శాలిబండకు చెందిన గులాం రసూల్ అన్సారీ, రఫియా దంపతుల కుమారుడు ఫైజాన్(12), జహనుమాలోని మదీనా మిషన్ హై స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాల యాజమాన్యం 65మంది విద్యార్థులను ఒక రోజు విహారయాత్ర నిమిత్తం శంకర్‌పల్లి మండలం వైల్డ్ వాటర్స్(ఫామ్ ఎక్స్‌ోటికా)కి తీసుకెళ్లింది. మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో వేవ్ పూల్‌లో ఆడుకుంటున్న ఫైజాన్ ఊపిరి ఆడక కింద పడిపోయాడు. దీంతో వారు హుటాహుటిన శంకర్‌పల్లిలోని లైఫ్ కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

మా భూములను కబ్జాదారుల నుంచి కాపాడండి

పంజగుట్ట: తమ గ్రామంలో జరుగుతున్న వేలకోట్లు విలువ చేసే భూ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరిపి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా, రామచంద్రాపురం మండలం, వెలిముల రెవెన్యూ గ్రామ ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్రామస్తులు మహిపాల్‌ గౌడ్‌, ప్రతాప్‌ రెడ్డి, విశ్వేష్‌ గౌడ్‌, రవి నాయక్‌లు మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా రామచంద్రాపూర్‌ మండలం, వెలిమెల గ్రామంలో 60 ఎకరాలు, ఆ పక్కనే ఉన్న కొండకల్‌ గ్రామంలో 50 ఎకరాల బిల్లా దాఖలు భూముల్లో గత 60 సంవత్సరాలుగా గిరిజనులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి రెండు రియల్‌ఎస్టేట్‌ సంస్థల ప్రతినిధులు ఈ భూములు తమకు సంబంధించినవి అంటూ గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ భూమిపై తమకు పూర్తి హక్కు కల్పించాలని గిరిజనులు 1994లోనే హైకోర్టును ఆశ్రయించారని, హైకోర్టు గిరిజనుల దరఖాస్తులు పరిగణలోకి తీసుకోవాలని రెవెన్యూశాఖ వారికి ఆదేశాలు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు భూముల రేట్లు పెరగడంతో భూకబ్జాదారులు తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఈ వేధింపులపై తాము ఇటీవల హైకోర్టును ఆశ్రయిస్తే హైకోర్టు నిర్మాణ సంస్థల వారు అక్కడకు వెళ్లకూడదని ఆదేశించిందని అయినా వారి బెదిరింపులు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని వేడుకున్నారు.

ట్రాఫిక్‌ నిబంధనలు తప్పక పాటించాలి

వెస్ట్‌జోన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ హరిప్రసాద్‌ కట్టా


అవగాహన కల్పిస్తున్న వెస్ట్‌జోన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ హరిప్రసాద్‌ కట్టా

బంజారాహిల్స్‌: వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్‌ నిబంధనలే మన ప్రాణాలను కాపాడతాయని వెస్ట్‌జోన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ హరిప్రసాద్‌ కట్టా అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవ–2025లో భాగంగా గురువారం వెస్ట్‌జోన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ హరిప్రసాద్‌ కట్టా, పంజగుట్ట ట్రాఫిక్‌ పోలీసులు, సెయింట్‌ ఫ్రాన్సిస్‌ మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ విద్యార్థినులు గ్రీన్‌ల్యాండ్స్‌ చౌరస్తాలో ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన కలిగించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్‌ నిబంధనలు తప్పక ఉపయోగిస్తే క్షేమంగా ఇంటికి వెళ్తామన్నారు. ఏదో ఒక చిన్న తప్పుగా భావిస్తే మాత్రం అది మన భవిష్యత్‌ను పూర్తిగా మార్చివేస్తుందని సూచించారు. మెట్రో స్టేషన్లలో ఉన్న పాదచారుల వంతెనలను కూడా ఉపయోగించుకోవాలన్నారు. అలాగే హెల్మెట్‌ లేకుండా వాహనాలు నడపవద్దని, తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని కోరారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం గ్రీన్‌ల్యాండ్స్‌ చౌరస్తాలో ఉన్న పాదచారుల వంతెనను ఉపయోగించకుండా ఇష్టానుసారంగా రోడ్డు దాటడం ప్రమాదకరమని, పాదచారులంతా దీనిని ఉపయోగించుకోవాలని విద్యార్థినులు ప్లకార్డులు ప్రదర్శించారు.

‘ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా లేదు’


ప్రశాంతితో మాట్లాడుతున్న మామిడి నర్సింగరావు

ఫిలింనగర్‌: ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా జరగడం లేదని, చాలా చోట్ల జాబితాలో పేర్లు ఉన్నా సిబ్బంది సర్వేకు రావడం లేదని, సర్వేలో ఎన్నో లోటుపాట్లు చోటుచేసుకుంటున్నాయని ఫిలింనగర్‌ 18 బస్తీల వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్‌ డివిజన్‌ కాంగ్రెస్‌ సీనియర్‌ నేత మామిడి నర్సింగరావు గురువారం సర్కిల్‌–18 డీసీ ప్రశాంతికి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్‌ డివిజన్‌ పరిధి నుంచి వచ్చిన బాధిత మహిళలు, నేతలతో కలిసి ఆయన ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై చర్చించారు. అలాగే డివిజన్‌లో వీధి దీపాలు వెలగడం లేదని, చెత్తాచెదారం రెగ్యులర్‌గా తొలగించడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే బడ్జెట్‌లో విడుదలైన నిధులతో పనులు కూడా మొదలుపెట్టలేదని, ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నేతలు రాము, శ్రీనివాస్‌, మాణిక్యం, శ్రీశైలం, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు యూసుఫ్‌గూడ మార్గంలో ట్రాఫిక్‌ ఆంక్షలు

బంజారాహిల్స్‌: యూసుఫ్‌గూడ బెటాలియన్‌ పోలీస్‌లైన్‌లో జరగనున్న డాకు మహారాజ్‌ మూవీ ప్రీ రిలీజ్‌ ఈవెంట్‌ సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఆ మార్గంలో ట్రాఫిక్‌ ఆంక్షలు విధించినట్లు నార్త్‌ డిస్ట్రిక్ట్‌ ట్రాఫిక్‌–1 డీసీపీ అశోక్‌ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయా మార్గాల్లో ట్రాఫిక్‌ మళ్లింపు వివరాలను వెల్లడించారు. ఆ మేరకు వాహనదారులు ట్రాఫిక్‌ అధికారులు సహకరించాలన్నారు.
–జూబ్లీహిల్స్‌ చెక్‌పోస్టు నుంచి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం వైపు వెళ్లే ట్రాఫిక్‌ను కృష్ణానగర్‌ జంక్షన్‌ వద్ద శ్రీనగర్‌కాలనీ–పంజగుట్ట వైపు మళ్లిస్తారు.
– మైత్రివనం జంక్షన్‌ నుంచి జూబ్లీహిల్స్‌ చెక్‌పోస్టు, మాదాపూర్‌ వైపు వెళ్లే వాహనాలను యూసుఫ్‌గూడ బస్తీ వద్ద ఆర్‌బీఐ క్వార్టర్స్‌, కృష్ణానగర్‌ జంక్షన్‌, జూబ్లీహిల్స్‌ చెక్‌పోస్ట్‌ వైపు మళ్లిస్తారు.
–మైత్రివనం జంక్షన్‌ నుంచి బోరబండ బస్టాప్‌ వైపు వచ్చే ట్రాఫిను సవేరా ఫంక్షన్‌హాల్‌, కృష్ణకాంత్‌ పార్క్‌, జీటీఎస్‌ టెంపుల్‌, కళ్యాణ్‌నగర్‌, మోతీనగర్‌, బోరబండ బస్టాప్‌ వద్ద మళ్లిస్తారు.
–బోరబండ బస్టాప్‌ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను, మైత్రీవనం జంక్షన్‌ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను ప్రెమ్‌ గార్డన్‌ కళ్యాణ్‌నగర్‌, మిడ్‌ల్యాండ్‌ బేకరీ, జీటీఎస్‌ కాలనీ, కళ్యాణ్‌నగర్‌ జంక్షన్‌, ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద యూటర్న్‌, ఐసీఐసీఐ బ్యాంక్‌ యూటర్న్‌, మైత్రివనం జంక్షన్‌ వద్ద మళ్లిస్తారు.
– ద్విచక్ర వాహనాలను జానకమ్మ తోట, నాలుగు చక్రాల వాహనాలను సవేరా ఫంక్షన్‌ హాల్‌, మహమూద్‌ ఫంక్షన్‌ హాల్స్‌ను పార్కింగ్‌ కోసం కేటాయించడం జరిగిందని వివరించారు.

డిజిటల్‌ ఆవిష్కరణలపై జాతీయ సదస్సు



ఖైరతాబాద్‌: డిజిటల్‌ ఆవిష్కరణలపై రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ఖైరతాబాద్‌లోని ఇండియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌ అండ్‌ కామర్స్‌ కళాశాలలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌ కూర రఘువీర్‌ మాట్లాడుతూ సదస్సుకు 87 పరిశోధన వ్యాసాలు వచ్చాయని తెలిపారు. అమెరికా, లండన్‌ నుంచి కూడా వ్యాసాలు వచ్చాయన్నారు. మనిషి ఆలోచన చేస్తే ప్రతీది టెక్నాలజీగా మార్చవచ్చన్నారు. కళాశాల చైర్మన్‌ ప్రొఫెసర్‌ వి.విశ్వనాథం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎంతో ఉత్సుకతతో పరిశోధన చేసే విశ్లేషణతో వ్యాసాలు రాశారన్నారు. అనంతరం 87 వ్యాసాలతో కూడిన సంక్షిప్త పరిశోధనా వ్యాస సంపుటిని విడుదల చేశారు. మొదటి రోజు రెండు సెషన్లుగా మొత్తం వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు వివిధ విభాగాలకు సంబంధించిన 38 పరిశోధన పత్రాలు సమర్పించారని సదస్సు కన్వీనర్‌ కరుణశ్రీ తెలిపారు.

కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–12లోని శ్రీ విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం 24వ రోజు స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. విశేష పూజలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి పూజలు నిర్వహించారు.

జన్యుశాస్త్రంపై అవగాహన ఉండాలి

లక్డీకాపూల్‌: వైద్య రంగంలో ప్రతి వైద్యుడు జన్యుశాస్త్రంపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిమ్స్‌ మెడికల్‌ జెనెటిక్స్‌ విభాగం ప్రొఫెసర్‌ డాక్టర్‌ ప్రజ్ఞ రంగనాథ్‌ అన్నారు. నిమ్స్‌ ట్రామా బ్లాక్‌ ఆడిటోరియంలో ఇండియన్‌ అకాడమీ ఆఫ్‌ పీడియాట్రిక్స్‌, ఇండియన్‌ అకాడమీ ఆఫ్‌ మెడికల్‌ జెనెటిక్స్‌, పీడియాట్రిక్‌ రేర్‌ జెనెటిక్‌ డిజార్డర్స్‌పై డీబీటీ మిషన్‌ ప్రోగ్రామ్‌ ఆధ్వర్యంలో ‘యుటిలిటీ అండ్‌ ఇంటర్‌ప్రెటేషన్‌ ఆఫ్‌ జెనెటిక్‌ టెస్ట్‌ ఇన్‌ క్లినికల్‌ ప్రాక్టీస్‌’ పేరుతో ఈ వర్క్‌షాప్‌ నిర్వహించారు. పీడియాట్రిక్స్‌, వివిధ ఇతర వైద్య విభాగాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు పాల్గొన్న వర్క్‌షాపు జన్యు పరీక్షకు సంబంధించిన అన్ని అంశాలు, కార్యోటైపింగ్‌ వంటి ప్రాథమిక పద్ధతుల నుంచి తదుపరి తరం సీక్వెన్సింగ్‌, ఆప్టికల్‌ జీనోమ్‌ మ్యాపింగ్‌ వంటి అధునాతన పరీక్షలపై చర్చించింది. అంతే కాకుండా వ్యాధి నిర్ధారణ, నిర్వహణలో ప్రాముఖ్యతపై చర్చ సాగింది. ఈ కార్యక్రమానికి హాజరైన నిమ్స్‌ డీన్‌ ప్రొఫెసర్‌ లిజా రాజశేఖర్‌ క్లినికల్‌ ప్రాక్టీస్‌లో జన్యుశాస్త్రం ప్రాముఖ్యత వివరించారు. అనంతరం డాక్టర్‌ ప్రజ్ఞ రంగనాథ్‌ మాట్లాడుతూ ప్రతి వైద్యుడు జన్యుశాస్త్రం ప్రాథమిక భావనలను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జన్యు నిర్ధారణ నిర్వహణపై అవగాహన కల్పించేందుకు చొరవ తీసుకోవడం పట్ల నిమ్స్‌ మెడికల్‌ జెనెటిక్స్‌ విభాగాన్ని సెంటర్‌ ఫర్‌ డీఎన్‌ఏ ఫింగర్‌ ప్రింటింగ్‌ అండ్‌ డయాగ్నోస్టిక్స్‌ (సీడీఎఫ్‌డీ) హైదరాబాద్‌ డయాగ్నోస్టిక్స్‌ విభాగాధిపతి డాక్టర్‌ అశ్విన్‌ దలాల్‌ అభినందించారు.

శుభాకాంక్షలు

శ్రీనగర్‌కాలనీ: మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్‌ జన్మదిన వేడుకలు గురువారం ఎర్రగడ్డ బంజారానగర్‌లో ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ స్టేట్‌ ఎస్టీ సెల్‌ కో ఆర్డినేటర్‌ రమేష్‌నాయక్‌, జనరల్‌ సెక్రటరీ దూడల రవిగౌడ్‌, రఘునాయక్‌, శశి, రాహుల్‌నాయక్‌లు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయాలకు ‘వైకుంఠ ఏకాదశి’ శోభ

నేటి తెల్లవారుజాము 5 గంటల నుంచే ఉత్తర ద్వార దర్శనాలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ సిబ్బంది
- ఆలయాల వద్ద భారీ పోలీసు బందోబస్తు

బంజారాహిల్స్‌: శ్రీరంగనాథ స్వామిని ఆరాధించి వరించిన భక్తురాలైన ఆండాళ్‌ (గోదాదేవి) రోజుకొక పాశురం, భక్తి గీతాన్ని పాడుతూ చివరి రోజు మనోనాథుడిలో ఐక్యమైన మాసం ధనుర్మాసం. ఈ మహా దివ్య మాసంలోనే శుక్లపక్షంలో వచ్చే ఏకాదశిని వైకుంఠ, ముక్కోటి ఏకాదశి అంటారు. అత్యంత విశిష్ట పర్వదినమైన వైకుంఠ ఏకాదశి రోజు స్వామివారిని ఆలయ ఉత్తర ద్వార దర్శనం చేసుకోవడం అత్యంత పరమ పవిత్రంగా భక్తులు విశ్వసిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరిపేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. తెల్లవారుజాము నుంచే స్వామివారు ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. జూబ్లీహిల్స్‌ టీటీడీ టెంపుల్‌లో వైకుంఠ ఏకాదశి వేడుకలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని రంగురంగుల పూలమాలలు, విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సుమారుగా 50వేల మంది భక్తులు స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకోవడానికి వచ్చే అవకాశం ఉందని ఆలయ వర్గాలు ఆ మేరకు ఏర్పాట్లు చేశాయి. ఫిలింనగర్‌ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. అన్ని ఆలయాలను రంగరంగుల పూలమాలలతో, విద్యుద్దీపాలతో అలంకరించారు. శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో తెల్లవారుజామున 2.30 గంటలకు సుప్రభాతసేవ, తదుపరి శ్రీవారి గరుడ సేవ, వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. ఇందులో భాగంగానే ఉత్తర ద్వారాన్ని సుందరంగా అలంకరించారు. ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు.


వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనానికి ముస్తాబవుతున్న జూబ్లీహిల్స్‌ టీటీడీ టెంపుల్‌



ఉత్తర ద్వార దర్శనం కల్పించే ఆలయాలు..

- శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం.
- బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–12లోని విరించి చౌరస్తాలో ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం.
- ఫిలింనగర్‌లోని ఫిలింనగర్‌ దైవ సన్నిధానంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి దేవస్థానం.
- బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–12లోని ఎమ్మెల్యే కాలనీ రోడ్డులో ఉన్న హరేకృష్ణ గోల్డెన్‌ టెంపుల్‌.
- పంజగుట్ట దుర్గానగర్‌లో ఉన్న కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం.
- లిబర్టీలోని బాలాజీ టెంపుల్‌.
- అపోలో ఆసుపత్రి ఆవరణలోని వేంకటేస్వారస్వామి దేవస్థానం.
- జూబ్లీహిల్స్‌లోని రోడ్‌–15లోని సీతారామస్వామి దేవాలయం,
- బంజారాహిల్స్‌ రోడ్‌–12లోని జగన్నాథ దేవాలయం

నేడు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

బంజారాహిల్స్‌: ముక్కోటి ఏకాదశి సందర్భంగా బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–1, 12లోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున 4 గంటలకు వివిధ సుగంధ భరిత పుష్పాలతో అలంకరించిన వైకుంఠ ద్వార ప్రవేశం, స్వామి వారికి సువర్ణ పుష్పములచే అష్టదళ పాద పద్మారాదనము, అమ్మవార్లకు కుంకుమార్చన ఉంటుందన్నారు. అలాగే సాయంత్రం 5 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీవేంటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం, స్వామివారి గరుడ వాహనసేవ, సహస్ర దీపాలంకరణ, ఊంజల సేవ జరుగుతాయని పేర్కొన్నారు.

డివిజన్లకు బీజేపీ అధ్యక్షుల నియామకం


జూబ్లీహిల్స్‌ డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్‌

ఫిలింనగర్‌: బీజేపీ ఖైరతాబాద్‌ నియోజకవర్గం డివిజన్‌ అధ్యక్షులతో పాటు హైదరాబాద్‌ సెంట్రల్‌ జిల్లా కౌన్సిల్‌ మెంబర్లను నియమించారు. జూబ్లీహిల్స్‌ డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడిగా ముద్దంగుల శ్రీనివాస్‌, ఖైరతాబాద్‌ అధ్యక్షుడిగా ఏ.ఆదర్శ్‌ వంశీకర్‌, సోమాజీగూడ అధ్యక్షుడిగా గొల్లపల్లి సూర్యవినాయక్‌, వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడిగా చెట్టపల్లి విజయ్‌కుమార్‌, బంజారాహిల్స్‌ అధ్యక్షుడిగా వినయ్‌ముదిరాజ్‌ నియమితులయ్యారు. గురువారం వీరిని రిటర్నింగ్‌ అధికారి శ్రీకాంత్‌ ప్రకటించారు. అలాగే హైదరాబాద్‌ సెంట్రల్‌ డిస్ట్రిక్ట్‌ కౌన్సిల్‌ మెంబర్లుగా అనిల్‌ కుమార్‌, నర్సింహ్మగౌడ్‌, వేణు, సర్వోత్తమరెడ్డి, శ్రీకాంత్‌యాదవ్‌లను నియమించారు.

జూబ్లీహిల్స్‌ నియోజకవర్గంలో..

జూబ్లీహిల్స్‌ నియోజకవర్గం షేక్‌పేట డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడిగా పూస రాకేష్‌, యూసుఫ్‌గూడ అధ్యక్షుడిగా బీ రాజశేఖర్‌, వెంగళరావునగర్‌ అధ్యక్షుడిగా ఎస్‌.నవీన్‌కుమార్‌, ఎర్రగడ్డ అధ్యక్షుడిగా బొట్ల విజయ్‌కుమార్‌, రహమత్‌నగర్‌ అధ్యక్షుడిగా తంగెళ్లపల్లి లక్ష్మణ్‌, బోరబండ అధ్యక్షుడిగా కొత్త వెంకటేశం నియమితులయ్యారు. అలాగే డిస్ట్రిక్‌ కౌన్సిల్‌ మెంబర్లుగా జి.శివకుమార్‌, కె. చంద్రమోహన్‌, ఎస్‌.విజయ్‌కుమార్‌, ఈ.రాజేష్‌, ఎస్‌.కనకరాజు, పూజారి శ్రావణ్‌రెడ్డిలు నియమితులయ్యారు.

యువకుడిపై దాడి

వెంగళరావునగర్‌: యువకుడిపై దాడికి పాల్పడిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జవహర్‌నగర్‌కు చెందిన మార్టిన్‌ ఇమ్మానియేల్‌ బుధవారం మధ్యాహ్నం ప్రజాపాలన, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులకు సంబంధించి ప్రజలకు సాయం చేస్తున్నాడు. ఈ సమయంలో సయ్యద్‌ అబ్బాస్‌ సాత్రీ, అహ్మద్‌ రియా రసూల్‌, అజామ్‌ ఖాన్‌లు అతని వద్దకు వచ్చి దుర్భాషలాడారు. ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించగా అతనిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇమ్మానియేలు గాయపడ్డాడు. అనంతరం బాధితుడు మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు .

ద్విచక్ర వాహనం ఢీ.. ముగ్గురికి గాయాలు

వెంగళరావునగర్‌: వేగంగా ద్విచక్ర వాహనంపై వచ్చి మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... హబీబ్‌నగర్‌లో నివసించే ఆర్‌.కృష్ణ పోలీసుగా విధులు నిర్వహిస్తుంటాడు. ఈనెల 8న తన వాహనంపై భార్య లక్ష్మి, కుమారుడు కార్తీక్‌తో వెళుతున్నాడు. ఎస్‌ఆర్‌నగర్‌ మెట్రోస్టేషన్‌ వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు వీరి వాహనాన్ని ఢీకొట్టి పారిపోయాడు. ఈ సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాలీ ఆటో మాయం

వెంగళరావునగర్‌ : ఇంటి ఎదుట పార్కింగ్‌ చేసి ట్రాలీ ఆటో మాయమైన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక ఆర్‌బీఐ క్వార్టర్స్‌లో నివసించే జి.లక్ష్మీతులసి ఫుడ్‌ క్యాటరింగ్‌ వ్యాపారం చేస్తుంది. ఈ క్రమంలో ఈనెల 6వ తేదీ రాత్రి ఆటోను డ్రైవర్‌ ఇంటి ఎదుట పార్కింగ్‌ చేశాడు. ఉదయం వచ్చి తాము చూడగా ట్రాలీ ఆటో కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బాధితులు మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం...

వెంగళరావునగర్‌: మద్యం షాపు వద్ద పార్కింగ్‌ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వీడియోగల్లీలో నివసించే వెంకి ఈనెల 7వ తేదీ రాత్రి మద్యం సేవించడానికి ద్విచక్ర వాహనంపై రహమత్‌నగర్‌లోని సాయి వైన్స్‌ వద్దకు వెళ్లాడు. షాపు ఎదుట తన వాహనాన్ని పార్కింగ్‌ చేసి మద్యం సేవించి అరగంటలో తిరిగి వచ్చి చూస్తే వాహనం కనిపించలేదు. దీంతో చుట్టూ పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బాధితుడు మధురానగర్‌ పోలీసులుకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రహమత్‌నగర్‌లో చోరీ

వెంగళరావునగర్‌: తిరుపతి వెళ్లి వచ్చేలోగా ఇంట్లో దొంగలు పడి చోరీ చేసిన జరిగిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో నివసించే పాపారావు కెమెరామెన్‌గా పనిచేస్తున్నాడు. గతనెల 26వ తేదీన స్నేహితులతో కలిసి తిరుపతి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లోనే కెమెరా, కొంత నగదు ఉంచాడు. తిరుపతి యాత్ర ముగించుకొని ఈనెల 8వ తేదీ తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దాదాపు రూ.2 లక్షల విలువైన కెమెరాతోపాటు ఇతర సామగ్రిని కనిపించలేదు. దీంతో బాధితుడు మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

ఖైరతాబాద్‌: సైఫాబాద్‌ డివిజన్‌ పరిధిలోని జవహర్‌నగర్‌, ఎర్రమంజిల్‌, నారాయణగూడ, లేక్‌వ్యూ సబ్‌ స్టేషన్ల పరిధిలో శుక్రవారం చెట్ల నరికివేత, మెయింటెనెన్స్‌ పనుల్లో భాగంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్‌ డివిజనల్‌ ఇంజినీర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జవహర్‌నగర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో జవహర్‌నగర్‌ ఏరియా, లేబర్‌ కమిషనర్‌ కార్యాలయం, ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్‌, పీఅండ్‌టీ క్వార్టర్స్‌, అంజయ్య భవన్‌, హనుమాన్‌ టెంపుల్‌, ఎర్రమంజిల్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో భగత్‌ సింగ్‌ స్టాచ్యూ, పద్మావతినగర్‌, పోస్టాఫీస్‌, మోర్‌ సూపర్‌ మార్కెట్‌ లేన్‌, పద్మావతి నగర్‌ చమాన్‌, శివాజీ స్టాచ్యూ ఏరియాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అలాగే నారాయణగూడ, లేక్‌ వ్యూ సబ్‌స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిటీ సెంట్రల్‌ లైబ్రరీ, సుధా హోటల్‌ ఏరియా, బాబూజీనగర్‌, చిక్కడపల్లి (కొంత భాగం), వివేక్‌నగర్‌, ఆర్టీసీ ఎక్స్‌రోడ్డు మోర్‌సూపర్‌ మార్కెట్‌, పార్థివాడ ఏరియా, ఎంసీహెచ్‌ మార్కెట్‌ ఏరియా, త్యాగరాయ గానసభ, కపాడియా లేన్‌, ఏషియన్‌ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఏరియాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బీసీల్లో చైతన్యం రావాలి

పంజగుట్ట: బీసీలు 78 సంవత్సరాల స్వాతంత్య్ర చరిత్రలో ఇంకా దీనస్థితిలో మగ్గిపోతున్నారని నవ సంఘర్షణ సమితి జాతీయ అధ్యక్షులు పంజాల జైహింద్‌ గౌడ్‌ అన్నారు. బ్యాక్‌వర్డ్‌ క్లాస్‌ ఫెడరేషన్‌ (బీసీఎఫ్‌) ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణలో రాజ్యాధికారమే లక్ష్యంగా రాష్ట్రస్థాయి బీసీ నేతల చర్చావేదిక కార్యక్రమం నిర్వహించారు. బీసీ ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షులు నాగనమోని చెన్నరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జైహింద్‌ గౌడ్‌ పాల్గొని మాట్లాడుతూ ఇప్పటి వరకు పాలించినవి అన్ని అగ్రకుల పార్టీలే కావడంతో రాష్ట్రంలో ఇంకా బీసీల పరిస్థితి అలానే ఉందన్నారు. ఇప్పుడు ఈడబ్ల్యూఎస్‌ రిజర్వేషన్లు వచ్చి బీసీలకు మరింత అన్యాయం జరుగుతుందని, రాజ్యాంగ విరుద్ధంగా అగ్రకులాల వారు ఉద్యోగాలు పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నుంచే బీసీలు ఐక్యమయ్యేలా బీసీ నాయకులు వివిధ కార్యక్రమాలు రూపొందించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ కానిస్టేబుల్‌ శ్రీశైలం ముదిరాజ్‌ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వస్తే మన జీవితాలు మారుతాయని, బీసీలు ప్రాణ త్యాగాలు చేసి, ఉద్యమాలు చేస్తే చివరికి నిరాశే మిగిలిందన్నారు. తాను విధుల్లో ఉండి జై తెలంగాణ అని నినాదం చేస్తే ఉద్యోగం పోయిందని గుర్తు చేశారు. రాబోయే కరీంనగర్‌ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను బరిలో ఉంటున్నానని బీసీలు ఐక్యమై తనను గెలిపిస్తే బీసీల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. వివిధ బీసీ సంఘాల నాయకులు చీపురు మల్లేష్‌, శివ ముదిరాజ్‌, బోయపల్లి లింగస్వామి, పంజాల శ్రవణ్‌ కుమార్‌, సయ్యద్‌ ఫిరోజీద్దీన్‌, బత్తుల సిద్దేశ్వర్‌, మహేష్‌ గౌడ్‌, కాటం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

లిబర్టీ: రైతులకు పెట్టుబడి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులను విడుదల చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వి.కృష్ణస్వరూప్‌ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతు సంక్షేమాన్ని కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి, మంత్రులు పేర్కొంటున్నారని ఆ మాట మీద కట్టుబడి ఉండాలని కోరారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం పొలం పనులకు డబ్బులు లేక వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు తెచ్చుకుని తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా రైతులకు చేయూతనిచ్చేందుకు రైతు భరోసా నిధులు విడుదల చేస్తే వ్యవసాయ అవసరాల నిమిత్తం వినియోగించుకుంటారని తెలిపారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అని నిరూపించుకోవాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి

బంజారాహిల్స్‌: ప్రజా సమస్యలపై సమాజ్‌వాదీ పార్టీ నేతలు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజలతో కలిసి పోరాడాలని సమాజ్‌వాదీ పార్టీ నేషనల్‌ సెక్రటరీ డాక్టర్‌ జగదీశ్‌యాదవ్‌ అన్నారు. గురువారం గ్రేటర్‌ హైదరాబాద్‌ సమాజ్‌వాదీ పార్టీ సీనియర్‌ నేత, సామాజికవేత్త దండుబోయిన నిత్య కళ్యాణ్‌ యాదవ్‌, సమాజ్‌వాదీ పార్టీ ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర అధ్యక్షుడు మదిరె నర్సింగ్‌రావు నేషనల్‌ సెక్రటరీ డాక్టర్‌ జగదీశ్‌ యాదవ్‌తో భేటీ అయ్యారు. కళ్యాణ్‌ యాదవ్‌ మాట్లాడుతూ త్వరలో గ్రేటర్‌ వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న కార్యక్రమాలతో పాటు సభ్యత్వ నమోదు, సామాజిక కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. నేషనల్‌ సెక్రటరీ జగదీష్‌ యాదవ్‌ సూచించినట్లుగా త్వరలోనే ప్రజా సమస్యలపై కూడా పోరాటాలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

సైట్‌–3లో యాచకురాలి మృతి


శోభ (ఫైల్‌)

రహమత్‌నగర్‌: భిక్షటన చేస్తూ జీవించే యాచకురాలు మృతి చెందిన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. అడ్మిన్‌ ఎస్‌ఐ నాగుల్‌ మీరా తెలిపిన వివరాల ప్రకారం... శోభ (54) ముప్పై సంవత్సరాలుగా బోరబండ ఎస్‌ఆర్‌ఆర్‌పురం సైట్‌–3లో నివసిస్తుంది. శోభ భర్త పదేళ్ల క్రితం చనిపోయాడు. సంతానం లేకపోవడంతో శోభ భిక్షాటన చేస్తూ పొట్టపోసుకునేది. ఈ క్రమంలోనే గతనెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటుంది. ఆమె నివాసముంటున్న ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ఆమె గదిలో చూడగా శోభ మృతి చెంది కనిపించింది. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నాగుల్‌మీరా తెలిపారు.

మహిళ అదృశ్యం

వెంగళరావునగర్‌: ఫోన్‌ షాపునకు వెళ్లి వస్తానని చెప్పిన మహిళ అదృశ్యమైన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. మధురానగర్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ కథనం ప్రకారం... ఉమెన్‌ కోఆపరేటివ్‌ సొసైటీలో నివసించే కేతావత్‌ శ్రీనుకు గత ఆరేళ్ల కిందట మంజులతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీను ఆటో డ్రైవర్‌గా పని చేస్తుండగా, మంజుల సర్వెంట్‌గా పనిచేస్తుంది. ఈనెల 7న తన మంజుల చేతిలో కొత్త ఫోన్‌ కనిపించగా శ్రీను ప్రశ్నించాడు. కొత్త ఫోన్‌ను కొన్నానని మంజుల శ్రీనుకు తెలుపగా షాపు వద్దకు వెళదామని అన్నాడు. దీంతో భార్య మంజుల, అత్తను ఆటోలో ఎక్కించుకుని ఎస్‌ఆర్‌నగర్‌ వద్దకు రాగానే ఆమె షాపు వద్దకు వెళ్లి వస్తానని చెప్పి మెట్రోవైపు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. అయితే తన భార్య కనిపించకపోవడం వెనుక సురేష్‌ ప్రమేయం ఉందని అనుమానం వ్యక్తం చేస్తూ శ్రీను మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.







సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

సాక్షి శుక్రవారం ı 10 ı జనవరి ı 2025

నగరంలో నేడు

- బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జరుగుతున్న ఉద్యాన్ ఉత్సవ్ కార్యక్రమాలు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతాయి.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రీయల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళా మేళా ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జాతీయ స్థాయి వర్క్‌షాప్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

భోగి 'మంట నూనెలు'

- భగ్గుమంటున్న వంటనూనెల ధరలు
- అన్నిరకాల నూనెలపై రూ.12 నుంచి రూ.15 పెంపు

సాక్షి,సిటీబ్యూరో: వంటనూనెల ధరలు భగ్గుమంటున్నాయి. ఎంతకూ తగ్గమంటున్నాయి. సంక్రాంతి పండుగ వేళ సామాన్యులకు దడ పుట్టిస్తున్నాయి. పిండివంటల నూనెలు మండిపోతున్నాయి. ఇక రోజూ వంటల్లో సరిపడా నూనె వాడేందుకే ఒకటికి, రెండుసార్లు ఆలోచించే పరిస్థితి వచ్చేసింది. హైదరాబాద్ నగరంలో రోజుకు వందల టన్నుల వంటనూనెల అమ్మకాలు జరుగుతున్నాయి. గృహ అవసరాలకే కాకుండా హోటల్స్, క్లబ్బులు, బార్లలో అత్యధికంగా వివిధరకాల వంట నూనెలు భారీగా వినియోగిస్తుంటారు. సంక్రాంతి పండుగ రావడంతో నగరంలో వంట నూనెల డిమాండ్ మూడింతలు ఎక్కువైంది. దీంతో నూనె ధరలు ఆమాంతం పెరిగాయి. హోల్‌సెల్ మార్కెట్ అన్ని రకాల నూనెలపై ధర రూ.5 నుంచి రూ.8 పెరిగింది. రిటైల్, బహిరంగ మార్కెట్‌లో ప్రతి లీటరు నూనెపై రూ.12 నుంచి రూ.15 పెరిగింది.



అన్ని రకాల నూనెల ధరలు భగ్గుమంటున్నాయి

పామాయిల్, రిఫైన్డ్ ఆయిల్, వేరుశనగ, రైస్‌బ్రాన్... ఇలా అన్ని రకాల నూనెల ధరలు భారీగా పెరిగాయి. వంట నూనెలకు సంబంధించి హోల్‌సేల్ ధరలు, రిటైల్ మార్కెట్ ధరల మధ్య వ్యత్యాసం రూ.10 నుంచి రూ.20 వరకు ఉంది. హోల్‌సేల్ మార్కెట్‌లో పామాయిల్ కిలో ధర రూ.100 నుంచి రూ.105కు చేరింది. రిటైల్ మార్కెట్‌లో రూ.115కు చేరింది. సన్‌ఫ్లవర్ ఆయిల్ హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.130 నుంచి రూ.140 మధ్య ఉండగా, ప్రస్తుతం రూ.145–150 పలుకుతోంది. కిలో వేరుశనగ నూనె ధర నెల క్రితం రూ.150 ఉండగా, ఇప్పుడు రూ.165కు పెరిగింది. వీటితోపాటు రైస్ బ్రాన్ ఆయిల్ ధర రూ.140 నుంచి రూ.150 ఉండగా, ప్రస్తుతం రూ.160 పలుకుతోంది. ఈ స్థాయిలో వంటనూనెల ధరల మంటకు కారణం నూనెలపై దిగుమతి సుంకం పెరగడమేనని వ్యాపారులు అంటున్నారు. రాష్ట్రానికి దిగుమతయ్యే ముడి ఆయిల్‌పై సుంకాన్ని 5–10 శాతం నుంచి ఏకంగా 45 శాతానికి ప్రభుత్వం పెంచిందని, అందుకే ధరలు మండిపోతున్నాయని పేర్కొన్నారు. వంటనూనెల ధరలు మున్ముందు మరింతగా పెరిగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. వంటనూనెలపై దిగుమతి సుంకం పెరగడం కొందరు వ్యాపారులకు వరంగా మారింది. పాత స్టాక్‌ను గోడౌన్లలో దాచేసి ధరలు పెంచి అమ్ముతున్నారు.

ప్రజల సంపద, జ్ఞానం పెంచేలా చూడాలి

- దేశాభివృద్ధి అంటే 143 కోట్ల మంది పౌరుల అభివృద్ధి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

రాయదుర్గం: మనదేశ ప్రజల సంపద, జ్ఞానం, ఆనందాలను పెంచేలా చూడాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు అన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో 'ఉన్నత్ భారత్ అభియాన్', కేంద్ర విద్యాశాఖ సహకారంతో జరిగిన రెండో రోజు సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవనోపాధి వృద్ధికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన గ్రామీణ యువతను తీర్చిదిద్దే దిశగా చర్యలు అవసరమని అన్నారు. సాంకేతిక ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి నేడు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రపంచంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఎంతో ప్రాముఖ్యం సంతరించుకుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికీ దేశంలో 58 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివాసముంటున్నారని, వారి జీవితాలను మార్చాలని, వారికి జాప్యం లేకుండా న్యాయం అందేలా చూడాలన్నారు. అప్పట్లో తనకు వాజ్‌పేయి మంత్రివర్గంలో గ్రామీణాభి వృద్ధి శాఖ, నరేంద్ర మోదీ హయాంలో పట్టణాభివృద్ధి శాఖ ఇచ్చారని, ఈ విషయమై ప్రధానిని అడుగగా పట్టణీకరణ పెరిగిపోతోందని, అందుకే పట్టణాభివృద్ధి శాఖ ఇచ్చామని అన్నారని గుర్తు చేశారు. ఉన్నత్ భారత్ అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీకే సింగ్ మాట్లాడుతూ ఉన్నత్ భారత్ అభియాన్ మూలాలు, విజన్, మిషన్ గురించి వివరించారు. గ్రామీణాభివృద్ధి, కమ్యూనిటీ డెవలప్‌మెంట్, అట్టడుగు స్థాయి అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం పెంపొందించడంపై చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు, డాక్టర్ ఆర్ రమేష్ రంగస్వామి ఉన్నత్ భారత్ అభియాన్ కోఆర్డినేటర్ డాక్టర్ రావుల కృష్ణయ్యతోపాటు పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రజకవృత్తి ఆధునీకరణకు కృషి

బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్


మాట్లాడుతున్న నూతి శ్రీకాంత్ గౌడ్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: రజక వృత్తి ఆధునీకరణ, ఉపాధి కల్పనకు తన వంతుగా కృషి చేస్తానని బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ కులవృత్తులవారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి అనేక విధాలుగా ప్రభుత్వం కృషి చేయనుందని, ముఖ్యమంత్రి చేతివృత్తుల పట్ల ఎంతో అభిమానంతో ఉన్నారని తెలిపారు. బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి మాట్లాడుతూ రజకుల ఆత్మగౌరవం, విద్యాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. రజకులపై జరుగుతున్న దాడులు, వివక్ష, అవమానాలను కట్టడి చేయడానికి రక్షణ చట్టాలు అవసరమని అభిప్రాయపడ్డారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి రాజు నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రజక ఫెడరేషన్ ఎండీ చంద్రశేఖర్, వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, ఎం.వి.రమణ, సుదర్శన్‌రావు, ఎల్.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'సంవిధాన్ @75'

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని శిల్పకళా వేదికగా శుక్రవారం(నేడు)'సంవిధాన్ @75'పేరుతో 4 వందల మంది చిన్నారులతో థియేటర్ ప్రదర్శన చేయనున్నారు. భారత 75వ గణతంత్ర దినోత్సవం, భారత రాజ్యాంగ 75వ వార్షికోత్సం నేపథ్యంలో అభ్యాస ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన చేపట్టారు. సాయంత్రం 3:45 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో అభ్యాస ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ బృందంతోపాటు విభిన్న రంగాల ప్రముఖులు పాల్గొననున్నారు.

జానపద కళలకు ప్రత్యేక అకాడమీ అవసరం

భూపతి వెంకటేశ్వర్లు


యక్షగాన వృత్తి కళాకారుల సదస్సులో మాట్లాడుతున్న భూపతి వెంకటేశ్వర్లు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: యక్షగాన, జానపద కళలకు ప్రత్యేక అకాడమీని ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన బేడ బుడగ యక్షగాన కళాకారుల సదస్సులో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు దాటినా జానపద, వృత్తి కళాకారుల బతుకుల్లో కనీస మార్పు కూడా రాలేదన్నారు. రాష్ట్రంలో యక్షగాన కళాకారులు సుమారు 2 లక్షల మంది ఉన్నారని, వారి సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. జానపద సాహిత్యం కనుమరుగై పోతుంటే తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ రవీంద్రభారతిలో సత్కారాలకే పరిమితమైందని విమర్శించారు. రెండు వేల సంవత్సరాల చరిత్ర ఉన్న యక్షగానం కాలగర్భంలో కలిసిపోకముందే, ఆ కళాకారులను అన్నివిధాలుగా ఆదుకోవాలన్నారు. జానపద కళాకారులకు గుర్తింపు కార్డులు, వృద్ధాప్య పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.జనార్దన్, లక్ష్మమ్మ, శారదాదేవి, తూర్పాటి నర్సింహులు, అంజయ్య, అయోధ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం సహకరిస్తే మూసీని శుభ్రం చేయిస్తా

ప్రొఫెసర్ వెంకటేశ్వర్


మురుగునీటిని శుభ్రం చేసి చూపిస్తున్న ప్రొఫెసర్ వెంకటేశ్వర్

పంజగుట్ట: ప్రభుత్వం సహకరిస్తే తాను కనుగొన్న పద్ధతి ద్వారా తక్కువ ఖర్చుతో మూసీ నదిని శుభ్రం చేయిస్తానని ప్రొఫెసర్ సి.వెంకటేశ్వర్ తెలిపారు. గతంలో ప్రభుత్వ పెద్దల అనుమతితో బుల్కాపూర్ నాలాలో ప్రతీరోజు వంద మిలియన్ లీటర్ల మురుగునీరు శుభ్రం చేసి హుస్సేన్‌సాగర్‌లోకి వదిలినట్లు ఆయన గుర్తుచేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలాలో ప్రవహించే నీటిలో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (సీఓడీ), బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ), ఫంగస్, బ్యాక్టీరియాతోపాటు మరికొన్ని వ్యర్థాలు ఉంటాయని తెలిపారు. వీటిని శుభ్రపరిచేందుకు అల్యూమినియం సల్ఫేట్, ఐరన్ సల్‌ఫేట్, ఐరెన్ క్లోరైడ్, అల్యూమినియం క్లోరైడ్, సున్నం వంటి రసాయనాలను తగిన మోతాదులో నాలా ప్రవహించే ఒకచోట, ఆ తరువాత అర కిలోమీటర్ దూరంలో మరోచోట వెయ్యాలని, ఐదు నుంచి 10 నిమిషాల్లో నాలాలోని వ్యర్థాలు ఒకచోట చేరి శుభ్రమైన నీరు వస్తుందన్నారు. ఈ ప్రక్రియ ద్వారా నీటిని శుభ్రం చేసేందుకు ఒక్క లీటర్‌కు 5 నుంచి 8 పైసల ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. గతంలో ఐఏఎస్ అధికారి దానకిషోర్ వద్దకు వెళ్లి తన ప్రక్రియ గురించి వివరించానని చెప్పారు. ఆయన అనుమతితో పరిశోధక విద్యార్థులతో కలిసి ఎటువంటి మిషనరీ లేకుండానే వంద మిలియన్ లీటర్ల నాలా నీటిని 2018లో నాలుగు నెలలపాటు శుభ్రం చేసి హుస్సేన్‌సాగర్‌లోకి వదిలినట్లు తెలిపారు. ఇదే విధానం ద్వారా మూసీ నదిని కూడా శుభ్రం చేయవచ్చని తెలిపారు. సమావేశంలో సల్మాన్ రాజు, అర్వింద్ కుమార్ పాల్గొన్నారు.

నీటి వనరులను పరిరక్షిస్తాం

- హైడ్రా కమిషనర్ రంగనాథ్
- ధర్మోజి,గొల్లవాని కుంటల పరిశీలన



ధర్మోజికుంట, గొల్లవాని కుంటలను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

శంషాబాద్: నీటి వనరులకు పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. పట్టణంలోని సర్వే నంబర్ 104లో గొల్లవాని కుంట, 73లో ధర్మోజి కుంట కబ్జాకు గురవుతున్నట్లు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విలేజ్ మ్యాప్‌లో మాత్రమే ఉన్న గొల్లవాని కుంట రెవిన్యూ, ఇరిగేషన్ రికార్డుల్లో లేకపోవడంతో పట్టాదారులు దానిని లేఅవుట్‌గా మర్చి విక్రయించారు. ఈ విషయమై రంగనాథ్ అధికారులతో కలిసి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. సంబంధిత కుంటలపై పూర్తిగా వివరాలు సేకరించి చట్టబద్ధంగా ముందుకెళతామన్నారు. అప్పటి వరకు సంబంధిత భూములు క్రయవిక్రయాలు చేయకూడదన్నారు.

మీకు బాధ్యత లేదా..?

పర్మిషన్లు రాని చోట భూములు ఎలా అమ్ముతారు..? మీకు బాధ్యత లేదా అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త మహేందర్‌రెడ్డిని నిలదీశారు. జీవో 111 కారణంగా మున్సిపాలిటీలో ఎక్కడ కూడా నిర్మాణాలకు అనుమతులు లేవని, వెయ్యికిపైగా అక్రమ నిర్మాణాలు పట్టణంలో జరుగుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త తెలిపారు. కుంటలు, నీటి వనరులున్నచోట ఎప్పటికి కూడా హక్కులు సంక్రమించవని ఇటీవల హైకోర్టు స్పష్టం చేసిన సంగతిని కమిషనర్ గుర్తు చేశారు. అనంతరం ఆయన ధర్మోజి కుంటను పరిశీలించి బఫర్‌జోన్‌లో అడ్డుగా నిర్మించిన ప్రహరిని తొలగించాలని ఇరిగేషన్ ఏఈ మౌనికకు సూచించారు. ప్రహరి నిర్మాణం చేసే వరకు మీ దృష్టికి రాలేదా అని నిలదీశారు. త్వరలోనే మరోసారి పర్యటించి అన్ని పరిశీలించి చర్యలు తీసుకోనున్నట్లు ఆయన మీడియాతో అన్నారు.

బుక్‌ఫెయిర్ తొలి అధ్యక్షుడు తల్వార్ కన్నుమూత



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ బుక్ ఫెయిర్ తొలి అధ్యక్షుడు ఐ.జె.తల్వార్ (90) అనారోగ్య కారణాలతో బుధవారం రాత్రి తన నివాసంలో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల హైదరాబాద్ బుక్ ఫెయిర్ పూర్వ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, పూర్వ కార్యదర్శి కోయ చంద్రమోహన్ సంతాపం తెలిపారు. తొలిసారిగా 1986లో ఏర్పాటు చేసిన హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు తల్వార్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆయన సుదీర్ఘకాలం పుస్తక ప్రదర్శనలకు సేవలందించారు. గురువారం బన్సీలాల్‌పేట్ శ్మశాన వాటికలో ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు ముగిశాయి. హైదరాబాద్ బుక్ ఫెయిర్ వ్యవస్థాపకులు గోపాలరావు, పి రాజేశ్వరరావు, శృతికాంత్ భారతి తదితరులు ఒక ప్రకటనలో ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నార్సింగిలో రాష్ట్రకూటుల నంది విగ్రహం

గుర్తించిన పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి


నంది విగ్రహాన్ని పరిశీలించిన శివనాగిరెడ్డి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీలోని ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో రాష్ట్రకూటుల కాలపు నంది విగ్రహం పడి ఉందని, దాన్ని కాపాడుకోవాలని ప్రముఖ పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. గురువారం ఆయన నార్సింగి నుంచి లంగర్‌హౌస్ వెళ్లే మార్గంలో ఉన్న చిన్న ఆంజనేయస్వామి దేవాలయంలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా దేవాలయం ఆవరణలో ఎర్ర ఇసుకరాతిలో రెండు అడుగుల పొడవు, అడుగు ఎత్తు, 9 అంగుళాల మందంతో చెక్కిన నంది విగ్రహాన్ని గుర్తించారు. దాని ఒంటిపై గంటల పట్టెడలు, గంగడోలు, మూపురం, ముఖభాగం, శిల్పశైలి 9వ శతాబ్ది నాటి రాష్ట్ర కూటుల శిల్పకళకు అద్దం పడుతోందని పేర్కొన్నారు. భిన్నమైన చారిత్రక ప్రాధాన్యం ఉన్న నంది శిల్పాన్ని ఆలయ ప్రాంగణంలోనే పీఠంపై నిలబెట్టి భద్రపరచాలని ఆలయ అర్చకులు, ధర్మకర్తలకు సూచించారు.

వందల కోట్ల భూమి స్వాధీనం

దేవాలయ స్థలాల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

అత్తాపూర్: వందల కోట్ల రూపాయల విలువైన నాలుగున్నర ఎకరాల అత్తాపూర్ అనంత పద్మనాభ స్వామి దేవాలయ భూములను రంగారెడ్డి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అత్తాపూర్ జనప్రియ యూటోపియా సమీపంలో అనంత పద్మనాభ స్వామి దేవాలయానికి చెందిన భూములు ఉన్నాయి. కబ్జాదారులు వాటిని ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలలో వ్యాపారాలు చేసుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. అనంత పద్మనాభస్వామి దేవాలయ భూములను రక్షించుకోవాలనే సంకల్పంతో కొంతమంది కొన్నేళ్లుగా పోరాడుతున్నారు. దేవాలయ భూములకు క్రయవిక్రయాలు ఉండవని, ఎవరైనా కబ్జా చేస్తే, వాటిని వదిలి వెళ్లాల్సిందేనని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆదేశాల నుసారం అనంత పద్మనాభస్వామి దేవాలయానికి చెందిన నాలుగున్నర ఎకరాల్లో కబ్జా చేసినవారికి నోటీసులు జారీ చేసింది. గురువారం రంగారెడ్డి జిల్లా దేవాలయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, ఆనదపు కమిషనర్ జ్యోతి, అత్తాపూర్ పద్మనాభస్వామి దేవాలయ ఈవో శ్రీనివాస్ పర్యవేక్షణలో అక్రమ కట్టడాలను తొలగించి ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. దేవాలయా భూముల్లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని అసిస్టెంట్ కమిషనర్ హెచ్చరించారు. అత్తాపూర్, రాంబాగ్ దేవాలయ భూముల్లో అక్రమ నిర్మాణాలపై రాష్ట్ర ఉన్నత స్థానాన్ని ఆశ్రయించినట్లు చెప్పారు. తీర్పు అనుకూలంగా వస్తే, వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.


దేవాదాయ శాఖకు సంబంధించిన భూమిగా బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

17 నుంచి ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్

సాక్షి, సిటీబ్యూరో: సేవాభారతి, లయన్స్ క్లబ్ గ్రీన్‌ల్యాండ్స్, మెర్సీ మిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 30 తేదీ వరకు ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సేవా భారతి ట్రస్ట్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మానసిక, శారీరక వికలాంగులకు అండగా నిలవడం, వృద్ధాశ్రమాల నిర్వహణ, చిన్న పిల్లలకు గుండె శస్త్రచికిత్సలు, పాఠశాలలను దత్తత తీసుకోవడం, అనాథ శరణాలయాలకు అండగా నిలవడం, ప్లాస్టిక్ సర్జరీలు, నేత్ర పరీక్షలు చేపట్టడం, అవసరమైన వారికి చికిత్సలు అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తామన్నారు. తెల్ల రేషన్ కార్డు తీసుకుని హాజరు కావాలని సూచించారు. వివరాలకు 98482 41640, 99086 30301 నెంబర్లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. సేవా భారతి ఎల్‌సీహెచ్ గ్రీన్‌ల్యాండ్స్ డాక్టర్ ఈశ్వరచంద్ర హాస్పిటల్ సీతారాంబాగ్ ఓల్డ్, మల్లేపల్లి హైదరాబాద్‌లో ఉచిత ప్లాస్టిక్ సర్జరీలు చేస్తారని తెలిపారు.

కోట శ్రీనివాసరావు విలక్షణ నటుడు


కోటకు పురస్కారం అందజేస్తున్న బాబూ మోహన్

ఫిలింనగర్: సినీరంగంలో ఎన్నో పాత్రలు పోషించిన కోటా శ్రీనివాసరావు విలక్షణమైన నటుడని సినీనటుడు బాబూ మోహన్ అన్నారు. ఫిలిం ఎనలిటికల్ అండ్ అప్రిసియేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఫిలిం ఛాంబర్‌లో అక్కినేని సెంటినరీ ఫిలిం అవార్డుల బహూకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జీవన సాఫల్య పురస్కారాన్ని కోట శ్రీనివాసరావుకు అందజేశారు. నాలుగు దశాబ్దాల సినీజీవిత అవార్డుల కేటగిరీలో ప్రముఖ సినీ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజకు, రజతోత్సవ సినీ జీవిత పురస్కారాన్ని తుమ్మలపల్లి సత్యనారాయణ, సినీనటి కవితలకు అవార్డులను అందజేశారు. అక్కినేని ఎక్సలెన్సీ అవార్డులను సినీనటులు అశోక్ కుమార్, డబ్బింగ్ కళాకారుడు ఆర్‌సీఎం రాజు, ఘంటసాల సినీ పాటల గాయకుడు డీపీ మిత్ర, వంశీ ఆర్ట్స్ థియేటర్ శిరోమణి వంశీ రామరాజులకు అందజేశారు. కోట శ్రీనివాసరావుకు జీవిత సాఫల్య పురస్కారం అందజేయడం ఆనందంగా ఉందని సొసైటీ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ధర్మారావు అన్నారు. అక్కినేని నాగేశ్వరరావు మీద అభిమానంతో ఈ అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దర్శకుడు రేలంగి నరసింహారావు, డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పది భాషల్లో 'అనంత్ డిజైన్' పరీక్ష

సాక్షి, సిటీబ్యూరో: ఇంటీరియర్ తదితర డిజైనింగ్ విద్యార్థుల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష, అనంత్ డిజైన్ ఎంట్రన్స్ అండ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ (ఏడీపీటీ)ను 10 భాషలకు విస్తరించారు. గతంలో 5 భాషలకే పరిమితమైన ఈ పరీక్షను ఈసారి 10 వభాషల్లో నిర్వహించనున్నట్లు అనంత్ నేషనల్ యూనివర్సిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల, హిందీ, గుజరాతీ తదితర భాషలతోపాటు తెలుగులో కూడా నిర్వహించనున్నామని, ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రవేశ పరీక్ష ఈ నెల 26న జరగనుందని వివరించారు.

ఫిబ్రవరి 24న ఢిల్లీలో దివ్యాంగుల ధర్నా

డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని


మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: దివ్యాంగుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 24వ తారీఖున ఢిల్లీలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ తెలిపారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించాలని, పెన్షన్ 10 వేల రూపాయలు ఇవ్వాలని, చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. రాష్ట్రం నుంచి సుమారు రెండు వేల మంది దివ్యాంగులు, బధిరులు మహాధర్నాకు తరలనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం కార్యదర్శి వి.భారతి, ఉపాధ్యక్షుడు కె.వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాలా సమస్యకు శాశ్వత పరిష్కారం

మేయర్ విజయలక్ష్మి


స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న మేయర్ విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్

బౌద్ధనగర్: దీర్ఘకాలికంగా నెలకొని ఉన్న సమస్యలను పూర్తిస్థాయిఓ పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. బౌద్ధనగర్ డివిజన్‌లోని సెయింట్ ఆల్బన్ స్కూల్ నుంచి అంబర్‌నగర్ ఏకశిల మెడికల్ హాల్ వరకు రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్, డిప్యూటీ మేయర్ శ్రీలతా రెడ్డి, కార్పొరేటర్ కంది శైలజ, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్, జీహెచ్‌ఎంసీ జెడ్‌సీ రవికిరణ్‌లతో కలిసి గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, నాలాల చుట్టుపక్కల రక్షణ గోడ లే ప్రమాదకరంగా మారాయని స్థానికులు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. నగరాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉన్నామని చెప్పారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని అంబర్ నగర్ నాలా చుట్టూ రక్షణ గోడ లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సంక్రాంతి పండుగ అనంతరం ఈ నెల 18న పలు రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. పాదయాత్రలో జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డీసీ సుభాష్‌రావు, కాంగ్రెస్ నాయకులు ఆదం సృజన్, అనిల్ కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ఇలాగేనా..?


భోలక్‌పూర్‌లో పర్యటిస్తున్న మేయర్ విజయలక్ష్మి, ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: పరిసరాల పరిశుభ్రత ఇలాగేనా.... చెట్ల కొమ్మలకు విద్యుత్ తీగలు ఆనుకొని ఉన్నా తొలగించరా... విద్యుత్ దీపాల నిర్వహణ ఇలాగేనా... రోడ్లపై డ్రైనేజీ మ్యాన్‌హోల్ కవర్లు ప్రమాదకరంగా మారినా మరమ్మతులు చేపట్టరా? అని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులపై ప్రశ్నల పరంపర కురిపించారు. నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం భోలక్‌పూర్‌లో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, డివిజన్ కార్పొరేటర్ గౌసుద్దీన్‌తో కలిసి మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ఎం.శ్రీలతాశోభన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి భోలక్‌పూర్‌లో నెలకొన్న సమస్యలను చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రూ.1.50 కోట్లతో రోడ్లను ఆధునీకరిస్తాం

స్టాండింగ్ కమిటీ సమావేశంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ గౌసుద్దీన్ సమస్యలపై ప్రస్తావించడంతో భోలక్‌పూర్‌లో పర్యటించామని మేయర్ తెలిపారు. అధ్వానంగా మారిన రోడ్లను విడతలవారీగా రూ.1.50 కోట్లతో ఆధునీకరిస్తామని పేర్కొన్నారు. ఎంపీ ఎం.అనిల్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. డీఎంసీ ఖదీర్, ఏఎంఓహెచ్ డాక్టర్ ప్రవీణ, ఈఈ శ్రీనివాస్, డీఈ సన్నీ, ఏఈ సు భాష్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, మాజీ కార్పొరేటర్ వాజిద్‌హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు సంగపాక వెంకట్, సురేష్‌కుమార్, జఫీరుద్దీన్ పాల్గొన్నారు.



ఇండియన్ లైఫ్‌స్టైల్ సూత్రం

సాక్షి, సిటీబ్యూరో : బంజారాహిల్స్ తాజ్‌కృష్ణ హోటల్‌లో ఈ నెల 9 నుంచి 11 వరకూ మూడు రోజుల పాటు ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు సూత్రా ఎగ్జిబిషన్ నిర్వాహకులు తెలిపారు. దేశం నలుమూలల నుంచి 100కు పైగా డిజైనర్లు అద్భుతమైన, వినూత్న ఆవిష్కరణలతో వివాహ వేడుకలకు ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. బ్రైడల్ కోచర్, ట్రెండింగ్ లెహంగా, బెస్పోక్ జ్యువెలరీ, డిజైనర్ క్లచ్‌లు, పాదరక్షలు, ప్రత్యేకమైన గృహాలంకరణ వస్తువులు ఈ ప్రదర్శనలో సందర్శించవచ్చు. ప్రముఖ డిజైనర్స్ ఇంపీరియల్ తారా జ్యువెలరీ, సోనాల్‌సింగ్, బెంగాల్ హ్యాండ్‌లూమ్ ఆర్ట్, విమ దిలీప్, రంగత్, బనారస్ కలర్స్, దీపాలి వోరా పాల్కీ, గుల్మార్ సిల్క్ వీవర్స్, శ్రీ అలేఖ్యా, గోపి జ్యువెల్స్ కోల్‌కత్తా, తపస్వి డిజైనర్స్ ముంబయి తదితరులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ప్రదర్శన ఉంటుంది.



అలరించిన గురువందనం

గన్‌ఫౌండ్రీ : అరణ్య నాట్యం నృత్య అకాడమీ ఆధ్వర్యంలో గురువందన పేరిట రవీంద్రభారతిలో గురువారం నిర్వహించిన భరతనాట్య నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. నాట్య గురువు ఎస్‌వీఎస్ సమతారావు ఆధ్వర్యంలో గణేష పంచరత్నం, దేవిస్తుతి, హనుమాన్ చాలీసా వంటి అంశాలపై 50 మంది విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మంజుల రామస్వామి మాట్లాడుతూ.. నేటి తరానికి శాస్త్రీయ సంగీత కళలను నేర్పించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. 900లకు పైగా ప్రదర్శనలు చేసినటువంటి నాట్య గురువు సమతారావు నుంచి నేటి తరానికి స్ఫూర్తి అని కొనియాడారు. అనంతరం నాట్యగురువు, కళాకారులను అభినందించారు. సినీ నటుడు వాసుదేవరావు, కొరియోగ్రఫర్ ఉదయ్, డైరెక్టర్ విజయ్ పాల్గొన్నారు.

నగరంలో మొదటిసారి..
మిస్, మిస్సెస్, మిస్టర్ ఇండియా పోటీలు



పంజగుట్ట: నగరంలో మొదటిసారి గ్లోరియస్ మిస్, మిస్సెస్, రాయల్ మిస్టర్ ఇండియా పోటీలు నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ మాజీ జాతీయ అధ్యక్షుడు జై కుమార్ అగర్వాల్ తెలిపారు. పోటీల కరపత్రాన్ని జూనియర్ చాంబర్ ఆఫ్ ఇండియా (జేసీఐ) సికింద్రాబాద్, ప్యారడైజ్ అధ్యక్షురాలు సబీనా మండూరి, షిమ్మిరింగ్ స్టార్‌లైట్ సంస్థ డైరెక్టర్‌లు స్నేహల్, క్రాంతికుమార్ కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ పోటీలు షిమ్మిరింగ్ స్టార్‌లైఫ్, జేసీఐ సికింద్రాబాద్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి తాము మొదట ఆన్‌లైన్, తరువాత ఆఫ్‌లైన్‌లో శిక్షణ ఇచ్చి ఏప్రిల్ నెల చివరి వారంలో సోమాజిగూడ పార్క్ హోటల్‌లో జరిగే పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. పోటీలద్వారా వచ్చిన నిధుల్లో కొంత మొత్తాన్ని ముంబయికి చెందిన ఉమంగ్ ఫౌండేషన్ ద్వారా పేదపిల్లల చదువుకు ఉపయోగిస్తామని తెలిపారు.



ఎగిరే ఎగిరే..ఎగిరే ఎగిరే..
చూపే ఎగిరెనే చీకటి ఎరుగని దారిలో..
పాదం ఎగిరెనే భయమే తెలియని బాటలో..
ప్రాయం ఎగిరెనే పరిచయమవ్వని త్రోవలో..
ఫ్లై.. హై.. ఇన్ ది స్కై..
ఎగిరే ఎగిరే పైకెగిరే..
కలలే అలలై పైకెగిరే..
పలుకే స్వరమై పైకెగిరే..

ప్రతి అడుగు స్వేచ్ఛ కోరగా.. అని చంద్రబోస్ రచించినట్లు.. నగరంలో పతంగుల పండగ షురూ అయ్యింది. ఎక్కడ చూసినా ఆకాశంలో పతంగుల సందడి కినిపిస్తోంది. దీంతో నగరంలోని పాతబస్తీలో పతంగుల విక్రయాలు జోరందుకున్నాయి. ఈ సందర్భంగా విభిన్న రకాల పతంగులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. దీంతోపాటు రిమోట్ కంట్రోల్‌తో ఆపరేట్ చేసే చెరక్‌లు అందుబాటులో ఉన్నాయి. యువకులు కూడా టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నారు. చైనా మాంజాల నిషేధంతో వాటి స్థానంలో దేశీయ మాంజానే కొనేందుకు యువత ఆసక్తి చూపిస్తున్నారు. కొనుగోలు దారులతో దుకాణాలు సందడిగా మారాయి. పతంగుల్లో కూడా రక రకాల మోడళ్లు, పలువురు హీరోల ఫొటోలతో చేసిన పతంగులు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో దీనిపై ఓ ప్రత్యేక కథనం.. - చార్మినార్

ఎగిరే.. పైకెగిరే..

నగరంలో పతంగుల పండగ సందడి

- ఆకట్టుకుంటున్న సినీ నటుల పతంగులు
- పాతబస్తీలో జోరందుకున్న విక్రయాలు
- ఈసారి కొత్తగా మార్కెట్లోకి రిమోట్ చెరక్‌లు
- టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్న యువకులు
- చైనా మాంజాలకు బదులుగా దేశీయ మాంజా
- కొనుగోలుదారులతో సందడిగా దుకాణాలు



పతంగుల పండగొచ్చిందంటే చాలు.. చిన్నారుల నుంచి మొదలుకుని యువకుల వరకూ ఎంతో సంబరపడతారు. సెలవులొస్తే చాలు.. రోజంతా వాటి వెంటే ఉంటారు. మరీ ముఖ్యంగా సంక్రాంతి పండుగ దగ్గర పడుతుండడంతో నగరంలో పతంగుల విక్రయాలు జోరందుకున్నాయి. పాతబస్తీలోని గుల్జార్ హౌజ్, కాలికమాన్, డబీర్‌పురా, యాకుత్‌పురా, ధూల్‌పేట్, పురానాపూల్, మంగళ్‌హాట్, సికింద్రాబాద్, చిలకలగూడ, ముషీరాబాద్, అబిడ్స్ వంటి ప్రాంతాల్లో పతంగుల దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. వీటితోపాటు మాంజాలకూ గిరాకీ పెరిగింది. చైనా మాంజా నిషేధంతో దేశీయ మాంజాలకు గిరాకీ పెరిగింది. పతంగులను ఎగరవేయడానికి చెరక్‌లను వినియోగిస్తారు. దీనికి ముందు వరుసలో మాంజాను తదుపరి తెల్లటి దారాన్ని వినియోగిస్తారు.

మార్కెట్లో చిట్టి పతంగులు..



సంక్రాంతిని పురస్కరించుకుని కొంత మంది పండగ శుభాకాంక్షలను వెరైటీగా చెప్పడం ఆనవాయితీగా వస్తోంది. బంధుమిత్రులకు చిట్టి పతంగులను గిఫ్ట్‌గా అందజేస్తున్నారు. ఇందుకోసం మార్కెట్లో రంగు రంగుల చిట్టి పతంగులూ అందుబాటులో ఉన్నాయి.

మార్కెట్లోకి రిమోట్ చెరక్..



పతంగులను కంట్రోల్ చేయడానికి దేశంలోనే మొట్టమొదటి సారి రిమోట్ చెరక్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటి వరకూ పతంగులను ఎగరేయడానికి ఒకరు చెరక్ పట్టుకుంటే.. ఇంకొకరు పతంగులను ఎగరవేసేవారు. ఈసారి అలాంటి పరిస్థితి లేదు. రిమోట్ చెరక్‌లు మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఒక్కరే ఎంచక్కా పతంగులను రిమోట్ చెరక్‌తో ఎగరవేయవచ్చు. ఈ రిమోట్ చెరక్ ఖరీదు రూ.2100 నుంచి రూ.3000 వరకూ ఉంది. దీంతోపాటు 2500 మీటర్ల దేశీయ మాంజా ఉచితంగా లభిస్తుందని బజాజ్ పతంగ్ మహల్ యజమాని వేణుగోపాల్ బజాజ్ తెలిపారు.



వేళ్ల రక్షణకు ఫింగర్ సేవర్..

పతంగులు ఎగరవేసేటప్పుడు మాంజాతో చేతి వేళ్లు గాయాలకు గురవుతుంటాయి. దీనిని నివారించేందుకు కొత్తగా మార్కెట్‌లోకి ఫింగర్ సేవర్‌లు అందుబాటులోకి వచ్చాయి. ప్రమాదవశాత్తూ మాంజాలు కోసుకుపోయి చేతి వేళ్లు తెగిపోతున్న సందర్భాలు గతంలో ఎన్నో ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని కొత్తగా ఫింగర్ సేవర్‌లను రూపొందించారు అమ్మకందారులు. వీటి వినియోగంతో దారంతో పాటు మాంజాలతో కలిగే గాయాల నుంచి విముక్తి కలుగుతుందని పతంగుల విక్రయదారులు చెబుతున్నారు.

22న మార్కెట్లోకి గెలాక్సీ ఏఐ ఫోన్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ మొబైల్ తయారీ బ్రాండ్ శామ్‌సంగ్ గెలాక్సీ ఏఐ మొబైల్ ఫోన్‌ను రూపొందించింది. ఈ మొబైల్ ఫోన్‌ను ఈ నెల 22న మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు శామ్‌సంగ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కొత్త గెలాక్సీ ఎస్ సిరీస్ అత్యాధునిక సాంకేతిక ఫీచర్లతోనూ, మరీ ముఖ్యంగా ఏఐ సంబంధిత విప్లవాత్మక ఆవిష్కరణలతో అందుబాటులోకి రానుందని, ఈ కొత్త ఫోన్ ఆవిష్కరణ కార్యక్రమం తమ న్యూస్‌రూమ్ ఇండియాతో పాటు తమ యూట్యూబ్ ఛానెల్‌లో ప్రసారం కానుందని వివరించారు.



పతంగులు తప్పనిసరి..

ఏడాదికోసారి తప్పనిసరిగా పతంగులు ఎగురవేస్తా. ముఖ్యంగా సంక్రాంతి రోజు పొద్దస్తమానం బిల్డింగ్ పైనే ఎంజాయ్ చేస్తాం. ఆ రోజు ఎక్కడికీ వెళ్లను.

– ప్రభు, బోయిగూడ

టాలీవుడ్ హీరోల పతంగులు..



గేమ్ చేంజర్, పుష్ప–2, గుంటూరు కారం, కల్కి.. ఇలా తెలుగు సినీ నటుల చిత్రాల పేర్లు, నటులతో కూడిన పతంగులు ఆకట్టుకుంటున్నాయి. హీరో మహేష్‌బాబు, రామ్ చరణ్, అల్లు అర్జున్, ప్రభాస్ తదితర పతంగులకు ఆదరణ ఎక్కువగా ఉంది.

చైనా మాంజా వద్దు..



నిషేధిత చైనా మాంజా వద్దు. దేశీయ మాంజా ఎంతో బాగుంది. అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. మేమంతా దేశీయ మాంజాలనే వినియోగిస్తున్నాం.

– పంకజ్‌కుమార్ అగర్వాల్, రికాబ్‌గంజ్

దేశీయ మాంజాకే మొగ్గు..

ఎగిరే గాలిపటానికి దారమే ఆధారం. ఎదుటి వారి పతంగులను కట్ చేయడానికి మాంజానే కీలకం. అయితే ఇటీవల జరిగిన పలు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని చైనా మాంజాను నిషేధించారు. దీంతో దేశీయ మాంజానే వాడేందుకు యువత ఆసక్తి చూపిస్తున్నారు.

పిల్లల కోసం..



నేను ఆటోరిక్షా నడుపుతాను. పిల్లలు సంక్రాంతి సెలవుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ పతంగులతో ఉంటారు. ఆటో తీసుకుని నగరానికి వచ్చినప్పుడు ఇలా వారి కోసం పతంగులు తీసుకెళతాను.

– యాదగిరి, ఇబ్రహీంపట్నం





కిడ్స్ జోన్..

- ✦ హోటల్స్, రెస్టారెంట్, ఫంక్షన్ హాల్స్, ఆస్పత్రుల్లో ఉచితం
- ✦ ప్రైవేటుగానూ పిల్లల గేమింగ్ కేంద్రాలు
- ✦ నగరంలో పెరుగుతున్న కిడ్స్ జోన్

సాక్షి, సిటీబ్యూరో: కుటుంబ సభ్యులు హోటల్‌కు వెళ్లి హాయిగా భోజనం చేసి వద్దామన్నా, ఆస్పత్రిలో వివిధ రకాల పరీక్షలు, చికిత్సలు చేయించుకుని రావాలన్నా, సినిమా, షాపింగ్‌కు, షాపింగ్ మాల్స్‌కు వెళ్లినా ఎక్కడైనా చిన్న పిల్లలు ఆడుకునే ప్రత్యేక ఆటస్థలాలు తప్పనిసరి ఐపోయింది. చిన్నపిల్లలు సహజంగా అల్లరి చేస్తారు. పెద్దల పనులకు ఇవి ఆటంకం కలిగిస్తాయి. అందుకు ఎక్కడికైనా పిల్లలను తీసుకుని వెళ్లాలంటే తల్లిదండ్రులు ఒకటికి రెండు దఫాలు ఆలోచించాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇంట్లో విడిచిపెట్టి పోదామంటే ఎక్కడ ఏడుస్తారో అని భయం. పెద్దవారు ఎవరైనా ఉంటే వాళ్లకు అప్పగించి వెళ్లడానికి.. వాళ్ల దగ్గర ఉంటారో.. ఉండరో అని అనుమానం. అల్లరి చేస్తే ఏం చేయాలనే తర్జనభర్జనలు ప్రతి తల్లిదండ్రి మదిలో మెదులుతున్నాయి. ఇటువంటి కుటుంబాల కోసం ఇటీవల నగరంలో కొత్త ట్రెండ్ మొదలైంది. హోటల్స్, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లలో, ఇతర ప్రాంగణంలో ఉచితంగా చిన్నపిల్లలు ఆడుకునేందుకు కిడ్స్ జోన్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఆట వస్తువులను అందుబాటులో ఉంచుతున్నాయి. అక్కడ ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. మరికొన్ని సంస్థలు ప్రత్యేకించి వ్యాపార కోణంలోనూ కిడ్స్ జోన్స్‌ను ఏర్పాటు చేస్తున్నాయి.

గంటకు రూ.500 నుంచి..

భాగ్యనగరం కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతోంది. అపార్ట్‌మెట్ కల్చర్‌కు ప్రజలు ఆకర్షితులవుతున్నారు. కాలనీల్లో క్రీడా ప్రాంగణాలకు స్థలం లేకుండా పోతోంది. ఉన్న కొద్దిపాటి పార్కుల్లో ఆశించిన మేరకు చిన్న పిల్లలకు క్రీడా పరికరాలు అందుబాటులో ఉండటంలేదు. కొన్ని చోట్ల ఉయ్యాల, జారుడుబల్లతో సరిపెట్టేస్తున్నారు. దీంతో ప్రైవేటు కిడ్స్ ప్లే జోన్లపై తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు. గంటకి సుమారు రూ.500 వరకూ చెల్లిస్తున్నారు. మరికొన్ని షాపింగ్ మాల్స్‌లో పిల్లల కోసం ప్రత్యేకించి విద్యుత్తుతో నడిచే రైలు, మోటారు సైకిల్, కార్‌లను అందుబాటులో ఉంచుతున్నారు. పిల్లలు కూర్చున్నాక వీటిని రిమోట్‌తో మరో వ్యక్తి నడిపిస్తుంటాడు. రెండు, మూడు రౌండ్లు తిప్పడానికి రూ.100 తీసుకుంటున్నారు. ఆపై వీడియో గేమ్స్, బాల్స్ రూం, మరికొన్ని రకాల ఆటల కోసం అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

ఆ పేరు చెబితే అల్లరి ఆపేస్తాడు..



మాకు రెండున్నరేళ్ల బాబు ఉన్నాడు. ఇంట్లో అల్లరి చేస్తుంటాడు. ఉద్యోగం, ఫ్యామిలీ లైఫ్‌ను బ్యాలెన్స్ చేసుకుంటాం. ప్రత్యేకించి బాబు కోసం నెలలో కనీసం రెండు దఫాలైనా గచ్చిబౌలి ఏఎంబీ మాల్‌కు తీసుకెళతాము. అక్కడ ఉల్లాసంగా ఆడుకుంటారు. ఇంటికి వచ్చిన వెంటనే గాఢంగా నిద్రపోతాడు. కిడ్స్ జోన్‌కు తీసుకెళతామని చెబితే చాలు అల్లరి చేయడం ఆపేస్తాడు. మాట వింటాడు.

– రమణారెడ్డి, అర్జున్‌రెడ్డి తండ్రి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, మణికొండ



బంజారాహిల్స్‌లో.. సిలాయియా వస్త్ర ప్రదర్శన..

సాక్షి, సిటీబ్యూరో: చేనేత కళాకారులకు చేయూతని అందించే ఉద్దేశ్యంతో సిలాయియా వస్త్ర ప్రదర్శన బంజారాహిల్స్‌లోని గఫార్‌ఖాన్ కాలనీలో ఉన్న లేబుల్స్ ది పాప్ అప్ స్పేస్‌లో ఏర్పాటైంది. ఈ ప్రదర్శనను నగరానికి చెందిన హస్తకళా ఆర్టిజన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీదేవి విజయదాస్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేతలు, హస్తకళలకు మన దేశం పట్టుకొమ్మ అనీ, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. తొలుత నగరంలో ఆ తర్వాత దేశంలోని ప్రతి ఇంట్లో కనీసం ఒక్కరైనా చేనత వస్త్రాల అభిమాని ఉండేలా చేయడమే తమ లక్ష్యం అన్నారు. ఈ ప్రదర్శనలో బనారస్, కంచి పట్టు, పెన్ కళంకారి, జామ్‌దాని, మట్కా చీరలు.. వంటివి కొలువుదీరిన ఈ ప్రదర్శన మూడు రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు.

వస్త్ర దుకాణాలపై జీఎస్టీ దాడులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు ప్రముఖ వస్త్ర దుకాణాలపై వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అధికారులు దాడులు నిర్వహించారు. నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా పెద్ద ఎత్తున వస్త్ర నిల్వలు తెచ్చిన వ్యాపార సంస్థలు ఆ మేరకు జీఎస్టీ చెల్లించలేదన్న సమాచారంతో ప్రత్యేక కమిషనర్ నిఖిల్ చక్రవర్తి ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఈ దాడులు జరిపినట్టు తెలుస్తోంది. మూడ్రోజులుగా జరుగుతున్న ఈ దాడుల్లో ప్రముఖ వస్త్ర దుకాణాలన్నింటినీ 25 బృందాలతో కూడిన జీఎస్టీ అధికారులు తనిఖీ చేశారని సమాచారం. ఈ తనిఖీల్లో భాగంగా వస్త్ర దుకాణాల్లో నిల్వ ఉన్న సరుకు, జీఎస్టీ చెల్లింపులకు మధ్య పెద్ద ఎత్తున తేడాలున్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్టు తెలిసింది.

'అతివ'కు హైదరాబాద్ భేష్



- మహిళలకు భద్రత, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగావకాశాల్లో టాప్ 5లో హైదరాబాద్
- 120 నగరాల్లో జాతీయ సర్వే చేపట్టిన అవతార్ గ్రూప్
- దేశీయంగా భద్రత, సంరక్షణలో దక్షిణాది బెస్ట్
- ఉత్తమ నగరాలుగా బెంగళూరు, చెన్నై, ముంబై, హైదరాబాద్, పుణె

సాక్షి, హైదరాబాద్: మహిళలకు భద్రత, నైపుణ్యాలు, ఉద్యోగావకాశాలతో పాటు ఇతర ప్రామాణిక అంశాల్లో దేశవ్యాప్తంగా అత్యుత్తమ 5 నగరాల్లో హైదరాబాద్ నగరం ఒకటిగా నిలిచింది. దేశవ్యాప్తంగా 120 నగరాల్లో అవతార్ గ్రూప్ చేపట్టిన సర్వేలో 2024 సంవత్సరానికి హైదరాబాద్ 4వ స్థానంలో ఉండగా.. ఈ టాప్ 5 (బెంగళూరు, చెన్నై, ముంబై, హైదరాబాద్, పుణె) నగరాల్లో 3 దక్షిణాది నుంచే ఉండటం విశేషం. ఇందులో బెంగళూరు మొదటి స్థానంలో నిలిచింది. అవతార్ గ్రూప్ నిర్వహించిన 'టాప్ సిటీస్ ఫర్ ఉమెన్ ఇన్ ఇండియా–2024' (టీసీడబ్ల్యూఐ) ఇండెక్స్ సర్వేను బుధవారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ సౌందర్య రాజేశ్ వెల్లడించారు. ఈ ఇండెక్స్ సెంటర్ ఫర్ మానిటరింగ్ ది ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ), వరల్డ్ బ్యాంక్, క్రైమ్ రికార్డ్స్, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే వంటి వివిధ డేటా వనరుల ఆధారంగా తయారు చేశారు.

మౌలిక సదుపాయాలు, టెక్ జాబ్స్ భేష్...

120 నగరాల్లో సర్వే చేపట్టగా, మౌలిక సదుపాయాల కల్పనలో 8.01 పాయింట్లతో హైదరాబాద్ అత్యధిక స్కోర్‌ను సాధించింది. మెరుగైన పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, ప్రయాణ సౌకర్యాలలోనూ ఆదర్శ నగరంగా నిలిచింది. ముఖ్యంగా మహిళ భద్రత కోసం షీ టీమ్స్, మెట్రో రైలు ప్రధానాంశాలుగా నిలిచాయి. టెక్నాలజీ రంగంలో మహిళలు అత్యధిక ఉద్యోగాలు పొందిన నగరాల జాబితాలో హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచింది. భద్రతలో 6.95 పాయింట్ల తో 2వ స్థానంలో ఉంది. నైపుణ్యం, ఉపాధిలో 6.95 పాయింట్లతో 5వ స్థానంలో నిలువగా... ఈ వరుసలో ముంబై, బెంగళూరు, గురుగ్రామ్ ముందంజలో ఉన్నాయి. మొత్తంగా మహిళలకు అత్యుత్తమ నగరాల్లో దక్షిణాది రాష్ట్రాలు భేష్ అనిపించుకున్నాయి.

హక్కులు, సమానత్వం అందాలి



అవతార్ గ్రూప్ ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా ఈ సర్వే నిర్వహిస్తున్నాం. అభివృద్ధి చెందుతున్న నగరాల్లో మహిళలకు రక్షణ, ఆరోగ్యం, వారు చేసే ఉద్యోగాల్లో సురక్షిత వాతావరణం, జీవన నాణ్యత తదితర అంశాలు ప్రధానమైనవి. 2047 వరకు వికసిత్ భారత్‌గా నిర్మించుకోవడంలో మహిళల హక్కులు, సమానత్వం కీలకం.

– డాక్టర్ సౌందర్య రాజేశ్, అవతార్ గ్రూప్ అధ్యక్షురాలు

దేవదేవా.. ఏమిటీ విషాదం!

ప్రభుత్వ నిర్లక్ష్యానికి శ్రీవారి బంధువుల దుర్మరణం
విషాదంలో మృతుల కుటుంబాలు
ఓ కుటుంబంలో పిల్లలకు దూరమైన తల్లి
లక్ష్మీ కళ తప్పిన మరో కుటుంబం
కుమారుడికి ఉద్యోగం వచ్చే సమయంలో మరో తల్లి

వైకుంఠ ఏకాదశికి ఉత్తర ద్వారం గుండా వెళ్లి దేవదేవుని దర్శనం చేసుకుంటే జీవిత కాలం ఆ తాదాత్మ్యంలో, భగవంతుడు మోక్ష ప్రాప్తి కలిగిస్తాడన్న ఆనందంలో గడిపేయొచ్చు. ఇదే విశ్వాసంతో లక్షలాది భక్తులు వైకుంఠ ఏకాదశికి తిరుమలేశుని దర్శించుకోవాలని తలిచారు. కానీ, ప్రభుత్వం, టీటీడీ నిర్లక్ష్య ధోరణి వల్ల దేవదేవుని దర్శనం కాకుండానే, ఆ ఆనందాన్ని పొందకుండానే ఆరుగురు ప్రాణాలొదిలారు. దేవుడిని దర్శించుకొని వస్తామని ఇంటి నుండి వెళ్లిన వారు విగతజీవులై వస్తున్నారన్న వార్త వారి కుటుంబాలకు శరాఘాతంలా తగిలింది. ఓ కుటుంబంలో పిల్లలకు తల్లి దూరమైంది. మరో కుటుంబంలో లక్ష్మీ కళ తప్పింది. మరో ఇంట్లో కుమారుడి క్షేమం కోసం నిత్యం పూజలు చేసే తల్లే దూరమైంది. ఇంకొక ఇంటి పెద్ద కానరాని దూరాలకు వెళ్లిపోయాడు..

– సీతంపేట, మద్దిలపాలెం, కంచరపాలెం (విశాఖపట్నం), నర్సీపట్నం

అమ్మ చనిపోయిందని పిల్లలకు ఎలా చెప్పాలి?



రోదిస్తున్న లావణ్య భర్త సతీష్

'తిరుపతి వేంకటేశ్వరస్వామి వైకుంఠ ద్వార దర్శనం ఒక్కసారైనా చేసుకుంటానని అనడంతో కాదనలేకపోయాను. కానీ, ఇలా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోతుందని కలలో కూడా ఊహించలేదు. మా అక్క, మరో ముగ్గురు బంధువులతో కలిసి ఈ నెల 5న తిరుపతికి బయల్దేరింది. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో క్యూలో ఉండగా ఫోన్ చేసింది. భోజనం చేశారా? పిల్లలు ఎలా ఉన్నారు అని అడిగింది. ఫోన్‌లో గోలగా వినిపించడంతో, జనాలు ఎక్కువగా ఉన్నట్టున్నారు జాగ్రత్తగా ఉండు అని చెప్పాను. మళ్లీ ఫోన్ చేస్తానని చెప్పింది. మళ్లీ ఫోన్ చేయలేదు. గంట తర్వాత ఫోన్ చేస్తే కలవలేదు. రాత్రి 11 గంటల సమయంలో మా అక్క ఫోన్ చేసి తొక్కిసలాటలో అందరం తలో దిక్కు అయిపోయామని, అందరం కలిశాం.. కానీ లావణ్య కనిపించడంలేదని చెప్పింది. ఆస్పత్రికి వెళ్లి చూడగా లావణ్య చనిపోయి ఉందని రాత్రి 12.30 సమయంలో నాకు ఫోన్ చేసి చెప్పారు. దర్శనానికి వెళ్లిన అమ్మ తిరిగి వస్తుందని నా పిల్లలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. తల్లిని విడిచి ఒక్క క్షణం కూడా ఉండలేని పిల్లలకు మీ అమ్మ చనిపోయిందని, దేవుడి దగ్గరికి వెళ్లిపోయిందని నా నోటితో ఎలా చెప్పను' అంటూ లావణ్య భర్త సతీష్ కన్నీరుమున్నీరుగా విలపిస్తుంటే విశాఖపట్నం వెంకటేశ్వర కాలనీ ప్రజల హృదయాలు బరువెక్కాయి.



లావణ్య(ఫైల్)

విశాఖలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన సూరిశెట్టి లావణ్య తన ఆడపడుచు, మరో ముగ్గురు మహిళలతో కలిసి వైకుంఠ ద్వార దర్శనం కోసం ఈ నెల 5న తిరుమల వెళ్లారు. టోకెన్ల కోసం క్యూలో ఉండగా జరిగిన తొక్కిసలాటలో లావణ్య ప్రాణాలు కోల్పోయింది. ఆమె భర్త సతీష్ సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద పాప శ్రీలాస్య 9వ తరగతి, చిన్న పాప కీర్తి 6వ తరగతి చదువుతున్నారు. ఇద్దరూ తల్లి లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేరు. తల్లి మరణవార్తను పిల్లలకు ఎలా చెప్పాలో తెలియక సతీష్ వారిని బాజీ జంక్షన్‌లోని తన అక్క ఇంటికి పంపించేశాడు.

అమ్మ.. కాళ్లకింద నలిగిపోయింది..



విశాఖపట్నం కంచరపాలెం సమీపంలోని గాంధీనగర్‌లో కండిపిల్లి శాంతి కుటుంబం వేంకటేశ్వర స్వామి భక్తులు. ఆమె భర్త వెంకటేష్ ఆటో డ్రైవర్. కుమారుడు మహేంద్ర వరప్రసాద్ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ముగ్గురూ గోవింద మాల దీక్ష చేపట్టారు. తొమ్మిది రోజుల పాటు గోవింద నామ స్మరణతో కఠిన నియమాలు పాటిస్తూ దీక్ష చేశారు. 11వ రోజున దీక్ష విరమణ కోసం ఆ కుటుంబం తిరుపతికి వెళ్లింది. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కోసం జరిగిన తొక్కిసలాటలో శాంతి దుర్మరణం పాలయ్యారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని స్థానికులు ఆరోపించారు.

ముందు ఉన్న అమ్మ చనిపోయింది

'టోకెన్ల కోసం క్యూలో ఉండగా గేట్లు ఒక్కసారిగా తెరవడంతో తొక్కిసలాట జరిగింది. నేను, నాన్న వెనుక ఉన్నాం. ముందు ఉన్న అమ్మ తొక్కిసలాటలో మిగతావారి కాళ్ల కింద నలిగిపోయింది' అని ఆమె కుమారుడు కండిపిల్లి వరప్రసాద్ రోదిస్తూ జరిగిన సంఘటనను వివరించాడు.

నా కూతురిని పొట్టన పెట్టుకున్నారు



తిరుపతి దర్శనానికి వెళ్లిన నా కూతురు శాంతిని ప్రభుత్వమే పొట్టన పెట్టుకుంది. వైకుంఠ ఏకాదశికి లక్షల్లో భక్తులు వస్తారని తెలిసినా, దేవస్థానం అధికారులు, ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా భక్తుల మరణానికి కారణమయ్యారు. నా కడుపు కోత నాయకులకు శాపంగా మారాలి.

– కిల్లాడి అప్పల నరసమ్మ, శాంతి తల్లి

మా కుటుంబాన్ని బాగా నడిపించేది



మా కోడలు శాంతి మరణవార్త వినగానే మా ప్రాణాలు పోయినట్టు అయ్యింది. ఆమె అందరినీ కలుపుకొంటూ కుటుంబాన్ని నడిపేది. గ్రామంలో, చుట్టుపక్కల ఇళ్లలో, బంధువులతో కలుపుగోలుగా ఉండేది. మమ్మల్ని బాగా చూసుకునేది.

– కండిపిల్లి అప్పారావు, శాంతి మామయ్య

కుమారుడి ఉన్నతి కోసం పరితపించి..



విశాఖపట్నం మద్దిలపాలెం రామాలయం సమీపంలో నివసించే ఆటో డ్రైవర్ గుడ్ల లక్ష్మారెడ్డి, రజనీ (47) దంపతులకు ఒక్కడే కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి. ఎంతో కష్టపడి అతన్ని బాగా చదివించారు. రెండేళ్ల క్రితం ఎంఎస్ చదువు కోసం అమెరికా పంపించారు. ప్రతి శనివారం ఆమె స్వామిని ప్రత్యేకంగా ఆరాధించేది. కుమారుడికి మంచి ఉద్యోగం రావాలని కోరుకునేది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా నిత్యం ఆరాధించే వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి లక్ష్మారెడ్డి దంపతులు, బంధువులు పది మంది తిరుపతి వెళ్లారు. వారంతా ఉత్తర ద్వార దర్శనం టోకెన్ల కోసం క్యూలో నిలబడ్డారు. ఆ సమయంలో జరిగిన తోపులాటలో రజనీ ప్రాణాలు కోల్పోయింది. కుమారుడి చదువు పూర్తయి, ఉద్యోగం వచ్చే సమయంలోనే రజని మరణించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. తల్లి ఇక లేదన్న వార్త విని హర్షవర్ధన్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. అతను శుక్రవారం అమెరికా నుంచి విశాఖపట్నం చేరుకుంటాడని రజని బంధువులు తెలిపారు.

ఆ ఇల్లే దేవాలయం



గుడ్ల రజని పరమ భక్తురాలు. నిత్యం భగవత్ ఆరాధనలో గడిపేది. ఆమె ఇంట్లో ఎక్కడ చూసినా దేవుని చిత్రపటాలే కనిపిస్తాయి. ఆమె ఇల్లే ఓ దేవాలయం. కుమారుడి భవిష్యత్తు కోసం వేంకటేశ్వరస్వామికి నిత్యం పూజలు చేసేది. సాయిబాబాని ఆరాధించేది. అంతటి భక్తురాలు ఇలా అర్ధంతరంగా మరణించడంతో మేమందరం జీర్ణించుకోలేకపోతున్నాం.

– ఎం.లక్ష్మి, మద్దిలపాలెం

వెళ్లిపోయిన పెద్ద దిక్కు..



నాయుడుబాబు

తిరుపతి తొక్కిసలాట మృతుల్లో ఒకరైన బొడ్డేటి నాయుడుబాబు నర్సీపట్నం పట్టణంలోని పెదబొడ్డేపల్లి నివాసి. బోరుబావుల నిర్మాణ కార్మికుడు. భార్య మణికుమారి, కుమార్తె సునీత ఉన్నారు. ఈ నెల 6న నాయుడుబాబు, మణికుమారి, నర్సీపట్నం మండలం చెట్టుపల్లికి చెందిన కుటుంబ స్నేహితులైన కరణం సత్యనారాయణ, అతని భార్య సంతోషి కలిసి తిరుపతి వైకుంఠ దర్శనానికి వెళ్ళారు. క్యూలో జరిగిన తొక్కిసలాటలో భార్య, భర్త తలోదారి అయ్యారు. మణికుమారిని పోలీసులు రక్షించారు. నాయుడుబాబు ఆచూకీ లభించలేదు. భర్త కోసం మణికుమారి లౌడ్ స్పీకర్‌లో చెప్పించగా, మృతుడి సెల్‌ఫోన్ నుండి పోలీసులు నాయుడుబాబు మరణించిన విషాద వార్త తెలియజేశారు.

ఏటా తిరిగి వచ్చే నాన్న ఈసారి రాలేదు



నాన్నకు వేంకటేశ్వరస్వామి అంటే ఎనలేని భక్తి. ప్రతి ఏటా వైకుంఠ ఏకాదశి దర్శనానికి వెళ్తుంటాడు. అప్పుడు కాకుండా మరో మూడు నాలుగుసార్లు దర్శనానికి వెళ్తాడు. ఈ సారి రద్దీ దృష్ట్యా వైకుంఠ ద్వార దర్శనానికి వెళ్లవద్దని చెప్పాం. ఏటా దర్శనం చేసుకొని ఆనందంగా తిరిగి వచ్చే నాన్న ఈసారి రాలేదు. మాకు నాన్నే పెద్ద దిక్కు. మా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి' అంటూ కుమార్తె సునీత రోదిస్తోంది.

– సునీత, నాయుడుబాబు కుమార్తె

నా కుడి భుజం పోయింది...



నా కుడి భుజం పోయింది. నాకు అన్ని విషయాల్లో నా సోదరుడు అండగా ఉండేవాడు. స్వామి సన్నిధిలో ఇలా జరగటం బాధాకరం. కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయాం. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

– బి.వి.రమణ, నాయుడుబాబు సోదరుడు

వరంగల్ మహా నగరంగా ఎదగాలి

- మామునూరు ఎయిర్‌పోర్టుకు ఆ విధంగా రూపకల్పన చేయాలి
- అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: వరంగల్ మహా నగరంగా ఎదిగేలా మామునూరు విమానాశ్రయానికి రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణ, ఇతర ప్రణాళికలపై గురువారం రాత్రి అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. దక్షిణ కొరియాతో పాటు పలు దేశాలు తమ పెట్టుబడులకు విమానాశ్రయాన్ని ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయని, ఆయా దేశాల పెట్టుబడులు ఆకర్షించేలా ఎయిర్‌పోర్టు ఉండాలని చెప్పారు. కొచ్చి విమానాశ్రయం అన్ని వసతులతో ఉంటుందని, దానిని పరిశీలించాలని సూచించారు. వరంగల్ ఔటర్ రింగు రోడ్డు, రేడియల్ రోడ్లు విమానాశ్రయానికి అనుసంధానంగా ఉండాలని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఖమ్మం, కరీంనగర్, నల్లగొండ జిల్లాల ప్రజలు భవిష్యత్తులో ఈ ఎయిర్‌పోర్టు నుంచే రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. టెక్స్‌టైల్స్‌తో పాటు ఐటీ, ఫార్మా, ఇతర పరిశ్రమల అభివృద్ధితో హైదరాబాద్‌ను ప్రతిబింబించేలా వరంగల్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ ఎయిర్‌పోర్టు పూర్తయితే మేడారం జాతరతో పాటు లక్నవరం, రామప్ప ఇతర పర్యాటక ప్రదేశాలకు వచ్చే ప్రజలు దానిని వినియోగించుకుంటారని అన్నారు. సమీక్షలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ మార్చికల్లా పూర్తి చేయాలి: దాన కిశోర్



సాక్షి, హైదరాబాద్: లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) కింద రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, అనుమతుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. వివాదాలు లేని పట్టా భూమిలో పట్టణాభివృద్ధి సంస్థల అనుమతులు లేకుండా వెంచర్లు చేసిన భూముల్లోని లే అవుట్లను క్రమబద్ధీకరించేందుకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. మార్చి నెలాఖరుకల్లా ఈ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో రాష్ట్రంలోని 142 పురపాలక సంఘాల కమిషనర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎల్‌ఆర్‌ఎస్, రెవెన్యూ, రెవెన్యూయేతర పన్ను వసూళ్లు, మెప్మా తదితర అంశాలను ఆయన సమీక్షించారు. అర్హత గల ప్రతి మహిళను స్వయం సహాయక సంఘంలో చేర్పించాలని ప్రభుత్వం ఎజెండాగా పెట్టుకుందని దానకిశోర్ తెలిపారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో ఉన్న పురపాలక శాఖను మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం వచ్చే 6 నెలల్లో కొత్తగా 48 మంది మున్సిపల్ కమిషనర్లను, 300 మంది టౌన్ ప్లానింగ్ అధికారులను నియమించనుందని తెలిపారు. అనంతరం పురపాలక శాఖ కేలండర్, డైరీని ఆవిష్కరించారు. పురపాలకశాఖ కమిషనర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్

వివరాలు వెల్లడించిన ఫెస్టివల్ సహ డైరెక్టర్ విజయ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ వేదికగా ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్'ఈనెల 24 నుంచి 26 వరకు జరగనుంది. దీనికి సంబంధించిన పోస్టర్ రిలీజ్ కార్యక్రమాన్ని గురువారం బేగంపేట్‌లోని ఐఏఎస్ ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ సహ డైరెక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ సారి హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌ను నగరంలోని టీ–హబ్ వేదికగా సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈసారి 15వ ఎడిషన్ ఫెస్టివల్‌లో భాగంగా పర్యావరణ పరిరక్షణపై చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు, అంతరించిపోతున్న భారతీయ భాషలపై ప్రత్యేక సదస్సులు, కవిత్వానికి సంబంధించి ప్రత్యేకంగా కావ్యధార కార్యక్రమం, మీట్ మై బుక్ పేరుతో పుస్తక ఆవిష్కరణలు, మూవింగ్ ఇమేజెస్ టాకీస్ సినిమా ప్రదర్శనలు తదితర 15 కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఇందులో షబానా ఆజ్మీ, అరుణా రాయ్, రాజ్‌దీప్ సర్దేశాయ్, సాహిత్య ప్రముఖులు రాజ్‌మోహన్ గాంధీ, కల్పన కన్నబిరాన్ పాల్గొంటారన్నారు. వరంగల్‌కు చెందిన రుత్వికా రావ్ (యూకే), ఖమ్మంకు చెందిన నిషాంత్ ఇంజం (యూఎస్) తమ రచనలు, ఆలోచనలను పంచుకోనున్నారు.

వీళ్లా 'పాలకులు'?

- పునరావాస కేంద్రంగా టీటీడీ పాలక మండలి
- అసమర్థులు.. వంది మాగధులను నియమించిన సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: తిరుమల–తిరుపతి దేవస్థానాన్ని సీఎం చంద్రబాబు పూర్తిగా రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చేశారు. అత్యంత వివాదాస్పదులు, తీవ్ర అవినీతి ఆరోపణలు ఉన్నవారికి టీటీడీ పాలక మండలిలో స్థానం కల్పించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తిరుమలలో దళారుల దందాకు తలుపులు బార్లా తెరిచారు. ఎన్నికల్లో తప్పుడు ప్రచారంతో ప్రజల్ని మభ్యపెట్టి టీడీపీకి బాకా ఊదిన టీవీ 5 చానల్ చైర్మన్ బీఆర్ నాయుడును టీటీడీ చైర్మన్‌గా నియమించడం శ్రీవారి భక్తులను నివ్వెరపరిచింది. ఇక టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి రాజ్యాంగం పట్ల గౌరవం లేదు.. దేవుడి పట్ల భక్తి లేదు. సివిల్ సర్వెంట్‌గా పాటించాల్సిన నిబంధనల పట్ల పట్టింపు లేదు. ఉన్నదల్లా కులం.. దాని నుంచి వచ్చిన బలం! అంతకు మించి ఏ కోశానా సమర్థత, నిజాయితీ, ప్రజల పట్ల బాధ్యతగా ఉండాలన్న ఇంగితం లేవు. కులం... దాని నుంచి వచ్చిన బలంతో విర్రవీగిన అదనపు వెంకయ్య చౌదరి టీటీడీని తెలుగుదేశం కార్యాలయంగా మార్చేశారు. నిరంతరం పార్టీ నాయకుల సేవలో తరిస్తూ తనకు ఉపయోగపడే వారికి ప్రత్యేక దర్శనాలు చేయిస్తూ స్వామివారి పవిత్ర ప్రాంగణాన్ని పూర్తిగా పార్టీ కేంద్రంగా మార్చివేశారు. సామాన్య భక్తులను పురుగుల్లా చూస్తూ ఇప్పుడు ఏకంగా ఆరుగురి ప్రాణాలు బలిగొనడానికి కారణమయ్యారు.

టీడీపీ కార్యకర్తలా వెంకయ్య...

నారా లోకేష్‌కు అత్యంత సన్నిహితుడైన వెంకయ్య చౌదరి టీడీపీ కార్యకర్తలా వ్యవహరిస్తూ రాజ్యాంగేతర శక్తిలా చెలరేగిపోతుంటారు. తిరుమల శ్రీవారి కన్నా స్వప్రయోజనాలే ఎక్కువ అనే తెంపరితనంతో వ్యవహరిస్తుంటారని టీటీడీ వర్గాలు చెబుతున్నాయి. కేవలం తన సామాజిక వర్గానికి చెందిన అస్మదీయ అధికారి అనే ఏకైక అర్హతతో సీఎం చంద్రబాబు ఆయన్ను అదనపు ఈవోగా నియమించారు. ఆయన్ను కలిసేందుకు ఎవరైనా వస్తే మీరు టీడీపీకి చెందిన వారా? అని తొలుత ప్రశ్నించిన తర్వాతే ఇతర విషయాలు మాట్లాడతారనేది బహిరంగ రహస్యం. టీటీడీ చైర్మన్, ఈవో, అధికారులను కనీసం పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఆయనకు చంద్రబాబు స్పష్టం చేసినట్టు సమాచారం. దాంతో వెంకయ్య చౌదరి తిరుమల క్షేత్రాన్ని ఏకంగా టీడీపీ రాజకీయ కేంద్రంగా మార్చి వేశారు.

డీఆర్‌ఐలో విధులు..

వెంకయ్య చౌదరి డీఆర్‌ఐలో పని చేసినప్పుడు పూర్తిగా టీడీపీ ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరించారనే తీవ్ర ఆరోపణలున్నాయి. అప్పట్లో టీడీపీలో ఒక వెలుగు వెలిగి రెండు సార్లు రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా వ్యవహరించి ఇప్పుడు పార్టీ మారి శాసనసభ్యుడిగా ఉంటూ... బ్యాంకులనుంచి వేల కోట్ల రూపాయల రుణం తీసుకుని తిరిగి చెల్లించకుండా కుచ్చు టోపీ పెట్టిన ఓ నాయకుడికి వెంకయ్య ప్రధాన అనుచరుడిగా మెలిగారని చెబుతారు. తన శాఖలో చేపట్టే కేసులను, సేకరించిన రహస్య సమాచారాన్ని గుట్టుగా చేరవేయడం ద్వారా టీడీ పీకి వెంకయ్య చౌదరి ప్రీతి పాత్రుడు అయ్యాడని ఆ వ్యవహారాల గురించి బాగా తెలిసిన వారు వ్యాఖ్యానిస్తుంటారు.

ఓఎస్డీగా వ్యవహారాలు..

2014 –19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వెంకయ్య చౌదరి ఓఎస్డీగా నియమితులయ్యారు.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పెద్దల అండ ఇబ్బడి ముబ్బడిగా ఉండటంతో అడిగేవారు లేరని రెచ్చిపోయిన వెంకయ్య చౌదరి కన్నూ మిన్నూ కానకుండా ప్రవర్తించారని చెబుతారు. చివరికి శాసన సభ్యులు, ఎంపీలు ముఖ్యమంత్రిని కలవడానికి వచ్చినా వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించేవారని, వెకిలిగా మాట్లాడేవాడిని, పొగరుగా సమాధానాలు ఇచ్చేవారని అంటుంటారు. ఆయన ప్రవర్తనతో నొచ్చుకున్న వారంతా మూకుమ్మడిగా ఫిర్యాదు చేయడంతో వెంకయ్య చౌదరిని ఆ స్థానం నుంచి తప్పించారన్న వ్యాఖ్యలు అప్పట్లో వినిపించాయి.

ఖనిజాభివృద్ధి శాఖ ఎండీగా..

అనంతరం వెంకయ్య చౌదరిని ఓఎస్డీ పదవి నుంచి తప్పించి ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) ఎండీగా నియమించారు. ఆ పదవిలోనూ చంద్రబాబు, తన కులస్తుల నమ్మకాన్ని వెంకయ్య చౌదరి ఏమాత్రం వమ్ము చేయలేదనే ఆరోపణలున్నాయి. టీడీపీకి చెందిన వారికి మరీ ముఖ్యంగా తన కులానికి చెందిన వ్యాపారస్తులకు లాభాలు చేకూర్చే విధంగా కాంట్రాక్టులు, లీజులు కట్టబెడుతూ పచ్చ నేతల ప్రయోజనాలకు గొడుగు పట్టి ఏపీఎండీసీని పార్టీ కార్యాలయంలా మార్చేశారు. 2019లో టీడీపీ పరాజయం అనంతరం వెంకయ్య చౌదరి అక్రమాలు, అవినీతిపై విచారణకు ప్రభుత్వం సిద్ధం కావడంతో దీన్ని పసిగట్టిన ఆయన అడ్డదారుల్లో, టీడీపీ మద్దతుదారుల సాయంతో రిలీవింగ్ లెటర్ సంపాదించుకుని కేంద్ర సర్వీసులకు పలాయనం చిత్తగించారు. చంద్రబాబు తిరిగి అధికారంలోకి రాగానే చంద్రముఖి మళ్లీ నిద్రలేచింది అన్నట్లుగా వెంకయ్య చౌదరి డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి రావడం, ఏకంగా వెంకన్న సన్నిధిలో అత్యంత కీలకమైన టీటీడీ అదనపు ఈఓ పదవిలో చేరడం జరిగిపోయాయి.

బాకా ఊదిన బీఆర్ నాయుడుకు చైర్మన్ పదవి

ఎల్లో మీడియాలో ఒకటైన టీవీ–5 చైర్మన్ బీఆర్ నాయుడు టీడీపీని స్థాపించినప్పటి నుంచి తాను ఆ పార్టీలో సభ్యుడిగా ఉన్నానని చెప్పుకుంటూ ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు అడుగులకు మడుగులొత్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద జల్లుతూ చంద్రబాబు భజన చేశారు. అందుకే చంద్రబాబు ఇప్పుడు ఆయనకు టీటీడీ చైర్మన్ పదవిని బహుమతిగా ఇచ్చారు. టీటీడీ చైర్మన్ పదవి దక్కాక బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. మాజీ సీఎం వైఎస్ జగన్‌పై నోరుపారేసుకున్నారు. జగన్ త్వరలో జైలుకెళ్లడం ఖాయమని.. చంద్రబాబు కొత్త కేసులు పెడితే జగన్ శాశ్వతంగా జైల్లో ఉండాల్సిందేనని విషం కక్కారు. టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక ఆ సంస్థ పరిపాలన వ్యవహారాల కంటే రాజకీయ వ్యవహారాలకే బీఆర్ నాయుడు పెద్దపీట వేస్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. పాలనా వ్యవహారాలను గాలికొదిలేసి టీటీడీని టీడీపీ కార్యాలయంగా మార్చేయడంవల్లే తిరుమల చరిత్రలో ఎన్నడూలేని రీతిలో ఘోరం జరిగిందని భక్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇంత దారుణం జరిగితే టీటీడీ వ్యవస్థకు ప్రధాన బాధ్యుడైన చైర్మన్ బీఆర్ నాయుడుపై సీఎం చంద్రబాబు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. నైతిక బాధ్యతగా చైర్మన్‌తో రాజీనామా చేయించలేదు.

అరెస్టు వద్దన్న ఆదేశాలు ఎత్తివేయండి

- ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌పై పోలీసుల కౌంటర్
- తొలి దశలోనే విచారణలో జోక్యం వద్దని కోరిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు అరెస్టు వద్దన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని హైకోర్టును పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక ఆధారాలతోనే కేసు నమోదు చేశామని, ప్రారంభంలోనే విచారణలో జోక్యం చేసుకోవద్దని కోరారు. బీఆర్‌ఎస్‌లో చేరాలని, లేదంటే రాజకీయాల్లో ఉండొద్దని కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్‌ను బెదిరించడంతోపాటు తీవ్ర వేధింపులకు పాల్పడ్డారంటూ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేశారు. రాజకీయకక్షతోనే తనపై చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజగుట్ట పీఎస్‌లో నమోదు చేసిన 'ట్యాపింగ్'కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో హరీశ్‌రావు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం మరోసారి విచారణ చేపట్టారు. కేసు వివరాలతో కౌంటర్‌ను పీపీ పల్లె నాగేశ్వర్‌రావు కోర్టుకు సమర్పించారు.

'ప్రజావాణి' 17కి వాయిదా

లక్డీకాపూల్ (హైదరాబాద్): రాష్ట్ర స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సంక్రాంతి పండుగ సందర్భంగా వాయిదా వేశారు. హైదరాబాద్ బేగంపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించేందుకు ప్రభుత్వం ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజావాణిని నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈనెల 14న జరగాల్సిన ప్రజావాణిని మకర సంక్రాంతి కారణంగా ఈనెల 17కి వాయిదా వేశారు. ఈ మేరకు స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


'టిట్ ఫర్ టాట్.. కన్వర్జేషన్స్ బిట్వీన్ ఎ బ్రా అండ్ ఎ బ్రీఫ్' నాటకం రిహార్సల్స్

చైతన్యం కోసం సంవాదం



'పురుషసూక్తం'..
'టిట్ ఫర్ టాట్.. కన్వర్జేషన్స్ బిట్వీన్ ఎ బ్రా అండ్ ఎ బ్రీఫ్'..
రెండు నాటకాలు.
ఇవి పురుష భావజాలంపై
నటి ఝాన్సీ రూపొందించిన సంవాదాలు.
ఆలోచనావీచికలు... మార్పుకై నివేదనలు.
ఝాన్సీ తన టీమ్‌తో రవీంద్రభారతిలో
జనవరి 12న ప్రదర్శించనున్న సందర్భంగా...

'తెలంగాణ థియేటర్ రీసెర్చ్ కౌన్సెల్ వాళ్లు 2019లో విమెన్స్ డేకి 'విమెన్ డైరెక్టర్స్ ఫెస్టివల్'ను కండక్ట్ చేస్తూ నన్ను కూడా అడిగారు ఒక నాటకం ఇస్తాం.. డైరెక్ట్ చేయమని. వాళ్లిచ్చిన నాటకం కంటే నేను నా ఐడియాలజీని నాటకంగా ప్రెజెంట్ చేస్తే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. దాన్నొక చాలెంజ్‌గా తీసుకున్నాను. నేను చదివిన, చూసిన, నేర్చుకున్న, ఏర్పర్చుకున్న దృక్పథాన్ని పేపర్ మీద పెట్టాను. అదే నా ఫస్ట్ ప్లే.. 'పురుషసూక్తం.'



జెండర్ కళ్లద్దాలతో మాస్క్యులినిటీని మనమెలా చూస్తున్నాం, దాన్నెలా పెంచి పోషిస్తున్నాం, దీనివల్ల పురుషుడు తాను మనిషి నన్న విషయాన్ని మరచిపోయి, అనవసరపు బరువు బాధ్యతలను ఎలా మోస్తున్నాడు, ఆ పురుషాధిపత్యాన్ని కాపాడటానికి మహిళ ఎలా కోటగోడగా మారిందనే అంశాల మీద సీరియస్ చర్చే ఆ నాటకం' అన్నారు ఝాన్సీ.

రవీంద్రభారతిలో తన రెండు నాటకాలను ప్రదర్శించడానికి ఒకవైపు రిహార్సల్స్ చేస్తూ మరోవైపు సాక్షి ప్రతినిధితో మాట్లాడారు.

కొత్త ఆలోచనను రేకెత్తిస్తుంది



'పురుషసూక్తం నన్ను థియేటర్ ఆర్టిస్ట్‌ని చేసింది. ఈ నాటకాన్ని మగవాడిని అర్థం చేసుకునే ప్రయత్నంగా చెప్పొచ్చు. ఆ దిశగా .. పురుషాధిపత్య భావజాలంతో కండిషనింగ్ అయి ఉన్న మొత్తం సమాజాన్నే ఆత్మవిమర్శకు గురిచేస్తుంది ఇది. ఒక్కమాటలో చెప్పాలంటే కొత్త ఆలోచనను రేకెత్తిస్తుంది! రిహార్సల్స్‌లో ఎన్నిసార్లు నన్ను నేను తరచి చూసుకున్నానో! ఇది నాకొక లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్!'

– వంశీ చాగంటి, హ్యాపీడేస్ ఫేమ్

'పురుషసూక్తం నాటకానికి 18 రోజుల్లోనే స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నాను. డైరెక్ట్ చేయడమే కాక నటించాను కూడా. అంత సీరియస్ నాటకాన్ని రెండు పాత్రలతో ఎంత వరకు మెప్పించగలను అనుకున్నా! కానీ ఆశ్చర్యం.. కె. విశ్వనాథ్ లాంటి వారి మహామహుల ప్రశంసలు అందాయి. అది నాటక రచయితగా, దర్శకురాలిగా నా ప్రయాణాన్ని ఖరారు చేసుకునేలా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. థియేటరే నా మీడియమనీ అర్థమైంది' అన్నారామె.

టిట్ ఫర్ టాట్..
కన్వర్జేషన్స్ బిట్వీన్ ఎ బ్రా అండ్ బ్రీఫ్

'కిందటేడు (2024) అక్టోబర్ 4న వరల్డ్ బ్రెస్ట్ క్యాన్సర్ డే సందర్భంగా స్త్రీల ఆరోగ్యం, పురుషుల బాధ్యత లాంటి విషయాలెన్నో చర్చకు వచ్చి.. అసలిలాంటి వాటి మీద మనమెందుకు అవసరమైనంతగా మాట్లాడట్లేదు, ఏదో ఒకటి చేయాలి అనిపించి 'టిట్ ఫర్ టాట్..' మొదలుపెట్టాను' అన్నారు ఝాన్సీ. ఇది 'పురుషసూక్తం' తర్వాత ఆమె రాసి నటించి దర్శకత్వం వహించనున్న రెండోనాటకం.

'రెండు రోజులకే ఏం రాయాలో తెలిసింది గాని మొదట సగం స్క్రిప్టే రాయగలిగాను. దానికే ఇంకొన్ని ఆలోచనలు జోడించి ఇంట్లో పిల్లలనే చేర్చి, క్లోజ్ సర్కిల్ ముందు వేసి చూపించాను. అలా వర్క్ చేసుకుంటూ నాటకం రాసుకుంటూ వచ్చాను. పార్ట్స్ పార్ట్స్‌గా రాస్తూ స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేసి ప్రదర్శించి ఫ్రెండ్స్‌కు చూపించాను. అందరికీ నచ్చింది. మెయిన్ షో ఎప్పుడని అడగడం మొదలుపెట్టారు. 'టిట్ ఫర్ టాట్ ఎ కన్వర్జేషన్ బిట్వీన్ బ్రా అండ్ బ్రీఫ్'కి కూడా మూలం పురుషాధిపత్య విషతుల్య భావజాలమే. కాకపోతే అప్రోచ్ వేరు. ఇదొక సోషల్ సెటైర్. దీనికి టార్గెట్ ఆడియన్స్ 16 ఏళ్ల నుంచి 25 ఏళ్ల వాళ్లు. వాళ్లకు అర్థమయ్యే భాషలో చెప్పాలి. అందుకే హ్యూమర్‌ని, వ్యంగ్యాన్ని ఎంచుకున్నాను. సీరియస్‌ను పండించడం తేలికే. వ్యంగ్యం చాలా కష్టం. భాష కూడా జెన్ జీ జార్గాన్స్‌తో ఉంటుంది. వాళ్ల తాలూకు మీమ్స్ ఉంటాయి. పురుషసూక్తం.. మగవాడు మీదేసుకున్న బాధ్యతల బరువు మీద ఫోకస్ చేసింది. ఇదేమో ఆ బాధ్యతలను ఇంకా వేసుకోని వాళ్లకు వేసుకోవాల్సిన అవసరం లేదని చెబుతుంది' అన్నారామె.

డిబేట్..

'రవీంద్రభారతి ప్రదర్శనలో ఈ రెండూ నాటకాలు మరింత మార్పు చేర్పులతో వస్తున్నాయి. పురుషసూక్తంలో కోరస్ యాడ్ అవుతోంది. 'టిట్ ఫర్ టాట్..' లో ట్రాన్స్ ఉమన్, ట్రాన్స్ మన్ ఇలా అన్ని వర్గాల వాళ్లు నటిస్తున్నారు. ప్రతివాళ్లు వాళ్ల వాళ్ల శరీర ధర్మాలను రిప్రెజెంట్ చేస్తూ తమ సహజమైన పాత్రలనే పోషిస్తున్నారు. అంటే ప్రకృతిలో ఇంత వైవిధ్యం ఉంటుంది.. దాన్ని మనం గౌరవించాలి.. వాళ్ల వల్నరబులిటీని అర్థం చేసుకోవాలని తెలిపే ప్రయత్నం చేస్తున్నాం.. ప్రేక్షకులకే కాదు.. అందులో నటించిన నటీనటులకు కూడా! ఇందులో మా అమ్మాయి ధన్య పరిచయం అవుతోంది. నాటకాల ప్రదర్శన తర్వాత ఓపెన్ డిబేట్ ఉంటుంది' అన్నారామె.

రంగయాత్ర..

సామాజిక చైతన్యాన్ని తీసుకురావడంలో నాటకానిదే ప్రధాన పాత్ర మొదటి నుంచీ! ఆ బాధ్యతను కొనసాగించాలనుకుంటున్నాం.. 'రంగయాత్ర.. థియేటర్ ఫర్ సోషల్ డిబేట్' పేరుతో! అందులో భాగంగానే రవీంద్రభారతిలో ప్రదర్శన తర్వాత తెలుగు రాష్ట్రాల్లోని కాలేజెస్‌కి వెళ్లి అక్కడ ఈ నాటకాలను ప్రదర్శించబోతున్నాం స్ట్రీట్ ప్లే తరహాలో. ప్రదర్శన తర్వాత విద్యార్థులతో డిబేట్ పెడతాం. జెండర్ మీద అవగాహన కల్పించే ప్రయత్నమే ఇదంతా!' అంటూ ముగించారామె.

– సరస్వతి రమ

● ముగ్గు ముచ్చట





ఎస్.ప్రచేత, నిజామాబాద్
15 చుక్కలు
8 వచ్చేవరకు
మధ్య చుక్క



ఎస్.శ్రీలత
కరీంనగర్



25 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకు


ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com

హెల్దీ డైట్

గోంద్ లడ్డు



కావలసినవి: గోంద్ (ఎడిబుల్ గమ్) – ముప్పావు కప్పు; **బాదం పలుకులు** – 2 టేబుల్ స్పూన్‌లు; **పిస్తా** – 2 టేబుల్ స్పూన్‌లు; **జీడిపప్పు** – 2 టేబుల్ స్పూన్‌లు; **రైజిన్స్** – 2 టేబుల్ స్పూన్‌లు; **కొబ్బరి తురుము**– 2 కప్పులు; **బెల్లం పొడి**– ఒకటింపావు కప్పు; **ఖర్జూరాలు (గింజలు తొలగించినవి)** – అర కప్పు; **గసగసాలు**– 2 టేబుల్ స్పూన్‌లు; **యాలకుల పొడి**– అర టీ స్పూన్; **నెయ్యి** – టేబుల్ స్పూన్.

తయారి: మందపాటి బాణలిలో నెయ్యి వేడి చేసి గోంద్‌ను వేయించాలి. చల్లారిన తర్వాత చిదిమి పొడి చేయాలి లేదా చపాతీలు చేసే పీట మీద వేసి చపాతీల కర్రతో పొడి చేయవచ్చు. చిన్న రోలు ఉంటే అందులో వేసి దంచి పొడి చేసుకోవచ్చు. ఒక బాణలిలో కొబ్బరి తురుము, గసగసాలు, కిస్‌మిస్, మిగిలిన గింజలన్నింటినీ ఒకదాని తర్వాత ఒకటి విడివిడిగా వేయిస్తూ, వేయించిన దినుసులన్నింటినీ ఒకే పాత్రలో వేయాలి. అందులో యాలకుల పొడి, ఖర్జూరాలు, గోంద్ పొడి వేసి సమంగా కలిసే వరకు స్పూన్‌తో కలపాలి.

మరొక పాత్రలో బెల్లం పొడి వేసి మూడు టేబుల్ స్పూన్‌ల నీటిని పోసి తీగ పాకం వచ్చేవరకు మరిగించాలి. పాకం వచ్చిన తర్వాత స్టవ్ మీద నుంచి దించి అందులో గోంద్‌పొడితోపాటు దినుసులన్నింటినీ కలిపిన మిశ్రమాన్ని వేసి కలపాలి. వేడి తగ్గే వరకు ఆగాలి. మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడు చేతికి నెయ్యి రాసుకుని లడ్డులు చేయాలి. పై కొలతలతో చేస్తే 16 లడ్డులు వస్తాయి. గాలి దూరని డబ్బాలో నిల్వ చేస్తే రెండు వారాల వరకు తాజాగా ఉంటాయి. గమనిక: ఇది గోధుమ జిగురు. మార్కెట్‌లో గోంద్ కటిరా పేరుతో దొరుకుతుంది.

ఒక్కో లడ్డులో పోషకాలు ఇలా ఉంటాయి.
కేలరీలు – 120–130; **కార్బోహైడ్రేట్‌లు** – 15–18 గ్రాములు; **ప్రొటీన్‌లు** – 2–3 గ్రాములు; **ఫ్యాట్** – 6–7 గ్రా.; **ఫైబర్**– 1–2 గ్రాములు



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

గోంద్ దేహంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది, ఎముకలను శక్తిమంతం చేస్తుంది. చల్లటి వాతావరణంలో దేహానికి తగినంత వెచ్చదనాన్నిస్తుంది. – గింజల నుంచి ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్, దేహానికి అవసరమైన మైక్రో న్యూట్రియెంట్స్ అందుతాయి.

బెల్లంలో ఐరన్, జీర్ణశక్తిని పెంచే లక్షణం ఉంటుంది. కొబ్బరి తురుములో ఫైబర్, ఆరోగ్యకరమైన ఫ్యాట్ ఉంటుంది.– ఖర్జూరాలు, రైజిన్స్‌లోని యాంటీ ఆక్సిడెంట్‌లు, మినరల్స్ ఉండటంతోపాటు అవి శక్తినిస్తాయి.



థీమ్ ఆర్ట్‌తో వెలిగిపోండి!



గ్రాండ్‌గా వెలిగిపోయే వివాహ వేడుకైనా
హుందాగా కదిలే సీమంతం ఫంక్షన్ అయినా
ఆధునికంగా ఆలోచించే అమ్మాయిలు ఒకచోట చేరినా
ఆ సందర్భంలో తమదైన ప్రత్యేకతను చూపాలనుకుంటారు.
అందులో మరింత స్పెషల్‌గా నిలుస్తుంది ఫ్యాబ్రిక్ పెయింటింగ్
ఫ్యాషన్ రంగంలో హ్యాండ్ వర్క్ ఎప్పుడూ అగ్రస్థానంలో ఉంటుంది.
అవే ప్రతియేటా రూపును మార్చుకొని కొత్తగా మన మదిని
ఆకట్టుకుంటాయి. వాటిలో ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లు ఈ ఏడాది
స్పెషల్‌గా సందడి చేయనున్నాయి.



పండగ థీమ్

మనవైన పండగల వేళ సంప్రదాయం ఉట్టిపడాలంటే అందుకు తగినట్టు వేషధారణలోనూ ఆ కళ కనిపించాలని కోరుకుంటున్నారు. పండగలో ప్రత్యేకంగా నిలిచే అమ్మవార్ల రూపాలు, పాదాలు, ఆభరణాలు, ముగ్గులు పెయింటింగ్ చేయించడం వీటి ప్రత్యేకత. వీటిలో సాదాసీదాగా కనిపించే పెయింటింగ్స్ కొన్ని అయితే పెయింటింగ్ కాంబినేషన్‌తో చేసే ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్, ప్యాచ్‌వర్క్‌లు అదనంగా జత కలుస్తున్నాయి.

దంపతులకు ప్రత్యేకం

వివాహ వేడుకలతో వధూవరుల దుస్తుల డిజైన్లు రిచ్‌గా కనిపించాలని కోరుకోని వారుండరు. దానితో పాటు తమ పెళ్లి ప్రత్యేకం అని చూపడానికి ఐదు రోజుల పెళ్లిలో ఏదో ఒక రోజు వధూవరుల రూపాలను పెయింటింగ్‌గా చిత్రించి, వాటిని ధరించడానికి ముచ్చట పడుతున్నారు. వీటిలో వారి వారి బడ్జెట్‌లను బట్టి ఎంపికలు ఉంటున్నాయి.

సీమంతం వేడుక

రాబోయే బిడ్డకు ఆహ్వానం పలకడానికి, తల్లీ–బిడ్డ క్షేమం కోసం చేసే ఈ వేడుకను... పెయింట్ చేసిన శారీస్, లెహంగాలతో ఎంతో సుందరంగా మార్చేస్తున్నారు. యశోదాకృష్ణ, గోపికా కృష్ణ, చిన్నారి పాదాలు, కామధేను వంటి డిజైన్లు దుస్తులను అద్భుతంగా మార్చేస్తున్నాయి. తల్లిదండ్రులు–పిల్లల కాంబినేషన్ పెయింటింగ్స్ కూడా ఈ థీమ్‌లో చోటుచేసుకుంటున్నాయి.

మోడరన్ మగువ

డెనిమ్స్, షర్ట్స్‌తో క్యాజువల్ వేర్‌గానూ, ఫ్రెండ్లీ గెట్ టుగెదర్ పార్టీల్లోనూ ప్రత్యేకంగా నిలవడానికి తమదైన థీమ్‌తో డిజైన్ చేయించుకుంటున్నారు. తమలోని ఆధునిక భావాలను డ్రెస్సింగ్ ద్వారా చూపుతున్నారు. దీనిలో భాగంగా పెయింటింగ్ చేసిన ఫ్యాబ్రిక్ ప్యాచ్‌వర్క్ ఈ తరాన్ని బాగా ఆకట్టుకుంటోంది.



యువర్స్

చిన్నప్పుడు కన్న కలలు నిజం అవుతాయా? మనసు పెడితే, కష్టపడితే 'కచ్చితంగా నిజం అవుతాయి' అని చెప్పడానికి బలమైన ఉదాహరణ కాజల్, హితేంద్రసింగ్. 'స్పానిక్' స్టార్టప్‌తో తమ కలను నిజం చేసుకున్నారు... రాకెట్‌ను ప్రయోగించే ప్రక్రియలో కాలంతో పాటు ఎంతో పురోగతిని చూస్తున్నాం. దీనికి సరికొత్త చేర్పు...స్పానిక్. రీయూజబుల్ రాకెట్ లాంచ్ వెహికిల్స్ కోసం కాజల్ రాజ్జర్, హితేంద్రసింగ్ 'స్పానిక్' అనే స్టార్టప్‌ను ప్రారంభించారు.

● ఇన్నోవేషన్

స్కై స్టార్స్


● హితేంద్రసింగ్ ● కాజల్

'పునర్వినియోగ రాకెట్ లాంచ్ వెహికిల్స్‌ను స్పానిక్ అభివృద్ధి చేస్తుంది. అంతరిక్ష పరిశోధనలను అందరికీ మరింత అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. మేము దీన్ని ఫెడెక్స్ టు స్పేస్ అని పిలవడానికి ఇష్టపడతాం' అంటున్నారు కాజల్, హితేంద్రసింగ్.

ఢిల్లీ కేంద్రంగా మొదలైన 'స్పానిక్' ఇప్పటికే గణనీయమైన పురోగతిని సాధించింది. ప్రభుత్వ గ్రాంట్లను పొందింది. ప్రైవేట్ ఈక్విటీ ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించింది. మోస్ట్ ప్రామిసింగ్ స్టార్టప్ 'టెక్ 30' జాబితాలో చోటు సాధించింది.

చిన్నప్పుడు పిల్లలు ఏవో కలలు కంటారు. అయితే ఆ కలలు అన్నీ నిజం కాకపోవచ్చు. చిన్న వయసులోనే 'నేను పెద్దయ్యాక స్పేస్ కంపెనీ నడపాలనుకుంటున్నాను' అని తండ్రితో చెప్పింది కాజల్. అంతేకాదు 'సొంతంగా రాకెట్లు, ఉపగ్రహాలు తయారు చేస్తాను' అని తన డైరీలో కూడా రాసుకుంది. తన లక్ష్యసాధనలో భాగంగా చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎంలో చేరింది.

అక్కడ ఫిజిక్స్ చదువుకున్న కాజల్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పేజీని నడిపేది. కొత్త శాస్త్రీయ ఆవిష్కరణల గురించి అందులో రాసేది. ఈ క్రమంలో కాజల్‌కు అహ్మదాబాద్‌లో చదువుకుంటున్న హితేంద్ర సింగ్‌తో పరిచయం అయింది. కాజల్‌లాగే సింగ్ కూడా చిన్నప్పుడు ఎన్నో కలలు కనేవాడు.

సోషల్ మీడియా ద్వారా పరిచయం అయిన కాజల్, హితేంద్రసింగ్‌లు సైన్స్‌కు సంబంధించి బోలెడు విషయాలు మాట్లాడుకునేవారు. అలా 'స్పానిక్' కోసం స్కెచ్ వేశారు.

ఆస్ట్రోఫిజిక్స్, కాస్మోలజీలో మాస్టర్స్ చేయడానికి గుజరాత్‌లోని 'చరోతార్ యూనివర్శిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ' చేరారు. తమ భవిష్యత్ లక్ష్యమైన 'స్పానిక్' కోసం కాలేజీ వదిలిపెట్టారు. కంపెనీ స్థాపించడానికి ముందు మానవ రహిత వైమానిక వాహనాలను (ఏరియల్ వెహికిల్స్) అభివృద్ధి చేయడం నుంచి యువిసి రోవర్ తయారీ వరకు ఎంతో అనుభవ జ్ఞానాన్ని సంపాదించారు.

అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహం 'స్పానిక్' వడివడిగా అడుగులు వేయడానికి ఉపయోగపడింది. రీసైకిల్ చేయదగిన రాకెట్‌ల డిమాండ్‌ను అర్థం చేసుకోవడానికి ప్రైవేట్ సంస్థలు, ఇస్రో సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. నిజానికి పునర్వినియోగ రాకెట్ కాన్సెప్ట్ కొత్త కాదు. రష్యా, అమెరికా, జర్మనీలాంటి దేశాలు దశాబ్దాలుగా ఈ కాన్సెప్ట్‌పై పనిచేస్తున్నాయి. ఈ ప్రయత్నంలో ఖర్చు హద్దులు దాటేది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎక్కువగా ఖర్చు కాని, ఎక్కువ సార్లు ఉపయోగించే రాకెట్‌లపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం కాజల్-సింగ్ బృందం వర్టికల్ టేకాఫ్ వర్టికల్ ల్యాండింగ్ (విటివిఎల్)ను నిర్మిస్తోంది. వ్యవస్థల పునర్వినియోగాన్ని అర్థం చేసుకోవడానికి ఇది వారికి సహాయపడుతుంది.

అయినా సరే...

చాలామంది స్పేస్ స్టార్టప్ వ్యవస్థాపకులు ఇస్రోలో పనిచేశారు. లేదా ఏదో ఒక హోదాతో సంస్థతో టచ్‌లో ఉన్నారు. మేము 'ఇస్రో'లో పనిచేయలేదు. 'ఇస్రో'లో పనిచేయని ఫౌండర్‌లకు సంబంధించిన స్టార్టప్ మాది. కీలక సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించడంపై దృష్టి పెట్టాం. ప్రసిద్ధ సంస్థలకు చెందని వ్యక్తులు కూడా సాంకేతిక స్టార్టప్‌లకు సంబంధించి ముందుకు వెళ్లగలరని నిరూపించాలనుకుంటున్నాం. ఇది ఎంతో మంది ఔత్సాహికులకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది.

- కాజల్

● టెక్.. టాక్

హానర్ మ్యాజిక్ 7 లైట్



సైజ్: 6.78 అంగుళాలు రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
బ్యాటరీ: 6,600 ఎంఎహెచ్ ర్యామ్: 8జీబి స్టోరేజ్: 256 జీబి
వోఎస్: ఆండ్రాయిడ్ 14 బరువు: 189 గ్రా.



రెడ్ మీ బుక్ 14

స్క్రీన్: 16:10
రిజల్యూషన్: 2,880×1,800 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
బ్యాటరీ: 56 డబ్ల్యూహెచ్

సినీబీమ్ ఎస్(పీయు 615 యు) ఎల్‌జీ ప్రొజెక్టర్



● రిజల్యూషన్: 4కే యుహెచ్‌డీ(3,840×2,160) ● స్క్రీన్ సైజ్: 30-120 అంగుళాలు 40-100 అంగుళాలు ● ఆటో స్క్రీన్ అడ్జస్ట్‌మెంట్ స్పేస్ ● బరువు: 7.5 కేజీ(పిఎఫ్600యు) 2.5కేజీ (పియు615యు) ● సపోర్ట్: డల్బీ ఆటోమస్ సౌండ్ ● లైట్ వెయిట్ డిజైన్

డాక్యుమెంట్స్ స్కాన్ చేయడానికి...



ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్‌లను అందుబాటులోకి తెస్తోంది. ఈ యాప్‌లో ఎన్నో ఫీచర్‌లు ఉన్నప్పటికీ డాక్యుమెంట్‌లను స్కాన్ చేసి పంపడానికి థర్డ్ పార్టీ యాప్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. లేటెస్ట్ అప్‌డేట్‌తో ఐఫోన్ యూజర్‌ల కోసం కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువస్తోంది వాట్సాప్. ఇన్-యాప్ కెమెరాను ఉపయోగించి డాక్యుమెంట్లను స్కాన్ చేసి, వారి కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్న ఎవరితోనైనా షేర్ చేసుకునే అవకాశం కల్పిస్తుంది.

వాట్సాప్‌లో డాక్యుమెంట్స్ స్కాన్ చేయడానికి...

● వాట్సాప్ ఓపెన్ చేసిన తరువాత బాటమ్ బార్‌లోని 'బటన్'ను నొక్కాలి. ● డాక్యుమెంట్స్-సెలెక్ట్ ● 'చూజ్ ఫ్రమ్ ఫైల్స్' 'చూజ్ ఫోటోస్ ఆర్ వీడియో' 'స్కాన్ డాక్యుమెంట్' అనే మూడు ఆప్షన్‌లు కనిపిస్తాయి ● థర్డ్ ఆప్షన్ క్లిక్ చేస్తే ఇన్-కెమెరా ఓపెన్ అవుతుంది ● స్కాన్ చేసిన తరువాత ఇతరులకు షేర్ చేయవచ్చు.



అవును... ఇది నిజమే!

● 'యస్...ఈ పని నేను కచ్చితంగా చేయగలను' అని ఒకటికి పదిసార్లు గట్టిగా అనుకోవడం మనం చేసే పనిపై సానుకూల ప్రభావం చూపుతుంది అంటున్నారు వ్యక్తిత్వ వికాస నిపుణులు.
● జపాన్‌లో 'హీరోషీమా పీస్ ఫ్లేమ్' 1964 నుంచి నిరంతరాయంగా వెలుగుతూనే ఉంది. ● జపాన్‌లో 'థ్యాంకు యూ'కు ప్రత్యామ్నాయంగా '39' వాడుతారు.

● గేమింగ్

అపురూప అగ్నితేజం



ఫైనల్ ఫాంటసీ 7(ఫర్ పీసీ) రీబర్త్ ఈ నెలలో విడుదల కానుంది. 'ఫైనల్ ఫాంటసీ 7 రిమేక్'కి సీక్వెల్‌గా వస్తున్న గేమ్ ఇది. రియల్-టైమ్ యాక్షన్‌కు స్ట్రాటజిక్, రోల్-ప్లేయింగ్ ఎలిమెంట్స్ జోడించి రూపొందించిన ఈ గేమ్‌లో క్లౌడ్ స్ట్రైఫ్(ఫైనల్ ఫాంటసీ సిరీస్‌లో ప్రధాన పాత్ర) పార్టీ ఆఫ్ క్యారెక్టర్లు(రెడ్, విన్‌సెంట్, సిడ్, టిఫా, బారెట్...మొదలైన క్యారెక్టర్స్) ప్లేయర్స్ కంట్రోల్ చేయాల్సి ఉంటుంది.

మునుపటి గేమ్‌లలోని ప్రధాన క్యారెక్టర్లు తాజా గేమ్‌లో కూడా కనిపిస్తాయి.

సిరీస్: ఫైనల్ ఫాంటసీ ఇంజిన్: అన్‌రియల్ ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, విండోస్ జానర్స్: యాక్షన్ రోల్-ప్లేయింగ్ మోడ్స్: సింగిల్-ప్లేయర్


● తపస్వీ రెడ్డి

● యంగ్ టాలెంట్

వండర్ బాయ్

టైమ్ మేనేజ్‌మెంట్ తెలిస్తే ఎంతో టైమ్ సేవ్ అవుతుంది. ఆ టైమ్‌లో ఎన్నో విద్యలు నేర్చుకోవచ్చు. 'శభాష్' అనిపించుకోవచ్చు.... దీనికి ఉదాహరణ తపస్వీరెడ్డి

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణానికి చెందిన కుంచాల తపస్వీరెడ్డి కరాటే, ఫ్యాన్సీ డ్రెస్, చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, చదరంగం, ఫోటోగ్రఫీ, సైన్స్, డ్యాన్స్....మొదలైన వాటిలో ప్రతిభ చూపుతున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే ఒలింపియాడ్ పరీక్షల్లో కూడా ప్రతిభ కనబరిచాడు. వియత్నాంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ మోడల్ యునైటెడ్ నేషన్స్ సదస్సుకు ఎంపికయ్యాడు.


వందకి పైగా జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలు, తేదీలు వాటికి సంబంధించిన వివరాలను చెప్పి అంతర్జాతీయ 'వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'లో చోటు సాధించాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ -2024లో అండర్ -14 బ్లాక్‌బెల్ట్ విభాగంలో గోల్డ్ మెడల్, కుమిటేలో కాంస్య పతకం గెలుచుకున్నాడు.

ఇస్రో అంతరిక్ష వారోత్సవాలు 2023ను పురస్కరించుకుని తణుకులో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో, రాజమండ్రిలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ బహుమతి సాధించాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ పోటీలో 674 మందితో పోటీపడి ఐదో స్థానంలో నిలిచి ప్రశంస పత్రం అందుకున్నాడు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్ నాలెడ్జ్ ఒలింపియాడ్ 2023-24 రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ సాధించాడు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ వారు నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీలో మహాత్మా గాంధీ వేషధారణతో పాల్గొని ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు. యువజన మహోత్సవాల్లో భాగంగా ఫ్యాన్సీడ్రెస్ పోటీలో కృష్ణుడి వేషధారణలో ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు.

– గాడి శేఖర్ బాబు, నిడదవోలు, సాక్షి

సాక్షి సినిమా

"చిన్న సినిమా, పెద్ద సినిమా... దేనికైనా మంచి కథే ప్రాణం. నా కెరీర్ ఆరంభం నుంచి కూడా కథను నమ్ముకునే సినిమాలు తీశాను. ఈ సృష్టిలో తల్లిని మించిన దైవం లేదు. మా అబ్బాయి అనంత కిశోర్ నిర్మించిన 'తల్లి మనసు' సినిమా అద్భుతమైన కథతో రూపొందింది. ప్రతి తల్లి, కుటుంబమంతా కలిసి చూడాల్సిన చిత్రం ఇది" అని ప్రముఖ సీనియర్ దర్శకులు, చిత్ర సమర్పకులు ముత్యాల సుబ్బయ్య చెప్పారు. రచితా మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల సుబ్బయ్య వద్ద దర్శకత్వ విభాగంలో పని చేసిన వి. శ్రీనివాస్ (సిప్పీ) ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్నారు. ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మించిన తొలి చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా ముత్యాల సుబ్బయ్య విలేకరులతో పంచుకున్న విశేషాలు.



కుటుంబమంతా తల్లి మనసు చూడాలి

- ముత్యాల సుబ్బయ్య

● దర్శకుడిగా నా తొలి చిత్రం 'మూడుముళ్ల బంధం'తో మంచి పేరు వచ్చింది కానీ అవకాశాలు రాలేదు. ఆ తర్వాత టి. కృష్ణగారి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. ఆ తర్వాత నేను దర్శకత్వం వహించిన 'అరుణ కిరణం' (1986) సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. ప్రముఖ హీరోలందరితోనూ సినిమాలు తీశాను. దర్శకుడిగా 50 సినిమాలు తీశాను.. వాటిలో అద్భుతమైన హిట్‌తో పాటు కొన్ని ఫెయిల్యూర్స్ లేకపోలేదు. అయినప్పటికీ ఏ రోజూ ఏదో సినిమా చేసెయ్యాలని, చుట్టేయాలని అనుకోలేదు. సమాజానికి ఉపయోగపడే పాయింట్‌తో పాటు సెంటిమెంట్, కామెడీ, డ్రామా వంటి అంశాలను మేళవించి సినిమాలు చేశాను. సెంటిమెంట్ సినిమాల కారణంగా నాకు సెంటిమెంట్ సుబ్బయ్య అని పేరొచ్చింది ● నిర్మాతగా నేను ఒక్క సినిమా కూడా తీయలేదు. మా పెద్ద అబ్బాయి అనంత కిశోర్‌కు ఒక మంచి సినిమా తీయాలనే అభిరుచి ఉండటంతో 'తల్లి మనసు' నిర్మించాం. నేను సీనియర్ దర్శకుడిని అయినప్పటికీ శ్రీనివాస్‌కి సూచనలు, సలహాలు ఇచ్చానే తప్ప ఎక్కడా కల్పించుకోలేదు. నా మనసుకి సంతృప్తినిచ్చిన చిత్రమిది. థియేటర్ నుంచి బయటికి వచ్చిన తర్వాత 'ఓ మంచి సినిమా చూశాం' అని ప్రేక్షకులు అనుకుంటారు.



కావేరి పాత్ర నాకో సవాల్

- ప్రగ్యా జైస్వాల్

"'డాకు మహారాజ్'లో నేను కావేరి పాత్ర చేశాను. నటనకు ఆస్కారం ఉన్న మంచి క్యారెక్టర్ ఇది. మొదటిసారి డీ గ్లామరస్ రోల్ చేశాను.. నేనిప్పటి వరకు చేసిన పాత్రలకు భిన్నంగా ఈ క్యారెక్టర్‌ని బాబీగారు అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ పాత్ర చేయడం నాకు సవాల్‌గా అనిపించింది" అని ప్రగ్యా జైస్వాల్ తెలిపారు. బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'డాకు మహారాజ్'. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రగ్యా జైస్వాల్ విలేకరులతో మాట్లాడుతూ– "2015లో 'కంచె' సినిమాతో తెలుగులో నా ప్రయాణం మొదలైంది. ఈ ప్రయాణంలో సినిమా గురించి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. బాలకృష్ణగారితో 'అఖండ, డాకు మహారాజ్, అఖండ-2'.. ఇలా వరుస సినిమాలు చేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నాను. తెలుగులో అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన సితార ఎంటర్‌టైన్మెంట్స్‌లో నటించడం హ్యాపీగా ఉంది. ఈ నెల 12న నా పుట్టినరోజు. నేను నటించిన 'డాకు మహారాజ్'అదే రోజు రిలీజ్ కావడం నా లక్" అని చెప్పారు.



నా లక్ష్యం నెరవేరింది

- కృష్ణ కాంత్

"తెలుగు సినిమాలకు నేరుగా పాటలు రాయడం సులభం. పైగా కావాల్సినంత స్వేచ్ఛ ఉంటుంది. కానీ, డబ్బింగ్ సినిమాలకు పాటలు రాసేటప్పుడు ఆయా భాషలో వాడిన పదాలకు సరిపోయే తెలుగు పదాలను ఎంచుకుని రాయాలి. అందుకే స్ట్రయిట్ సాంగ్స్‌తో పోలిస్తే డబ్బింగ్ పాటలు రాయడం చాలా కష్టం" అని పాటల రచయిత కృష్ణకాంత్ (కేకే) చెప్పారు. నేడు (జనవరి 10) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా గురువారం కృష్ణకాంత్ విలేకరులతో మాట్లాడుతూ– "పాటల రచయితగా పేరు తెచ్చుకోవాలని ఉద్యోగం వదులుకుని ఇండస్ట్రీకి వచ్చాను. ఆ లక్ష్యం నెరవేరిందనే సంతృప్తి కలుగుతోంది. 2024లో నేను రాసిన స్ట్రయిట్, డబ్బింగ్ పాటలన్నీ మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుని వైరల్‌గా మారడం సంతోషంగా ఉంది. ఒక సినిమా కథ మొత్తం తెలిస్తే పాటల రచయితకు అడ్వాంటేజ్ ఉంటుంది. అలా నేను సింగిల్ కార్డ్ రాసిన 'పడి పడి లేచె మనసు, సీతారామం (ఐదు పాటలు), సలార్, రాధే శ్యామ్' సినిమాల పాటలన్నీ సూపర్ హిట్ అయ్యాయి. గతేడాది నేను రాసిన పాటల్లో 'హాయ్ నాన్న'లోని 'అడిగా..' పాట బాగా సంతృప్తిని ఇచ్చింది. మలయాళ డబ్బింగ్ మూవీ 'ఏఆర్‌ఎం', రజనీకాంత్‌గారి 'వేట్టయాన్', శివకార్తికేయన్‌గారి 'అమరన్' సినిమాలకు రాసిన పాటలకు మంచి పేరొచ్చింది. సాటి గీత రచయితలు నాతో స్నేహంగా ఉంటారు. నేను మంచి పాట రాసినప్పుడు చంద్రబోస్ గారు అభినందిస్తారు. ప్రస్తుతం ప్రశాంత్ వర్మ 'అధీర' మూవీకి డైలాగ్స్ రాస్తున్నాను. 'రాజాసాబ్', ప్రభాస్-హను రాఘవపూడి, రామ్ పోతినేని, విజయ్ దేవరకొండ-గౌతమ్ తిన్ననూరి చిత్రాలకు పాటలు రాస్తున్నాను" అని చెప్పారు.


సాయికుమార్ గోల్డెన్ జూబ్లీ



"కనిపించే ఈ మూడు సింహాలు న్యాయానికి, నీతికి, ధర్మానికి ప్రతిరూపాలైతే, కనిపించని ఆ నాలుగో సింహమేరా.. పోలీస్...' అనే డైలాగ్ వింటే... వెంటనే సాయికుమార్ అని ఆడియన్స్ చెప్పేస్తారు. అంటూ 'పోలీస్ స్టోరీ'లో ఆయన తనదైన శైలిలో పవర్‌ఫుల్‌గా చెప్పి, ఆకట్టుకున్నారు. నటుడిగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్న సాయికుమార్ ఇండస్ట్రీలోకి వచ్చి యాభై సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సాయికుమార్ గురించి కొన్ని విశేషాలు...

1972 అక్టోబరు 20న 'మయసభ' అనే నాటకంలో దుర్యోధనుడి పాత్ర కోసం తొలిసారి మేకప్ వేసుకున్నారు సాయికుమార్. ఆయన వెండితెర ప్రయాణం 'దేవుడు చేసిన పెళ్లి' చిత్రంతో జరిగింది. బాపు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సాయికుమార్ బాలనటుడిగా చేశారు. ఈ మూవీ 1975 జనవరి 9న రిలీజైంది. గురువారంతో (జనవరి 9) వెండితెరపై సాయికుమార్ యాభైఏళ్ల నట ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ముందు డబ్బింగ్ ఆర్టిస్టుగానే కెరీర్ మొదలుపెట్టారు సాయికుమార్. ఆ తర్వాత 'ఛాలెంజ్, కలికాలం, మేజర్ చంద్రకాంత్' వంటి తెలుగు సినిమాల్లో నటిస్తూనే, 'తయ్యల్‌క్కారన్, కావల్ గీతమ్' వంటి తమిళ సినిమాల్లోనూ నటించారు. 1996లో సాయికుమార్ హీరోగా వచ్చిన కన్నడ చిత్రం 'పోలీసు స్టోరీ' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాలోని సాయి కుమార్ నటనకు ఆడియన్స్ ఫిదా అయ్యారు. ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో అనువాదమై, విజయం సాధించింది. 'పోలీసు స్టోరీ' తర్వాత ఆయన పాతిక చిత్రాల్లో పోలీస్ ఆఫీసర్‌గా నటించారు. ఇక తెలుగులో 'అమ్మ రాజీనామా, కర్తవ్యం, అంతఃపురం, ఈశ్వర్ అల్లా, జగద్గురు ఆది శంకర, ఎవడు, పటాస్, పండుగ చేస్కో, భలే మంచి రోజు, సరైనోడు, జనతా గారేజ్, ఓం నమో వెంకటేశాయ, జై లవ కుశ, రాజా ది గ్రేట్, నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా, మహర్షి, ఎస్ఆర్ కల్యాణమండపం, దసరా, సార్...' ఇలా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో సాయికుమార్ నటించారు. 50 ఏళ్ల కెరీర్‌లో హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా మెప్పించిన సాయికుమార్ విలన్‌గానూ నిరూపించుకున్నారు. 'సామాన్యుడు, ప్రస్థానం, ఎవడు..' వంటి చిత్రాల్లో విలన్‌గా చేశారు. కేవలం వెండితెరకు మాత్రమే పరిమితం కాకుండా, బుల్లితెరపై రాణిస్తున్నారు సాయికుమార్. ఇక ఆయన తమ్ముళ్లు అయ్యప్ప పి.శర్మ, పి. రవిశంకర్ డబ్బింగ్ ఆర్టిస్టులుగా, నటులుగా సినిమా రంగంలోనే రాణిస్తున్నారు. ఆయన కొడుకు ఆది సాయికుమార్ హీరోగా చేస్తున్నారు.

సింగర్ జయచంద్రన్ మృతి



ప్రముఖ గాయకుడు పి.జయచంద్రన్(80) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కేరళలోని త్రిసూర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ, గురువారం తుది శ్వాస విడిచారు. 1944 మార్చి 3న కొచ్చిలో జన్మించిన జయచంద్రన్ 1965లో వచ్చిన 'కుంజలి మరక్కర్' అనే సినిమాలోని 'ఒరు ముల్లప్పుమలమే..' పాటతో గాయకుడిగా పరిచయమయ్యారు. 1967లో విడుదలైన 'కలితోజన్' చిత్రంలోని 'మంజలైల్ ముంగి తోర్తి' పాట ఆయన కెరీర్‌లో ఒక మైలురాయి. ఆరు దశాబ్దాలకుపైగా తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 16 వేలకుపైగా పాటలు పాడారాయన. జయచంద్రన్ తెలుగులో పాడిన'రోజావే చిన్ని రోజావే (సూర్యవంశం), అనగనగా ఆకాశం ఉంది (నువ్వే కావాలి), హ్యాపీ హ్యాపీ బర్త్‌డేలు (సుస్వాగతం)' వంటి పాటలు సూపర్ హిట్‌గా నిలిచాయి. 2002లో వచ్చిన 'ఊరు మనదిరా'లో పాడిన 'నా చెల్లి చంద్రమ్మ' తెలుగులో ఆయన చివరి పాట. ఇళయరాజా, ఏఆర్ రెహమాన్, ఎం.ఎం. కీరవాణి, విద్యాసాగర్, కోటి వంటి సంగీత దర్శకుల సినిమాలకు ఆయన ఎక్కువగా పాటలు పాడారు. హిందీలో ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన 'అదా: ఎ వే ఆఫ్ లైఫ్' అనే ఒకే ఒక మూవీలో పాడారు జయచంద్ర. అదేవిధంగా తన మాతృ భాష మలయాళంలో 'నఖక్షతంగళ్', 'త్రివేండ్రం లాడ్జ్' వంటి సినిమాల్లో అతిథి పాత్రల్లో మెరిశారాయన. అంతేకాదు.. 'శ్రీ నారాయణ గురు' అనే మలయాళ సినిమాలోని 'శివ శంకరా సర్వ శరణ్య విభో..' పాటకుగానూ 'బెస్ట్ మేల్ ప్లే బ్యాక్ సింగర్'గా 1986లో జాతీయ అవార్డు అందుకున్నారు. అలాగే ఐదు కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డులు, రెండు తమిళనాడు స్టేట్ ఫిల్మ్ అవార్డులు కూడా ఆయన్ని వరించాయి. జయచంద్రన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, సంగీత దర్శకులు, గాయకులు సంతాపం తెలిపారు.

థ్రిల్లింగ్ బూమరాంగ్


● అనూ ఇమ్మాన్యుయేల్

అనూ ఇమ్మాన్యుయేల్ ప్రధాన పాత్రలో, శివ కందుకూరి, 'వైవా' హర్ష, 'వెన్నెల' కిశోర్, ఎస్. నివాసిని, షానీ సాల్మన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బూమరాంగ్'. ముప్పైకి సినిమాలకుపైగా సినిమాటోగ్రాఫర్‌గా చేసిన ఆండ్రూ బాబు 'బూమరాంగ్' మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. లండన్ గణేశ్, డా. ప్రవీణ్ రెడ్డి వూట్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సితార ఫిల్మ్స్ లిమిటెడ్ లైన్ ప్రొడక్షన్ నిర్వహిస్తోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను హీరో వెంకటేశ్ రిలీజ్ చేశారు. "కర్మ ఇతివృత్తాన్ని రెండు సమాంతర కథాంశాలతో సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ మూవీగా ఈ సినిమాను తీస్తున్నాం. ఈ సినిమా ఆడియన్స్‌కు మంచి అనుభూతినిస్తుంది" అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: అనూప్ రూబెన్స్.

సాక్షి బిజినెస్
శుక్రవారం
10-1-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
528	162
77,620	23,526

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	19,479	▽ 11
డోజోన్స్	42,635	△ 107
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,320	△ 69
డాక్స్	20,317	▽ 13
షాంఘై	3,211	▽ 19
నికాయ్	39,605	▽ 376

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

	ధర	మార్పు
బంగారం (99.9 స్వచ్ఛత)	77,618	△ 254
బంగారం (99.5 స్వచ్ఛత)	77,307	△ 253
వెండి (కిలో)	89,800	△ 297

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	85.41	86.43
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.80	108.68
€	యూరో	ఒకటి	87.65	90.25
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	53.63	54.96
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.40	54.59
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.48	65.19
SAR	సౌదీ రియాల్	పదింటికి	22.03	23.59
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	22.50	24.28
¥	చైనా యువాన్	పదింటికి	10.85	12.68

ఉపాధికి కిక్ కామర్స్!

కార్మికులకు పెరుగుతున్న డిమాండ్
- 2027 నాటికి 5 లక్షల కొత్త కొలువులు
- ఇండీడ్ ప్లాట్‌ఫామ్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: క్విక్ కామర్స్ జోరుతో బ్లూకాలర్ ఉద్యోగాలకు (కార్మికులకు) పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. 2027 నాటికి వివిధ రంగాల్లో 24 లక్షల మంది కార్మికులకు డిమాండ్ ఉంటుందని హైరింగ్ ప్లాట్‌ఫామ్ 'ఇండీడ్' వెల్లడించింది. ఇందులో ఒక్క క్విక్ కామర్స్ రంగమే 5 లక్షల మందికి ఉపాధి కల్పించనున్నట్టు పేర్కొంది. డిసెంబర్ త్రైమాసికంలో క్విక్‌కామర్స్ కంపెనీలు 40,000 మందిని నియమించుకున్నట్టు ఇండీడ్ ఇండియా సేల్స్ హెడ్ సతీష్ కుమార్ తెలిపారు. ''ఈ రంగం విస్తరించే కొద్దీ, నైపుణ్య, పాక్షిక నైపుణ్య కార్మికులకు డిమాండ్ వృద్ధి చెందుతూనే ఉంటుంది. వేగవంతమైన, టెక్నాలజీ ఆధారిత ప్రపంచానికి అనుగుణంగా నడుచుకునే నైపుణ్యాల కోసం యాజమాన్యాల అన్వేషణ పెరిగింది'' అని వివరించారు. బ్లూ కాలర్ ఉద్యోగులు అంటే విద్యతో పెద్దగా అవసరం లేకుండా శారీరక శ్రమతో, నైపుణ్యాలతో పనులు నిర్వహించే వారు. డెలివరీ డ్రైవర్లు, రిటైల్ సిబ్బంది ఈ విభాగం కిందకే వస్తారు. ఇండీడ్ నిర్వహించిన సర్వేలో వీరికి బేసిక్ వేతనం రూ. 22,600గా ఉన్నట్టు తెలిసింది. పండుగల సీజన్‌లో క్విక్‌కామర్స్ కంపెనీలు డెలివరీ డ్రైవర్లు, వేర్‌హౌస్ అసోసియేట్‌లు, మార్కెటింగ్, ప్రమోషనల్, ప్యాకేజింగ్ సిబ్బంది, లాజిస్టిక్స్ కోఆర్డినేటర్లను నియమించుకోనున్నట్టు ఇండీడ్ నివేదిక తెలిపింది. దీంతో ఇలాంటి డిమాండ్ సీజన్లలో కార్మికులకు బోనస్‌లు, నగదేతర ప్రయోజనాలు అధికంగా అధించనున్నట్టు వివరించింది.

వీరికి డిమాండ్.. : నేవిగేషన్ అండ్ డ్రైవింగ్, డిజిటల్ లిటరసీ, డేటా అనలిటిక్స్, మేనేజ్‌మెంట్, టెక్ సపోర్ట్ నైపుణ్యాలున్న వారికి ఎక్కువ డిమాండ్ ఉన్నట్టు ఇండీస్ నివేదిక వెల్లడించింది. ఆటోమేషన్, డిజిటల్ టూల్స్ ఆధారంగా ఈ ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాల్లోనూ మార్పులు చోటుచేసుకుంటున్నట్టు తెలిపింది. కస్టమర్లు నిమిషాల వ్యవధిలో గ్రోసరీ, నిత్యావసరాలను కోరుకుంటున్నారని.. దీంతో వేగవంతమైన డెలివరీలకు డిమాండ్ పెరుగుతున్నట్టు పేర్కొంది. క్విక్‌కామర్స్ సంస్థల మధ్య పోటీ పెరిగిపోవడంతో అవి మరింత వేగంగా డెలివరీకి, మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయని, ఇది ఈ రంగంలో ఉపాధి అవకాశాల విస్తరణకు దారి తీస్తోందని వివరించింది. చెన్నై, పుణె, బెంగళూరు, ముంబై, ఢిల్లీ నగరాల్లో బ్లూకాలర్ ఉద్యోగ నియామకాలు చెప్పుకోతగ్గ స్థాయిలో పెరిగినట్టు తెలిపింది. టైర్–2 నగరాలైన చండీగఢ్, అహ్మదాబాద్‌లోనూ ఇదే ధోరణి నెలకొన్నట్టు వివరించింది.

సెన్సెక్స్ 78000 దిగువకు

నిఫ్టీ నష్టం 162 పాయింట్లు
- అధిక వెయిటేజీ షేర్ల పతన ప్రభావం
- ఫైనాన్స్, ఐటీ షేర్లలో భారీ విక్రయాలు



ముంబై: అధిక వెయిటేజీ షేర్లు రిలయన్స్ ఇండస్ట్రీస్(1%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(1.50%), టీసీఎస్(2%) షేర్ల పతనంతో గురువారం స్టాక్ సూచీలు అరశాతానికి పైగా నష్టపోయాయి. డిమాండ్ తగ్గుదలను సూచిస్తూ చైనా ద్రవ్యోల్బణ గణాంకాలు నిరాశపరచడం, యూఎస్ బాండ్లపై భారీ రాబడులు సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 528 పాయింట్లు క్షీణించి 78 వేల దిగువన 77,620 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 162 పాయింట్లు కోల్పోయి 23,526 వద్ద నిలిచింది. ట్రేడింగ్ ప్రారంభం నుంచే ఎఫ్ఎంసీజీ మినహా అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సూచీలు ఏ దశలోనూ కోలుకోలేదు. ఇంట్రాడేలో సెన్సెక్స్ 606 పాయింట్లు క్షీణించి 77,543 వద్ద, నిఫ్టీ 186 పాయింట్లు పతనమై 23,503 వద్ద కనిష్టాలు తాకాయి. చిన్న, మధ్య తరహా షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 1.50%, ఒకశాతానికి పైగా క్షీణించాయి. సూచీల వారీగా బీఎస్‌ఈ రియల్టీ ఇండెక్స్ 3% పతనమైంది.

- టీసీఎస్ క్యూ3 ఫలితాల నేపథ్యంలో ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. కోఫోర్జ్ 3%, ఎంఫసీస్ 2%, విప్రో, టీసీఎస్ 1.50% క్షీణించాయి. పెర్సిస్టెంట్, ఎల్‌టీఐఎం, టెక్ మహీంద్రా షేర్లు 1% పడ్డాయి.

మార్కెట్ రేటింగ్‌కు హెచ్‌ఎస్‌బీసీ కోత..

అంతర్జాతీయ బ్రోకరేజ్ దిగ్గజం హెచ్‌ఎస్‌బీసీ.., భారత ఈక్విటీ మార్కెట్ రేటింగ్‌ను 'ఓవర్‌వెయిట్' నుంచి 'న్యూట్రల్'కి తగ్గించింది. కార్పొరేట్ ఆదాయాలు నెమ్మదించడం, అధిక వాల్యుయేషన్లు ఇందుకు కారణాలుగా చెప్పుకొచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి(2025) గానూ నిఫ్టీ 50 కంపెనీల ఆదాయ వృద్ధి అంచనాలను గణనీయంగా 15% నుంచి 5%కి తగ్గించింది.

- ఈ ఏడాది చివరి నాటికి సెన్సెక్స్ 85,990 స్థాయికి చేరొచ్చని అంచనా వేసింది. గురువారం సెన్సెక్స్ ముగింపు (77,620)తో పోలిస్తే 10% మాత్రమే అధికం.

టీసీఎస్ లాభం అప్

క్యూ3లో రూ. 12,380 కోట్లు

ఆదాయం రూ. 63,973 కోట్లు ● వచ్చే ఏడాది మరిన్ని ఉద్యోగాలు
ఒక్కో షేరుకి రూ. 76 డివిడెండ్ ● బెంగళూరులో భూమి కొనుగోలు



ముంబై: ఐటీ సేవల దేశీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసిక ఫలితాలు వెల్లడించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 12 శాతం ఎగసి రూ. 12,380 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 11,058 కోట్లు ఆర్జించింది. ఈ ఏడాది జూలై–సెప్టెంబర్(క్యూ2)లో సాధించిన రూ. 11,909 కోట్ల లాభంతో పోలిస్తే త్రైమాసికవారీగా 4 శాతం పుంజుకుంది. మొత్తం ఆదాయం 6 శాతం బలపడి రూ. 63,973 కోట్లకు చేరింది. గతేడాది క్యూ3లో రూ. 60,583 కోట్ల టర్నోవర్ అందుకుంది. వాటాదారులకు ఒక్కో షేరుకి రూ. 66 ప్రత్యేక డివిడెండ్‌తో కలిపి మొత్తం రూ. 76 చెల్లించనుంది.

విభాగాలవారీగా

ప్రధాన విభాగం బీఎఫ్ఎస్ఐసహా కన్జూమర్ బిజినెస్ వృద్ధి బాట పట్టినట్లు కంపెనీ పేర్కొంది. కొన్ని విభాగాలలో విచక్షణాధారిత వినియోగం పుంజుకుంటున్నట్లు తెలియజేసింది. వీటికి తోడు ప్రాంతీయ మార్కెట్ల నుంచి డిమాండ్ బలపడుతున్నట్లు వివరించింది. వెరసి భవిష్యత్ వృద్ధి పట్ల విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. కంపెనీ ప్రణాళికలకు అనుగుణంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్లు చేపడుతున్నట్లు మానవ వనరుల ప్రధాన అధికారి మిలింద్ లక్కడ్ తెలియజేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం(2025-26)లో మరింత మందికి ఉపాధి కల్పించే సన్నాహాల్లో ఉన్నట్లు వెల్లడించారు. రూ. 1,625 కోట్లు వెచ్చించి టాటా గ్రూప్ కంపెనీ నుంచి బెంగళూరులో భూమిని కొనుగోలు చేసినట్లు టీసీఎస్ పేర్కొంది.



ఆర్డర్ల జోరు

పండుగల సీజన్ కారణంగా అధిక సెలవు లున్నప్పటికీ భారీ కాంట్రాక్టులను సాధించాం. విభిన్న రంగాలు, వివిధ ప్రాంతాలు, వివిధ లైన్లలో ఆర్డర్లు పొందాం. కంపెనీ దీర్ఘకాలిక వృద్ధిని ఇవి ప్రతిబింబిస్తున్నాయి.
– కె.కృతివాసన్, సీఈవో, టీసీఎస్

ఇతర విశేషాలు

- కొత్తగా 10.2 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు పొందింది.
- ఉద్యోగుల సంఖ్యలో నికరంగా 5,370 కోతపడింది.
- మొత్తం సిబ్బంది సంఖ్య 6,07,354 మందికి చేరింది.
- ఈ ఏడాది 40,000 క్యాంపస్ ప్లేస్‌మెంట్ల సాధనవైపు సాగుతోంది.
- డివిడెండుకు రూ. 21,500 కోట్లు వెచ్చించనుంది.
- నిర్వహణ లాభ మార్జిన్లు 0.4 శాతం మెరుగుపడి 24.5 శాతాన్ని తాకాయి.
- ఐటీ సర్వీసుల ఉద్యోగ వలసల రేటు 13 శాతంగా నమోదైంది.

మార్కెట్లు ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో టీసీఎస్ షేరు 1.7% క్షీణించి రూ. 4,037 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

4 ఐపీవోలకు సెబీ లైన్ క్లియర్	ఈ ఏడాది మెర్సిడెస్ 8 కొత్త మోడళ్లు

భార్యలవైపు ఎంతసేపు చూస్తారు...

ఆదివారాలు కూడా ఆఫీసుకు రండి!

ఎల్&టీ చైర్మన్ వ్యాఖ్య
- నెటిజన్ల నిరసన
- దిద్దుబాటుకు కంపెనీ ప్రయత్నాలు



'ఇంట్లో కూర్చుని ఏం చేస్తారు? భార్యను ఎంత సేపు చూడగలరు? భర్తలను భార్యలు ఎంత సేపు చూడగలరు? ఆఫీసుకు వెళ్లి పని మొదలుపెట్టండి. 'ఆదివారాలు కూడా ఆఫీసుకురండి. వారానికి 90 గంటలు పనిచేయాలి' అంటూ స్టేట్‌మెంట్ ఇచ్చింది ఎవరో కాదు దేశంలోనే ప్రముఖ కార్పొరేట్ కంపెనీ లార్సన్ అండ్ టుబ్రో చైర్మన్ ఎస్ఎన్ సుబ్రమణ్యన్. ఆ మధ్య వారానికి 70గంటలు పనిచేయాలని మాట్లాడి ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కి గురయ్యారు. ఇప్పుడు ఆ వంతు సుబ్రమణ్యన్‌ది. మూర్తి మీద జోకులు మీమ్‌లు ఆగకముందే ఎల్&టీ చైర్మన్ అయనకు తోడయ్యారు. ఉద్యోగులకు వ్యక్తిగత జీవితం ఉండదా, ఉండకూడదా అంటూ నెటిజనులు దాడి మొదలెట్టారు. ఇతర కార్పొరేట్ సీఈఓలు కూడా సుబ్రమణ్యన్ మాటల్ని కొట్టిపారేశారు. ఉద్యోగులపై ఒత్తిడి పెరిగి సమర్థత సన్నగిల్లుతున్న ఈరోజుల్లో వారికి స్ఫూర్తినిచ్చే మాటలు చెప్పాల్సింది పోయి ఇలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదన్నారు. సోషల్ మీడియాలో దాడిని నెటిజన్ల నుంచి వెల్లువెత్తిన వ్యతిరేకతని గమనించిన ఎల్&టీ దిద్దుబాటు చర్యలకు దిగింది. ఇది భారతదేశపు దశాబ్దమని చైర్మన్ సుబ్రమణ్యన్ విశ్వసిస్తున్నారు..అసాధారణ ఫలితాలు సాధించాలంటే అసామాన్య కృషి అవసరం. కలసికట్టుగా అంకితభావంతో కృషి చేస్తే వృద్ధిని కొనసాగించగలుగుతాం. అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించాలనే విజన్‌ను సాకారం చేసుకోగలుగుతాం. కంపెనీ చైర్మన్ వ్యాఖ్యలు ఇదే లక్ష్యాన్ని ప్రతిఫలిస్తున్నాయని ఎల్&టీ ప్రకటన జారీ చేసింది. జాతి నిర్మాణమే ఎల్అండ్‌టీ ప్రధాన లక్ష్యం. ఎనిమిది దశాబ్దాలుగా దేశ మౌలికసదుపాయాలు, పరిశ్రమలు, సాంకేతిక సామర్థ్యాలను బలపరుస్తున్నాం. ఉద్దేశాలు, లక్ష్యాలు సాధనకు కట్టుబడి ముందుకు సాగుతామని స్పష్టం చేసింది.



వన్డే సిరీస్ నుంచి రాహుల్‌కు విశ్రాంతి!

న్యూఢిల్లీ: స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు భారత బ్యాటర్ కేఎల్ రాహుల్ దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తనకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి ఇవ్వాల్సిందిగా అతను కోరినట్లు సమాచారం. 'ఆస్ట్రేలియాతో సిరీస్ ముగిసిన తర్వాత రాహుల్ విరామం కోరుకుంటున్నాడు. అందుకే ఈ సిరీస్‌కు తన పేరును పరిగణనలోకి తీసుకోవద్దని అతను చెప్పాడు. అయితే చాంపియన్స్ ట్రోఫీ కోసం మాత్రం తాను అందుబాటులో ఉంటానని రాహుల్ స్పష్టం చేశాడు' అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. ఆసీస్‌తో ఐదు టెస్టులూ ఆడిన రాహుల్ 10 ఇన్నింగ్స్‌లలో 2 అర్ధసెంచరీలతో 276 పరుగులు చేసి ఫర్వాలేదనిపించాడు. చాంపియన్స్ ట్రోఫీకి తాను సిద్ధమని చెప్పినా... వన్డే జట్టులో వికెట్ కీపర్ బ్యాటర్ స్థానం కోసం పంత్, సంజూ సామ్సన్‌ల నుంచి అతను పోటీని ఎదుర్కొంటున్నాడు. మరోవైపు కర్ణాటక జట్టు ఆడే విజయ్ హజారే ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌కూ తాను అందుబాటులో ఉండనని రాహుల్ ఇప్పటికే సమాచారం అందించాడు.

వన్డే సమరం!

నేడు ఐర్లాండ్ మహిళల జట్టుతో భారత్ తొలి మ్యాచ్
- ఉదయం 11 గంటల నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

భారత్, ఐర్లాండ్ మహిళా క్రికెట్ జట్ల మధ్య 1993 నుంచి ఇప్పటి వరకు 12 వన్డేలు జరిగాయి. వీటన్నింటిలోనూ భారతే గెలవగా, ఐర్లాండ్‌కు ఒక్క గెలుపు కూడా దక్కలేదు. ఈ మ్యాచ్‌లన్నీ ఐసీసీ టోర్నీల్లో భాగంగానే నిర్వహించారు ఒక్కసారి కూడా ఇరు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్ జరగలేదు. ఇప్పుడు 32 ఏళ్ల తర్వాత మూడు మ్యాచ్‌ల సిరీస్‌తో ద్వైపాక్షిక పోరుకు రంగం సిద్ధమైంది. అద్భుత ఫామ్‌లో ఉన్న భారత జట్టు సొంతగడ్డపై మరో సిరీస్‌ను గెలుచుకోవాలని పట్టుదలగా ఉండగా... ఐర్లాండ్ ఏమాత్రం పోటీనిస్తుందనేది ఆసక్తికరం.


స్మృతి

రాజ్‌కోట్: స్వదేశంలో ఈ ఏడాది జరిగే వన్డే వరల్డ్ కప్ సన్నాహాల్లో భాగంగా భారత మహిళల జట్టు దేశంలోని వేర్వేరు వేదికలపై సిరీస్‌లు ఆడుతోంది. దక్షిణాఫ్రికాతో బెంగళూరులో, న్యూజిలాండ్‌తో అహ్మదాబాద్‌లో, వెస్టిండీస్‌తో వడోదరలో ఆడిన జట్టు ఇప్పుడు మరో కొత్త వేదిక రాజ్‌కోట్‌లో ఐర్లాండ్‌తో తలపడుతోంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు జరిగే తొలి వన్డేలో ఐర్లాండ్‌తో భారత మహిళల జట్టు ఆడనుంది. ప్రస్తుతం ఇరు జట్ల బలబలాలు చూస్తే భారత్ సంపూర్ణ ఆధిక్యంలో కనిపిస్తోంది. తొలి మ్యాచ్ గెలిచి సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లాలని జట్టు పట్టుదలగా ఉంది.

కొత్త ప్లేయర్లకు అవకాశం...

రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కు విశ్రాంతి నివ్వడంతో స్మృతి మంధాన నాయకత్వంలో భారత జట్టు బరిలోకి దిగుతోంది. స్మృతి వన్డేల్లో గతంలో ఒకే ఒక మ్యాచ్‌లో కెప్టెన్‌గా వ్యవహరించింది. టాప్ పేసర్ రేణుకా సింగ్ లేకపోవడంతో కాస్త అనుభవం తక్కువ ఉన్న ప్లేయర్లతోనే ఆమె ఫలితాలు రాబట్టాల్సి ఉంది. అయితే కొత్త ప్లేయర్లను మరింతగా పరీక్షించేందుకు ఈ సిరీస్ ఉపయోగపడనుంది. హర్మన్ స్థానంలో రాఘ్వీ బిస్త్ వన్డేల్లో అరంగేట్రం చేయనుంది. మహిళల దేశవాళీ వన్డే టోర్నీలో ఉత్తరాఖండ్ ఫైనల్ చేరడంలో కీలకపాత్ర పోషించిన రాఘ్వీ భారత్ 'ఎ' తరఫున ఆసీస్ 'ఎ'తో జరిగిన మూడు వన్డేల్లో వరుసగా మూడు అర్ధ సెంచరీలు చేసింది. రేణుక, పూజ వస్త్రకర్‌తో పాటు అరుంధతి రెడ్డి కూడా జట్టులో లేకపోవడంతో టిటాస్ సాధు, సైమా ఠాకూర్‌లపై పేస్ బౌలింగ్ భారం ఉంది. ఆల్‌రౌండర్ కావాలంటే సయాలీ సత్ఘరే అందుబాటులో ఉండగా... దీప్తి శర్మ, ప్రియా మిశ్రాకు తోడుగా తుది జట్టులో మరో స్పిన్నర్ కావాలంటే తనూజ కన్వర్‌కు అవకాశం దక్కవచ్చు. అయితే సైమా, సాధు, ప్రియా కలిపి మొత్తం 20 వన్డేలు కూడా ఆడలేదు. ఓపెనర్‌గా తన స్థానం సుస్థిరం చేసుకునేందుకు ప్రతీక రావల్‌కు ఇది మంచి అవకాశం. ఎందుకంటే జట్టులో స్థానం కోల్పోయిన తర్వాత షఫాలీ వర్మ మరోవైపు దేశవాళీ క్రికెట్‌లో చెలరేగిపోతోంది. సీనియర్ వన్డే ట్రోఫీలో 527 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన ఆమె వన్డే చాలెంజర్ ట్రోఫీలో కూడా ఇప్పటికే ఆడిన రెండు మ్యాచ్‌లలో మెరుపు వేగంతో రెండు అర్ధసెంచరీలు సాధించింది. ఈ నేపథ్యంలో ప్రతీక ఆ స్థాయి దూకుడును చూపించాల్సి ఉంది. మరో ఓపెనర్‌గా స్మృతి సూపర్ ఫామ్‌లో ఉండటం భారత్‌కు సానుకూలాంశం. హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్‌లపై భారత బ్యాటింగ్ బలం ఆధారపడి ఉంది.


గాబీ లూయిస్

ఆల్‌రౌండర్లే బలం...

గాబీ లూయిస్ సారథ్యంలో ఐర్లాండ్ ఈ సిరీస్‌కు సన్నద్ధమైంది. ఈ టీమ్‌లో కూడా కొందరు అనుభవజ్ఞులతో పాటు ఎక్కువ మంది యువ ప్లేయర్లు ఉన్నారు. 2024లో జింబాబ్వే, శ్రీలంకలపై వన్డే సిరీస్‌లు నెగ్గిన ఐర్లాండ్.. ఇంగ్లండ్, బంగ్లాదేశ్ చేతిలో సిరీస్‌లు కోల్పోయింది. అయితే ఇంగ్లండ్‌పై 23 ఏళ్ల తర్వాత తొలిసారి ఒక వన్డే మ్యాచ్‌లో గెలవగలిగింది. ఐర్లాండ్ టీమ్‌లో ఒర్లా ప్రెండర్‌ఘాస్ట్ కీలక ప్లేయర్‌గా ఎదిగింది. ఆల్‌రౌండర్‌గా గత ఏడాది జట్టు తరఫున అత్యధిక పరుగులు చేయడంతో పాటు 9 వికెట్లు పడగొట్టింది. శ్రీలంకపై చేసిన సెంచరీ ఆమె సత్తాను చూపించింది. మహిళల బిగ్ బాష్ లీగ్‌లో ఆమెకు మంచి అనుభవం ఉంది. మరో ఆల్‌రౌండర్ లౌరా డెలానీ, లెఫ్టార్మ్ స్పిన్నర్ ఎయిమీ మగ్వైర్, జొవానా లాఫ్‌రన్ టీమ్‌లో ఇతర ప్రధాన ప్లేయర్లు. అయితే గత కొంతకాలంగా సంచలన ఆటతో 19 ఏళ్ల ఐర్లాండ్ స్టార్‌గా ఎదిగిన ఎమీ హంటర్ గాయంతో ఈ సిరీస్‌కు దూరం కావడం జట్టును కాస్త బలహీనపర్చింది.

సాత్విక్–చిరాగ్ ద్వయం ముందుకు

- గాయత్రి–ట్రెసా జోడీ అవుట్
- మాళవిక, ప్రణయ్‌లకు నిరాశ



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ తమ జోరు కొనసాగిస్తోంది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో గత ఏడాది రన్నరప్ సాత్విక్–చిరాగ్ ద్వయం 21–15, 21–15తో నూర్ మొహమ్మద్ అజ్రియాన్–టాన్ వీ కియోంగ్ (మలేసియా) జోడీపై గెలిచింది. 43 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రెండు గేముల్లో భారత జంట స్పష్టమైన ఆధిపత్యం కనబరిచింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో యె సిన్ ఓంగ్–ఈయి టియో (మలేసియా)లతో సాత్విక్–చిరాగ్ తలపడతారు. 'కొత్త సీజన్‌లో శుభారంభం లభించింది. కొత్త కోచ్‌తో మళ్లీ కలిసి పని చేస్తున్నాం. అంతా సవ్యంగా సాగుతోంది' అని విజయానంతరం సాత్విక్–చిరాగ్ వ్యాఖ్యానించారు.

మహిళల డబుల్స్‌లో భారత కథ ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం 21–15, 19–21, 19–21తో జియా యీ ఫాన్–జాంగ్ షు జియాన్ (చైనా) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ధ్రువ్ కపిల–తనీషా క్రాస్టో (భారత్) జంట 13–21, 20–22తో చెంగ్ జింగ్–జాంగ్ చి (చైనా) ద్వయం చేతిలో... సతీశ్ కరుణాకరన్–ఆద్యా వరియత్ (భారత్) జంట 10–21, 17–21తో సూన్ హువార్ గో–షెవోన్ జెమీలాయ్ (మలేసియా) జోడీ చేతిలో పరాజయం చవిచూశాయి.

సింగిల్స్ విభాగంలోనూ భారత పోరాటం ముగిసింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 8–21, 21–15, 21–23తో లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో ఓటమి పాలయ్యాడు. 82 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో ప్రణయ్ నిర్ణాయక మూడో గేమ్‌లో ఒక మ్యాచ్ పాయింట్ వదులుకోవడం గమనార్హం. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మాళవిక బన్సోద్ (భారత్) 18–21, 11–21తో హాన్ యువె (చైనా) చేతిలో ఓడిపోయింది.

యూకీ–ఒలివెట్టి జోడీ సంచలనం

మూడో సీడ్ జంటపై గెలిచి సెమీస్‌లోకి



ఆక్లాండ్: ఏఎస్‌బీ క్లాసిక్ ఆక్లాండ్ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ సంచలన విజయంతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో యూకీ–ఒలివెట్టి ద్వయం 3–6, 6–4, 12–10తో మూడో సీడ్ జూలియన్ క్యాష్–లాయిడ్ గ్లాస్‌పూల్ (బ్రిటన్) జంటను బోల్తా కొట్టించింది. 81 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణాయక 'సూపర్ టైబ్రేక్'లో 9–10తో యూకీ–ఒలివెట్టి ద్వయం ఓటమి అంచుల్లో నిలిచింది. అయితే పట్టుదల కోల్పోకుండా ఆడిన యూకీ–ఒలివెట్టి జంట వరుసగా మూడు పాయింట్లు గెలిచి విజయాన్ని ఖరారు చేసుకుంది. మ్యాచ్ మొత్తంలో యూకీ–ఒలివెట్టి నాలుగు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశారు. నేడు జరిగే సెమీఫైనల్లో క్రిస్టియన్ హారిసన్–రాజీవ్ రామ్ (అమెరికా)లతో యూకీ–ఒలివెట్టి తలపడతారు.

ఎదురులేని నిశేష్



ఆక్లాండ్: మరో మ్యాచ్... మరో సంచలనం... ఏఎస్‌బీ క్లాసిక్ ఆక్లాండ్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో తెలుగు సంతతి అమెరికన్ టీనేజర్ నిశేష్ బసవరెడ్డి సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో 19 ఏళ్ల నిశేష్ 2–6, 6–2, 6–4తో ఎనిమిదో సీడ్, ప్రపంచ 41వ ర్యాంకర్ అలెక్స్ మికెల్సన్ (అమెరికా)ను ఓడించాడు. 1 గంటా 42 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ 133వ ర్యాంకర్ నిశేష్ నాలుగు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. క్వాలిఫయర్‌గా మెయిన్ 'డ్రా'లో అడుగు పెట్టిన నిశేష్ తొలి రౌండ్‌లో ప్రపంచ 85వ ర్యాంకర్ కమ్సానా (అర్జెంటీనా)పై, రెండో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ 23వ ర్యాంకర్ అలెజాంద్రో టబిలో (చిలీ)పై సంచలన విజయాలు సాధించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

బట్టీ వద్దే బడి..

డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్ల చర్ల గ్రామ స్టేజీ సమీపంలోని ఇటుక బట్టీ వద్ద ఒడిశా బడి ఏర్పాటు చేశారు. ఇక్కడి ఇటుక బట్టీలో ఒడిశా రాష్ట్రానికి చెందిన 50 కుటుంబాలు పనులు చేస్తున్నాయి. వీరి కుటుంబాల్లో సుమారు 35 మంది ఏడేళ్లలోపు పిల్లలు ఉండటంతో బట్టీ యజమాని జహంగీర్.. వారి కోసం ప్రత్యేకంగా ఒడిశా పాఠశాలను ఏర్పాటు చేశారు. 35 మంది పిల్లలకు ప్రాథమికస్థాయి విద్యను బోధించేందుకు ఒడిశాకు చెందిన సునీల్ అనే యువకుడిని నియమించారు. పాఠశాల కోసం ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు సునీల్ ఒడిశా భాషలో అక్షరాలతో పాటు పాఠాలు నేర్పుతున్నారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ, బట్టీలో పనిచేస్తున్న వారి పిల్లలకు వారి భాషలోనే విద్యను నేర్పించాలనే ఉద్దేశంతో ఈ బడి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



ఒడిశా బడి వద్ద విద్యార్థులతో జహంగీర్



ప్రజల ముంగిటకు పౌరసేవలు

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ◆ 'మీ టికెట్' యాప్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు సుపరిపాలన అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. టెక్నాలజీ సాయంతో నిపుణులను భాగస్వాములను చేస్తూ పౌర సేవలను ప్రజల ముంగిటకు చేరవేస్తున్నామన్నారు. తెలంగాణ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ సర్వీసెస్ డెలివరీ (ఈఎస్డీ) రూపొందించిన 'మీ టికెట్'యాప్‌ను గురువారం సచివాలయంలో శ్రీధర్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్ని రకాల టికెట్ బుకింగ్స్‌ను ఒకే ప్లాట్ ఫాం పైకి తెచ్చేందుకు వీలుగా ఈ యాప్‌ను రూపొందించామన్నారు. భవిష్యత్తులో ఇదే తరహాలో మరిన్ని యాప్‌లను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. 'ఈ యాప్‌లో తెలంగాణలోని 15 ప్రముఖ దేవాలయాలు, 129 పార్కులు, 54 బోటింగ్ ప్రదేశాలు, జూ, మెట్రో, ఆర్టీసీ, మ్యూజియాలు, ప్లే అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్స్ కు సంబంధించిన టికెట్లను తీసుకోవచ్చు. జీహెచ్ఎంసీ పరిధిలోని కమ్యూనిటీ హాళ్లు, జిమ్‌లు, స్పోర్ట్ కాంప్లెక్స్‌లను బుక్ చేసుకోవచ్చు.



మీ టికెట్ యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

పర్యాటకులు ఎంచుకున్న లొకేషన్‌కు సమీప ప్రాంతాల్లో చూడదగిన ప్రదేశాలుంటే.. ఆ సమాచారం కూడా యాప్‌లో ఆటోమేటిక్‌గా కనిపిస్తుంది. ఈ యాప్ ను చాలా సులువుగా వినియోగించుకోవడంతో పాటు యూపీఐ ద్వారా చెల్లింపులు కూడా చేయవచ్చు. ఇతర ప్లాట్‌ఫాంల మాదిరిగా ఈ యాప్ లో అదనంగా ఎలాంటి చార్జీలను వసూలు చేయం'అని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో మీ సేవ కమిషనర్ రవికిరణ్, పరిశ్రమల శాఖ కమిషనర్ డా.జి.మల్సూర్, జూపార్క్స్ డైరెక్టర్ డా.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ బస్సు..'ప్రత్యేక' చార్జీ

- సంక్రాంతి బస్సుల్లో 10 నుంచి 12 వరకు.. అలాగే 19, 20 తేదీల్లో చార్జీల పెంపు
- పెంచిన చార్జీలు ప్రత్యేక బస్సుల్లోనే అమలు

సాక్షి, హైదరాబాద్: పండుగపూట ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. సంక్రాంతిని పురస్కరించుకుని 6,432 ప్రత్యేక బస్సులను నడపనుంది. పండుగ సందర్భంగా ఈ నెల 10, 11, 12 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని సంస్థ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా రోజుల్లో ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటోంది. అదేవిధంగా ఈ నెల 19, 20 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీ దృష్ట్యా కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తోంది. హైదరాబాద్‌లో ఎంజీబీఎస్, జేబీఎస్ బస్‌స్టేషన్లు, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు ప్రారంభమవుతాయి. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేసింది. కాగా, పండుగపూట నడిపే ప్రత్యేక బస్సుల చార్జీలను ఆర్టీసీ సవరించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకటిన్నర రెట్ల వరకు ధరలను సవరిస్తున్నట్లు సంస్థ తెలిపింది. పెంచిన చార్జీలు ప్రత్యేక బస్సుల్లో మాత్రమే అమలు చేస్తారు. ఈ నెల 10, 11, 12 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 19, 20 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలను అమలు చేస్తామని, స్పెషల్ బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయని టీజీఎస్ఆర్టీసీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుంది. ఇదిలా ఉండగా పండుగలు, ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం www. tgsrtcbus. in వెబ్‌సైట్‌ను సందర్శించాలని టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. మరిన్ని వివరాల కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలని సూచించింది.





HYDERABAD: YUVAAN AUTOHUB- LB NAGAR- 8121801302, SRI LV MOTORS - VANASTHALIPURAM – 8121801302, RAMCOR MOTORS - MALAKPET– 8121801302, ANJALI MOTORS - SOMAJIGUDA– 8121801302, KIRAN AUTOHUB - RANIGUNJ – 8121801302, LOTUS IMPERIUM ENTERPRISE - ATTAPUR – 8121801302, ANTARIKSH MOTORS PVT. LTD - TOLICHOWKI – 8121801302, LOTUS IMPERIUM AUTOMOTIVE - HABSIGUDA – 8121801302, Sree Tulasi – AS Rao Nagar – 8121801302. SUSHEEL TVS -KUKATPALLY – 7548848694, NANESH TVS- TADBUND – 7548848694, LANDMARK TVS- KONDAPUR & GACHIBOWLI – 7548848694, OM SRI SAI SRINIVASA - KOMPALLY – 7548848694, SHANTI TVS – HIMAYATHNAGAR – 7548848694, NALGONDA NISCHAY AUTOMOTIVE PVT LTD – 8121801302, SREE L V MOTORS LLP – 8121801302, SURAYAPET LAXMISAI AUTO AGENCIES- 8121801302, MAHABUBNAGAR Sri JAYARAMA TVS – 7548848694, KHAMMAM RANGARAYA TVS & VAJRA TVS –7548848694, KARIMNAGAR ADARSHA MOTORS SALES PRIVATE LIMITED-9392013695, NIZAMABAD LAXMI AGENCIES-9392013695, HANAMKONDA ADARSHA TVS-9392013695, MANCHERIAL TVS-VINAY AUTOTECH- 9392013695, NIRMAL VINAY AUTOTECH PVT. LTD- 9392013695, JAGTIAL HRUTHIN MOTORS PVT LTD - 9392013695, WARANGAL BALAJI MOTOCORP WIN-9392013695, SANGAREDDY- DURGA SAI - 7548848694.
dentsu/sak ts/07/24

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.




భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయం వద్ద పునరుద్ధరించిన బావి


మెట్ల బావులకు పూర్వవైభవం!

పర్యాటకాభివృద్ధికి బాటలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: పూడికతో ఉనికి కోల్పోయిన మెట్ల బావులకు మహర్దశ కలిగింది. కామారెడ్డి జిల్లా లింగంపేట మండల కేంద్రంలోని నాగన్నగారి బావి, భిక్కనూరు మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వరాలయం వద్ద ఉన్న మెట్ల బావులకు అప్పటి కలెక్టర్ జితేష్ వి పాటిల్ చొరవతో పూర్వ వైభవం చేకూరింది. దీంతో పర్యాటకులు వాటిని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారు. కామారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని మెట్ల బావులు ఉనికి కోల్పోతున్న విషయమై 'సాక్షి' అక్షర సమరం సాగించింది. 2022 జనవరి 29న లింగంపేటలోని నాగన్న బావి ఉనికి కోల్పోతున్న వైనంపై 'మెట్ల బావిలో నిర్లక్ష్యపు పూడిక' శీర్షికన, తరువాత వరుసగా 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలతో అప్పటి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ స్పందించారు. నాగన్నగారి బావిని సందర్శించిన కలెక్టర్.. గ్రామస్తులతో కలిసి ముళ్ల పొదలు, చెట్లను తొలగించడంతో మొదలైన పనులు.. పూడిక తొలగించే వరకు కొనసాగింది. రెయిన్ వాటర్ ప్రాజెక్టు అనే స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ కల్పనా రమేశ్‌తో మాట్లాడి.. వారి సహకారంతో దానికి పూర్వవైభవం తీసుకువచ్చారు. భిక్కనూరు మండల కేంద్రంలోని సిద్దరామేశ్వరాలయ ప్రాంగణంలో మరుగున పడిన మెట్ల బావిని అద్భుతంగా తీర్చిదిద్దారు. మెట్ల బావి వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతూ పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చేలా ఏర్పాట్లు చేశారు. సిద్దరామేశ్వరాలయం దర్శనానికి వెళ్లిన వారంతా.. మెట్ల బావి కట్టడాన్ని చూసి అబ్బురపడుతున్నారు. ఫొటోలు దిగుతున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో రెండు మెట్ల బావులు, రాజంపేట మండల కేంద్రంలో ఒకటి, లింగంపేట మండలం శెట్పల్లి, నాగిరెడ్డిపేట మండలం మాటూరు గ్రామాల్లో మెట్ల బావులను గుర్తించి.. వాటిలో పేరుకుపోయిన పూడికను తొలగించి పూర్వవైభవం తీసుకువచ్చే ప్రయత్నం జరుగుతోంది.

నాగన్నగారి బావిని సందర్శించిన 'జూపల్లి'

లింగంపేట మండల కేంద్రంలోని నాగన్నగారి బావిని గత నెలలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌తో కలిసి సందర్శించారు. మెట్ల బావికి పూర్వవైభవం తేవడాన్ని అభినందించారు. పర్యాటక శాఖ ద్వారా మరింత వైభవం తీసుకొస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. గతంలో పనిచేసిన కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రత్యేక శ్రద్ధతో పూర్వవైభవం వచ్చింది. ప్రస్తుత కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ దానికి మరింత వన్నె తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. జిల్లాలోని మిగతా మెట్ల బావులను కూడా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మెట్ల బావులకు పూర్వవైభవం సమకూరడం పర్యాటకులకు ఆనందాన్ని కలిగిస్తోంది.


జాతీయస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు, విద్యార్థుల వివరాలు

విద్యార్థి	జిల్లా	ప్రాజెక్టు
ప్రియహర్షిణి దుర్గ	భద్రాద్రి కొత్తగూడెం	టెంపరేచర్ కంట్రోల్ బెడ్ కూలర్
పూర్ణిత్‌రెడ్డి	సంగారెడ్డి	అంధులకు సహాయపడే పరికరం
మణికంఠ	కొత్తకోట (వనపర్తి)	కంట్రోలింగ్ మొబైల్ చార్జర్ బై యూజింగ్ టైమర్
జెస్సీ	హనుమకొండ	ఏ గ్లోవ్ ఫర్ ఉమెన్ ప్రొటెక్షన్
శ్రీ వైష్ణవి	హైదరాబాద్	ఈ క్లాడ్
అంజనీ దయాల్	మేడ్చల్	సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ త్రూ రాపిడ్ కంపోస్టింగ్
సంజయ్‌కృష్ణ	నాగర్‌కర్నూల్	స్పెషల్ డిజేబుల్ పర్సన్స్ యూజింగ్ అండర్ ఆర్మ్ క్రచెస్
శివకుమార్	వరంగల్	ఫ్లడబుల్ రాడార్ ఫర్ క్లైంబింగ్ అప్పర్ బెర్త్ ఇన్ ట్రెయిన్స్
వి.రష్మిత	వరంగల్	గార్బేజ్ కలెక్షన్ త్రూ స్కైకింగ్
బి.శివరాంచరణ్	యాదాద్రి భువనగిరి	ఎకో ఫ్రెండ్లీ గ్రెయిన్స్ ప్రొటెక్టర్
కేఆర్‌పీ రెడ్డి	హైదరాబాద్	వాయిస్ కంట్రోల్డ్ వీల్‌చైర్ ఫర్ ఫిజికల్లీ డిజేబుల్డ్
ఎం.ఆకాష్	కామారెడ్డి	ఫార్మర్స్ సీడ్ సొయింగ్ బై సైకిల్
ఎం.రితిక	కరీంనగర్	సీడ్స్ సొయింగ్ షో ఫర్ ఫార్మర్
చేగువీర	కరీంనగర్	సోలార్ పవర్ మల్టీ గ్రెయిన్ సెపరేటర్
బి.శివమణి	నిజామాబాద్	పెడల్ ఆపరేటర్ ఫ్లోర్‌మిల్ విత్ మల్టీ అప్లికేషన్స్
పి.అభిలాష్	పెద్దపల్లి	సోలార్ పవర్ డిసిలైనేషన్
సి.విశాల్	రాజన్న సిరిసిల్ల	యానిమల్స్ కర్కస్ రిమూవల్ ట్రాలీ
సీహెచ్ అన్విత	ఖమ్మం	ఫుట్‌ప్రెస్ నెమాటిక్ లిఫ్టర్ జాక్
వై.సిద్ధినబయ్	రంగారెడ్డి	అంధులకు ఉపయోగపడే షూ
ఎస్.సోలంకి	ఆసిఫాబాద్	ఎలక్ట్రానిక్ హమ్మర్ మిషన్
ఆర్.శరణ్య	సంగారెడ్డి	మల్టీపర్పస్ లోడ్ క్యారియల్ ఫర్ హోంనీడ్స్
ఆయుష్ కుమార్	సంగారెడ్డి	టాక్ గురుట్రాన్స్ కమ్యూనికేషన్స్ బేరియర్స్
ఆర్.సౌజన్య	సంగారెడ్డి	ది ఫ్లెక్సీ షూస్
ఎ.దినేష్	మహబూబాబాద్	బైక్ థెఫ్ట్ ప్రివెంటింగ్ అలారం
వి.హర్షవర్ధన్	మహబూబ్‌నగర్	లోకాస్ట్ అండ్ రీయూజబుల్ మిక్సర్ కన్వర్ట్ ఇన్ టు పొట్టరీ మిషన్
జి.శ్రావణ్‌కుమార్	మంచిర్యాల	ఆటోమేటిక్ అప్‌డేటెడ్ టాయిలెట్ క్లీనింగ్ మిషన్
వికాస్ చర్ల	సిద్దిపేట	పోర్టబుల్ బ్యాటరీ క్లీనింగ్ డివైజ్
సి.సంజనశ్రీ	మెదక్	మల్టీ ఫ్యూచర్ వాకింగ్ స్టిక్



ఇన్‌స్పైర్ విభాగంలో జాతీయస్థాయిలో ఎంపికై బహుమతి అందుకుంటున్న ప్రియహర్షిణి

65 శాతం మరణాలకు అసంక్రమిత వ్యాధులే కారణం

ఎన్‌సీడీల నివారణపై ముగిసిన జాతీయ సదస్సు

సాక్షి, హైదరాబాద్: దేశంలో 65 శాతం మరణాలకు కారణమవుతున్న అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) విషయంలో ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించిన సదస్సు తీర్మానించింది. వ్యాధులను గుర్తించి తగిన చికిత్స పొందడంతో పాటు జీవనశైలిలో మార్పులతో మరణాల నుంచి కాపాడుకోవచ్చని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అధికారులు, వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ద్వారా హైదరాబాద్‌లో బుధవారం ప్రారంభమైన రెండు రోజుల ఎన్‌సీడీ వర్క్‌షాపు గురువారం ముగిసింది. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధ ఆరోగ్య నిపుణులు, ప్రభుత్వ అధికారులు ఈ సదస్సుకు హాజరై ఎన్‌సీడీల నివారణ, ముందస్తు గుర్తింపు తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. సదస్సుకు హాజరైన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి పుణ్యసలిల శ్రీవాస్తవ మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల నివారణకు అధిక ప్రాధాన్యతనిచ్చి, తగిన చర్యలు చేపట్టాలని అన్ని రాష్ట్రాల అధికారులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు మాట్లాడుతూ రాష్ట్రంలో అసంక్రమిత వ్యాధుల పరీక్షలు, నివారణ చర్యలకు ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. ఈ సమావేశంలో నేషనల్ హెల్త్ మిషన్ ఎండీ ఆరాధన పట్నాయక్, వివిధ రాష్ట్రాల నుంచి ఆరోగ్య కార్యదర్శులు, ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్లు, రాష్ట్ర నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పీఆర్ సెక్రటరీలు, సూపరింటెండెంట్ల బదిలీలు

తెలంగాణ పంచాయతీ కార్యదర్శి అసోసియేషన్

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల బదిలీలు, స్థానికతకు సంబంధించి గతంలో ఇచ్చిన జీవో 317తో నష్టపోయిన పలువురికి ఊరట లభించిందని తెలంగాణ పంచాయతీ కార్యదర్శి అసోసియేషన్ తెలిపింది. పంచాయతీరాజ్ శాఖ వరకు చూస్తే పంచాయతీ సెక్రటరీలు వివిధ గ్రేడ్ల వారికి, సూపరింటెండెంట్లకు స్పౌజ్, మెడికల్ కేటగిరీల్లో ప్రయోజనం చేకూరినట్టు వెల్లడించింది. గురువారం ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మెమో జారీచేసింది. ఇందుకు అనుగుణంగా 18 మంది కార్యదర్శులకు స్పౌజ్ కేటగిరీలో, ముగ్గురికి మెడికల్ కేటగిరీలో అవకాశం కల్పించారని ఈ సంఘ అధ్యక్షుడు పి.మధుసూదనరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సూపరింటెండెంట్లకు 17 మందికి స్పౌజ్ కేటగిరీలో, 15 మందికి మెడికల్ కేటగిరీలో అవకాశం లభించిందన్నారు. వీరికి పీఆర్ ఆర్‌డీ డైరెక్టర్ బదిలీ ఉత్తర్వులు అందజేస్తారని తెలిపారు. ఇక 317 జీవోలో స్థానికత కోల్పోయి నష్టపోయిన దాదాపు 450 మంది పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై ఉమ్మడిగా పోరాడాల్సి ఉందని చెప్పారు.

వెంటనే ఆరోగ్యశ్రీ, 'ఫీజు' బకాయిలు ఇవ్వాలి

సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: ఆరోగ్యశ్రీతోపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. వీటికి సంబంధించిన బకాయిలు రూ.8 వేల కోట్ల లోపేనని, రూ.2.75 లక్షల కోట్ల బడ్జెట్‌లో నుంచి ఈ మొత్తాన్ని చెల్లించి లక్షలాది మంది రోగులు, విద్యార్థులను ఆదుకోలేరా? అని ప్రశ్నించారు. వెంటనే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల ప్రతినిధులు, ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలతో సమావేశమై బకాయిలను విడుదల చేయాలని గురువారం ముఖ్యమంత్రికి రాసిన బహిరంగలేఖలో సంజయ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నాయకత్వంలో విద్యార్థులు, పేదలతో కలసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కూడా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నీరుగారుస్తున్నట్లు కన్పిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఇంటర్ నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్ వంటి కోర్సులను చదువుతున్న దాదాపు 13 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి విద్యను అభ్యసిస్తున్నారని సంజయ్ పేర్కొన్నారు.

జైపాల్‌రెడ్డి 83వ జయంతికి ఏర్పాట్లు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఈనెల 16న నెక్లెస్ రోడ్‌లో మాజీ కేంద్రమంత్రి, దివంగత ఎస్.జైపాల్‌రెడ్డి 83వ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. జైపాల్‌రెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో.. సంబంధిత అధికారులతో గురువారం శాంతికుమారి సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల సమన్వయంతో జైపాల్‌రెడ్డి మెమోరియల్ స్ఫూర్తి స్థల్‌లో అన్ని ఏర్పాట్లు చేయాలని హెచ్‌ఎండీఏ కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా.. శానిటేషన్, పార్కింగ్, ట్రాఫిక్, భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు.

మృతి చెందిన ఒక్కో భక్తుడికి కోటి పరిహారం ఇవ్వాలి

తెలంగాణ అడ్వొకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన ఒక్కో భక్తుడికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని తెలంగాణ అడ్వొకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంతం గోవర్ధన్‌రెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు ఉపేందర్, న్యాయవాదులు వడియారపు రవికుమార్, పనుగంటి అరుణ్‌కుమార్, తుడి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని ఉంటే ఆరు నిండు ప్రాణాలు పోయేవి కాదని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతి చెందిన కుటుంబాల్లో ఒకరికి టీటీడీలో ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఇది ముమ్మాటికీ పోలీసులు, టీటీడీ అధికారుల నిర్లక్ష్యంతోనే జరిగిందని గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. తొక్కిసలాట సంఘటనకు బాధ్యత వహించి టీటీడీ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

గేమ్ ఛేంజర్ సినిమాకు మినహాయింపులు ఎందుకు?

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: గేమ్ ఛేంజర్ సినిమాకు ప్రత్యేక మినహాయింపులు ఇవ్వడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు నాల్కల ధోరణి మరోసారి బయట పడిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శించారు. తెలంగాణలో కల్లు, మటన్‌కే వైబ్ ఉంటుందన్న నిర్మాత దిల్ రాజు ఇక్కడ సినిమాలు విడుదల చేసి రేట్లు ఎందుకు పెంచాలని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి గురువారం తెలంగాణ భవన్‌లో దేశపతి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. దిల్ రాజు మొదటి నుంచి తెలంగాణ వ్యతిరేకి అని, తెలంగాణ సంస్కృతిపై రేవంత్ ప్రభుత్వం చేస్తున్న దాడిని ఖండిస్తున్నామన్నారు. బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వబోమని ప్రకటించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గేమ్ ఛేంజర్ సినిమాకు మినహాయింపులపై సమాధానం చెప్పాలని దేశపతి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సినిమా టికెట్ల రేట్ల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతి అంశంలో అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ చేసిన ప్రకటన పచ్చి అబద్ధమని తేలిందని రసమయి బాలకిషన్ మండిపడ్డారు.



జలవిహారానికి స్వామి వారిని తీసుకొస్తున్న అర్చకులు

జగదభిరాముని జలవిహారం

భద్రాచలంలోని భద్రగిరిపై కొలువైన వైకుంఠ రాముడు గురువారం గోదావరి నదిలో సీతాదేవితో కలిసి హంస వాహనంలో జలవిహారం చేశారు. వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దర్బార్ సేవ నిర్వహించిన అనంతరం సీతా సమేత రామచంద్రస్వామిని మేళతాళాల నడుమ గోదావరి తీరానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. రాముని కథను తెలిపే శాస్త్రీయ నృత్యరూపకాలను ప్రదర్శించారు.



శాస్త్రీయ నృత్యం చేస్తున్న కళాకారులు

బాధితులకు మెరుగైన పరిహారమివ్వాలి



తిరుపతి తొక్కిసలాట ఘటన చాలా దురదృష్టకరం. ఈ ఘటనలో మృతి చెందిన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. ఇరుకైన ప్రదేశంలో టోకెన్లు జారీ చేయడం వల్లే ఈ దారుణం జరిగింది. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు మెరుగైన పరిహారం ఇవ్వాలి.

– పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎంపీ

టీటీడీ నిర్వహణలో ప్రభుత్వం విఫలం



టీటీడీ నిర్వహణలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. టీటీడీ చైర్మన్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం. తొక్కిసలాటకు బాధ్యత ఎవరు తీసుకుంటారు? ఇప్పటికైనా ప్రజల ముందుకు వచ్చి తప్పు తమదేనని లెంపలేసుకోవాలి. చంద్రబాబు ప్రభుత్వం రాజకీయల కోసం దేవుడిని కూడా వదల్లేదు. శ్రీవేంకటేశ్వరస్వామిని రాజకీయానికి వాడుకున్నారు.

– కన్నబాబు, మాజీ మంత్రి

తిరుమల పవిత్రతను పదేపదే దెబ్బతీస్తున్నారు





కూటమి ప్రభుత్వం పదే పదే తిరుమల తిరుపతి పవిత్రతను దెబ్బతీస్తోంది. ఇటీవల లడ్డూ కల్తీ జరిగిందంటూ అసత్య ఆరోపణలు చేసి భక్తుల మనోభావాలను గాయపరిచింది. ఇప్పుడు ప్రభుత్వ చేతగానితనం వల్ల భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఇలా జరుగుతుందని ముందే తెలుసని చెప్పిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు.. ముందస్తు జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేదో చెప్పాలి? తొక్కిసలాటకు కారణమైన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరిని తొలగించాలి.

– మాసీమ బాబు, యానాదయ్య, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు

బాధ్యులపై హత్యకేసు నమోదు చేయాలి



నరసరావుపేట : తిరుపతిలో భక్తుల మృతికి కారకులైన పోలీసు, రెవెన్యూ, టీటీడీ చైర్మన్‌లపై హత్యకేసు నమోదుచేయాలి. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఎలాంటి ఇబ్బందిలేకుండా లక్షలాది మందికి టికెట్లు జారీచేశారు. టీటీడీ బోర్డును రద్దు చేయాలి. టీవీ–5 ఛానల్‌లో మిడ్‌నైట్ మసాలా వేసుకునే వ్యక్తి టీటీడీ చైర్మన్‌గా పనికి రాడు. ఇదే సంఘటన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగి ఉంటే నానా రభస చేసి ఉండేవారు. మృతులకు ఇస్తామన్న రూ.25 లక్షలు సరిపోవు. ఒక్కొక్కరికి రూ.కోటి ఇవ్వాలి.

– మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుని ఇల్లు కూల్చివేత

రేణిగుంట: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం పోలి పంచాయతీ వాంపల్లి దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు రంగారావు ఇంటిని గురువారం తెల్లవారుజామున నాలుగు గంటలకు రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. బఫర్‌జోన్ పేరిట గ్రామం మధ్యలో ఉన్న ఇంటిని అధికారులు కక్షపూరితంగా కూల్చేశారని బాధితులు వాపోతున్నారు.

‘ఎక్స్‌ప్రెస్’ బస్సుల్లో ఉచితం ఇవ్వాలా వద్దా!?

పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సులకే పరిమితం చేద్దామా..



మహిళలకు ఉచిత ప్రయాణంపై ప్రభుత్వం మల్లగుల్లాలు

రెండు రకాల ప్రతిపాదనలు సమర్పించిన ఆర్టీసీ

ఎన్నికల హామీని నీరుగార్చేందుకే ప్రభుత్వ ఎత్తుగడ

సాక్షి, అమరావతి : మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకంపై రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ప్రధానంగా ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని అమలుచేయాలా వద్దా అనే అంశంపై సందిగ్ధతతో కొట్టుమిట్టాడుతోంది. పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ బస్సులకే ఈ పథకాన్ని పరిమితంచేస్తే ఎలా ఉంటుంది?.. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తే ఎలా ఉంటుంది?.. అనే దానిపై తర్జనభర్జన పడుతోంది. ప్రభుత్వ పెద్దల ఉద్దేశం గ్రహించిన ఆర్టీసీ ఉన్నతాధికారులు ఈ రెండు రకాల ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించారు. అయినా.. ఇటీవల సీఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోలేకపోవడం గమనార్హం.

ఎన్నికల హామీని నీరుగార్చేదెలా..

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని అమలుచేస్తామనే టీడీపీ కూటమి ఎన్నికల్లో హామీ ఇచ్చింది. దీని ప్రకారం.. అన్ని కేటగిరీల బస్సుల్లో ఉచితంగా అమలుచేయాలి. కానీ, ఈ పథకాన్ని నీరుగార్చేందుకే టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యత్నిస్తోంది. అందుకే ఈ తరహా పథకాన్ని అమలుచేస్తున్న ఇతర రాష్ట్రాల్లో పర్యటనల పేరుతో ఏడు నెలలుగా కాలయాపన చేసింది. ముందు అధికారుల బృందాలు పర్యటించి నివేదిక సమర్పించాయి. అయినాసరే మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించి మరోసారి పర్యటనలతో కాలం వెళ్లదీశారు. ఆగస్టు 15 నుంచి ఓసారి.. కాదు దసరా నుంచి అని మరోసారి చెప్పుకొచ్చారు. సంక్రాంతికి కూడా ఈ పథకాన్ని ప్రారంభించడంలేదని తాజాగా వెల్లడించి ఉగాదికి వాయిదా వేశారు. తీరా ఇటీవల సీఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్షా సమావేశంలో రెండు రకాల ప్రతిపాదనలపై చర్చించడం గమనార్హం. కేవలం పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సులకే పరిమితంచేస్తే ఎంత భారంపడుతుంది.. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణం అమలుచేస్తే ఎలా ఉంటుందని చర్చించారు.

ఆ మూడు రాష్ట్రాలు నిధుల కేటాయింపు ఇలా..

తమిళనాడు, కర్ణాటక, తెలంగాణల్లో ఎక్స్‌ప్రెస్ సర్వీసులతో సహా అన్ని కేటగిరీల సర్వీసుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేస్తున్నాయి. అందుకోసం ఏటా తమిళనాడు ప్రభుత్వం రూ.6,396 కోట్లు, కర్ణాటక ప్రభుత్వం రూ.5,015 కోట్లు, తెలంగాణ ప్రభుత్వం రూ.4,084 కోట్లు కేటాయిస్తున్నాయి. కానీ, ఆ స్థాయిలో నిధుల కేటాయింపుపై టీడీపీ కూటమి ప్రభుత్వం వెనుకంజ వేస్తోంది. అందుకే ఈ పథకాన్ని నీరుగార్చేందుకు యత్నిస్తోంది.

ఎక్స్‌ప్రెస్ బస్సులతో సహా అన్ని బస్సుల్లో పథకాన్ని అమలుచేయాలంటే..

- ఏడాదికి ప్రభుత్వం కేటాయించాల్సిన నిధులు: రూ.3,182 కోట్లు
- నెలకు కేటాయించాల్సింది : రూ.265 కోట్లు
- ఉచిత ప్రయాణానికి కేటాయించాల్సిన బస్సుల సంఖ్య : 8,193
- కొత్తగా కొనాల్సిన బస్సుల సంఖ్య : 2,045
- కొత్తగా నియమించాల్సిన ఉద్యోగులు : 11,479

(డ్రైవర్లు, కండక్టర్లు, నిర్వహణ సిబ్బంది)

పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సులకే ఈ పథకాన్ని పరిమితం చేస్తే..

- ఏడాదికి ప్రభుత్వం కేటాయించాల్సిన నిధులు : రూ.2,122 కోట్లు
- నెలకు కేటాయించాల్సింది : రూ.177 కోట్లు
- ఉచిత ప్రయాణానికి కేటాయించాల్సిన బస్సుల సంఖ్య : 6,303
- కొత్తగా కొనాల్సిన బస్సుల సంఖ్య : 1,684
- కొత్తగా నియమించాల్సిన ఉద్యోగులు: 9,449

(డ్రైవర్లు, కండక్టర్లు, నిర్వహణ సిబ్బంది)

సంక్రాంతి పండగ అంటే పల్లెల్లో ఎంతో సందడి ఉంటుంది. జనవరి నెల మొదలు కాగానే అన్ని గ్రామాల్లో ఈ పండుగ వాతావరణం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రతి రోజూ ఇంటి ముందు ముగ్గులు వేయడం, హరిదాసుల సంకీర్తనలు, అందరూ కలసి ఒక చోట చేరి ఆడిపాడి సందడి చేయడం, ముగ్గుల పోటీలు నిర్వహించడం, వివిధ క్రీడా పోటీలు లాంటి కార్యక్రమాలు ఎంతో సందడిగా జరుగుతుంటాయి. అయితే ఇందుకు భిన్నంగా కొన్ని శతాబ్దాలుగా సంక్రాంతి పండుగకు ఓ గ్రామంలో సగానికి పైగా ప్రజలు దూరంగా ఉంటున్నారు. ఇందుకు గల కారణాలు... విశేషాలు తెలుసుకోవాలంటే అనంతపురం జిల్లా పి.కొత్తపల్లి గ్రామాన్ని సందర్శించి తీరాల్సిందే.

– ఆత్మకూరు:


పి.కొత్తపల్లి ముఖచిత్రం

వారికి సంక్రాంతి లేదు!



ఓ ఊరి కథ

- ఆత్మకూరు మండలం పి.కొత్తపల్లిలో వింత ఆచారం
- శతాబ్దాలుగా పండుగ సంబరాలకు దూరంగా బోదపాటి వంశీకులు

అనంతపురం జిల్లాలో ఆత్మకూరు నుంచి కళ్యాణదుర్గం వెళ్లే మార్గంలో ఐదు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే జాతీయ రహదారికి ఓ కిలోమీటరు దూరంలో పి.కొత్తపల్లి గ్రామం వస్తుంది. ఈ గ్రామంలో కమ్మ, బోయ, ఎస్సీ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. దాదాపు 300 గడపలున్న ఈ గ్రామ ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. వరి, చీనీ, వేరుశనగ, టమాట పంటల సాగుతో జీవనం సాగిస్తున్నారు. గ్రామం చుట్టూ ఎటు చూసినా పచ్చని పంట పొలాలు కనువిందు చేస్తుంటాయి. సమైక్య జీవనానికి, స్వశక్తికి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపాలుగా ఈ గ్రామస్తులు నిలుస్తున్నారు.

అనాదిగా వస్తున్న ఆచారాన్ని గౌరవిస్తూ..

సంక్రాంతి పండుగ విషయంలో బోదపాటి వారి భయాందోళనకు కారణమూ లేకపోలేదు. ఇందుకు సంబంధించి ఓ పురాతన కథను నేటికీ పూర్వీకులు చెబుతున్నారు. శతాబ్దాల క్రితం సంక్రాంతి సరుకుల కొనుగోలు కోసమని గ్రామానికి చెందిన బోదపాటి కుటుంబానికి సంబంధించిన వ్యక్తి ఆత్మకూరు సంతకు వచ్చారు. ఆ సమయంలో ఉన్నఫళంగా ఆయన కుప్పకూలి మృతి చెందాడు. ఇదేదో సాధారణ మృతిగానే అందరూ అప్పట్లో భావించారు. అయితే ఆ మరుసటి సంవత్సరం సంక్రాంతి పండుగ సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన బోదపాటి కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. ఇలా వరుసగా ఏటా సంక్రాంతి పండుగ చేయాలనే ఉద్దేశంతో సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన బోదపాటి కుటుంబంలోని ఎవరో ఒకరు మృత్యువాత పడుతుండడంతో ఒక్కసారిగా వారిలో ఆందోళన మొదలైంది. దీంతో సంక్రాంతి పండుగ జరుపుకోకూడదని బోదపాటి కుటుంబీకులు నిర్ణయించుకున్నారు. నాటి నుంచి నేటి వరకూ సంక్రాంతి పండుగకు బోదపాటి కుటుంబీకులు దూరంగా ఉంటూ వస్తున్నారు.

సంక్రాంతి అంటే బెదరు

హిందూ సంప్రదాయంలో వచ్చే ప్రతి పండుగనూ పి.కొత్తపల్లి వాసులు ఎంతో సంబరంగా జరుపుకుంటారు. అయితే సంక్రాంతి అంటే చాలు ఈ గ్రామంలో సగానికి పైగా జనాభా ఉన్న కమ్మ సామాజిక వర్గంలోని బోదపాటి వారు బెదిరిపోతుంటారు. సంక్రాంతి సందర్భంగా ప్రతి ఇంటి ముంగిట కనిపించే రంగవల్లులు వీరి ఇళ్ల ముందు కనిపించవు. గొబ్బెమ్మలు ఉండవు. పిండి వంటలు, నూతన వస్త్రాలకు దూరంగా ఉంటారు. ఇక గ్రామంలో జరిగే సంక్రాంతి సంబరాలకు సైతం బోదపాటి వారు దూరంగా ఉంటారు. రైతు కుటుంబంలో సాధారణంగా భోగి నాడు కనిపించే సందడి ఊసే ఉండదు. పశువులకు, పొలాల్లో నవధాన్యాలకు, ఇంట్లో పూజలు చేయరు. ఒక్క మాటలో చెప్పాలంటే సంక్రాంతి పండుగ నాడు కనీసం స్నానం చేయాలన్నా వీరు భయపడుతుంటారు.

నేను పుట్టినప్పటి నుంచి చూడలేదు



ప్రస్తుతం నాకు 45 సంవత్సరాలు. నేను పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ బోదపాటి వారు సంక్రాంతి పండుగను జరుపుకున్నది చూడలేదు. మా తాతల కాలం నుంచి కూడా ఇదే పద్ధతి కొనసాగుతూ వస్తోంది. ఒకవేళ బోదపాటి కుటుంబీకులు ఎవరైనా ధైర్యం చేసి పండుగ చేసేందుకు సిద్ధమైతే ఏదో ఒక ప్రమాదం బారిన పడుతున్నారు. దీంతో సంక్రాంతి నాడు ఇంట్లో పూజలు కూడా చేయం.

– గోపాల్, పి.కొత్తపల్లి, ఆత్మకూరు మండలం

పెద్దల ఆచారాలు గౌరవిస్తున్నాం



సంక్రాంతి పండుగ అంటే మా పల్లెల్లో అందరూ ఎంతో ఆనందంగా గడుపుతారు. కొత్త అల్లుళ్ల రాకతో ప్రతి ఇంట్లోనూ సందడిగా ఉంటుంది. కానీ, బోదపాటి వంశానికి చెందిన దాదాపు వంద కుటుంబాల వారు సంక్రాంతి పండుగ చేసుకోం. పెద్దల ఆచారాలు గౌరవిస్తూ ఇళ్ల ముందు ముగ్గులు వేయడం, ఇల్లు, వాకిలి శుభ్రం చేయడం ఇతర ఆచారాలు ఏవీ చేయం.

– రమాదేవి, పి.కొత్తపల్లి, ఆత్మకూరు మండలం

స్నానం కూడా చేయం



సంక్రాంతి అంటే అందరూ ఆనందంగా జరుపుకుంటారు. కానీ మా బోదపాటి వారు స్నానాలు కూడా చేయరు. పండుగ చేసుకుంటే ఏం జరుగుతుందో అనే భయం అందరిలోనూ ఉంది. దీంతో చాలా ఏళ్లుగా పండుగనాడు కూడా సాధారణ వంటకాలతోనే సరిపెట్టుకుంటాం.

– రాజప్ప, పి.కొత్తపల్లి, ఆత్మకూరు మండలం

దేశంలో నూతన విద్యావిధానం గేమ్‌చేంజర్

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ


అన్నమాచార్య యూనివర్సిటీని ప్రారంభిస్తున్న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ

రాజంపేట:విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా రాజంపేటలోని అన్నమాచార్య యూనివర్సిటీని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. నిరుద్యోగం, పేదరికం నిర్మూలించాలంటే విద్యే గొప్ప టానిక్ అని చెప్పారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో అన్నమాచార్య యూనివర్సిటీ నిర్వహించడం స్వాగతించదగ్గ పరిణామమన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ 2020లో నూతన విద్యావిధానం తీసుకొచ్చారని, భారతదేశ చరిత్రలో ఈ నూతన విద్యావిధానం గేమ్ చేంజర్ లాంటిదన్నారు. దేశభవిష్యత్తు యువత చేతిలోనే ఉందన్నారు.

కన్నుల పండువగా శ్రీరామగిరి తెప్పోత్సవం



చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): రెండో భద్రాద్రిగా పేరుగాంచిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అల్లూరి జిల్లా వీఆర్‌పురం మండలం శ్రీరామగిరిలోని శ్రీ సుందర సీతారామచంద్ర స్వామి తెప్పోత్సవ వేడుక గురువారం రాత్రి అత్యంత కోలాహలంగా జరిగింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి తెప్పోత్సవాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు వైకుంఠ ఏకాదశి పర్వదిన విశిష్టతను భక్తులకు వివరించారు.

ఔట్‌సోర్సింగ్‌లో నియమించుకోమని న్యాకోనే చెప్పిందట!

వైద్య పోస్టుల భర్తీలో పారదర్శకతకు కూటమి ప్రభుత్వం పాతర

- ఏఆర్‌టీ సెంటర్స్‌లో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా భర్తీ చేస్తున్న వైద్య శాఖ
- నోటిఫికేషన్ ద్వారానే భర్తీ చేయాలని చెప్పిన న్యాకో
- నిబంధనలకు విరుద్ధమైన నియామకాలను సమర్థించుకుంటున్న వైద్య శాఖ

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం పారదర్శక పాలనకు పాతరేసింది. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల నియామకాల్లో కనీస నిబంధనలు పాటించడంలేదు. గోప్యంగా ప్రైవేట్ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కావాల్సిన వారికి పోస్టులు కట్టబెడుతోంది. తాజాగా ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (శాక్స్)లో వైద్య పోస్టులను ప్రైవేట్ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా వైద్య శాఖ భర్తీ చేయడం విమర్శలకు దారితీసింది. ఎయిడ్స్ రోగులకు చికిత్స అందించే యాంటి రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) సెంటర్స్‌లో మెడికల్ ఆఫీసర్(ఎంవో) పోస్టులను బహిరంగ నోటిఫికేషన్ ఇవ్వకుండానే హార్మోని కన్సల్టెన్సీ ద్వారా భర్తీ చేస్తున్నారు. ఇదే విధానంలో మంగళవారం ముగ్గురు వైద్యులను నియమించారు. ఈ వ్యవహారంపై ‘నోటిఫికేషన్ ఇవ్వకుండా వైద్యుల నియామకమా?’ శీర్షికతో బుధవారం ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. దీంతో న్యాకో మార్గదర్శకాలను అనుసరించే ఔట్‌సోర్సింగ్‌లో వైద్యులను నియమిస్తున్నామని శాక్స్ అధికారులు సమర్థించుకున్నారు. వాస్తవానికి ఏఆర్‌టీ సెంటర్స్‌లో వైద్య, ఇతర సిబ్బంది పోస్టులను బహిరంగ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని జాతీయ ఏఆర్‌టీ సేవల నిర్వహణ మార్గదర్శకాలు–2021లోనే న్యాకో స్పష్టంగా చెప్పింది. ఒక పోస్టుకు ఐదు దరఖాస్తులు దాటితే రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి ప్రతిభ కలిగిన వారిని నియమించాలని న్యాకో నిబంధనలు చెబుతున్నాయి. ఈ నిబంధనలను అనుసరిస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శాక్స్ పోస్టులను డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) ద్వారా భర్తీ చేశారు. తెలంగాణ, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిస్సా వంటి రాష్ట్రాల్లో శాక్స్‌లో సమన్వయకర్తలు, వైద్యులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఇతర సిబ్బంది పోస్టులన్నింటినీ బహిరంగ నోటిఫికేషన్ ఇచ్చి, దరఖాస్తులు ఆహ్వానించి, ఆర్‌ఓఆర్ పాటిస్తూ ప్రతిభ కలిగిన, అర్హులైన అభ్యర్థులతో భర్తీ చేస్తున్నారు.


ORISSA STATE AIDS CONTROL SOCIETY (OSACS)
ADVERTISEMENT

కేవలం మూడు వైద్య పోస్టుల భర్తీకి గత ఏడాది అక్టోబర్‌లో బహిరంగ నోటిఫికేషన్ ఇచ్చిన ఒడిశా శాక్స్ విభాగం


DELHI STATE AIDS CONTROL SOCIETY
RESULT

వైద్య పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి, ఎంపికైన అభ్యర్థుల వివరాలను సైతం పారదర్శకంగా ప్రకటించిన ఢిల్లీ శాక్స్ విభాగం

రూ. లక్షల్లో వసూళ్లు

కూటమి ప్రభుత్వం మాత్రం న్యాకో నిబంధనలంటూ ఔట్‌సోర్సింగ్ విధానంలోనే భర్తీ చేస్తోంది. ప్రస్తుతం భర్తీ చేస్తున్న వైద్యులకు నెలకు రూ.72 వేల వేతనం ఉంటుంది. ఎన్‌హెచ్‌ఎం పరిధిలో ఇంతకంటే తక్కువ వేతనం ఇస్తున్నారు. దీంతో ఏఆర్‌టీ సెంటర్లలో వేతనం కొంత ఎక్కువ, పని ఒత్తిడి తక్కువగా ఉంటుంది. వీటికి బహిరంగ నోటిఫికేషన్ ఇస్తే ఎక్కువ మంది యువ వైద్యులు ముందుకు వస్తారని వైద్య శాఖ వర్గాలు చెబుతున్నాయి. అయినా, అర్హులకు అన్యాయం చేస్తూ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా పోస్టులు భర్తీ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఇందుకోసం అవుట్‌సోర్సింగ్ రూ. లక్షల్లో ముడుపులు చేతులు మారినట్టు ఆరోపణలున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక శాక్స్‌లో ఇదే తరహాలో క్లస్టర్ ప్రివెన్షన్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేశారు. అప్పట్లో ఓ కీలక అధికారి బంధువుకు గుంటూరు జిల్లాలో ఓ పోస్టును కట్టబెట్టారు.

మోదీ, బాబు, పవన్‌పై మండిపడ్డ వామపక్షాలు

డాబాగార్డెన్స్(విశాఖ): విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ద్రోహం చేసి ప్రైవేట్ సంస్థ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ దాసోహమయ్యారంటూ వామపక్షాలు గురువారం విశాఖలోని జగదాంబ జంక్షన్‌లో పెద్ద ఎత్తున నిరసన చేపట్టాయి. విశాఖ సాక్షి గా మోదీ మరోసారి ద్రోహం చేశారని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణ, సొంత ఇనుప గనుల కేటాయింపుపై ప్రధాని ప్రకటన చేయకపోవడం విశాఖకు, ఉత్తరాంధ్రకు మరోసారి ద్రోహం చేయడమేనని వామపక్షాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసం విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఆర్సిలర్ మిట్టల్ స్టీల్‌కి అవసరమైన ముడి ఇనుము సరఫరా, ఇతర అనుమతుల గూర్చి సాగిల పడి మాట్లాడటం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి ద్రోహం చేయడమేనన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమి కలిసి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మిట్టల్‌కి బలిచ్చేలా కుట్ర పన్నినట్టు మోదీ బహిరంగ సభతో తేలిపోయిందన్నారు. దీనికి టీడీపీ, జనసేన కూటమి తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. విభజన చట్టప్రకారం రావాల్సిన విశాఖ మెట్రో రైలుపైనా ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణమన్నారు. పక్కనే ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దీనిపై ప్రధానిని కనీసం అడగకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి గంగారామ్, జగన్, మణి, సత్యవతి, సీపీఐ నాయకులు మరుపిల్ల పైడిరాజు, జేడీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



జగదాంబ జంక్షన్లో నిరసన తెలుపుతున్న వామపక్షాలు

టీటీడీ పాలకమండలి, ఈవోపై చర్యలు తీసుకోవాలి..

ధర్మ సంస్థాపన పరిషత్ ప్రధాన కార్యదర్శి నందకిషోర్

సాక్షి, అమరావతి: టీటీడీ బోర్డును, ఈవోను వెంటనే బర్తరఫ్ చేయాలంటూ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ధర్మ సంస్థాపన పరిషత్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి తూపల్లి నందకిషోర్ కోరారు. తిరుమలలో తొక్కిసలాట చోటు చేసుకుని ఆరుగురు భక్తులు మృతి చెందడటంతో పాటు, పలువురు గాయాలపాలైన ఘటనపై గురువారం ఆయన స్పందించారు. వైకుంఠ ద్వార ప్రవేశానికి 10 వేల టికెట్లు కేటాయించాలని నిర్ణయించిన టీటీడీ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భక్తులకు టికెట్‌లు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. భక్తులను నేరుగా వచ్చి టికెట్లు తీసుకోవాలని చెప్పడం నిర్వహ లోపం, అలసత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన టీటీడీ ఈవో, పాలకమండలిపై గవర్నర్ చర్యలు తీసుకోవాలని ఓ ప్రకటనలో కోరారు.













● 'నేసిప్పాయా' పోస్టర్

కోలీవుడ్‌లో గేమ్ చేంజ్

- పొంగల్‌కి పెరియ పడమ్ ఇల్లే
- ఆట అంతా 'గేమ్ చేంజర్'దే

సంక్రాంతి అంటే స్టార్ హీరోల చిత్రాలు కనీసం మూడు నాలుగైనా ఉండాలి. అప్పుడే సినీ లవర్స్‌కి అసలైన పండగ. కానీ ఈ పొంగల్‌కి తమిళ తెరపై ఒకే ఒక్క స్టార్ హీరో కనిపించనున్నారు. అది కూడా తెలుగు స్టార్ రామ్‌చరణ్. 'గేమ్ చేంజర్' తమిళంలో డబ్ అయి, విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఇక తమిళంలో అజిత్ 'విడాముయర్చి' పొంగల్ రేసు నుంచి తప్పుకుంది. మొత్తంగా తమిళంలో ఆరేడు స్ట్రయిట్ చిత్రాలు పొంగల్‌కి రానున్నాయి. అవి కూడా మీడియమ్ కంటే ఓ మెట్టు ఎక్కువ ఉన్న హీరోలు, ఓ మెట్టు తక్కువ ఉన్న హీరోలవే. హీరోల రేంజ్ పక్కన పెడితే... ఒకవేళ కథాబలం ఉండి, ప్రేక్షకులను ఆకట్టుకుంటే మీడియమ్ రేంజ్ సినిమా పెద్ద రేంజ్ అయిపోతుంది. మరి... పొంగల్ పోటీలో వసూళ్లు కొల్లగొట్టే సినిమా ఏది? అనేది తర్వాత డిసైడ్ అవుతుంది. ఇక ఈ పొంగల్‌కి తెరపైకి రానున్న చిత్రాల గురించి తెలుసుకుందాం...

తెలుగు సినిమాకి సంక్రాంతి సీజన్ ఎంత ముఖ్యమో తమిళ ఇండస్ట్రీకి పొంగల్ కూడా అంతే ముఖ్యం. వరుస సెలవులను క్యాష్ చేసుకునే వీలు ఉన్న సీజన్ కాబట్టి భారీ చిత్రాల విడుదలను ప్లాన్ చేస్తుంటారు. ఎప్పటిలానే ఈసారి తెలుగులో భారీ చిత్రాలు విడుదలకు సిద్ధం అయ్యాయి. సీనియర్ స్టార్ హీరోలు బాలకృష్ణ 'డాకు మహారాజ్', వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' సంక్రాంతి సందడికి రెడీ అయ్యాయి. యంగ్ స్టార్ రామ్‌చరణ్ నటించిన 'గేమ్ చేంజర్' కూడా ఈ పండగకి రానుంది. అయితే అటు తమిళంలో మాత్రం మీడియమ్ రేంజ్ హీరోల చిత్రాలే విడుదల కానున్నాయి. ఆ మాట కొస్తే... గతేడాది కూడా కోలీవుడ్ పరిస్థితి ఇదే. ధనుష్ 'కెప్టెన్ మిల్లర్' మినహా మిగతావన్నీ ఓ మోస్తరు చిత్రాలే. ఈసారి అజిత్ 'విడాముయర్చి' రావాల్సింది కానీ సంక్రాంతి రేసు నుంచి ఆ సినిమా తప్పుకోవడంతో ఇక పొంగల్‌కి పెరియ పడమ్ ఇల్లే (సంక్రాంతికి పెద్ద సినిమా లేదు) అన్నట్లు అయింది.

సో... ఉన్నదంతా 'గేమ్ చేంజర్' మాత్రమే. అనువాద రూపంలో తమిళ తెరపై 'గేమ్ చేంజర్' కనిపించనుంది. 'ఆర్ఆర్ఆర్'తో గ్లోబల్ స్టార్ అనిపించుకున్న రామ్‌చరణ్ హీరోగా నటించిన చిత్రం కావడం, తమిళ దర్శకుడు శంకర్ తెరకెక్కించిన చిత్రం కావడం, సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ 'దిల్' రాజు నిర్మించిన చిత్రం కావడంతో 'గేమ్ చేంజర్'పై తమిళనాడులోనూ భారీ అంచనాలు ఉన్నాయి. సో... ఒక స్టార్ డైరెక్టర్-స్టార్ హీరో-స్టార్ ప్రొడ్యూసర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం కావడంతో కోలీవుడ్ పొంగల్ బాక్సాఫీస్ దగ్గర ఆట అంతా 'గేమ్ చేంజర్'దే అని చెప్పొచ్చు. వేరే పెద్ద చిత్రాలు లేకపోవడంతో ఈ చిత్రానికే ఎక్కువ థియేటర్లు లభించాయి. 'గేమ్ చేంజర్'కి ఇదో మంచి అవకాశం.

10న 3 సినిమాలు

ఈ నెల 10న తెలుగులోనూ, అనువాద రూపంలో తమిళ్, హిందీ భాషల్లోనూ 'గేమ్ చేంజర్' విడుదల కానుంది. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, 'దిల్' రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ దాదాపు రూ.450 కోట్లతో ఈ చిత్రాన్ని నిర్మించినట్లు సమాచారం. శంకర్ అంటే దాదాపు లార్జ్ స్కేల్ సినిమానే అవుతుందని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 'గేమ్ చేంజర్'తో పాటు 10న తమిళంలో విడుదల కానున్న వాటిలో విలక్షణ నటుడు బాల దర్శకత్వంలో అరుణ్ విజయ్ నటించిన 'వణంగాన్', మలయాళ నటుడు షానే నిగమ్ తమిళ తెరకు హీరోగా పరిచయం అవుతున్న 'మద్రాస్‌క్కారన్' చిత్రాలు ఉన్నాయి. నిజానికి 'వణంగాన్'ని సూర్య హీరోగా ప్లాన్ చేశారు బాల. అయితే కొన్ని కారణాల వల్ల అరుణ్ విజయ్‌తో ఈ చిత్రం చేశారు. ఒకవేళ సూర్యతో చేసి ఉంటే... పొంగల్ రేస్‌లో తమిళంలో ఓ స్టార్ ఉండి ఉండేవారు. ఇక 'మద్రాస్‌క్కారన్' విషయానికొస్తే... గతేడాది 'రంగోలి' చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమైన వాలీ మోహన్‌దాస్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. మలయాళ యంగ్ హీరో షానే నిగమ్ నటించారు.

11 ఏళ్ల తర్వాత 12న

ఇక పొంగల్ రేస్‌లోని తమిళ చిత్రాల్లో చెప్పుకోదగ్గ మాస్ హీరో అంటే విశాల్. 'మద గజ రాజా' చిత్రంతో ఈ 12న రానున్నారు విశాల్. ఈ సినిమా 2013లో విడుదల కావాల్సింది. కొన్ని కారణాల వల్ల కుదరలేదు. చివరికి 11 ఏళ్ల తర్వాత ఈ 12న విడుదల కానుంది. సుందర్.సి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది.

పొంగల్ రోజున...

పండగ రోజున ఆకాశ్ మురళి అనే నూతన హీరో వెండి తెరకు పరిచయం కానున్నారు. 'ఇదయం' (హృదయం) ఫేమ్ మురళి రెండో కుమారుడే ఆకాశ్ మురళి. ఆల్రెడీ పెద్ద కుమారుడు అథర్వ హీరోగా (తెలుగులో 'గద్దలకొండ గణేశ్'లో నటించారు) సినిమాలు చేస్తున్నారు. ఇక తమిళంలో 'బిల్లా, ఆరంభం' చిత్రాలతో మంచి మాస్ స్టయిలిష్ దర్శకుడు అనిపించుకున్న విష్ణువర్ధన్ నూతన హీరో ఆకాశ్ మురళితో తీసిన 'నేసిప్పాయా' 14న రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తె అదితీ శంకర్ హీరోయిన్‌గా నటించారు. ఇక పండగ రోజున సీనియర్ హీరో 'జయం రవి' ప్రేమించడానికి సమయం లేదంటూ ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఆయన హీరోగా నిత్యామీనన్ హీరోయిన్‌గా నటించిన 'కాదలిక్క నేరమిల్లై' (ప్రేమించడానికి సమయం లేదు) చిత్రం ఈ 14న విడుదల కానుంది. ఈ చిత్రానికి కృతికా ఉదయనిధి స్టాలిన్ దర్శకత్వం వహించారు. ఇలా పొంగల్ రేసులో తమిళంలో ఐదు చిత్రాలు నిలవగా, వాటిలో విశాల్, 'జయం' రవి పేరున్న హీరోలు కాగా... వీరి తర్వాత అరుణ్ విజయ్ కొంచెం చెప్పుకోదగ్గ హీరో కాగా... మిగతా ఇద్దరిలో యువ హీరోలు ఆకాశ్ మురళి, షానే నిగమ్ ఉన్నారు. ఈ ఐదు చిత్రాలే కాకుండా మరో రెండు మూడు చిన్న సినిమాలు కూడా విడుదల కానున్నాయి.

సో... ఎలా చూసుకున్నా పొంగల్‌కి తమిళ ప్రేక్షకుల ముందుకు రానున్న పెద్ద సినిమా 'గేమ్ చేంజర్' మాత్రమే. మరి... వసూళ్ల పరంగా ఈ సినిమా ప్రభావం ఇతర చిత్రాలపై ఏ మేరకు ఉంటుంది? పొంగల్ పోటీలో బాక్సాఫీస్ హిట్ ఏ సినిమాకి దక్కుతుంది? అనేది మరో వారంలో తెలిసిపోతుంది.

* * *

'విడాముయర్చి' రాకపోవడం నిరుత్సాహమే

"పొంగల్ చాలా పెద్ద పండగ. పైగా ఇది పెద్ద వీకెండ్. పెద్ద హీరోల సినిమాలు రాకపోతే అస్సలు పండగలానే అనిపించదు. తమిళనాడులోని థియేటర్ ఓనర్స్ అందరూ అజిత్ హీరోగా నటించిన 'విడాముయర్చి' కోసం ఎదురు చూశారు. హఠాత్తుగా ఈ సినిమా వాయిదా పడటంతో అందరూ నిరుత్సాహపడ్డారు" అంటూ తమిళ చిత్రపరిశ్రమకు చెందిన ట్రేడ్ వర్గాలు అంటున్నాయి.

గేమ్ చేంజర్‌తో రీ ఎంటర్ కావడం హ్యాపీ

'సందడే సందడి'తో నిర్మాతగా తెలుగులో ఆదిత్యా రామ్ ప్రయాణం ఆరంభమైంది. ఆ తర్వాత 'ఖుషీ ఖుషీగా, స్వాగతం, ఏక్ నిరంజన్' చిత్రాలు నిర్మించారాయన. 'ఏక్ నిరంజన్' (2009) తర్వాత మళ్లీ సినిమాలు నిర్మించలేదు. చెన్నైలో రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నారు. కాగా 'గేమ్ చేంజర్'ని తమిళంలో విడుదల చేస్తున్నారు ఆదిత్యా రామ్. ''చాలా కాలం తర్వాత ఒక గ్రాండ్ స్కేల్ సినిమాతో వస్తున్నందుకు ఆనందంగా ఉంది. తమిళనాడులో దాదాపు నాలుగు వందల స్క్రీన్స్‌లో విడుదల చేస్తున్నాం. రామ్‌చరణ్ హీరోగా శంకర్ డైరెక్షన్‌లో వస్తున్న 'గేమ్ చేంజర్' ఈ వీకెండ్‌కి పెద్ద సినిమా అవుతుంది. 'దిల్' రాజుగారి సినిమాని విడుదల చేయడం ఆనందంగా ఉంది'' అని పేర్కొన్నారు ఆదిత్యా రామ్.

- డి.జి.భవాని

ఎన్టీఆర్ డ్రాగన్‌లో టొవినో?



● టొవినో థామస్
● ఎన్టీఆర్

ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' అనే ఓ పీరియాడికల్ యాక్షన్ మూవీ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించనున్నారు. అలాగే ఈ సినిమాలోని ఇతర కీలక పాత్రల్లో మలయాళ నటులు టొవినో థామస్, జోజు జార్జ్ నటించనున్నట్లు తెలిసింది. ఆల్రెడీ రుక్మిణీ వసంత్, టొవినో థామస్‌ల లుక్ టెస్ట్ కూడా పూర్తయిందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సినిమా చిత్రీకరణ సంక్రాంతి తర్వాత ప్రారంభం కానుందని తెలిసింది. తొలి షెడ్యూల్‌ను కర్ణాటకలో ప్లాన్ చేశారట ప్రశాంత్ నీల్. 'డ్రాగన్' మూవీని 2026 జనవరి 9న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక... కెరీర్‌లో యాభైకిపైగా సినిమాల్లో నటించిన టొవినో థామస్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడే. 2023లో వచ్చిన '2018: ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో', 2024లో వచ్చిన 'ఏఆర్ఎమ్' చిత్రాల్లో టొవినో థామస్ హీరోగా నటించగా, ఈ చిత్రాలు తెలుగులో అనువాదమై హిట్ మూవీస్‌గా నిలిచాయి.

చంపేస్తానని బెదిరిస్తున్నాడు



● నిధీ అగర్వాల్

- సోషల్ మీడియాలో నిధీ అగర్వాల్‌కు బెదిరింపులు
- సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించిన నిధీ అగర్వాల్

సోషల్ మీడియాలో తనను చంపేస్తానంటూ ఓ వ్యక్తి బెదిరింపులకు పాల్పడుతున్నట్లుగా హీరోయిన్ నిధీ అగర్వాల్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో పాటు తనకు ఇష్టమైన వారిని కూడా లక్ష్యంగా చేసుకుని సదరు వ్యక్తి ఇబ్బంది పెడుతున్నారని నిధీ అగర్వాల్ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వ్యక్తి బెదిరింపుల వల్ల తాను మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నానని, నిందితుడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులను కోరారు నిధీ అగర్వాల్. ఆమె ఫిర్యాదును స్వీకరించిన సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ మొదలుపెట్టారు. ఇక సినిమాల విషయానికి వస్తే... ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'రాజా సాబ్', పవన్‌కల్యాణ్ హీరోగా చేస్తున్న పీరియాడికల్ డ్రామా 'హరి హర వీరమల్లు' చిత్రాల్లో నిధీ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ రెండు చిత్రాలు ఈ ఏడాది వేసవిలో విడుదల కానున్నాయి.

ఫిల్మ్ విభాగాల్లో ఉచిత శిక్షణ

- టీజీ విశ్వప్రసాద్



'గూఢచారి, కార్తికేయ 2, వెంకీ మామ, ఓ బేబీ, ధమాకా' వంటి బ్లాక్ బస్టర్ సినిమాలు నిర్మించిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఫౌండర్, చైర్మన్ టీజీ విశ్వప్రసాద్ హైదరాబాద్, బెంగళూరులో 'పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఫిల్మ్ అకాడమీ'ని ఆరంభించారు. ఈ సందర్భంగా టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ– ''సినిమా రంగంలో రాణించాలనుకునే నేటి యువతకి మేం ఉన్నామని భరోసా ఇస్తూ ఉచిత శిక్షణ కల్పించి, ప్రతిభావంతులుగా ఇండస్ట్రీకి పరిచయం చేయడమే 'పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఫిల్మ్ అకాడమీ' ప్రధాన లక్ష్యం. చైర్‌ఉమెన్ టీజీ వందనా ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రపంచ స్థాయి శిక్షణతో పాటు భావితరాలకి మంచి భవిష్యత్తు అందించడానికి దిశా నిర్దేశంగా 'పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఫిల్మ్ అకాడమీ' అడుగులు వేస్తుంది. స్టూడెంట్స్‌కు రియల్ ప్రాజెక్టులపై పని చేసే అవకాశం కల్పించడంతో పాటు, సెలెక్ట్ అయిన స్టూడెంట్స్‌కు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఈ ఫిల్మ్ కోర్సులు పూర్తి ఉచితంగా శిక్షణ ఇస్తాం. యాక్టింగ్, డైరెక్షన్, స్క్రిప్ట్ రైటింగ్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, ఆర్ట్, మేకప్, కాస్ట్యూమ్స్, డిజైనింగ్, వర్చ్యువల్ ప్రొడక్షన్– డిఐ, లైటింగ్ విభాగాల్లో శిక్షణ ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు 90322 57101 నంబరులో సంప్రదించాలి'' అని తెలిపారు.

లాభాలను విరాళంగా ఇస్తా

- సోనూ సూద్



''ఫతే' మూవీ సామాన్యుల కోసం నిర్మించిన సినిమా. ఇలాంటి సినిమా అన్ని వర్గాల ప్రజలకు చేరువ కావాలి. అందుకే మా మూవీకి తొలి రోజు టిక్కెట్ ధర కేవలం రూ. 99గా నిర్ణయించాం. అంతేకాదు... ఈ సినిమా నుంచి వచ్చే లాభాన్ని స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా అందిస్తాను'' అని నటుడు సోనూ సూద్ తెలిపారు. ఆయన హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఫతే'. ఇందులో జాక్వెలిన్ ఫెర్నాండెజ్ హీరోయిన్‌గా నటించారు. జీ స్టూడియోస్, శక్తి సాగర్ ప్రొడక్షన్స్‌పై సోనాలీ సూద్, ఉమేష్ కేఆర్ బన్సాల్ నిర్మించారు. ఈ చిత్రం నేడు రిలీజవుతోంది. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా పలు ఇంటర్వ్యూల్లో సోనూ సూద్ మాట్లాడారు.. అలాగే సోషల్ మీడియాలో ఓ వీడియో విడుదల చేశారాయన. ''2020 కోవిడ్ సమయంలో చాలామంది తమకు సాయం చేయాలని నన్ను కోరారు. అందులో ఎక్కువగా సైబర్ క్రైమ్ మోసాల బారిన పడిన వాళ్లు కూడా ఉన్నారు. ఈ విషయం నాకు చాలా బాధగా అనిపించింది. అందుకే 'ఫతే' సినిమా ద్వారా సామాన్యుడి కథను చెప్పాలనుకుని, వారి కోసం నిర్మించాం. భారతదేశంలోని అందరూ చూడాలని మొదటి రోజు 'ఫతే'కి రూ. 99గా టికెట్ ధర నిర్ణయించాం. అంతేకాదు... ఈ సినిమా నుంచి వచ్చే లాభాలను స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా అందిస్తాను'' అని పేర్కొన్నారు సోనూ సూద్.

సంకురాత్రియేల ముగ్గేసినట్లు!



● భరత్ రెడ్డి, మణి ఏగుర్ల, దయాకర్, ఆనంద్ దేవరకొండ, ఆర్ఆర్ ధ్రువన్, శ్రీజా రెడ్డి

బ్రహ్మాజీ లీడ్ రోల్ నటిస్తున్న తాజా చిత్రం 'బాపు'. ఆమని, 'బలగం' సుధాకర్ రెడ్డి, ధన్య బాలకృష్ణ, మణి ఏగుర్ల, అవసరాల శ్రీనివాస్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఈ డార్క్ కామెడీ డ్రామా మూవీకి దయా దర్శకత్వం వహిస్తుండగా, కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అధీరా ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై రాజు, సిహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా 'బాపు' మూవీలోని సోల్ ఫుల్ లవ్ మెలోడీ పాట 'అల్లో నేరేడల్లో పిల్లా' పాట లిరికల్ వీడియోను హీరో ఆనంద్ దేవరకొండ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ–''అల్లో నేరేడల్లో పిల్లా' సాంగ్ కంపోజిషన్ బ్యూటీఫుల్ అండ్ క్యాచీగా ఉంది. ఈ పాటకు రామన్న వాయిస్ పర్ఫెక్ట్ చాయిస్. మణి లుక్ చాలా బాగుంది. 'బలగం' తరహాలో ఈ మూవీ కూడా విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. 'సంకురాత్రియేళ ముగ్గేసినట్టు... సంధ్యయేళ పొద్దు రంగేసినట్లు... సందు చూసి యేరు పొంగేసినట్లుందే...' అంటూ మొదలై, ..''అల్లో నేరేడల్లో పిల్లా.. కళ్లో కొచ్చిందిరో... తెల్ల తెల్లవారేకల్లా దిల్లోకి దూరిందిరో..! అంటూ సాగుతుందీ పాట. సంగీత దర్శకుడు– సింగర్ రామ్ మిర్యాల పాడిన ఈ పాటకు రఘు రామ్ లిరిక్స్ అందించారు. 'బాపు' సినిమాకు ఆర్ఆర్ ధ్రువన్ సంగీత దర్శకుడు.

బిజినెస్ రీల్

బ్రిగేడ్ గ్రూప్ కొత్త ప్రాజెక్ట్



హైదరాబాద్: రియల్టీ సంస్థ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైసెస్ హైదరాబాద్‌లో కొత్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. కోకాపేటలో బ్రిగేడ్ గేట్‌వే పేరుతో 10 ఎకరాల విస్తీర్ణంలో హౌసింగ్, కమర్షియల్ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయనుంది. ఇందుకు రూ.4,500 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రకటించింది. 45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రానున్న ఈ ప్రాజెక్టులో లగ్జరీ గృహాలను 25 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తారు. హైదరాబాద్, బెంగళూరు, మైసూరు, చెన్నై, కొచ్చిలో కంపెనీ పలు ప్రాజెక్టులను అభివృద్ధి చేసింది.

ఓఎన్‌జీసీ కాంట్రాక్ట్ దక్కించుకున్న బీపీ



న్యూఢిల్లీ: యూకేకు చెందిన బీపీ కంపెనీ తాజాగా ఓఎన్‌జీసీ నుంచి ఓ కాంట్రాక్ట్ దక్కించుకుంది. ఇందులో భాగంగా ముంబైలో ఉన్న భారత అతిపెద్ద ముడి చమురు, సహజవాయువు నిక్షేపంలో ఉత్పత్తిని 10 ఏళ్లలో పెంచనుంది. ఈ మేరకు టెక్నికల్ సర్వీస్ ప్రొవైడర్‌గా బీపీ ఎక్స్‌ప్లోరేషన్‌ను (ఆల్ఫా) ఓఎన్‌జీసీ ఎంచుకుంది. ముడి చమురు ఉత్పత్తి 44 శాతం, సహజ వాయువు ఉత్పత్తిని 89 శాతం పెంచనుంది. ప్రస్తుతం ఈ నిక్షేపంలో రోజుకు 1,32,265 బ్యారెళ్ల చమురు, 13 బిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ ఉత్పత్తి అవుతోంది.

టాటా టెక్నాలజీస్ జట్టు..



ముంబై: కొత్త తరం సాఫ్ట్‌వేర్ ఆధారిత వాహనాల (ఎస్‌డీవీ) కోసం వినూత్నమైన వాహన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌ను రూపొందించేందుకు టెలీచిప్స్ సంస్థతో టాటా టెక్నాలజీస్ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌లో టాటా టెక్నాలజీస్‌కి గల అనుభవం, సెమీకండక్టర్ సాంకేతికతలో టెలీచిప్స్‌కి గల నైపుణ్యాలను ఉపయోగించి కస్టమర్లకు అవసరమయ్యే ఎస్‌డీవీ సొల్యూషన్స్‌ను అందించనున్నట్లు ఇరు సంస్థలు తెలిపాయి. వాహనాల సంస్థలు మరింత కనెక్టెడ్, ఇంటెలిజెంట్, పర్యావరణ అనుకూల వాహనాలను తయారు చేసేందుకు ఇవి ఉపయోగపడలవని టాటా టెక్నాలజీస్ సీఈవో వారెన్ హ్యారిస్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-1-2025

విశాఖ	520–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	490–00
వరంగల్	492–00
రిటైల్ ధర	5.50

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJ-AUTO	8,825.00	2.11
NESTLEIND	2,259.00	1.76
HINDUNILVR	2,440.00	1.62
M&M	3,131.80	1.48
BRITANNIA	4,922.00	1.28

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ONGC	264.3	-2.59
SHRIRAMFIN	2,828.95	-2.41
BPCL	281.05	-2
COALINDIA	372.95	-1.95
TATASTEEL	130.12	-1.9

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,580
ఎన్ఎస్ఈ	89,207
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,66,410
ఎఫ్ఐఐ	- 7,171
డీఐఐ	+ 7,639

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	74.13 (రాత్రి 11.30కు)	$ 73.32 (క్రితం ముగింపు)
బ్రెంట్	77.11 (రాత్రి 11.30కు)	$ 76.16 (క్రితం ముగింపు)


4 ఐపీవోలకు సెబీ సై

జాబితాలో హైవే ఇన్‌ఫ్రా
- కాసాగ్రాండ్ ప్రీమియర్
- రీగ్రీన్ ఎక్సెల్ ఈపీసీ
- డాక్టర్ అగర్వాల్స్ హెల్త్‌కేర్



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా నాలుగు కంపెనీల పబ్లిక్ ఇష్యూలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జాబితాలో డాక్టర్ అగర్వాల్స్ హెల్త్‌కేర్‌సహా కాసాగ్రాండ్ ప్రీమియర్ బిల్డర్, హైవే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రీగ్రీన్ ఎక్సెల్ ఈపీసీ ఇండియా చేరాయి. గతేడాది సెప్టెంబర్– అక్టోబర్ మధ్య కాలంలో ఈ కంపెనీలు సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేశాయి. అయితే మారి టెక్, అమంటా హెల్త్‌కేర్ ఐపీవో ప్రణాళికల నుంచి వెనక్కి తగ్గాయి. వివరాలు చూద్దాం..

ఐకేర్ కంపెనీ



పీఈ దిగ్గజాలు టెమాసెక్ హోల్డింగ్స్, టీపీజీలకు పెట్టుబడులున్న డాక్టర్ అగర్వాల్స్ హెల్త్‌కేర్ ఐపీవోలో భాగంగా రూ. 300 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 6.95 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. కంపెనీ ప్రధానంగా కంటి పరిరక్షణ(ఐ కేర్) సర్వీసులు అందిస్తోంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 195 కోట్లు రుణ చెల్లింపులకు, మిగిలినవాటిని ఇతర సంస్థల కొనుగోళ్లు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

వెనకడుగులో..



ఐటీ సొల్యూషన్ల కంపెనీ మారి టెక్, ఆరోగ్య పరిరక్షణ సంస్థ అమంటా హెల్త్‌కేర్ పబ్లిక్ ఇష్యూ సన్నాహాలను విరమించుకున్నాయి. గతేడాది సెప్టెంబర్– అక్టోబర్‌లో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి. అయితే డిసెంబర్‌లోనే పత్రాలను వెనక్కి తీసుకున్నాయి. ఇందుకు కారణాలు వెల్లడికాలేదు. ఐపీవోలో భాగంగా హైదరాబాద్ కంపెనీ మారి టెక్ రూ. 440 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయాలని భావించింది. వీటితోపాటు మరో రూ. 1,060 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచాలని ప్రణాళికలు వేశారు. ఇక ఫార్మా రంగ కంపెనీ అమంటా హెల్త్‌కేర్ ఐపీవోలో భాగంగా 1.25 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయాలని తొలుత భావించింది. కంపెనీ ప్రధానంగా మెడికల్ పరికరాలు, స్టెరైల్ లిక్విడ్ ప్రొడక్టుల తయారీలో ఉంది.

రియల్టీ డెవలపర్



పబ్లిక్ ఇష్యూలో భాగంగా రియల్టీ రంగ కంపెనీ కాసాగ్రాండ్ ప్రీమియర్ బిల్డర్ రూ. 1,000 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 100 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థల రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

మౌలిక రంగ సంస్థ



ఈపీసీ ఇన్‌ఫ్రా, టోల్ వసూళ్ల కంపెనీ హైవే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఐపీవోలో భాగంగా రూ. 105 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా 31 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. ప్రమోటర్లకు ప్రస్తుతం 71.58 శాతం వాటా ఉంది. ఈక్విటీ జారీ నిధులను సాధారణ కార్పొరేట్, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు వెచ్చించనుంది.

మెషినరీ తయారీ



ఇథనాల్ ప్లాంట్లను రూపొందించే రీగ్రీన్ ఎక్సెల్ ఈపీసీ ఇండియా పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. దీనిలో భాగంగా రూ. 350 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 1.14 కోట్ల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. కంపెనీ ప్రధానంగా ఇథనాల్ ప్లాంట్ల డిజైనింగ్, తయారీ, సరఫరా తదితర కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

ఆర్గానిక్ ఎగుమతులకు చక్కని అవకాశాలు

- మూడేళ్లలో రూ.20,000 కోట్ల మేర
- కేంద్ర వాణిజ్య మంత్రి గోయల్



న్యూఢిల్లీ: సేంద్రీయ ఉత్పత్తుల (రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించని) ఎగుమతులకు చక్కని అవకాశాలున్నాయని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. వచ్చే మూడేళ్లలో ఆర్గానిక్ ఉత్పత్తుల ఎగుమతులు రూ.20,000 కోట్లకు చేరుకోవచ్చన్నారు. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్‌పీఓపీ) ఎనిమిదో ఎడిషన్‌ను విడుదల చేసిన సందర్భంగా మాట్లాడారు. సేంద్రీయ ఉత్పత్తులకు సంబంధించి ప్రమాణాలు, పారదర్శకత, నిబంధనలపై ఇందులో స్పష్టత ఇచ్చారు. ''ప్రస్తుతానికి ఆర్గానిక్ ఉత్పత్తుల ఎగుమతులు రూ.5,000–6,000 కోట్లుగా ఉన్నాయి. వచ్చే మూడేళ్లలో రూ.20,000 కోట్లను సులభంగా చేరుకుంటాం. ప్రస్తుత స్థాయితో పోల్చితే 3–3.5 రెట్లు''అని తెలిపారు. అంతర్జాతీయంగా రూ.లక్ష కోట్ల మేర సేంద్రీయ ఉత్పత్తులకు డిమాండ్ ఉందని, రానున్న సంవత్సరాల్లో ఇది రూ.10 లక్షల కోట్లకు చేరుకుంటుందన్నారు. ఇది భారత్‌కు చక్కని అవకాశమని, దీన్ని జారవిడుచుకోరాదన్నారు. సేంద్రీయ సాగును ఎక్కువ మంది రైతులు చేపట్టిన దేశాల్లో భారత్ కూడా ఉన్నట్టు మంత్రి తెలిపారు. ఈ రంగం వృద్ధికి అవసరమైన పరిష్కారాలతో స్టార్టప్‌లు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భారత సేంద్రీయ ఎగుమతుల రంగాన్ని బలోపేతం చేయడం, 2030 నాటికి 2 బిలియన్ డాలర్ల విలువైన ఆహారోత్పత్తుల ఎగుమతులను చేరుకునే లక్ష్యాలతో ఎనిమిదో ఎడిషన్ ఎన్‌పీవోపీని విడుదల చేయడం గమనార్హం. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సేంద్రీయ ఉత్పత్తులకు విశ్వసనీయత పెంచడం, ఆర్గానిక్ ఉత్పత్తుల ప్రమాణాలను పెంచడంలోనూ ఎన్‌పీవోపీ కీలక పాత్ర పోషిస్తుంటుంది.

హైదరాబాద్‌లో ఎలీ లిల్లీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

1,000 మంది పైగా నియామకం



న్యూఢిల్లీ: ఫార్మా దిగ్గజం ఎలీ లిల్లీ అండ్ కంపెనీ తాజాగా హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ని (జీసీసీ) ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. తమ డిజిటల్ వ్యూహాన్ని, సర్వీసుల డెలివరీని పటిష్టం చేసుకునేందుకు 1,000 మంది పైగా సిబ్బందిని నియమించుకోనున్నట్లు పేర్కొంది. హైదరాబాద్ జీసీసీ పేరు లిల్లీ కేపబిలిటీ సెంటర్ ఇండియా (ఎల్‌సీసీఐ) హైదరాబాద్‌గా ఉంటుందని వివరించింది. అంతర్జాతీయంగా తమ వ్యాపార అవసరాలకు కావల్సిన అధునాతన టెక్నాలజీ సొల్యూషన్స్‌ను అందించేందుకు ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ మొదలైన సామర్థ్యాలను పెంచుకోవడంపై దృష్టి పెట్టనున్నట్లు కంపెనీ పేర్కొంది. టెక్నాలజీ ఇంజినీర్లు, డేటా సైంటిస్టులు సహా పలువురు నిపుణులను తీసుకోనున్నట్లు వివరించింది. కంపెనీకి ఇప్పటికే బెంగళూరులో ఒక ఎల్‌సీసీఐ ఉండగా, హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేది రెండోది కానుంది. హెల్త్‌కేర్ ఆవిష్కరణలు, నిపుణులకు హైదరాబాద్ హబ్‌గా ఎదగడాన్ని తాజా పెట్టుబడులు ప్రతిబింబిస్తాయని తెలంగాణ ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.

రేడియో వ్యాపారం మూసివేతకు టీవీ టుడే నిర్ణయం



న్యూఢిల్లీ: ఇష్క్ 104.8 ఎఫ్ఎం బ్రాండ్ పేరుతో నిర్వహిస్తున్న రేడియో వ్యాపారాన్ని వచ్చే ఆరు నెలల్లో మూసివేయనున్నట్లు టీవీ టుడే నెట్‌వర్క్ వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనకు బోర్డు సమావేశంలో ఆమోదముద్ర వేసినట్లు వివరించింది. మార్కెట్లో నెలకొన్న పరిస్థితులే మూసివేత నిర్ణయానికి కారణమని పేర్కొంది. టీవీ టుడే నెట్‌వర్క్ ప్రస్తుతం ముంబై, ఢిల్లీ, కోల్‌కతా నగరాల్లో మూడు ఎఫ్ఎం రేడియో స్టేషన్లను నిర్వహిస్తోంది. 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రేడియో వ్యాపారం టర్నోవరు రూ. 16.18 కోట్లుగాను, నష్టం రూ. 19.53 కోట్లుగాను నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ మొత్తం ఆదాయంలో రేడియో విభాగం వాటా 1.7 శాతంగా ఉంది.

ఈ ఏడాది ఎనిమిది కొత్త మోడళ్లు

మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఈ ఏడాది కొత్తగా ఎనిమిది మోడళ్లను ప్రవేశపెట్టనున్నట్టు ప్రకటించింది. వీటిలో బ్యాటరీ మోడళ్లు కూడా ఉంటాయి. గతేడాది 14 మోడళ్లను పరిచయం చేసినట్టు మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. 2,000 యూనిట్లకు పైగా ఆర్డర్ బుక్‌తో నూతన సంవత్సరం ప్రారంభం అయిందని, ఇది ఆత్మ విశ్వాసాన్ని ఇస్తోందని అన్నారు. సంస్థ మొత్తం విక్రయాల్లో 50 శాతం యూనిట్లకు మెర్సిడెస్ బెంజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రుణం సమకూర్చిందని చెప్పారు. ఇప్పటి వరకు కస్టమర్లకు రూ.10,000 కోట్ల పైచిలుకు రుణాలు మంజూరు చేసినట్టు పేర్కొన్నారు.

రెండు కొత్త మోడళ్లు..

మెర్సిడెస్ భారత మార్కెట్లో గురువారం రెండు బ్యాటరీ మోడళ్లను విడుదల చేసింది. ఇందులో ఈక్యూ టెక్నాలజీతో జీ580, అలాగే అయిదు సీట్లతో కూడిన ఈక్యూఎస్ ఎస్‌యూవీ 450 ఉన్నాయి. ఎక్స్‌షోరూంలో జీ580 ధర రూ.3 కోట్ల నుంచి ప్రారంభం. ఒకసారి చార్జింగ్‌తో 473 కిలోమీటర్లు పరుగెడుతుంది. ఈక్యూఎస్ ఎస్‌యూవీ 450 ధర రూ.1.28 కోట్లు ఉంది. భారత్ మొబిలిటీ షో వేదికగా మెర్సిడెస్ మైబహ్ ఈక్యూఎస్ ఎస్‌యూవీ నైట్ సిరీస్ తళుక్కుమనేందుకు రెడీ అవుతోంది.

రెండింతలైన ఈవీలు..

2024లో సంస్థ దేశవ్యాప్తంగా 19,565 యూనిట్లను విక్రయించింది. 2023తో పోలిస్తే గతేడాది కంపెనీ అమ్మకాల్లో 12.4 శాతం వృద్ధి నమోదైంది. బ్యాటరీ ఎలక్ట్రిక్ వెహికిల్స్ విక్రయాలు దాదాపు రెట్టింపు అయ్యాయని సంతోష్ అయ్యర్ తెలిపారు. 'మొత్తం అమ్మకాల్లో ఈవీల వాటా ఏడాదిలో 2.5 నుంచి 2024లో 6 శాతానికి ఎగసింది. ఇక మొత్తం అమ్మకాల్లో రూ.1.5 కోట్లకుపైగా విలువ చేసే టాప్ ఎండ్ కార్ల వాటా 25 శాతం ఉంది. వీటి సేల్స్ 30 శాతం దూసుకెళ్లాయి. ప్రస్తుతం సంస్థకు 50 నగరాల్లో 125 ఔట్‌లెట్స్ ఉన్నాయి. ఈ ఏడాది మరో 20 లగ్జరీ కేంద్రాలు తోడవనున్నాయి. ఫ్రాంచైజ్ భాగస్వాములు మూడేళ్లలో రూ. 450 కోట్లకుపైగా పెట్టుబడులకు కట్టుబడి ఉన్నారు' అని అయ్యర్ వెల్లడించారు. భారత్‌లో ఎంట్రీ ఇచ్చిన తొలి రెండు దశాబ్దాల్లో 50,000 పైచిలుకు మెర్సిడెస్ కార్లు రోడ్డెక్కాయి. గత 10 ఏళ్లలో కస్టమర్ల చేతుల్లోకి వెళ్లిన కార్ల సంఖ్య 1.5 లక్షల యూనిట్లు. ఇదీ భారత మార్కెట్ ప్రస్థానం అని ఆయన వివరించారు.

బెంగళూరులో 23 నుండి ఐఎంటీఈఎక్స్ 2025



న్యూఢిల్లీ: మెషిన్ టూల్ పరిశ్రమకు సంబంధించి జనవరి 23 నుండి 29 వరకు బెంగళూరులో ఐఎంటీఈఎక్స్ 2025 ఎగ్జిబిషన్ జరగనుంది. ఇందులో అమెరికా, జర్మనీ, ఇటలీ, జపాన్ తదితర 23 దేశాల నుండి 1,100కు పైగా ఎగ్జిబిటర్లు పాల్గొనున్నారు. సుమారు 90,000 చ.మీ. విస్తీర్ణంలో నిర్వహించే ఎగ్జిబిషన్‌లో టూల్‌టెక్, డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ మొదలైన కార్యక్రమాల్లో భారత తయారీ సాంకేతికత సామర్థ్యాలను ప్రతిబింబించే పలు ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. మెషిన్ టూల్ రంగ సంస్థలు కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఇది ఉపయోగపడగలదని ఐఎంటీఎంఏ ప్రెసిడెంట్ రాజేంద్ర ఎస్ రాజమాణె తెలిపారు.

ఈక్వల్, వన్‌మనీ అడ్వైజరీ బోర్డు చైర్మన్‌గా జస్టిస్ శ్రీకృష్ణ



న్యూఢిల్లీ: డేటా షేరింగ్ ప్లాట్‌ఫాం ఈక్వల్, అలాగే ఆ సంస్థ పెట్టుబడులున్న అకౌంట్ అగ్రిగేటర్ వన్‌మనీ ఏర్పాటు చేసిన అడ్వైజరీ బోర్డు చైర్మన్‌గా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ నియమితులయ్యారు. న్యాయశాస్త్ర, ఆర్థిక, టెక్నాలజీ తదితర రంగాలకు చెందిన నిపుణులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఆర్‌బీఐ మాజీ గవర్నర్లు జగదీష్ కపూర్, రాకేష్ మోహన్ .. యూఐడీఏఐ మాజీ చైర్మన్ జె సత్యనారాయణ వంటి ప్రముఖులు ఈ జాబితాలో ఉన్నారు. డేటా షేరింగ్‌కి సంబంధించి భద్రత, నైతికతకు ప్రాధాన్యమిస్తూ అత్యున్నత ప్రమాణాలు పాటించడంలో ఇరు కంపెనీలకు ఈ బోర్డు మార్గనిర్దేశం చేస్తుంది. వ్యక్తుల హక్కులు, ఆకాంక్షలు, ఆర్థిక వృద్ధి తదితర అంశాల్లో సమతౌల్యత పాటించేందుకు ఉపయోగపడే సొల్యూషన్స్‌ను రూపొందించడంపై దృష్టి పెట్టనున్నట్లు జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ తెలిపారు. రుణాలు, ఉద్యోగాలు, ఆరోగ్య సంరక్షణ సేవలను మరింత మందికి అందుబాటులోకి తేవడానికి కట్టుబడి ఉన్నామని ఈక్వల్ వ్యవస్థాపకుడు కేశవ్ రెడ్డి తెలిపారు. సమ్మిళిత ఆర్థిక వృద్ధి సాధన దిశగా కృషి చేస్తున్నట్లు వన్‌మనీ వ్యవస్థాపకుడు కృష్ణ ప్రసాద్ చెప్పారు.

విస్తరణ బాటలో కామధేను

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బ్రాండెడ్ టీఎంటీ కడ్డీల తయారీ సంస్థ కామధేను లిమిటెడ్ తమ కార్యకలాపాలను మరింత విస్తరించడంపై దృష్టి పెడుతోంది. తమ ఉత్పత్తులకు డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో వచ్చే ఏడాది వ్యవధిలో ప్రీమియం బ్రాండ్ 'కామధేను నెక్స్' తయారీ సామర్థ్యాన్ని 20 శాతం మేర పెంచుకోనున్నట్లు సంస్థ డైరెక్టర్ సునీల్ అగర్వాల్ తెలిపారు. అలాగే చానల్ పార్ట్‌నర్ల నెట్‌వర్క్‌ను కూడా పెంచుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మార్కెట్లోకి గోద్రెజ్ అడ్వాంటిస్ ఐవోటీ9 స్మార్ట్‌లాక్‌లు



హైదరాబాద్: గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్‌లో భాగమైన లాక్స్ అండ్ ఆర్కిటెక్చరల్ సొల్యూషన్స్ సంస్థ హైదరాబాద్‌లో తమ అడ్వాంటిస్ ఐవోటీ9 (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) స్మార్ట్‌లాక్‌ల శ్రేణిని ప్రవేశపెట్టింది. వాయిస్ కమాండ్స్, తొమ్మిది రకాల యాక్సెస్ మోడ్‌లు, స్పైకోడ్ తదితర ఫీచర్లు వీటిలో ఉంటాయి. డిజిటల్ లాక్‌లలో ఐవోటీ9ని ప్రవేశపెట్టిన తొలి బ్రాండ్ తమదేనని సంస్థ ఈవీపీ శ్యామ్ మోత్వానీ చెప్పారు. డిజిటల్ లాక్స్ వ్యాపార విభాగం ఆదాయాల్లో 5–6 శాతం వాటాతో ఈ మార్కెట్ తమకు కీలకంగా మారిందని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 100 పైగా ఔట్‌లెట్స్‌లో ఈ ఉత్పత్తులు లభ్యమవుతాయని తెలిపారు.

వ్యవసాయ కూలీలు, డ్రైవర్లకు భారీ ఉపాధి

నర్సులు, సెకండరీ టీచర్లకూ డిమాండ్

- తగ్గిపోనున్న క్యాషియర్లు, క్లర్క్ పోస్టులు
- 2030కి 7.8 కోట్ల మందికి కొత్తగా ఉపాధి
- డబ్ల్యూఈఎఫ్ 2025 నివేదిక విడుదల





న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో వ్యవసాయ, నిర్మాణ కూలీలు, డ్రైవర్ల ఉద్యోగాలు (డెలివరీ రంగాల్లో) గణనీయంగా పెరగనున్నట్టు ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) తెలిపింది. అదే సమయంలో క్యాషియర్లు, టికెట్ క్లర్క్‌ల ఉద్యోగాలు పెద్ద ఎత్తున తగ్గిపోతాయని అంచనా వేసింది. ఈ నెల 20 నుంచి డబ్ల్యూఈఎఫ్ వార్షిక సదస్సు జరగనుండగా, దీనికంటే ముందు 'ఉద్యోగాల భవిష్యత్, 2025' పేరుతో నివేదికను విడుదల చేసింది. 2030 నాటికి 17 కోట్ల ఉద్యోగాలు కొత్తగా అందుబాటులోకి వస్తాయని, ఇందులో 9.2 కోట్ల ఉద్యోగాలకు స్థానచలనం ఉంటుందని అంచనా వేసింది. అంటే 7.8 కోట్ల మందికి నికరంగా కొత్తగా ఉపాధి లభించనుంది. అత్యాధునిక టెక్నాలజీలు, భౌగోళిక పరమైన మార్పులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక ఒత్తిళ్లు ఈ మార్పులను నడిపిస్తాయంటూ, పరిశ్రమలు, వృత్తుల ముఖచిత్రం మారిపోనుందని అంచనా వేసింది.

ఏఐ, బిగ్‌డేటాకు భారీ డిమాండ్

కృత్రిమ మేధ (ఏఐ), బిగ్ డేటా, సైబర్ సెక్యూరిటీ టెక్నాలజీకు వేగవంతమైన వృద్ధితోపాటు, డిమాండ్ ఉంటుందని డబ్ల్యూఈఎఫ్ తెలిపింది. అదే సమయంలో మానవ నైపుణ్యాలైన సృజనాత్మకత, చురుకుదనం, బలమైన దృక్పథం ఇక ముందూ కీలకమని పేర్కొంది. 1,000 కంపెనీలకు సంబంధించిన డేటాను విశ్లేషించగా, వ్యాపారాల నవీకరణకు నైపుణ్యాల అంతరం పెద్ద అవరోధంగా ఉన్నట్టు గుర్తించింది. ఉద్యోగాలకు సంబంధించి 40 శాతం నైపుణ్యాలు మారిపోనున్నాయని, 63 శాతం సంస్థలు ఇప్పటికే నైపుణ్యాల అంతరాన్ని ఎదుర్కొంటున్నట్టు తెలిపింది. జెనరేటివ్ ఏఐ, వేగంగా మారిపోయే టెక్నాలజీలు పరిశ్రమలకు, ఉపాధి మార్కెట్‌కు గణనీయమైన అవకాశాలను తీసుకురావడమే కాకుండా, పెద్ద ఎత్తున రిస్క్ కూడా మోసుకొస్తాయని డబ్ల్యూఈఎఫ్ 'ఉపాధి కల్పన' విభాగం హెడ్ టిల్ లియోపోల్డ్ అన్నారు. సంరక్షణ ఉద్యోగాలైన నర్సులు, సెకండరీ స్కూల్ టీచర్ల ఉద్యోగాలు కూడా గణనీయంగా పెరొగొచ్చని ఈ నివేదిక అంచనా వేసింది. ఏఐ వినియోగం ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలను గణనీయంగా మార్చివేయనుందని, దాదాపు సగం సంస్థలు ఏఐతో కొత్త అవకాశాలను లక్ష్యంగా చేసుకున్నట్టు తెలిపింది. ముఖ్యంగా ఏఐ సాయంతో తమ సిబ్బందిని తగ్గించుకోవాలని 41 శాతం సంస్థలు భావిస్తున్నట్టు పేర్కొంది. మరో 77 శాతం సంస్థలు తమ సిబ్బందికి నైపుణ్యాల పెంపుపై శిక్షణ ఇప్పించే యోచనతో ఉన్నట్టు వివరించింది.

ఉపాధి అవకాశాల్లో మార్పులు

వేగంగా పెరిగేవి..	వేగంగా తగ్గేవి
వ్యవసాయ కూలీలు, నిర్మాణ రంగ కూలీలు	క్యాషియర్లు, టికెట్ క్లర్కులు
ఇతర వ్యవసాయ పనివారు	పరిపాలన సహాయకులు, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీలు
లైట్ ట్రక్ డ్రైవర్లు లేదా డెలివరీ సర్వీస్ డ్రైవర్లు	బిల్డింగ్ కేర్ టేకర్లు, క్లీనర్లు, హౌస్ కీపర్లు
సాఫ్ట్‌వేర్ అండ్ అప్లికేషన్ డెవలపర్లు	మెటీరియర్, స్టాక్ కీపింగ్ క్లర్కులు
షాపుల్లో సేల్స్ పర్సన్లు	ప్రింటింగ్ కార్మికులు
ఫుడ్ ప్రాసెసింగ్ కార్మికులు	అకౌంటింగ్, బుక్ కీపింగ్, పేరోల్ క్లర్కులు
కార్, వ్యాన్, మోటార్‌సైకిల్ డ్రైవర్లు	అకౌంటెంట్లు, ఆడిటర్లు
నర్సింగ్ ప్రొఫెషనల్స్	

నిశేష్ X జొకోవిచ్

ఆస్ట్రేలియన్ ఓపెన్ 'డ్రా' విడుదల

తొలి రౌండ్‌లో సెర్బియా దిగ్గజంతో ఆడనున్న తెలుగు సంతతి అమెరికన్ టీనేజర్

'వైల్డ్ కార్డు'తో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ బరిలో నిశేష్


నిశేష్ బసవరెడ్డి


జొకోవిచ్

మెల్‌బోర్న్: తన కెరీర్‌లో ఆడుతున్న తొలి గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లోనే తెలుగు సంతతి అమెరికన్ టీనేజర్ నిశేష్ బసవరెడ్డి దిగ్గజ ప్లేయర్‌ను 'ఢీ'కొనబోతున్నాడు. ఈనెల 12 నుంచి మొదలయ్యే ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌కు సంబంధించి 'డ్రా' వివరాలను గురువారం విడుదల చేశారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను రికార్డుస్థాయిలో 10 సార్లు గెల్చుకున్న సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ తొలి రౌండ్ ప్రత్యర్థిగా నిశేష్ ఎదురునిలువనున్నాడు. 37 ఏళ్ల జొకోవిచ్ ఇప్పటికే 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించాడు. మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధిస్తే జొకోవిచ్ కెరీర్‌లో 100 సింగిల్స్ టైటిల్స్ మైలురాయిని అందుకోవడంతోపాటు అత్యధికంగా 25 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన తొలి ప్లేయర్‌గా కొత్త చరిత్ర లిఖిస్తాడు. మరోవైపు అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) సర్క్యూట్‌లో రైజింగ్ స్టార్‌గా గుర్తింపు తెచ్చుకుంటున్న 19 ఏళ్ల నిశేష్ 'వైల్డ్ కార్డు'తో గ్రాండ్‌స్లామ్ అరంగేట్రం చేయనున్నాడు. సీజన్‌లో టాప్-8లో నిలిచిన 20 ఏళ్లలోపు ఆటగాళ్ల కోసం నిర్వహించే నెక్స్‌ట్ జనరేషన్ ఏటీపీ ఫైనల్స్‌లో గత ఏడాది నిశేష్ ఆడి ఆకట్టుకున్నాడు. దాంతో అతనికి ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ 'డ్రా'లో ఆడేందుకు నిర్వాహకులు 'వైల్డ్ కార్డు' కేటాయించారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో రెండేళ్లపాటు డాటా సైన్స్ విద్యార్థిగా ఉన్న నిశేష్ నెల రోజుల క్రితమే ప్రొఫెషనల్‌గా మారాడు. బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో క్వాలిఫయర్‌గా మెయిన్ 'డ్రా'లో ఆడి తొలి రౌండ్‌లో ఫ్రాన్స్ స్టార్ గేల్ మోన్‌ఫిల్స్‌కు గట్టిపోటీ ఇచ్చి ఓడిపోయాడు. ప్రస్తుతం జరుగుతున్న ఆక్లాండ్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో నిశేష్ తనకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న ప్లేయర్లను ఓడించి సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రస్తుతం నిశేష్ ఫామ్ చూస్తుంటే అతను జొకోవిచ్‌కు గట్టిపోటీ ఇవ్వడం ఖాయమనిపిస్తోంది. మరోవైపు జొకోవిచ్‌కు సులువైన 'డ్రా' ఎదురుకాలేదు. జొకోవిచ్ పార్శ్వంలోనే స్పెయిన్ స్టార్, ప్రపంచ 3వ ర్యాంకర్ కార్లోస్ అల్‌కరాజ్, జర్మనీకి చెందిన ప్రపంచ 2వ ర్యాంకర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ ఉన్నారు. అంతా సవ్యంగా సాగితే జొకోవిచ్‌కు క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్ ఎదురవుతాడు. అల్‌కరాజ్‌ను దాటితే సెమీఫైనల్లో జ్వెరెవ్‌తో జొకోవిచ్ ఆడే అవకాశముంది. ఈ సెర్బియా స్టార్ తుది పోరుకు చేరితే మరో పార్శ్వంలో ఉన్న డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సినెర్ (ఇటలీ)తో టైటిల్ కోసం ఆడాల్సి రావచ్చు.

సబలెంకాకు క్లిష్టమైన 'డ్రా'

మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకాకు కఠినమైన 'డ్రా' పడింది. తొలి రౌండ్‌లో 2017 యూఎస్ ఓపెన్ చాంపియన్, అమెరికా ప్లేయర్ స్లోన్ స్టీఫెన్స్‌తో సబలెంకా ఆడనుంది. గత రెండేళ్లలో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గిన సబలెంకా ఈసారీ గెలిస్తే 'హ్యాట్రిక్' పూర్తి చేసుకుంటుంది. స్విట్జర్లాండ్ స్టార్ మార్టినా హింగిస్ (1997, 1998, 1999) తర్వాత ఈ ఘనత సాధించిన ప్లేయర్‌గా సబలెంకా గుర్తింపు పొందుతుంది. సబలెంకాతోపాటు టైటిల్ ఫేవరెట్స్‌గా ఇగా స్వియాటెక్ (పోలాండ్), కోకో గాఫ్ (అమెరికా), కిన్‌వెన్ జెంగ్ (చైనా), రిబాకినా (కజకిస్తాన్) ఉన్నారు.

నగాల్ ప్రత్యర్థి మెఖాచ్

భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 26వ ర్యాంకర్ టొమాస్ మెఖాచ్ (చెక్ రిపబ్లిక్)తో ఆడతాడు. ప్రస్తుతం 96వ ర్యాంక్‌లో ఉన్న నగాల్ తన ర్యాంక్ ఆధారంగా మెయిన్ 'డ్రా'లో చోటు పొందాడు. గత ఏడాది ఇదే టోర్నీ తొలి రౌండ్‌లో ప్రపంచ 27వ ర్యాంకర్ అలెగ్జాండర్ బుబ్లిక్ (కజకిస్తాన్)ను ఓడించి సంచలనం సృష్టించిన నగాల్ రెండో రౌండ్‌లో చైనా ప్లేయర్ జున్‌చెంగ్ చేతిలో ఓడిపోయాడు.

'అఫ్గానిస్తాన్‌తో మ్యాచ్‌ను దక్షిణాఫ్రికా బహిష్కరించాలి'


దక్షిణాఫ్రికా క్రీడల మంత్రి మెకెంజీ

ప్రిటోరియా: దక్షిణాఫ్రికా ప్రజల డిమాండ్‌కు ఆ దేశ క్రీడల మంత్రి సంఘీభావం తెలిపారు. అఫ్గానిస్తాన్‌లో మహిళల కట్టుబాట్లకు నిరసనగా అక్కడి ప్రజలు త్వరలో జరగబోయే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో అఫ్గాన్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలని నినదిస్తున్నారు. అమెరికా సంకీర్ణ సేనల నిష్క్రమణతో మళ్లీ తాలిబన్ల పాలనలోకి వెళ్లిన అఫ్గాన్‌లో స్త్రీ హక్కుల్ని పూర్తిగా కాలరాశారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను హరించి కట్టుబాట్లతో ముళ్లబాట పరుస్తున్నారు. అఫ్గానిస్తాన్‌కు చెందిన మహిళా జట్లను ఏ క్రీడల్లోనూ పాల్గొనివ్వడం లేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా దక్షిణాఫ్రికా క్రీడల మంత్రి గేటన్ మెకెంజీ మాట్లాడుతూ 'ప్రజల నిరసనకు నైతిక మద్దతు తెలుపుతున్నాను. అఫ్గాన్‌తో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలి. అయితే నా అధికారాలు పరిమితం. ఇందులో నేను నిర్ణయం తీసుకోలేను. దక్షిణాఫ్రికా ప్రభుత్వం, క్రికెట్ బోర్డు సమాలోచనలు చేసి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాను' అని అన్నారు. పాకిస్తాన్ ఆతిథ్యమిస్తున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో సఫారీ జట్టు కరాచీ వేదికపై ఫిబ్రవరి 21న అఫ్గానిస్తాన్‌తో తలపడాల్సి ఉంది.

లెబనాన్ నుంచి తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో...


ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ 'డ్రా'కు హాది హబీబ్



మెల్‌బోర్న్: టెన్నిస్‌లో ఓపెన్ శకం (1968 నుంచి) మొదలై 56 ఏళ్లు గడిచాయి. కానీ ఇప్పటి వరకు లెబనాన్ దేశం నుంచి ఒక్కరు కూడా ఏ గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనూ పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో ఆడలేదు. ఎట్టకేలకు హాది హబీబ్ రూపంలో ఆ నిరీక్షణ ముగిసింది. ఈనెల 12 నుంచి మొదలయ్యే సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ 'డ్రా'కు 26 ఏళ్ల హబీబ్ అర్హత పొందాడు. క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో హబీబ్ 6-4, 3-6, 7-6 (10/8)తో క్లెమెంట్ చిడెక్ (ఫ్రాన్స్)పై గెలిచి క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'లో పోటీపడే అవకాశాన్ని దక్కించుకున్నాడు. గత ఏడాది 'పారిస్'లో ఒలింపిక్స్‌లో పోటీపడ్డ తొలి లెబనాన్ టెన్నిస్ ప్లేయర్‌గా హబీబ్ గుర్తింపు పొందాడు. అంతేకాకుండా ఇటలీలో జరిగిన ఏటీపీ చాలెంజర్ టోర్నీలో విజేతగా నిలిచిన ఈ ఘనత సాధించిన తొలి లెబనాన్ ప్లేయర్‌గా నిలిచాడు.

'చాంపియన్స్ ట్రోఫీ'కి కమిన్స్ దూరం!





సిడ్నీ: ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ వచ్చే నెల పాక్‌లో జరిగే 'ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ'లో ఆడటం సందిగ్ధంలో పడింది. అతను చీలమండ గాయంతో చాలా రోజులుగా సతమతమవుతున్నప్పటికీ ప్రతిష్టాత్మక 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ' కోసం గాయాన్ని పంటిబిగువన భరించి ఐదు టెస్టుల పూర్తి సిరీస్‌ను ఆడాడు. ఆసీస్ మళ్లీ దశాబ్దం తర్వాత అతని సారథ్యంలో 3-1తో ట్రోఫీ గెలుచుకుంది. తాజాగా అతని చీలమండకు స్కానింగ్ తీశారు. కానీ నివేదిక వెల్లడి కాలేదు. దీనిపై క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) సెలక్షన్ కమిటీ చైర్మన్ జార్జ్ బెయిలీ మాట్లాడుతూ... కెప్టెన్ కమిన్స్ చాంపియన్స్ ట్రోఫీలో ఆడేది లేనిది ఇప్పుడే నిర్ధారించలేమన్నాడు. 'కచ్చితంగా ఏమీ చెప్పలేం. స్కానింగ్ రిపోర్టు వచ్చాకే దాన్ని సమీక్షించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అంతవరకు నిరీక్షించక తప్పదు' అని ఆస్ట్రేలియాకు చెందిన వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ప్రస్తుతం కమిన్స్ మెటర్నిటీ లీవ్‌లో ఉన్నాడు. కమిన్స్ భార్య రెండో కాన్పు తేదీ త్వరలోనే ఉండటంతో అతను శ్రీలంక పర్యటనకు గైర్హాజరు కానున్నాడు.

కెప్టెన్‌గా స్టీవ్ స్మిత్

శ్రీలంక పర్యటన కోసం ఆస్ట్రేలియా జట్టులోకి మళ్లీ మెక్‌స్వీనీకి పిలుపొచ్చింది. సొంతగడ్డపై భారత్‌తో ఇటీవల జరిగిన టెస్టు సిరీస్‌లో తొలి మూడు టెస్టులు ఆడిన మెక్‌స్వీనీ పేలవమైన 14.40 సగటుతో 72 పరుగులే చేశాడు. దీంతో తర్వాత 4, 5 టెస్టులకు అతన్ని తప్పించారు. అయితే వారాల వ్యవధిలోనే మళ్లీ జట్టులో స్థానం సంపాదించాడు. ద్వీప దేశంలో జరిగే రెండు టెస్టుల సిరీస్ కోసం కంగారూ జట్టును గురువారం ప్రకటించారు. రెగ్యులర్ కెప్టెన్ కమిన్స్ గైర్హాజరీలోని ఆసీస్ జట్టును అనుభవజ్ఞుడైన మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ నడిపించనున్నాడు. గాలే వేదికపైనే ఈ నెల 29 నుంచి తొలిటెస్టు, ఫిబ్రవరి 6 నుంచి రెండో టెస్టు జరుగుతుంది.

ఆస్ట్రేలియా టెస్టు జట్టు: స్టీవ్ స్మిత్ (కెప్టెన్), ఉస్మాన్ ఖ్వాజా, ట్రావిస్ హెడ్, మెక్‌స్వీనీ, ఇంగ్లిస్, లబుషేన్, కొన్‌స్టాస్, అలెక్స్ కేరీ, కునెమన్, కూపర్, లయన్, మర్ఫీ, స్టార్క్, వెబ్‌స్టర్, అబాట్, బోలండ్.

తెలంగాణ షూటర్ డారియస్ చెనాయ్‌కు స్వర్ణం



న్యూఢిల్లీ: జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్ సీనియర్ మాస్టర్స్ పురుషుల ట్రాప్ ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన డారియస్ చెనాయ్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఆరుగురు షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో నిర్ణీత 50 షాట్‌ల తర్వాత డారియస్ చెనాయ్, నబీ ఇక్బాల్ (ఉత్తరప్రదేశ్) 37 పాయింట్లతో సమఉజ్జీగా నిలిచారు. దాంతో విజేతను నిర్ణయించేందుకు 'షూట్ ఆఫ్' నిర్వహించారు. 'షూట్ ఆఫ్'లో డారియస్ ఒక పాయింట్ స్కోరు చేయగా... నబీ ఒక్క పాయింట్ కూడా సాధించలేకపోయాడు. దాంతో డారియస్‌కు స్వర్ణం, నబీ ఇక్బాల్‌కు రజతం ఖరారయ్యాయి. ఏడుసార్లు జాతీయ చాంపియన్, కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత మొరాద్ అలీఖాన్ (ఉత్తరప్రదేశ్) 23 పాయింట్లతో కాంస్యం గెల్చుకున్నాడు. అంతకుముందు 16 మంది షూటర్లు పాల్గొన్న క్వాలిఫయింగ్‌లో నబీ ఇక్బాల్ 98 పాయింట్లు స్కోరు చేయగా... డారియస్ 94 పాయింట్లు, మొరాద్ అలీఖాన్ 93 పాయింట్లు సాధించారు.

క్వార్టర్స్‌లో రాజస్తాన్, హరియాణా

- ప్రిక్వార్టర్స్‌లో ఓడిన తమిళనాడు, బెంగాల్
- విజయ్ హజారే వన్డే టోర్నీ



వడోదర: దేశవాళీ వన్డే టోర్నీ 'విజయ్ హజారే ట్రోఫీ'లో రాజస్తాన్, హరియాణా జట్లు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాయి. గురువారం జరిగిన తొలి ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో రాజస్తాన్ 19 పరుగుల తేడాతో తమిళనాడుపై... హరియాణా 72 పరుగుల తేడాతో బెంగాల్‌పై విజయం సాధించాయి. శనివారం జరిగే రెండు క్వార్టర్ ఫైనల్స్‌లో మహారాష్ట్రతో పంజాబ్, కర్ణాటకతో బరోడా... ఆదివారం జరిగే మరో రెండు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో గుజరాత్‌తో హరియాణా, విదర్భతో రాజస్తాన్ తలపడతాయి.

గెలిపించిన అభిజిత్ తోమర్...

తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ 47.3 ఓవర్లలో 267 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అభిజిత్ తోమర్ (125 బంతుల్లో 111; 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ మహిపాల్ లోమ్రోర్ (49 బంతుల్లో 60; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ చేయగా... కార్తీక్ శర్మ (35) రాణించాడు. తమిళనాడు బౌలర్లలో వరుణ్ చక్రవర్తి (5/52) ఐదు వికెట్లు పడగొట్టాడు. అనంతరం తమిళనాడు 47.1 ఓవర్లలో 248 పరుగులే చేయగలిగింది. నారాయణ్ జగదీశన్ (52 బంతుల్లో 65; 10 ఫోర్లు), విజయ్ శంకర్ (69 బంతుల్లో 49; 2 ఫోర్లు, 1 సిక్స్), బాబా ఇంద్రజిత్ (37), మొహమ్మద్ అలీ (34) కీలక పరుగులు చేసినా అవి జట్టు విజయానికి సరిపోలేదు. అమన్ షెఖావత్‌కు 3 వికెట్లు దక్కాయి.

పార్థ్ వత్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శన...

బెంగాల్‌తో మ్యాచ్‌లో ముందుగా హరియాణా 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. నిశాంత్ (67 బంతుల్లో 64; 6 ఫోర్లు, 1 సిక్స్), పార్థ్ వత్స్ (77 బంతుల్లో 62; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేయగా... సుమీత్ కుమార్ (32 బంతుల్లో 41 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. బెంగాల్ బౌలర్లలో మొహమ్మద్ షమీ 3, ముకేశ్ కుమార్ 2 వికెట్లు తీశారు. అనంతరం బెంగాల్ 43.1 ఓవర్లలో 226 పరుగులకే ఆలౌటైంది. అభిషేక్ పొరేల్ (78 బంతుల్లో 57; 6 ఫోర్లు) హాఫ్ సెంచరీతో సాధించగా, అనుస్టుప్ మజుందార్ (36), కెప్టెన్ సుదీప్ కుమార్ (36) ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పార్థ్ వత్స్ 3 కీలక వికెట్లతో బెంగాల్‌ను దెబ్బ తీయగా...అన్షుల్ కంబోజ్, నిశాంత్ సింధు చెరో 2 వికెట్లు పడగొట్టారు.

6 బంతుల్లో 6 ఫోర్లు

తమిళనాడు బ్యాటర్ నారాయణ్ జగదీశన్ అరుదైన ఫీట్‌ను నమోదు చేశాడు. రాజస్తాన్ బౌలర్ అమన్ షెఖావత్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్లో అతను వరుసగా 6 బంతుల్లో 6 ఫోర్లు బాదాడు. అమన్ వేసిన తొలి బంతి 'వైడ్'గా వెళ్లి కీపర్ అందుకోకపోవడంతో మొత్తం 5 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత జగదీశన్ వరుసగా 4, 4, 4, 4, 4, 4 బాది మొత్తం 24 పరుగులు రాబట్టాడు. ఫలితంగా మొత్తం ఓవర్లో 29 పరుగులు వచ్చాయి.



భారత ఖోఖో సారథులు ప్రతీక్, ప్రియాంక

- ప్రపంచకప్‌కు జట్ల ఎంపిక
- 13 నుంచి ఖోఖో మెగా ఈవెంట్

న్యూఢిల్లీ: గ్రామీణ క్రీడ ఖోఖోలో మొట్టమొదటిసారిగా జరగబోతున్న ప్రపంచకప్ మెగా ఈవెంట్‌కు భారత జట్లను ఎంపిక చేశారు. సందర్భంగా భారత ఖోఖో సమాఖ్య (కేకేఎఫ్‌ఐ) అధ్యక్షుడు సుధాన్షు మిట్టల్, మెగా ఈవెంట్ సీఈఓ మేజర్ జనరల్ విక్రమ్ దేవ్ డోగ్రా టీమ్ జెర్సీలను ఆవిష్కరించారు. ఇందులో ఇండియా టీమ్ అని కాకుండా 'భారత్ కి టీమ్' అని ఉండటం విశేషం. జెర్సీపై భారత్ లోగోను ప్రముఖంగా హైలైట్ చేశారు. కేకేఎఫ్‌ఐ సెలక్టర్లు ఇరుజట్లను గురువారం ప్రకటించారు. పురుషుల జట్టుకు ప్రతీక్ వాయ్‌కర్, మహిళల జట్టుకు ప్రియాంక ఇంగ్లే సారథులుగా వ్యవహరిస్తారు. ప్రియాంక బృందానికి సుమిత్ భాటియా, ప్రతీక్ జట్టుకు అశ్వని కుమార్ హెడ్ కోచ్‌లుగా మార్గదర్శనం చేస్తారు.

ఆంధ్ర ప్లేయర్ శివా రెడ్డికి చోటు

ప్రపంచకప్‌లో పాల్గొనే భారత పురుషుల జట్టులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పోతిరెడ్డి శివా రెడ్డికి స్థానం లభించింది. ప్రకాశం జిల్లా ఈదర గ్రామానికి చెందిన 26 ఏళ్ల శివా రెడ్డి అల్టిమేట్ ఖోఖో లీగ్‌లో ముంబై ఖిలాడీస్, గుజరాత్ జెయింట్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు.

రెండు వేదికల్లో...

ఖోఖో ప్రపంచకప్ మ్యాచ్‌లను ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో, గ్రేటర్ నోయిడా స్టేడియంలో ఈ నెల 13 నుంచి 19 వరకు నిర్వహిస్తారు. తొలిరోజు 13న పురుషుల జట్టు నేపాల్‌తో తలపడుతుంది. మరుసటి రోజు (14న) మహిళల జట్టు తమ తొలి మ్యాచ్‌లో కొరియాను ఢీకొంటుంది. 24 దేశాలకు చెందిన జట్లు ఈ తొలి ప్రపంచకప్‌లో పాల్గొంటున్నాయి. 16వ తేదీ వరకు లీగ్ దశ మ్యాచ్‌లు జరుగుతాయి. 17న క్వార్టర్ ఫైనల్స్, 18న సెమీస్, 19న జరిగే టైటిల్ పోటీలతో మెగా ఈవెంట్‌కు తెరపడుతుంది.

భారత ఖోఖో జట్ల వివరాలు

పురుషుల జట్టు: ప్రతీక్ (కెప్టెన్), పబని సబర్, మేహుల్, సచిన్ భార్గో, సుయశ్, రామ్‌జీ కశ్యప్, పోతిరెడ్డి శివా రెడ్డి, ఆదిత్య గాన్పులే, గౌతమ్, నిఖిల్, ఆకాశ్ కుమార్, సుబ్రమణి, సుమన్ బర్మన్, అనికేత్ పోటే, రాకేషన్ సింగ్.

మహిళల జట్టు: ప్రియాంక ఇంగ్లే (కెప్టెన్), అశ్విని, రేష్మ రాథోడ్, బిలార్ దేవ్‌జీభాయ్, నిర్మలా, నీతా దేవి, చైత్ర, శుభశ్రీ సింగ్, మాంగయ్ మజీ, అన్షు కుమారి, వైష్ణవి, నస్రీన్, మీనూ, మోనిక, నజియా.

సహజ ఓటమి

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల డబ్ల్యూ75 టోర్నమెంట్‌లో తెలంగాణ అమ్మాయి సహజ యామలపల్లి పోరాటం ముగిసింది. థాయ్‌లాండ్‌లోని నొంతాబురి పట్టణంలో ఈ టోర్నీ జరుగుతోంది. గురువారం జరిగిన సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సహజ 4-6, 3-6తో పెట్రా మర్సింకో (క్రొయేషియా) చేతిలో ఓడిపోయింది. 84 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ మూడు ఏస్‌లు సంధించింది. నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. ఇదే టోర్నీ డబుల్స్ విభాగంలో రుతుజా భోస్లే (భారత్)-యుడైస్ చోంగ్ (హాంకాంగ్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో రుతుజా-యుడైస్ ద్వయం 7-5, 6-7 (12/14), 10-7తో 'సూపర్ టైబ్రేక్'లో నహో సాటో-హిరోకో కువాటా (జపాన్) జంటపై గెలిచింది.





కళింగ లాన్సర్స్ విజయం

రూర్కెలా: హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)లో కళింగ లాన్సర్స్ జట్టు వరుస విజయాలతో జోరు పెంచింది. గురువారం ఇక్కడ జరిగిన పోరులో కళింగ జట్టు 2-1 గోల్స్‌తో టీమ్ గోనాసిక వైజాగ్‌పై విజయం సాధించింది. లాన్సర్స్ జట్టు తరఫున ఆట 28వ నిమిషంలో ఆంటోని కినా, 33వ నిమిషంలో జాలెస్కీ చెరో గోల్ చేశారు. గోనాసిక జట్టులో నమోదైన ఏకైక గోల్‌ను సునీల్ (14వ నిమిషంలో) సాధించాడు. తొలి క్వార్టర్ ముగిసే దశలో గోనాసిక జట్టే ముందుగా గోల్ బోణీ కొట్టింది. సునీల్ చేసిన గోల్‌తో 1-0తో క్వార్టర్‌ను ముగించగా... ఆ తర్వాత ఏ క్వార్టర్‌లోనూ స్ట్రయికర్లు సత్తా చాటలేకపోయారు. దీంతో పాటు రక్షణపంక్తి లోపాల్ని సొమ్ముచేసుకున్న కళింగ ఆటగాళ్లు పదేపదే దాడులకు పదును పెట్టారు. ఈ క్రమంలో రెండో క్వార్టర్ రెండు నిమిషాల్లో ముగుస్తుందనగా ఆంటోని కినా గోల్ చేయడంతో కళింగ లాన్సర్స్ స్కోరును 1-1తో సమం చేసింది. మూడో క్వార్టర్ మొదలైన మూడు నిమిషాలకే జాలెస్కీ గోల్‌తో 2-1తో ఆధిక్యంలోకి వెళ్లిన లాన్సర్స్ ఇదే పైచేయి ఆఖరిదాకా కనబరిచి విజయం సాధించింది. తాజా విజయంతో లాన్సర్స్ జట్టు 7 పాయింట్లతో మూడో స్థానానికి ఎగబాకగా, గోనాసిక జట్టు 4 పాయింట్లతో ఏడో స్థానంలో ఉంది.



యూరప్ దేశాలను మంచు వణికిస్తోంది. గురువారం బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో మంచు తీవ్రతకు నింగీనేలా ఏకమైనట్టు చెట్లు సైతం చూచాయగా ఇలా కనిపించాయి



చైనాలోని హెయిలాంగ్ జియాంగ్ ప్రావిన్స్‌లోని హర్బిన్ కోలాహలంగా మారింది. అక్కడి 'ఐస్ అండ్ స్నో వరల్డ్'లో మంచుతో నిర్మితమైన కట్టడాలు కనువిందు చేశాయి. సందర్శకులిలా సెల్ఫీలతో సరదా తీర్చుకున్నారు.



ఫ్రాన్స్‌లోని కొన్ని ప్రాంతాల్లో మంచు తుఫాను తీవ్రంగా ఉంది. గురువారం విమీ పట్టణంలో ఉన్న విమీ వార్ మెమోరియల్ ప్రాంతమిది. కొన్ని అడుగుల దూరంలో ఎవరున్నదీ తెలియనంతగా మంచు కురుస్తోంది.

జాట్లకు మీరు ద్రోహం చేశారు..

ప్రధాని మోదీకి రాసిన లేఖలో కేజ్రీవాల్ ఆరోపణ

- ఆ సామాజికవర్గాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్
- ఓటరు జాబితా తారుమారుకు బీజేపీ కుట్ర అని మండిపాటు
- జాట్లు ఇప్పుడు గుర్తొచ్చారా? అంటూ కేజ్రీపై పర్వేశ్ వర్మ ఆగ్రహం

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఢిల్లీ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఢిల్లీలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల వేడి పెరుగుతోంది. తాజాగా మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ 'జాట్'అస్త్రాన్ని ప్రయోగించారు. ఆ సామాజికవర్గాన్ని కేంద్రం ఓబీసీ జాబితాలో చేర్చాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి గురువారం కేజ్రీవాల్ లేఖ రాశారు. ఢిల్లీలోని జాట్‌లకు ద్రోహం చేశారంటూ ఆ లేఖలో ఆరోపించారు. బీజేపీ ఓటరు జాబితాను తారుమారు చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. అలాగే, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్న బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మపై చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి కేజ్రీవాల్ ఫిర్యాదు చేశారు. మరోవైపు.. ఎన్నికల ముందు కేజ్రీవాల్‌కు జాట్లు గుర్తుకొచ్చారా? అంటూ పర్వేశ్ వర్మ విరుచుకుపడ్డారు. ఢిల్లీలోని జాట్ సామాజిక వర్గం వారిని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని ప్రధాని మోదీకి రాసిన లేఖలో కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. రెండు పేజీల లేఖలో జాట్లకు సంబంధించి పలు అంశాలను ఆయన పేర్కొన్నారు. 'ఢిల్లీలోని జాట్‌లకు మీరు ద్రోహం చేశారు. ఓబీసీ రిజర్వేషన్ల పేరుతో జాట్ వర్గాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా మోసం చేస్తోంది. 2015 మార్చి 26న జాట్ నాయకులను ఇంటికి పిలిచి ఢిల్లీలోని జాట్‌లను ఓబీసీ జాబితాలో చేర్చుతామని మీరు హామీ ఇచ్చారు. 2019 ఫిబ్రవరి 8న హోం మంత్రి అమిత్ షా కూడా జాట్‌లను కేంద్ర ఓబీసీ జాబితాలోకి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. రాజస్థాన్‌లోని జాట్ కమ్యూనిటీ విద్యార్థులు ఢిల్లీ వర్సిటీలో రిజర్వేషన్ పొందుతున్నారు. కానీ, ఢిల్లీలోని జాట్‌లకు రిజర్వేషన్లు ఎందుకు లభించడంలేదు? ఢిల్లీలోని జాట్ సామాజిక వర్గానికి చెందిన వేలాది మంది పిల్లలు కేంద్ర ఓబీసీ జాబితాలో లేకపోవడంవల్ల ఢిల్లీ యూనివర్సిటీలో ప్రవేశం పొందలేకపోతున్నారు. ఢిల్లీ ప్రభుత్వం రాష్ట్ర ఓబీసీ జాబితాలో వారు ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో జాట్‌లు ప్రయోజనాలు పొందేందుకు మీ ప్రభుత్వం అనుమతించడం లేదు. మీ ప్రభుత్వ పక్షపాత వైఖరితో ఢిల్లీలోని జాట్‌లతోపాటు. మరో ఐదు సామాజికవర్గాలకు చెందిన వారు విద్యా, ఉపాధి, ఉద్యోగాల్లో తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. ఓబీసీ జాబితాలో మార్పులు చేసి ఓబీసీ హోదా ఉన్న ఆయా వర్గాలకు న్యాయం చేయండి. మీ సమాధానం కోసం ఎదురుచూస్తూ ఉంటా'అని లేఖలో కేజ్రీవాల్ పేర్కొన్నారు.

పర్వేశ్ వర్మపై చర్యలు తీసుకోండి.. ఈసీకి ఆప్ ఫిర్యాదు

న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మపై చర్యలు తీసుకోవాలంటూ ఆమ్ ఆద్మీ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. గురువారం ఢిల్లీ సీఎం ఆతిశీ, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ సింగ్, ఎంపీ సంజయ్ సింగ్‌లతో కలిసి కేజ్రీవాల్ ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను కలిసి రెండు పేజీల ఫిర్యాదును అందజేశారు. హర్ ఘర్ నౌకరీ (ఇంటికో ఉద్యోగం) పేరుతో ఓట్లు అడుగుతూ.. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న పర్వేశ్‌పై చర్యలు తీసుకోవాలని



విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో పోటీ చేయకుండా వర్మ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఎన్నికల జాబితాలో బీజేపీ అవకతవకలకు పాల్పడుతోందని సీఎం ఆతిశీ మరో ఫిర్యాదు చేశారు. 'నేను పోటీ చేస్తున్న న్యూఢిల్లీ నియోజకవర్గంలో గత 15 రోజుల్లోనే కొత్తగా 13 వేల మంది ఓటర్లు చేరారు. అదేవిధంగా, ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని 5,500 దరఖాస్తులు ఈసీకి అందాయి. ఇదో భారీ కుట్ర'అని అనంతరం కేజ్రీవాల్ విలేకరులతో అన్నారు. పర్వేశ్ వర్మ ఇంటిపై తక్షణమే ఎన్నికల నిఘా అధికారులు దాడి చేయాలని డిమాండ్ చేశారు. పర్వేశ్ వర్మ మహిళలకు రూ.1,100 బహిరంగంగానే పంచుతున్నారని ఆరోపించారు. ఓటరు జాబితాలో అవకతవలకు పాల్పడుతున్న స్థానిక ఎలక్టోరల్ అధికారులను సస్పెండ్ చేయాలి లేదా బదిలీ చేయాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు.

ఆప్ సర్కారు పడిపోవాలని వారు కోరుకుంటున్నారు: పర్వేశ్ వర్మ

ఎన్నికల ముందు కేజ్రీవాల్‌కు జాట్‌లు గుర్తుకువచ్చారా? అంటూ బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ మండిపడ్డారు. జాట్లను ఓబీసీ జాబితాలో చేర్చాలన్న కేజ్రీవాల్ డిమాండ్‌పై ఆయనకు కౌంటర్ ఇచ్చారు. 'ఈసారి ఢిల్లీలో మా ప్రభుత్వం ఏర్పడుతుంది. జాట్‌ల కోసం కేజ్రీవాల్ ఏమైనా చేసి ఉంటే.. ఎన్నికలకు 25 రోజుల ముందు జాట్‌లు గుర్తుకువచ్చేవారు కాదు. ఢిల్లీలోని గ్రామీణ ప్రాంతాల్లో జాట్‌లు మాత్రమే కాదు.. గుజ్జర్లు, యాదవులు, త్యాగులు, రాజ్‌పుత్‌లు కూడా ఉన్నారు. వీరంతా కేజ్రీవాల్ ప్రభుత్వం పడిపోవాలని కోరుకుంటున్నారు'అని పర్వేశ్ వర్మ అన్నారు.

కల్లోల కడలిలో.. పడవలోనే కాన్పు

- ఆఫ్రికా నుంచి స్పెయిన్‌కు వలస వస్తుండగా ఘటన
- తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమం
- హెలికాప్టర్‌లో ఆస్పత్రికి తరలింపు

వలస బతుకుల దుర్భర దైన్యానికి దర్పణం పట్టే ఉదంతమిది. వలసదారులతో కిక్కిరిసిన పడవలో ఓ నిండు గర్భిణి పురిటి నొప్పులు పడింది. ఆఫ్రికా నుంచి స్పెయిన్‌కు వస్తుండగా ఈ ఘటన జరిగింది. కొద్దిసేపట్లో స్పెయిన్ పాలనలోని స్వయం ప్రతిపత్తి ప్రాంతం కానరీ దీవులకు చేరతారనగా నొప్పులు ఎక్కువయ్యాయి. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో పడవే ప్రసూతి గదిగా మారింది. చుట్టూ ఉత్కంఠగా వేచి చూస్తున్న వలసదారుల నడుమే పండంటి బాబు ఈ లోకంలోకి వచ్చాడు. తర్వాత పది నిమిషాలకే నేవీ బోటులో ఆ పడవను చుట్టుముట్టిన కోస్ట్ గార్డులు వలసదారుల మధ్యలో రక్తమయంగా కనిపించిన పసి గుడ్డును చూసి నిర్ఘాంతపోయారు. తల్లీబిడ్డలను హుటాహుటిన హెలికాప్టర్‌లో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగానే అన్నారు. వలస పడవలో నిస్త్రాణంగా పడి ఉన్న తల్లి పక్కన మరొకరి చేతిలో నవజాత శిశువును చూసిన క్షణాలను కోస్ట్ గార్డ్ సిబ్బంది కెమెరాలో బంధించారు. ఆ ఫోటో ఇప్పుడు వైరల్ గా మారింది. క్రైస్తవులకు పర్వదినమైన ఎపిఫనీ రోజునే ఈ ఘటన జరగడం విశేషం. ఆ రోజున ప్రధానంగా బాలలకు బోలెడన్ని కానుకలివ్వడం సంప్రదాయం. అలాంటి పండుగ రోజున వలస దంపతులకు ఏకంగా బుల్లి బాబునే దేవుడు కానుకగా ఇచ్చాడని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

-సాక్షి, నేషనల్ డెస్క్

ధర్మాగ్రహం కట్టలు తెంచుకున్న వేళ

- వేధించిన ముల్లాను 'హిజాబ్'తో బుద్ధిచెప్పిన ధైర్యశాలి ఇరాన్ మహిళ
- టెహ్రాన్ ఎయిర్‌పోర్ట్‌లో ఘటన

టెహ్రాన్: హిజాబ్ ధరించలేదంటూ సూటిపోటి మాటలతో వేధిస్తున్న మతాధికారిని తనదైన శైలితో బుద్ధిచెప్పిన వీర వనిత ఘటన ఇది. మతాచారాలను కఠినంగా అమలుచేసే ఇరాన్‌లో ఇటీవల జరిగింది ఘటన. హిజాబ్ ధరించవా ? అంటూ వేధిస్తున్న ఒక ముల్లాను అతని సంప్రదాయ తలపాగాను తొలగించి దానినే హిజాబ్‌గా ధరించి అక్కడి వారంతా అవాక్కయ్యేలా చేసింది. నవీద్ మొహెబ్బీ అనే ఇరాన్ మహిళా యూజర్ ఒకరు పెట్టిన వీడియో ప్రకారం టెహ్రాన్‌లోని మెహ్రాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒక వివాహిత విమానం కోసం ఎదురుచూస్తుండగా అటుగా వచ్చిన ఒక ముస్లిం మతాధికారి ఆమె దగ్గరికి వచ్చి 'హిజాబ్ ధరించవా?'అని మొదలెట్టి పలు రకాలుగా వేధించసాగాడు. కొద్దిసేపు ఓపిక పట్టిన ఆ మహిళ తర్వాత వీరావేశంతో ఆ ముల్లాకు తనదైన శైలిలో సమాధానం చెప్పింది. అతని తలపై ఉన్న తలపాగాను విసురుగా లాక్కొని దానిని వస్త్రంగా విడదీసి హిజాబ్‌గా ధరించింది. ''ఇంతసేపు హిజాబ్ ఉంటేనే మహిళకు గౌరవం అని మాట్లాడావుకదా?. ఇప్పుడు నేను హిజాబ్ ధరించాను. నాకు తగిన గౌరవం ఇవ్వు ఇప్పుడు'' అని గద్దాయించింది. దీంతో ఏం చేయాలో తెలీక అతను దిక్కులు చూశాడు. తర్వాత ఆమె అక్కడి నుంచి వెళ్లిపోతూ ''మా ఆయన ఇక్కడే ఉండాలికదా!. నేను హిజాబ్ ధరించలేదని నా భర్తను ఏమైనా చేశారా ఏంటి?''అంటూ తన భర్తను వెతికేందుకు వెళ్లింది. మహిళ చర్యను ఆన్‌లైన్‌లో ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది నెటిజన్లు మెచ్చుకున్నారు. ఛాందసవాద ప్రవర్తనకు వీరవనిత తగిన బుద్ధి చెప్పిందని కొనియాడారు. అయితే ఈ ఘటన వార్త తెలిసి అక్కడే ఉన్న ఇరాన్ నైతిక పోలీసు విభాగం ఆమెను అరెస్ట్‌చేసిందని, తర్వాత ఆమెను విడుదలచేసిందని తెలుస్తోంది.

గూగుల్ మ్యాప్స్ నిర్వాకం

- నాగాలాండ్‌లో తేలిన అసోం పోలీసులు
- దొంగలనుకుని రాత్రంతా బంధించిన స్థానికులు

కోహిమా: గూగుల్ మ్యాప్స్ అయోమయం అసోం పోలీసుల దుంప తెంచింది. నేరగాన్ని పట్టుకునే ప్రయత్నం బెడిసికొట్టడమే గాక వాళ్లే ఒక రాత్రి మొత్తం బందీలుగా గడపాల్సి వచ్చింది. తేయాకు తోటలో దాగిన నేరగాడి వెదుకుతూ బయల్దేరిన 16 మంది పోలీసుల బృందం గూగుల్ మ్యాప్స్ నిర్వాకంతో ఏకంగా రాష్ట్ర సరిహద్దులు దాటి నాగాలాండ్‌లో అడుగుపెట్టింది. వారి కష్టాలు అక్కడితో ఆగలేదు. మొత్తం ముగ్గురు మినహా అంతా సివిల్ డ్రెస్సుల్లోనే ఉండటంతో వారి దగ్గర ఆయుధాలు చూసిన స్థానికులు వీరిని దొంగలని పొరబడ్డారు. స్వల్ప మోతాదులో దేహశుద్ధి చేయడమే గాక అందరినీ పట్టి బంధించారు. పోలీసులం మొర్రో అని మొత్తుకుంటున్నా పట్టించుకోలేదు. తప్పించుకోవడానికి అలా చెప్తున్నారని భావించి అందరినీ ఓ గదిలో కుక్కి వెళ్లిపోయారు. దాంతో మరో దారి లేక ఖాకీలు రాత్రంతా బిక్కుబిక్కుమంటూ బందీలుగా గడిపారు. పై అధికారులకు ఫోన్లోనే గోడు వెళ్లబోసుకున్నారు. వాళ్లు నాగా పోలీసులకు చెప్పడంతో వాళ్లు హుటాహుటిన వెళ్లి విడిపించారు. అసోంలోని తేయాకు తోటకు బదులు గూగుల్ మ్యాప్స్ పొరపాటున నాగాలాండ్‌లోని మరో తోటను చూపడమే ఈ అనర్థానికి కారణమని బాధిత పోలీసుల్లో ఒకరు తీరిగ్గా చెప్పారు.

గుజరాత్‌లో పిల్లలపై ఫోన్ ఆంక్షలు!

అహ్మదాబాద్: చిన్న పిల్లలు మొబైల్ ఫోన్లను, సోషల్ మీడియాను ఉపయోగించకుండా ఆంక్షలు విధించబోతున్నట్లు గుజరాత్ ప్రభుత్వం గురువారం వెల్లడించింది. ఈ విషయంలో త్వరలో స్పష్టమైన విధివిధానాలు తీసుకురాబోతున్నట్లు తెలియజేసింది. ఎక్కువ సేపు ఫోన్‌తో గడిపితే పిల్లల ఆరోగ్యం దెబ్బతింటుందని, మానసిక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ప్రభుత్వం పేర్కొంది. పిల్లలు ఫోన్లు వదిలేసి ఆట మైదానాల వైపు, చదువుల వైపు వెళ్లాలన్నదే తమ ఉద్దేశమని గుజరాత్ విద్యాశాఖ మంత్రి ప్రఫుల్ పన్సారియా స్పష్టం చేశారు. నిపుణులను సంప్రదించిన తర్వాత విధివిధానాలు ఖరారు చేస్తామన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఫోన్ల వాడకాన్ని నిషేధిస్తూ ఇప్పటికే ఒక తీర్మానం చేశామని, ఇకపై దాన్ని కఠినంగా అమలు చేయబోతున్నామని తెలిపారు.



వాషింగ్టన్ నేషనల్ కేథడ్రల్ చర్చిలో జరిగిన అధికారిక నివాళి కార్యక్రమంలో అధ్యక్షుడు బైడెన్ దంపతులు, ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ దంపతులతోపాటు మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, జార్జి బుష్, బరాక్ ఒబామా, కాబోయే అధ్యక్షుడు ట్రంప్



నివాళి సందేశాన్ని చదువుతున్న దివంగత మాజీ అధ్యక్షుడు గెరాల్డ్ ఫోర్డ్ కుమారుడు స్టీవ్ ఫోర్డ్

కార్టర్‌కు కన్నీటి వీడ్కోలు

అధికారిక నివాళి కార్యక్రమంలో పాల్గొన్న ఐదుగురు దేశాధ్యక్షులు

వాషింగ్టన్: దిగ్గజ అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్‌కు అమెరికా ప్రభుత్వం ఘన నివాళులర్పించింది. దేశ రాజధాని వాషింగ్టన్‌లో జరిగిన అధికారిక నివాళుల కార్యక్రమంలో దేశాధ్యక్షుడు జో బైడెన్ సెల్యూట్ చేసి తమ ప్రియతమ నేతకు తుది వీడ్కోలు పలికారు. గురువారం వాషింగ్టన్ సిటీలోని జాతీయ చర్చికు కార్టర్ పార్థివదేహాన్ని తీసుకొచ్చి ప్రభుత్వ లాంఛనాలతో అధికారిక సంతాప కార్యక్రమాలు పూర్తిచేశారు. ఈ నివాళుల కార్యక్రమంలో అధ్యక్షుడు బైడెన్‌తోపాటు అగ్రరాజ్య మాజీ అధ్యక్షులు జార్జి బుష్, బిల్ క్లింటన్, బరాక్ ఒబామా, డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్నారు. అమెరికా అధ్యక్షులుగా సేవలందించిన ఐదుగురు అగ్రనేతలు ఇలా ఒకే వేదికపై కనిపించడం ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి. చివరిసారిగా 2018 డిసెంబర్‌లో మాజీ దేశాధ్యక్షుడు జార్జ్ హెచ్ డబ్ల్యూ బుష్ సంతాప కార్యక్రమానికి ఇలా ఒకే చోట ఐదుగురు అధ్యక్షులు హాజరయ్యారు. కార్టర్‌కు ఘనంగా అంజలి ఘటిస్తూ బైడెన్ తన సంతాప సందేశం చదివి వినిపించారు. '' అమెరికా అధ్యక్షులుగా పనిచేసిన వారు తదనంతర కాలంలో ఎలాంటి నిరాడంబర జీవించాలో, హుందాగా ఉండాలో కార్టర్ ఆచరించి చూపారు. అంతర్జాతీయ సమాజానికి సేవ చేయాలన్న ఆయన సంకల్పానికి రాజకీయాలు ఏనాడూ ఆయనకు అడ్డురాలేదు'' అని బైడెన్ అన్నారు.

నివాళుల కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ దంపతులు సైతం పాల్గొన్నారు. మాజీ అధ్యక్షునిగా నివాళిగా సైనికులు తుపాకులతో '21 గన్ సెల్యూట్' సమర్పించారు. 39వ అధ్యక్షుడిగా సేవలందించిన కార్టర్ 100 ఏళ్లు జీవించి డిసెంబర్ 29వ తేదీన తుదిశ్వాస విడిచిన విషయం విదితమే. కార్టర్ భౌతిక కాయాన్ని మూడు రోజులపాటు అమెరికా పార్లమెంట్ భవనంలో మూడు రోజుల పాటు ప్రజల సందర్శనార్థం ఉంచారు. గురువారం ఉదయం నేషనల్ క్యాథడ్రల్‌కు తీసుకొచ్చి ఈ అధికారిక నివాళుల కార్యక్రమం చేపట్టారు. దీంతో ప్రభుత్వ అధికారిక వీడ్కోలు కార్యక్రమం గురువారంతో ముగిసింది. తర్వాత కార్టర్ భౌతికకాయాన్ని గురువారం జార్జియాలోని స్వస్థలం పెయిన్స్ గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడ భార్య రొజలిన్ కార్టర్ సమాధి పక్కనే కార్టర్‌ను ఖననం చేస్తారు. రోజలిన్ 77 ఏళ్ల వయస్సులో 2023 నవంబర్‌లో కన్నుమూశారు.

అలహాబాద్ హైకోర్టు తీరు ఆందోళనకరం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు పనితీరు ఆందోళనకరంగా ఉందని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎమ్మెల్యే అబ్బాస్ అన్సారీ పెట్టుకున్న పిటిషన్‌ను విచారణ చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై చురకలు అంటించింది. రాష్ట్ర ప్రభుత్వం తన భూమిని స్వాధీనం చేసుకోవడాన్ని సవాల్ చేస్తూ అన్సారీ వేసిన పిటిషన్‌పై గురువారం జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. దురదృష్టవశాత్తూ అలహాబాద్ హైకోర్టులో కేసుల లిస్టింగ్, ఫైలింగ్ ప్రక్రియ కుప్పకూలిందని, అక్కడ ఆందోళనకర పరిస్థితులున్నాయని పేర్కొంది. 'దీనిపై మేం వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు. కొన్ని హైకోర్టుల్లో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. ఆందోళనకరమైన వాతావరణం ఉన్న హైకోర్టుల్లో ఇదొకటి'అని జస్టిస్ సూర్యకాంత్ విచారణ సందర్భంగా తెలిపారు. గ్యాంగ్‌స్టర్-రాజకీయ నాయకుడు ముఖ్తార్ అన్సారీ కుమారుడే అబ్బాస్ అన్సారీ. యూపీ ప్రభుత్వం ఈయన భూమిని స్వాధీనం చేసుకుని ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లను నిర్మిస్తోంది. దీనిని సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించకుండా ఉద్దేశపూర్వకంగా పక్కన పడేసిందంటూ అబ్బాస్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న ధర్మాసనం.. లక్నోలోని అబ్బాస్‌కు చెందిన స్థలంలో ఇళ్ల నిర్మాణాలను ఆపేయాలని యూపీ యంత్రాంగాన్ని ఆదేశించింది. పిటిషన్‌పై విచారణ చేపట్టాలని అలహాబాద్ హైకోర్టుకు ఆదేశాలిచ్చింది.

చాద్ అధ్యక్ష భవనంపై దాడి!

- భగ్నం చేసిన భద్రతా సిబ్బంది
- దాడి చేసిన 19 మంది ముష్కరుల హతం

ఇంజమెనా (చాద్): మధ్య ఆఫ్రికా దేశం చాద్‌లో దేశాధ్యక్ష భవనంపై దాడికి విఫల యత్నం జరిగింది. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. దాడిని భగ్నం చేసినట్టు విదేశాంగ శాఖ ప్రకటించింది. దాడి సమయంలో అధ్యక్షుడు మహమత్ డెబీ ఇత్నో భవనం లోపలే ఉన్నట్టు ధ్రువీకరించింది. అయితే, 'దాడిని తిప్పికొట్టాం. భద్రతా దళాల కాల్పుల్లో 19 మంది ముష్కరులు హతమయ్యారు. ఆరుగురిని బందీలుగా పట్టుకున్నాం. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా అదుపులో ఉంది' అని చాద్ విదేశాంగ మంత్రి అబ్దరమాన్ కౌలామల్లాహ్ తెలిపారు. రాజ్యాంగబద్ధ పాలనను అమలుచేస్తున్నందుకు అభినందించేందుకు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ చాద్‌కు వచ్చి అధ్యక్షుడిని కలిసిన రోజే ఈ దాడి జరగడం గమనార్హం. ఇది ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ బొకో హరాం పని కావచ్చన్న అనుమానాలను తోసిపుచ్చారు. 'జరిగింది ఉగ్ర దాడి కాకపోవచ్చు. దాడికి పాల్పడ్డ వాళ్లంతా తప్ప తాగి అన్నారు. డ్రగ్స్ మత్తులో కనిపించారు. వారంతా రాజధానికి చెందిన దారి తప్పిన యువకులే' అని ఆయన అన్నారు. దాదాపు 1.8 కోట్ల జనాభా ఉన్న చాద్ దేశంలో కొంతకాలంగా రాజకీయ అస్థిరత రాజ్యమేలుతోంది.


మయన్మార్ సైన్యం దాడులు 40 మంది మృతి

అరకాన్ గ్రూపు స్వాధీనంలోని గ్రామంలో విధ్వంసం


బ్యాంకాక్: మయన్మార్ సైన్యం, సాయుధ గ్రూపులకు మధ్య భీకర పోరు సాగుతోంది. పశ్చిమ రఖైన్ రాష్ట్రంలోని రమ్రీ ద్వీపంలో ఓ గ్రామంలోని మార్కెట్‌పై మిలటరీ బుధవారం చేపట్టిన వైమానిక దాడిలో కనీసం 40 మంది చనిపోగా 50 మందికి పైగా గాయపడ్డారు. బాంబింగ్ కారణంగా చెలరేగిన మంటల్లో 500కు పైగా నివాస గృహాలు భస్మీపటలమయ్యాయి. ఈ గ్రామం గత ఏడాది కాలంగా తమ ఆధీనంలోనే ఉందని 'అరకాన్ ఆర్మీ'అనే సాయుధ గ్రూపు ప్రతినిధి ఖైంగ్ థుఖా తెలిపారు. ఆ సమయంలో తమ నేత గ్రామంలో లేరని వివరించారు. మృతులంతా పౌరులేనని, వీరిలో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారన్నారు. దీనిపై మిలటరీ స్పందించలేదు. ఆ గ్రామంలో జరిగిన పరిణామాలను ఇంటర్నెట్, సెల్‌ఫోన్‌లో అందే సమాచారం ఆధారంగానే ధ్రువీకరించుకోవాల్సి ఉంది. 2021లో అంగ్ సాన్ సూకీ సారథ్యంలోని ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోసి సైనిక జుంటా అధికారం చేజిక్కించుకుంది. అప్పటి నుంచి ప్రజాస్వామ్య అనుకూల సంస్థలన్నీ కలిసి 'పీపుల్స్ డిఫెన్స్ ఫోర్స్'పేరుతో సైనిక పాలకులపై పోరాటం సాగిస్తున్నాయి. అదేవిధంగా, అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన సాయుధ గ్రూపులు మరింత స్వేచ్ఛ కావాలని కోరుతున్నాయి. ఈ రెండు వర్గాలు కలిసి ఒక్కోసారి సైనిక జుంటాపై దాడులకు పాల్పడుతున్నాయి. రఖైన్ అల్ప సంఖ్యాక వర్గానికి చెందిన అరకాన్ ఆర్మీలో సుశిక్షితులైన సాయుధులున్నారు.

అప్ప తిరిగి ఇవ్వనందుకు అంతంచేశాడు

- మహిళను పెద్ద కత్తితో నరికి చంపిన సహోద్యోగి
- అడ్డుకోకుండా అలాగే చోద్యం చూసిన జనం
- పుణెలో ఘటన



సుభద్ర



కృష్ణ

పుణె: ఆపదలో ఉన్న వ్యక్తిని ఆదుకునే అవకాశం ఉండి కూడా జనం ఊరకే చోద్యం చూస్తూ మిన్నకుండిపోయిన ఘటన మహారాష్ట్రలో జరిగింది. అబద్ధాలు చెప్పి అప్పులు తీసుకుని తిరిగివ్వట్లేదన్న కోపంతో మహిళను సహోద్యోగి పట్టపగలే అందరూ చూస్తుండగా నరికి చంపిన ఉదంతం పుణె పరిధిలోని ఎరవాడలో మంగళవారం సాయంత్రం జరిగింది. కత్తితో దాడి చేస్తుంటే అందరూ సెల్‌ఫోన్‌లకు పనిచెప్పి వీడియోలు తీశారేగానీ అతనిని అడ్డుకునే ప్రయత్నం ఒక్కరు కూడా చేయకపోవడం విస్మయం కల్గించింది. సంబంధిత వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. పోలీసులు నమోదుచేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం ఎరవాడలోని డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ అనే బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్(బీపీఓ) సంస్థలో 30 ఏళ్ల కృష్ణ కనోజ, 28 ఏళ్ల అమ్మాయి సుభద్రా కొదరే కలిసి పనిచేస్తున్నారు. తన తండ్రికి ఒంట్లో బాగోలేదని చెబుతూ విడతలవారీగా పలుమార్లు కృష్ణ వద్ద సుభద్ర కొంత నగదు అప్పు తీసుకుంది. తిరిగి ఇవ్వాలని అడిగితే ఇంకా మా నాన్నకు ఆరోగ్యం కుదుటపడలేదని సాకులు చెప్పేది. అనుమానంతో అతను సుభద్ర వాళ్ల సొంతూరుకు వెళ్లి వాకబుచేయగా సుభద్ర తండ్రి నిక్షేపంగా ఉన్నట్లు తేలింది. దీంతో పట్టరాని ఆవేశంతో కృష్ణ మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు తాము పనిచేసే సంస్థ పార్కింగ్ ప్రాంతానికి వచ్చి అక్కడికి సుభద్రను పిలిచి తండ్రి గురించి వాకబు చేసి డబ్బంతా తిరిగి ఇచ్చేయాలని డిమాండ్‌చేశాడు. నగదు ఇచ్చేది లేదని ఆమె తెగేసి చెప్పి వాగ్వాదానికి దిగింది. దీంతో వెంట తెచ్చుకున్న పెద్ద పదునైన కత్తితో సుభద్రపై పలుమార్లు దాడి చేశాడు. రక్తమోడుతూ పడి ఉన్న సుభద్రను కాపాడేందుకు అక్కడ ఉన్న వాళ్లు ఒక్కరూ ముందుకు రాలేదు. ఆవేశంతో ఇంకెవరితోనూ ఫోన్ మాట్లాడిన హంతకుడు చేతిలోని కత్తిని పడేశాడు. వెంటనే సమీపంలోని వాళ్లు అతడిని చుట్టుముట్టి చితకబాది పోలీసులకు అప్పజెప్పారు. రక్తమోడుతున్న సుభద్రతను సమీపంలోని ఆస్పత్రికి తరలించగా రాత్రి 9 గంటలప్పుడు చికిత్సపొందుతూ ఆమె ప్రాణాలువిడిచింది. కేసు నమోదుచేసి పోలీసులు కృష్ణను అరెస్ట్‌చేశారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్‌కు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, గైడెన్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

బడ్జెట్ పద్ధతిని ఎప్పుడు ప్రవేశపెట్టారు?

'సైమన్ కమిషన్ మొదటిసారిగా సమాఖ్య పద్ధతిని సూచించింది'. సైమన్ కమిషన్ అనేది భారత సమస్యలపై ఒక సమగ్ర అధ్యయనమని కూప్లాండ్ అనే రచయిత పేర్కొన్నారు. బ్రిటన్‌లోని అధికార లేబర్ పార్టీ ఈ కమిషన్ సమర్పించిన నివేదికలోని అంశాలపై సరిగా దృష్టిపెట్టలేదు. కానీ, ఆ తర్వాత రూపొందించిన భారత ప్రభుత్వ చట్టం-1935లో సైమన్ కమిషన్ ప్రతిపాదించిన అంశాలను పొందుపరిచారు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత కౌన్సిల్ చట్టాలు

1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత దేశంలో పరిపాలనా సంస్కరణలను ప్రవేశపెట్టడానికి, భారతీయుల సహకారాన్ని పొందడానికి బ్రిటిష్ ప్రభుత్వం అనేక చట్టాలను రూపొందించింది. వీటినే కౌన్సిల్ చట్టాలు లేదా శాసన చట్టాలు అంటారు.

కౌన్సిల్ చట్టం-1861

భారతదేశంలో శాసన నిర్మాణ ప్రక్రియలో మొదటిసారిగా భారతీయులకు ప్రాతినిధ్యం కల్పించారు.

- ఈ చట్టం ప్రకారం కొంతమంది భారతీయులను అనధికార సభ్యులుగా కౌన్సిల్‌లోకి వైస్రాయ్ నామినేట్ చేస్తారు. ఇలా నామినేట్ అయిన వారిలో బెనారస్ రాజు, పాటియాలా మహారాజు, శ్రీ దినకర్‌రావు ఉన్నారు.
- 1773 చట్టం ద్వారా రద్దయిన బాంబే,మద్రాస్ ప్రెసిడెన్సీల శాసనాధికారాలను పునరుద్ధరించారు. ఆ విధంగా ఈ చట్టాన్ని 'వికేంద్రీకరణ ప్రక్రియ'కు నాందిగా చెప్పొచ్చు. బెంగాల్, పంజాబ్, ఈశాన్య సరిహద్దు ప్రావిన్సులతో నూతన లెజిస్లేటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు.
- కౌన్సిల్‌లో కార్యక్రమాలను సజావుగా నిర్వహించడానికి అవసరమైన సూత్రాలు,నియమాలను జారీ చేసే అధికారాన్ని వైస్రాయ్‌కి ఇచ్చారు. 1859లో లార్డ్ కానింగ్ ప్రవేశపెట్టిన పోర్ట్‌ఫోలియో (మంత్రిత్వ శాఖలుగా విధుల కేటాయింపు)పద్ధతిని గుర్తించి కొనసాగించారు. తద్వారా వైస్రాయ్ కౌన్సిల్ మరిన్ని శాఖలను నిర్వహించే అవకాశాన్ని ఈ చట్టం కల్పించింది. శాసన కౌన్సిళ్ల సమ్మతి లేకుండానే ఆర్డినెన్సులు జారీ చేసే అధికారాన్ని వైస్రాయ్‌కు కల్పించారు. 1860లో బడ్జెట్ పద్ధతి ప్రవేశపెట్టారు.

కౌన్సిల్ చట్టం-1892

కౌన్సిల్ చట్టం-1861లోని లోపాలను సరిదిద్దడానికి ఈ చట్టం చేశారు. ముఖ్యంగా 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడటం, విద్యావంతులైన భారతీయులు బ్రిటిష్ పాలనలోని లోపాలపై ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తుండటంతో ఈ చట్టాన్ని రూపొందించారు. కేంద్ర శాసనసభలో అనధికార సభ్యుల సంఖ్య 10కి తగ్గకుండా 16 కంటే మించకుండా.. రాష్ట్ర శాసనసభల్లో 8 మందికి తక్కువ కాకుండా 20 మందికి మించకుండా నియంత్రించారు. కేంద్రశాసన మండలికి ఎంపికైన భారతీయ ప్రముఖులు.. గోపాలకృష్ణ గోఖలే, ఫిరోజ్ షా మెహతా, సురేంద్రనాథ్ బెనర్జీ, రాస్ బిహారీ ఘోష్.

ఈ చట్టం ద్వారా శాసన మండలి అధికారాలను విస్తృతం చేశారు. బడ్జెట్‌పై చర్చించడం లాంటి అధికారాలను కల్పించారు.

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, శాసనసభల్లో ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రశ్నలు వేయడానికి సభ్యులకు అవకాశం కల్పించారు. అయితే ఈ ప్రశ్నలు అడిగేందుకు గవర్నర్, గవర్నర్ జనరల్‌ల ముందస్తు అనుమతి పొందాలి. శాసనసభల్లో తమ స్థానం నామమాత్రమేనని గ్రహించిన భారతీయులు ఈ చట్టాన్ని వ్యతిరేకించారు.

భారత కౌన్సిల్ చట్టం-1909 లేదా మార్లే-మింటో సంస్కరణలు

1892 చట్టంలోని లోపాలను సవరించాలని, దేశంలో తీవ్రవాద జాతీయవాదంతో ఏర్పడిన పరిస్థితిని ఎదుర్కొనాలనే ఉద్దేశంతో ఈ చట్టానికి రూపకల్పన చేశారు. భారత రాజ్య కార్యదర్శి లార్డ్ మార్లే, భారత వైస్రాయ్ మింటో పేర్లతో ఈ చట్టాన్ని సూచించారు. అందువల్ల దీన్ని మార్లే-మింటో సంస్కరణ చట్టం అంటారు. కాంగ్రెస్‌లోని మితవాదులను మచ్చిక చేసుకోవడానికి బ్రిటిష్‌వారు ఈ చట్టం ద్వారా ప్రయత్నించారని చెప్పవచ్చు.

ముఖ్యాంశాలు

- కేంద్ర, రాష్ట్ర శాసన మండళ్లలో సభ్యుల సంఖ్యను పెంచారు.
- శాసన ప్రక్రియ కోసం వైస్రాయ్ కార్యనిర్వాహక కౌన్సిల్‌లోని సభ్యుల సంఖ్యను 16 నుంచి 60కి పెంచారు. అదేవిధంగా మద్రాస్, బెంగాల్, యునైటెడ్ ప్రావిన్స్, బిహార్, ఒరిస్సా రాష్ట్రాల శాసన మండళ్లలో సభ్యుల సంఖ్యను 50కి, పంజాబ్, అస్సాం, బర్మాల్లో 30కి పెంచారు.
- గవర్నర్ జనరల్ ఆధీనంలోని శాసన మండలిలో 4 రకాల సభ్యులు ఉంటారు.
  1. నామినేటెడ్ అధికార సభ్యులు
  2. నామినేటెడ్ అనధికార సభ్యులు
  3. హోదా రీత్యా సభ్యులు
  4. ఎన్నికైన సభ్యులు

మెజారిటీ సభ్యులు అధికార సభ్యులు కావడం వల్ల బిల్లుల ఆమోదం ప్రభుత్వానికి సులభమయ్యేది. వైస్రాయ్, గవర్నర్ల కార్యనిర్వాహక మండలిలో తొలిసారిగా భారతీయులకు సభ్యత్వం కల్పించారు. ఇలా సభ్యత్వాన్ని పొందిన తొలి భారతీయుడు సత్యేంద్ర ప్రసాద్ సిన్హా.

ముస్లింలు, వ్యాపార సంఘాల సభ్యులకు ప్రత్యేక ప్రాతినిధ్యాన్ని కల్పించారు. ముస్లిం జనాభాకు మించిన ప్రాధాన్యాన్ని ఈ చట్టం కల్పించింది. ముస్లిం సభ్యులను ముస్లింలే ఎన్నుకునే వీలు కల్పించింది. దీని కోసం ప్రత్యేక మతపరమైన నియోజక గణాలను ఏర్పాటు చేశారు.

ఈ చట్టం మతతత్వానికి చట్టబద్ధత కల్పించింది. అందుకే లార్డ్ మింటోను 'మత నియోజక గణాల పితామహుడి'గా పేర్కొంటారు.

ప్రెసిడెన్సీ కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, భూస్వాములు, వ్యాపార సంస్థలకు కూడా ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించారు. కేంద్ర, రాష్ట్ర శాసనమండళ్లలో సభ్యులు సైనిక, దౌత్య, మతపరమైన విషయాలు మినహా ఇతర ఏ అంశంపైనైనా ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలు అడగడానికి అధికారం లభించింది. కేంద్ర, రాష్ట్ర శాసనమండళ్లలో పోటీచేసే అభ్యర్థులకు ఈ చట్టం కచ్చితమైన అర్హతలను నిర్ణయించింది.

విమర్శ: ఈ చట్టంలోని అంశాలు 'అసలైన స్వరూపానికి బదులు కేవలం నీడ లాంటి ఆకారా'న్ని మాత్రమే అందించడం వల్ల 1909 చట్టాన్ని చంద్రకాంతితో పోల్చారు. ఈ చట్టం హిందూ, ముస్లింల మధ్య వేర్పాటు బీజాలు నాటి అడ్డుగోడలు సృష్టించిందని, దేశవిభజనకు దారి తీసిందని నెహ్రూ అభిప్రాయపడ్డారు.

భారత ప్రభుత్వ చట్టం-1919 లేదా మాంటెగు-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు

భారతదేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం 1917 ఆగస్టు 20న ఒక ప్రకటన చేసింది. అందులో భాగంగా భారత రాజ్య కార్యదర్శి లార్డ్ మాంటెగు 1917 నవంబర్‌లో భారతదేశాన్ని సందర్శించాడు. వైస్రాయ్ ఛెమ్స్‌ఫర్డ్‌తోపాటు భారతీయ నాయకులతో ఆయన చర్చలు జరిపి ఈ సంస్కరణలను ప్రకటించాడు. అందువల్ల వీటిని మాంటెంగు-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు అంటారు.

ముఖ్యాంశాలు

- భారత రాజ్య కార్యదర్శి జీతభత్యాలను భారత ఆదాయం నుంచి కాకుండా బ్రిటిష్ నిధి నుంచి చెల్లిస్తారు.
- రాష్ట్ర స్థాయిలో ద్వంద్వ పాలన ప్రవేశపెట్టారు. రాష్ట్రాల అధికారాలను రిజర్వ్‌డ్, ట్రాన్స్‌ఫర్డ్‌గా విభజించారు. రిజర్వ్‌డ్ విభాగంలో 28 పాలనా అంశాలను చేర్చారు. విత్తం, భూమిశిస్తు, న్యాయం, నీటి పారుదల, పరిశ్రమలు, మొదలైన వాటిని ఇందులో పేర్కొన్నారు.
- ఈ అంశాలకు సంబంధించిన పరిపాలనా వ్యవహారాలను బ్రిటిష్ కౌన్సిలర్ల సహాయంతో ఆయా రాష్ట్ర గవర్నర్లు నిర్వహిస్తారు. అయితే బ్రిటిష్ కౌన్సిలర్లు తమ విధి నిర్వహణలో రాష్ట్ర శాసనసభకు బాధ్యత వహించరు.
- ట్రాన్స్‌ఫర్డ్ విభాగంలో 22 అంశాలను పేర్కొన్నారు. స్థానిక పాలన, వ్యవసాయం, ప్రజా ఆరోగ్యం, విద్య, సహకారం, మొదలైన అంశాలు ఇందులో ఉన్నాయి.
- రాష్ట్ర గవర్నర్ ఈ అంశాల పాలనా వ్యవహారాలను భారతీయ మంత్రుల సహాయంతో నిర్వహిస్తారు. భారతీయ మంత్రులు ఆయా రాష్ట్ర శాసనసభల్లో సభ్యులై ఉంటారు. తమ విధుల నిర్వహణలో శాసనసభకు బాధ్యత వహిస్తారు.
- దేశంలో మొదటిసారి కేంద్ర స్థాయిలో ద్విసభా పద్ధతిని ప్రవేశపెట్టారు. ఎగువసభను రాష్ట్రాల మండలి(కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్), దిగువ సభను కేంద్ర శాసనసభ(సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ)గా వ్యవహరిస్తారు.
- ఎగువసభ అయిన కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్‌లో 60 మంది సభ్యులు ఉంటారు. ఇందులో 34 మంది ఎన్నికైనవారు, 26 మందిని గవర్నర్ జనరల్ నియమిస్తారు. వీరి పదవీకాలం అయిదేళ్లు. అధ్యక్షుడిని వైస్రాయ్ నియమిస్తారు. దిగువసభ అయిన సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో 145 మంది సభ్యులుంటారు. ఇందులో 104 మంది ఎన్నికైనవారు, 41 మంది నియమితులైనవారు ఉంటారు. ఈ సభ పదవీకాలం మూడేళ్లు.
- మత ప్రాతినిధ్యాన్ని సిక్కులు, క్రిస్టియన్లు, ఆంగ్లో-ఇండియన్లు, ఐరోపా వారికి కూడా వర్తింపజేశారు.
- ఆస్తి పన్ను చెల్లింపు ప్రాతిపదికపై పరిమిత ఓటు హక్కును కల్పించారు. లండన్‌లో భారత వ్యవహారాలను, ముఖ్యంగా రెవెన్యూ, పరిపాలన మొదలైన అంశాలను పర్యవేక్షించడానికి భారత హై కమిషనర్ పదవిని సృష్టించారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లను వేరు చేశారు.
- లీ కమిషన్ (1923–24) సూచన మేరకు భారతదేశానికి విడిగా ఒక ఆడిటర్ జనరల్‌ను, 1926లో ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు.
- కేంద్ర, రాష్ట్రాల మధ్య, వివిధ రాష్ట్రాల మధ్య ఉత్పన్నమయ్యే వివాదాలను పరిష్కరించే అధికారం వైస్రాయ్‌కి ఇచ్చారు. ఈ చట్టం అమలు తీరును సమీక్షించడానికి పదేళ్ల తర్వాత చట్టబద్ధత ఉన్న కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

విమర్శ: ఈ చట్టం ప్రతిపాదించిన అంశాలపై అనేక విమర్శలు వచ్చాయి.

- 1919 సంస్కరణలు అసంతృప్తి, నిరాశతో పాటు 'సూర్యుడు లేని ఉదయం'లా ఉన్నాయని బాలగంగాధర్ తిలక్ అభిప్రాయపడ్డారు.
- ఈ సంస్కరణలను బ్రిటిష్‌వారు ప్రకటించి ఉండాల్సింది కాదని, ఈ చట్టాన్ని భారతీయులు స్వీకరించడం తగదని అనిబిసెంట్ వ్యాఖ్యానించారు.
- భారతదేశంలో ద్వంద్వ పాలన దాదాపు దూషణ పదంగా మారింది. ఒక వ్యక్తి, ఇంకొక వ్యక్తిని నీవు 'డైయార్కి'వి అని అరవడం విన్నానని సర్ బట్లర్ అనే రచయిత తెలిపాడు.
- ద్వంద్వ పాలనను ఎప్పటికీ ఆదర్శంగా భావించలేం. మరో ఉత్తమ ప్రయోజన స్థితికి ఇది ఓ మెట్టు మాత్రమే. ఆ ఉత్తమ ప్రయోజనమే 'పరిపూర్ణ స్వపరిపాలిత భారతదేశం' అని పలాండే అనే రచయిత పేర్కొన్నారు.

ఈ సంస్కరణలు స్వపరిపాలన దిశగా చెప్పుకోదగ్గ ముందంజ కాబట్టి భారత రాజ్యాంగ చరిత్రలో ముఖ్య పరిణామంగా పరిగణిస్తారు. ప్రేరణను, భవితవ్యం కోసం అనుభవం సంపాదించడానికి ఈ చట్టం తగిన అవకాశం ఇచ్చిందని కూడా చెప్పవచ్చు.

సైమన్ కమిషన్ - నవంబర్ 1927

భారత ప్రభుత్వ చట్టం 1919 ద్వారా ప్రవేశపెట్టిన రాజ్యాంగ సంస్కరణలను సమీక్షించడానికి నిర్ణీత సమయం కంటే రెండేళ్ల ముందే బ్రిటన్ ప్రధాని స్టాన్లీ బాల్డ్‌విన్ 1927 నవంబర్‌లో సర్ జాన్ సైమన్ నాయకత్వంలో ఆరుగురు సభ్యులతో ఒక రాయల్ కమిషన్‌ను నియమించారు.

ఇందులోని సభ్యుడైన క్లిమెంట్ అట్లీ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చే సమయానికి ఇంగ్లండ్ ప్రధానిగా ఉన్నారు. ఈ కమిషన్‌లో సభ్యులందరూ ఆంగ్లేయులు కావడం వల్ల భారతీయులు దీన్ని పూర్తిగా వ్యతిరేకించారు. ఈ కమిషన్ భారతదేశంలో రెండు సార్లు పర్యటించింది. 1928 ఫిబ్రవరి 3 నుంచి మార్చి 31 వరకు తొలిసారి, 1928 అక్టోబర్ 11 నుంచి 1929 ఏప్రిల్ 6 వరకు రెండోసారి పర్యటించింది. ఈ కమిషన్ 1930లో నివేదికను సమర్పించింది.

ముఖ్యాంశాలు

- రాష్ట్రాల్లో ప్రవేశపెట్టిన ద్వంద్వ పాలనను రద్దు చేయడం, మంత్రులు శాసనసభకు బాధ్యత వహించేలా చేయడం.
- ప్రభుత్వ నిర్వహణలో భారతీయులకు పూర్తి స్వయంప్రతిపత్తి కల్పించడం.
- రాష్ట్ర శాసన మండళ్లలో సభ్యత్వ సంఖ్యను పెంచడం.
- ఏక కేంద్ర వ్యవస్థ భారతదేశానికి సరిపడదు కాబట్టి సమాఖ్య వ్యవస్థను అభివృద్ధి చేసుకోవడం.
- హైకోర్టుపై కేంద్ర ప్రభుత్వానికి పాలనాపరమైన నియంత్రణ ఏర్పాటు.
- సార్వజనీన వయోజన ఓటు హక్కు వెంటనే సాధ్యం కాదు కాబట్టి దీన్ని కాలానుగుణంగా విస్తృతం చేయడం.
- కమ్యునల్ ప్రాతినిధ్యం సమంజసం కాకపోయినా, దీనికి ప్రత్యామ్నాయం లేని దృష్ట్యా కొనసాగించడం.

అయనీకరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది?

ఆమ్లాలు - క్షారాలు - లవణాలు

- అలోహ ఆక్సైడ్‌లను నీటిలో కరిగించినప్పుడు ఆమ్లాలు ఏర్పడతాయి.
- ఫాస్ఫరస్ పెంటాక్సైడ్ నీటితో చర్య జరిపి ఫాస్ఫారిక్ ఆమ్లాన్ని ఏర్పరుస్తుంది.
  $P_2O_5 + H_2O \rightarrow 2H_3PO_4$
- ఎక్కువ భాష్పశీల ఆమ్లాల నుంచి తక్కువ భాష్పశీల ఆమ్లాలను తయారు చేయవచ్చు.
  $2NaCl + H_2SO_4 \rightarrow Na_2SO_4 + 2HCl$
- లోహ ఆక్సైడ్‌లను నీటిలో కరిగించినప్పుడు క్షారాలు ఏర్పడతాయి.
  $Na_2O + H_2O \rightarrow 2\,NaOH$
- ఆమ్లాలు నీలి లిట్మస్‌ను ఎరుపుకు మారుస్తాయి.
- ఆమ్లాలు నారింజ రంగు గల మిథైల్ ఆరంజ్ సూచిక రంగును ఎరుపు రంగుకు మారుస్తాయి.
- Zn, Mg మొదలైన లోహాలతో ఆమ్లాలు చర్య పొంది హైడ్రోజన్ వాయువును విడుదల చేస్తాయి.
  ఉదా: $Zn + H_2SO_4 \rightarrow ZnSO_4 + H_2 \uparrow$
- ఆమ్లాలు, క్షారాలతో చర్య పొంది నీటిని, లవణాలను ఏర్పరుస్తాయి.
  $HCl + NaOH \rightarrow NaCl + H_2O$
- కార్బొనేట్‌లు, బై కార్బొనేట్‌లతో ఆమ్లాలు చర్య పొంది CO_2 వాయువును విడుదల చేస్తాయి.
  $Na_2CO_3 + 2HCl \rightarrow 2NaCl + CO_2 + H_2O$
- క్షారాలు ఎరుపు లిట్మస్‌ను నీలి రంగుకు మారుస్తాయి.
- క్షారాల నారింజ రంగు గల మిథైల్ ఆరంజ్ సూచికను పసుపు రంగుకు మారుస్తాయి.
- క్షారాలను వేడిచేస్తే లోహ ఆక్సైడ్‌లను, నీటిని ఏర్పరుస్తాయి.
- ఆమ్ల, క్షారాల జల ద్రావణాలు విద్యుత్ వాహకతను ప్రదర్శిస్తాయి.
- 1887లో స్వీడన్ దేశస్థుడైన అర్హీనియస్ అయనీకరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఈ పదార్థాల్లో ఆమ్లాలు, క్షారాలు కూడా ఉన్నాయి.
- అర్హీనియస్ సిద్ధాంతం ప్రకారం జల ద్రావణంలో H^+ అయాన్లు ఇచ్చేవి ఆమ్లాలు.
  $HCl \rightarrow H^+ + Cl^-$
- జల ద్రావణంలో OH^- అయాన్‌లను ఇచ్చే పదార్థాలు క్షారాలు.
  $NaOH \rightarrow Na^+ + OH^-$
- స్వచ్ఛమైన నీరు మంచి విద్యుద్వాహకం కాదు.
- నీరు అతి తక్కువ పరిమాణంలో అయనీకరణం చెంది H^+, OH^- అయాన్‌లను ఇస్తుంది.
  $H_2O \rightleftharpoons H^+ + OH^-$ (సమతాస్థితి)
- ఒక మోల్ నీటిలో గల $[H^+]$, $[OH^-]$ అయాన్‌ల గాఢతల లబ్ధాన్ని నీటి అయానిక లబ్ధం అంటారు. దీన్ని K_Wతో సూచిస్తారు.
  $K_W = [H^+] \times [OH^-] = 1\times10^{-14}$ (25^0C వద్ద)
- ఉష్ణోగ్రత పెరుగుదలతో అయనీకరణం, దానితోపాటు K_W విలువ కూడా పెరుగుతుంది.

సంఖ్య	ఉష్ణోగ్రత ^0C	K_W(మోల్.అయాన్^{2}/లీ)
1.	0	1.14×10^{-15}
2.	25	1.0×10^{-14}
3.	50	5.30×10^{-14}

- నీటి అయానిక లబ్ధానికి ప్రమాణాలు మోల్.అయాన్^{2}/లీ^{2}
- P^H పదాన్ని సొరెన్‌సేన్ పరిచయం చేశారు.
  $P^H = -\log_{10}[H^+]$
- ఆమ్ల ద్రావణాలకు $[H^+] > 10^{-7}$; $P^H < 7$ తటస్థ ద్రావణాలకు $[H^+] = 10^{-7}$; $P^H = 7$
  క్షార ద్రావణాలకు $[H^+] < 10^{-7}$; $P^H > 7$
- సంపూర్ణంగా అయనీకరణం చెందే ఆమ్లాలు బలమైన ఆమ్లాలు. పాక్షికంగా అయనీకరణం చెందే ఆమ్లాలు బలహీనమైన ఆమ్లాలు.

HCl (బలమైన ఆమ్లం) $\rightarrow H^+ + Cl^-$ (100% అయనీకరణం)

CH_3COOH(బలహీన ఆమ్లం) $\rightleftharpoons CH_3COO^- + H^+$(<100% అయనీకరణం)

- సంపూర్ణంగా అయనీకరణం చెందే క్షారాలు బలమైన క్షారాలు. పాక్షికంగా అయనీకరణం చెందే క్షారాలు బలహీన క్షారాలు.
  $NaOH$(బలమైన క్షారం) $\rightarrow Na^+ + OH^-$ (100% అయనీకరణం)
  NH_4OH(బలహీన క్షారం) $\rightleftharpoons NH_4^+ + OH^-$ (<100% అయనీకరణం)

కొన్ని సాధారణ ద్రావణాల P^H

క్ర.సం.	సాధారణ ద్రవం	P^H
1.	గ్యాస్ట్రిక్ రసం	1 – 2
2.	నిమ్మ రసం	2 – 4
3.	మూత్రం	4.8 – 7.5
4.	సోడా నీరు	5.5
5.	ఉమ్మి	6.4 – 6.9
6.	స్వచ్ఛమైన నీరు	7
7.	రక్తం	7.32–7.45

- ఒక మోల్ బలమైన ఆమ్లం, ఒక మోల్ బలమైన క్షారంతో చర్య పొంది వెలువడే ఉష్ణాన్ని తటస్థీకరణోష్ణం అంటారు.
  $H^+ + OH^- \rightarrow H_2O + 13.7$ K.Cal / Mole



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఫిజికల్ సైన్స్ - ఎస్‌ఏ కంటెంట్

- బలమైన ఆమ్ల, క్షారాల మధ్య జరిగే చర్యకు తటస్థీకరణోష్ణం 13.7 KCal / Mole
  $NaOH + HCl \rightarrow NaCl + H_2O + 13.7$ KCal / Mole
- బలహీన ఆమ్లం, బలమైన క్షారం మధ్య తటస్థీకరణోష్ణం జరిగినప్పుడు విడుదలయ్యే ఉష్ణం = 13.7 KCal / Mole కంటే తక్కువగా ఉంటుంది.
  $CH_3COOH + NaOH \rightarrow CH_3COONa + H_2O + 13.4$ KCal / Mole

మాదిరి ప్రశ్నలు

1. ఎరుపు లిట్మస్‌ను నీలి రంగుకు మార్చేవి?
   1) ఆమ్లాలు 2) క్షారాలు
   3) లవణాలు 4) పైవన్నీ
2. నారింజ రంగు గల మిథైల్ ఆరంజ్ సూచికను ఎరుపు రంగుకు మార్చేవి?
   1) ఆమ్లాలు 2) క్షారాలు
   3) లవణాలు 4) అన్నీ
3. అయనీకరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది?
   1) లూయిస్ 2) అర్హీనియస్
   3) ఆస్వాల్డ్ 4) సొరెన్‌సేన్
4. తటస్థ ద్రావణాల P^H విలువ?
   1) 6 2) 5
   3) 9 4) 7
5. క్షార ద్రావణాల్లో ఫినాఫ్తలీన్ సూచిక రంగు?
   1) పసుపు 2) ఆకుపచ్చ
   3) గులాబీ 4) నారింజ
6. నిమ్మ రసం P^H విలువ?
   1) 1–2 2) 2–4
   3) 2 4) 5–6
7. P^H అనే పదాన్ని ఎవరు పరిచయం చేశారు?
   1) మోస్లే 2) అర్హీనియస్
   3) సొరెన్‌సేన్ 4) లూయిస్
8. రక్తం గుణం?
   1) ఆమ్లం 2) క్షారం
   3) తటస్థం 4) ఏదీ కాదు
9. 25^0C వద్ద నీటి అయానిక లబ్ధం విలువ____ మోల్ / అయాన్^{2}/లీ^{2}
   1) 0.4×10^{-14} 2) 1.0×10^{-14}
   3) 1.4×10^{-15} 4) 1×10^{-12}
10. మిథైల్ ఆరెంజ్ సూచిక గల ఆమ్ల ద్రావణ రంగు?
    1) ఎరుపు 2) పసుపు
    3) ఆకుపచ్చ 4) నీలం
11. 0.001 M HCl ద్రావణ P^H విలువ?
    1) 2 2) 4
    3) 3 4) 1
12. ఆమ్ల ఆక్సైడ్‌కు ఉదాహరణ?
    1) Na_2O 2) Mgo
    3) Cao 4) SO_2
13. Na_2CO_3, $NaHCO_3$లతో ఆమ్లాలు చర్య జరపగా ____ వాయువు వెలువడుతుంది?
    1) O_2 2) H_2
    3) CO_2 4) Co
14. వీటిలో ఆమ్లం కానిదేది?
    1) HNO_3 2) H_2SO_4
    3) CH_3COOH 4) KoH
15. క్షారాలు నారింజ రంగు గల మిథైల్ ఆరంజ్ సూచికను ____ రంగుకు మారుస్తాయి?
    1) ఎరుపు 2) నీలం
    3) నలుపు 4) పసుపు
16. ఎసిటికామ్లాన్ని అయనీకరణం చెందించేందుకు ఎంత ఉష్ణం ఉపయోగపడుతుంది?
    1) 0.1 KCals 2) 0.2 KCal
    3) 0.3 KCal 4) ఏదీకాదు
17. లోహ ఆక్సైడ్‌లు నీటిలో కరిగి ఏర్పర్చే పదార్థాలు ఏ వర్గానికి చెందుతాయి?
    1) ఆమ్లం 2) క్షారం
    3) లవణం 4) తటస్థ ద్రావణం
18. ఆమ్ల స్వభావం కలిగి నీటిలో కరగనది?
    1) SiO_2 2) HCl
    3) Na_2CO_3 4) ఏదీకాదు
19. హైడ్రోనియం అయాన్ ____
    1) H_3O 2) H^+
    3) OH^- 4) H_2O_2
20. $NaCl$ ద్రావణ P^H విలువ?
    1) 3 2) 7 3) 8.9 4) 12

సమాధానాలు

1) 2; 2) 1; 3) 2; 4) 4; 5) 3; 6) 2; 7) 3; 8) 2; 9) 2; 10) 1; 11) 3; 12) 4; 13) 3; 14) 4; 15) 4; 16) 3; 17) 2; 18) 1; 19) 1; 20) 2.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. 0.001 M HCl ద్రావణం P^H విలువ? (డీఎస్సీ – 2003)
   1) 4 2) 3 3) 2 4) 1
2. ఒక బలమైన ఆమ్లం, మరొక బలమైన క్షారంతో చర్య జరిపినప్పుడు వెలువడే తటస్థీకరణోష్ణం విలువ? (డీఎస్సీ – 2006)
   1) 13.7 KCal / Mole
   2) 13.4 KCal / Mole
   3) 0 KCal / Mole
   4) 0.3 KCal / Mole
3. P^H = 8గా గల ద్రావణంలో $[H^+]$ అయాన్‌ల గాఢత ఎంత? (డీఎస్సీ – 2006)
   1) 10^8 2) 10^{-8} 3) 8 4) $\log10^{-8}$
4. ఆమ్ల ద్రావణంలో మిథైల్ ఆరంజ్ సూచిక రంగు? (డీఎస్సీ – 2006)
   1) పసుపు 2) ఆకుపచ్చ
   3) నారింజ 4) ఎరుపు
5. ఫాస్ఫారిక్ ఆమ్లం, సోడియం హైడ్రాక్సైడ్‌తో చర్య పొంది సోడియం ఫాస్ఫేట్ ఏర్పడే చర్యలో ఒక అణువు ఫాస్ఫారిక్ ఆమ్లంతో కలిసే సోడియం హైడ్రాక్సైడ్ అణువుల సంఖ్య? (డీఎస్సీ – 2008)
   1) 3 2) 4 3) 1 4) 2
6. ఏ లోహం H_2SO_4తో చర్య జరపదు? (డీఎస్సీ – 2008)
   1) Zn 2) Cu 3) Au 4) Pb
7. $[H^+] = 10 \times 10^{-4}$ M గాఢత గల ద్రావణం P^H విలువ? (డీఎస్సీ – 2012)
   1) 1 2) 2 3) 3 4) 4

సమాధానాలు

1) 2; 2) 1; 3) 2; 4) 4; 5) 1; 6) 3; 7) 3.

విద్య, ఉద్యోగ సమాచారం

బెల్ చెన్నైలో 83 అప్రెంటిస్‌లు

చెన్నైలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) గ్రాడ్యుయేట్, డిప్లొమా, బీకాం అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 83.
- » **పోస్టుల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-63, టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్-10, బీకాం అప్రెంటిస్-10.
- » **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, సివిల్, మెకానికల్.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్, బీకాం ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులు దక్షిణ ప్రాంతీయ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- » **వయసు:** 25 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, సీజీపీఏ స్కోరు ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఇంటర్వ్యూ తేదీలు:** 20, 21, 22.01.2025.
- » **ఇంటర్వ్యూ వేదిక:** భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్),నందంబాక్కం,చెన్నై-600 089.
- » **వెబ్‌సైట్:** https://bel-india.in

ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో మేనేజిరియల్ పోస్టులు

మాల్పే(కర్ణాటక)లోని ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో మేనేజిరియల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
- » **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ జనరల్-01, మేనేజర్-01, డిప్యూటీ మేనేజర్(మెషినరీ ఔట్‌ఫిట్)-01, డిప్యూటీ మేనేజర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్)-01, డిప్యూటీ మేనేజర్(హల్)-01.
- » **అర్హత:** 60 శాతం మార్కులతో సంబంధిత విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వయసు:** 31.01.2025 నాటికి 45 ఏళ్లలోపు ఉండాలి.
- » **వేతనం:** నెలకు అసిస్టెంట్ జనరల్‌కు రూ.80,000 నుంచి రూ.2,20,000, మేనేజర్‌కు రూ.60,000 నుంచి రూ.1,80,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.50,000 నుంచి రూ.1,60,000.
- » **ఎంపిక విధానం:** పీపీటీ, పని అనుభవం, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**31.01.2025
- » **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

వహాబీ ఉద్యమానికి నాయకుడు ఎవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర



అసఫ్‌జాహీలు

క్రీ.శ. 1707లో ఔరంగజేబు మరణానంతరం మొగల్ సామ్రాజ్యం క్రమంగా క్షీణించింది. మొగల్ రాష్ట్ర సుబేదారులు (గవర్నర్‌లు) స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. మొగలు చక్రవర్తి ఔరంగజేబుతో పాటు అతడి వారసుల ఆస్థానంలో విశిష్ట సేవలందించిన మీర్ ఖమ్రుద్దీన్ ఖాన్‌ను చక్రవర్తి ఫరూఖ్ సియర్ 7000 మందితో కూడిన సేనకు మున్సబుదారుగా చేశాడు. ఇతడిని దక్కన్‌లోని ఖాందేష్, బీరార్, తెలంగాణ, దౌలతాబాద్, అహ్మద్‌నగర్, ఆర్కాట్ ప్రాంతాలకు సుబేదారుగా నియమించాడు. ఇతడికి 'ఫతేజంగ్', 'నిజాం-ఉల్-ముల్క్' బిరుదులు ఇచ్చారు.

దక్కన్ సుబేదారుగా మీర్ ఖమ్రుద్దీన్ ఈ ప్రాంతంలో రెండేళ్లలోపే శాంతిని నెలకొల్పాడు. ఈ సమయంలో నిజాం-ఉల్-ముల్క్‌ను వెనక్కి రప్పించి, సయ్యద్ హుస్సేన్ అలీఖాన్‌ను దక్కన్ సుబేదారుగా నియమించారు. 1720లో నిజాం-ఉల్-ముల్క్‌ను మాల్వాకు సుబేదారుగా నియమించారు. 1720 ఏప్రిల్‌లో నిజాం-ఉల్-ముల్క్ మాల్వాను వదిలి దక్కన్ ప్రాంతం వైపు నడిచాడు. ఈ క్రమంలో ఆసిర్‌ఘర్, బుర్హాన్‌పూర్ ప్రాంతాలను ఆక్రమించాడు.

దక్కన్ సుబేదారైన సయ్యద్ హుస్సేన్ అలీ ఖాన్ హత్యకు గురయ్యాడు. మొగల్ చక్రవర్తి మహమ్మద్ షా రంగీలా 'నిజాం-ఉల్-ముల్క్'ను వజీర్ (ప్రధానమంత్రి)గా నియమించాడు. ఇతడు మూడేళ్లలో అనేక సంస్కరణలను ప్రవేశపెట్టాడు. మొగల్ రాజ్యంలో నిజాం-ఉల్-ముల్క్ ఇజారా పద్ధతిని రద్దు చేసి దేశ ఆదాయాన్ని పెంచాడు. ఆ తర్వాత నిజాం-ఉల్-ముల్క్ రాజధానిలో జరిగే కుట్రలను భరించలేక ఢిల్లీని వదిలేసి దక్కన్ చేరుకున్నాడు. 1724 అక్టోబర్ 11న దక్కన్ సుబేదారైన ముబారిజ్‌ఖాన్‌ను షక్కర్‌ఖేడ్ యుద్ధంలో హతమార్చి దక్కన్‌ను ఆక్రమించాడు. నిజాం ఉల్ ముల్క్ గొప్పతనాన్ని గుర్తించి మొగలు చక్రవర్తి మహమ్మద్‌షా అతడిని దక్కన్ ప్రాంతానికి శాశ్వత సుబేదారుగా నియమించాడు. 'అసఫ్ జా' అనే బిరుదును ఇచ్చాడు. నిజాం-ఉల్-ముల్క్ 'అసఫ్ జా' బిరుదుతో పాలించడం వల్ల 'అసఫ్ జాహి' వంశం అనే పేరొచ్చింది. 1724 నుంచి నిజాం-ఉల్-ముల్క్ దక్కన్ ప్రాంతాన్ని స్వతంత్రంగా పరిపాలించాడు.

నిజాం-ఉల్-ముల్క్ (1724-48)

ఔరంగాబాద్‌ను రాజధానిగా చేసుకొని నిజాం-ఉల్-ముల్క్ దక్కన్ ప్రాంతాన్ని పాలించాడు. మహారాష్ట్రులతో జరిగిన మూడు యుద్ధాల్లో ఓటమిపాలై 'చౌత్' పన్ను చెల్లించడానికి అంగీకరించాడు. దక్కన్‌లో వచ్చిన తిరుగుబాట్లను అణచివేసి సర్కారు, కర్నూలు, ఆర్కాటు సుబాలను అదుపులోకి తెచ్చుకున్నాడు.

1739లో నాదిర్‌షా ఢిల్లీ పైకి దండెత్తి మహమ్మద్‌షాను ఓడించాడు. దక్కన్ నుంచి నిజాం-ఉల్-ముల్క్ ఢిల్లీకి వచ్చి నాదిర్‌షాకు నెమలి సింహాసనం, కొహినూర్ వజ్రాన్ని ఇచ్చి మహమ్మద్‌షాతో సంధి కుదిర్చాడు. నాదిర్‌షాను భారత్ నుంచి పంపించేశాడు. నిజాం-ఉల్-ముల్క్ 1748లో మరణించాడు. నిజాం మరణించే నాటికి ఉత్తరాన తపతి నది నుంచి దక్షిణాన తిరుచునాపల్లి వరకు, పశ్చిమాన ఔరంగాబాద్ నుంచి తూర్పున బంగాళాఖాతం వరకు రాజ్యం విస్తరించి ఉండేది.

వారసత్వ సమస్య: నిజాం మరణానంతరం అతడి కుమారుడు నాసర్‌జంగ్, మనవడు ముజఫర్ జంగ్ (ఖైరున్నిసా కుమారుడు) మధ్య వారసత్వ పోరాటం ప్రారంభమైంది. ముజఫర్ ఫ్రెంచివారి సహాయంతో దక్కన్ సుబేదారు కావాలని ఆశించాడు. కానీ నాసర్‌జంగ్ ఆంగ్లేయుల సాయంతో అతణ్ని ఓడించాడు. ఫ్రెంచి వారి కుట్ర ఫలితంగా నాసర్‌జంగ్‌ను హిమ్మత్‌ఖాన్ హతమార్చాడు. ఆ తర్వాత ముజఫర్‌జంగ్ సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతడు కృష్ణానది దక్షిణ ప్రాంతాన్ని ఫ్రెంచివారికి ఇచ్చాడు. చివరకు హిమ్మత్‌ఖాన్ కుట్ర వల్ల ముజఫర్ జంగ్ లక్కిరెడ్డిపల్లి వద్ద హత్యకు గురయ్యాడు. దీంతో ఫ్రెంచ్ సైనిక నాయకుడైన బుస్సీ పరిస్థితులను తన అదుపులోకి తెచ్చుకొని నాసర్‌జంగ్ సోదరుడైన సలాబత్ జంగ్‌ను రాజుగా చేశాడు.

సలాబత్ జంగ్ ఫ్రెంచివారికి కొండవీడు, నిజాంపట్నం, నరసాపురం మండలాలను ఇచ్చాడు. 1751-58 మధ్య కాలంలో బుస్సీ హైదరాబాద్‌కు మకాం మార్చి సలాబత్ జంగ్‌కు పదవిని సుస్థిరం చేసుకోవడంలో సాయపడ్డాడు. మహారాష్ట్రుల దాడుల నుంచి కాపాడినందుకుగాను ఫ్రెంచివారికి ఉత్తర సర్కార్లను, బుస్సీకి గుంటూరును సలాబత్ స్వాధీనం చేశాడు. మూడో కర్ణాటక యుద్ధంలో ఫ్రెంచివారిని ఆంగ్లేయులు ఓడించడంతో సలాబత్ ఆంగ్లేయులతో సంధి చేసుకొని వారికి ఉత్తర సర్కార్లను ఇచ్చాడు.

నిజాం అలీఖాన్ (1761-1803)

నిజాం ఉల్ ముల్క్ నాలుగో కుమారుడు నిజాం అలీఖాన్. ఇతడు తన సోదరుడైన సలాబత్ జంగ్‌ను బంధించి రెండో అసఫ్‌జా బిరుదుతో దక్కన్‌కు రాజయ్యాడు. నిజాం అలీ ఔరంగాబాద్ నుంచి రాజధానిని హైదరాబాద్‌కు తరలించాడు. 1765లో రాబర్ట్ క్లైవ్ మొగల్ చక్రవర్తి షా ఆలం నుంచి ఉత్తర సర్కారులను బ్రిటిషర్లకు ఇచ్చినట్లుగా ఫర్మానా పొందాడు. కానీ నిజాం అలీఖాన్ ఈ ఫర్మానాను అంగీకరించలేదు. దుబాసీ అయిన కాండ్రేగుల జోగి పంతులు సహాయంతో బ్రిటిషర్లు ఉత్తర సర్కారులను రూ. 15 లక్షలకు గుత్తకు తీసుకున్నారు. చివరకు 1766లో కుదిరిన ఒప్పందం ప్రకారం నిజాం అలీఖాన్ గుంటూరు మినహా సర్కారు జిల్లాలన్నింటినీ ఈస్టిండియాకు ఇచ్చేశాడు. గుంటూరు ప్రాంతం నిజాం అలీఖాన్ సోదరుడైన బసాలత్ జంగ్ ఆధీనంలో ఉండేది. బసాలత్ మరణించే వరకు ఈ ప్రాంతం ఆయన ఆధీనంలో ఉండే విధంగా అంగీకారం కుదిరింది.

నిజాం అలీ ఫ్రెంచి సేనాని రేమండ్ సహాయంతో తుపాకుల కర్మాగారాన్ని నిర్మించాడు. 1790లో మూడో మైసూర్ యుద్ధం ప్రారంభమైంది. టిప్పు సుల్తాన్‌కు వ్యతిరేకంగా నిజాం అలీ, మరాఠాలతో ఈస్టిండియా కంపెనీ ఒప్పందం చేసుకుంది. ఈ కూటమి టిప్పు సుల్తాన్‌ను ఓడించి ఆయన నుంచి సగం రాజ్యాన్ని, మూడు కోట్ల రూపాయలను నష్ట పరిహారంగా పొందింది. ఇందులో నిజాం అలీ తన వాటాగా దత్త మండలాలు (కడప, కర్నూలు, అనంతపురం, బళ్లారి జిల్లాలు), కోటి రూపాయల నగదును పొందాడు.

1795లో మరాఠాలు నిజాం అలీని 'ఖార్దా' వద్ద ఓడించి మూడు కోట్ల రూపాయల చౌత్‌ను, రూ. 2 కోట్ల నష్ట పరిహారాన్ని పొందారు. మరాఠాలు నిజాం అలీని ఓడించిన కొద్ది కాలానికే అతడి కుమారుడు 'అలీజా' తిరుగుబాటు చేశాడు. ఈ తిరుగుబాటుకు మెతుకు (మెదక్) జమీందారైన సదాశివరెడ్డి మద్దతు ఇచ్చాడు. ఫ్రెంచి సేనాని రేమండ్ సహాయంతో నిజాం సైన్యం ఈ తిరుగుబాటును అణచివేసింది. అలీజాను బంధించారు. ఆ తర్వాత అతడు ఆత్మహత్య చేసుకున్నాడు.

1799లో గవర్నర్ జనరల్ వెల్లస్లీ భారతదేశంలో సైన్య సహకార పద్ధతిని ప్రవేశపెట్టాడు. దీనికి అంగీకరించి, సంతకం చేసిన మొదటి భారతీయ రాజు నిజాం అలీఖాన్ (1798). సైన్య సహకార సంధి ప్రకారం నిజాం అలీఖాన్‌కు బ్రిటిష్ సైనికదళం సహాయంగా వచ్చింది. వీరు హైదరాబాద్‌లో స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సైన్యం నిర్వహణ కోసం నిజాం అలీఖాన్ మూడో మైసూర్ యుద్ధం ఫలితంగా పొందిన దత్త మండలాలను బ్రిటిషర్లకు ఇచ్చేశాడు.

సికిందర్ జా (1803-1829)

నిజాం అలీఖాన్ మరణం (1803) తర్వాత హైదరాబాద్ రాజ్యానికి సికిందర్ జా రాజయ్యాడు. మూడో అసఫ్ జా బిరుదుతో ఇతడు రాజ్యానికి వచ్చాడు. ఇతడి కాలంలో గవర్నర్ జనరల్ 'సైన్య సహకార సంధి'పై నైజాంతో మరోసారి సంతకం చేయించుకున్నాడు. సికిందర్ జా కాలంలో మీర్ ఆలం దివాన్‌గా, రాజా చందులాల్ పేష్కార్‌గా నియమితులయ్యారు.

- మీర్ ఆలం హైదరాబాద్ - మద్రాస్, బొంబాయి రహదారులు మరమ్మతు చేయించాడు. 1808లో తన పేరు మీద మీర్ ఆలం చెరువును నిర్మించాడు.
- 1814లో విలియం పామర్ హైదరాబాద్‌లో పామర్ అండ్ కో బ్యాంకు ప్రారంభించాడు.

1811లో హైదరాబాద్‌లో బ్రిటిష్ ప్రతినిధిగా హెన్రీ రస్సెల్ నియమితుడయ్యాడు. 1816లో హైదరాబాద్ రాజ్యంలో కల్లోల పరిస్థితులను చక్కదిద్దడానికి హెన్రీ రస్సెల్ ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేశాడు. ఈ సైన్యం సహాయంతో పిండారీలు, భిల్లులు, స్థానిక జమీందారుల తిరుగుబాటులను అణచివేసి హైదరాబాద్ రాజ్యంలో శాంతి నెలకొల్పారు. తర్వాతి కాలంలో రస్సెల్‌కు సైన్యం నిర్వహణ భారంగా మారింది. ఆర్థిక సంక్షోభం వల్ల జీతాలు చెల్లించలేని పరిస్థితులు నెలకొనడంతో అతడు పామర్ కంపెనీ నుంచి అప్పు తీసుకున్నాడు. 1820లో హైదరాబాద్‌లో బ్రిటిష్ ప్రతినిధిగా మెట్కాఫ్ వచ్చాడు. ఇతడు ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి పామర్ కంపెనీకి కట్టాల్సిన అప్పును నిజాం తీర్చేలా కృషి చేశాడు.

- చార్లెస్ మెట్కాఫ్ కాలంలోనే కోఠిలోని రెసిడెంట్ (ప్రస్తుత మహిళా కళాశాల) భవనాన్ని నిర్మించారు.

నసీరుద్దౌలా (1829-57)

నాలుగో అసఫ్ జా బిరుదుతో నసీరుద్దౌలా అధికారంలోకి వచ్చాడు. ఇతడి కాలంలో హైదరాబాద్ రాజ్య ఆర్థిక పరిస్థితి దిగజారిపోయింది. రాజా చందూలాల్ బ్రిటిషర్లకు రాజ్య ఖజానాను దోచిపెట్టాడు. 1848లో గవర్నర్ జనరల్‌గా వచ్చిన లార్డ్ డల్హౌసీ దేశంలోని స్వదేశీ సంస్థానాలను ఆక్రమించుకున్నాడు. హైదరాబాద్ రాజ్యం 1850 నాటికి ఈస్టిండియా కంపెనీకి రూ. 64 లక్షలు బాకీ పడింది. ఈ బాకీని 1850 డిసెంబర్ 31 లోగా తీర్చాలని డల్హౌసీ కోరాడు.

నసీరుద్దౌలా కాలంలో దేశంలో రెండు ముఖ్యమైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. మొదటిది వహాబీ ఉద్యమం. రెండో అంశం.. పంజాబ్ నుంచి సిక్కులను, దేశం నుంచి బ్రిటిషర్లను పంపించాలనే లక్ష్యానికి సంబంధించింది. హైదరాబాద్‌లో వహాబీ ఉద్యమానికి నసిరుద్దౌలా సోదరుడు ముబారిజ్ ఉద్దౌలా నాయకత్వం వహించాడు. కర్నూలు నవాబ్ గులాంఖాన్ వహాబీ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. 1838లో ముబారిజ్‌ను అరెస్ట్ చేసి గోల్కొండ జైల్లో పెట్టారు. అతడు 1854 జూన్ 25న జైల్లోనే మరణించాడు.

బ్రిటిషర్లకు చెల్లించాల్సిన అప్పును నిజాం 1853 వరకు కూడా తీర్చలేకపోయాడు. దీంతో డల్హౌసీ ఒత్తిడి మేరకు బీరారుతో పాటు, ఉస్మానాబాద్, రాయ్‌చూర్ జిల్లాలను ఈస్టిండియా కంపెనీకి ఇచ్చేశాడు. 1853 మే 21న బీరారు ఒడంబడికపై సంతకం చేసిన దివాన్ సిరాజ్ - ఉల్ - ముల్క్ అవమానంతో మరణించాడు. అతడి అల్లుడు మీర్ తురాబ్ అలీఖాన్ సాలార్‌జంగ్ బిరుదుతో దివాన్ పదవిని అలంకరించాడు.

- చాదర్‌ఘాట్ బ్రిడ్జిని నసీరుద్దౌలా కాలంలోనే నిర్మించారు. 1854లో కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ ఆస్పత్రి (గాంధీ ఆస్పత్రి) నిర్మించారు.

అఫ్జలుద్దౌలా (1857-1869)

నసీరుద్దౌలా మరణించిన తర్వాత అతడి పెద్ద కుమారుడు అఫ్జల్ - ఉద్ - దౌలా (అఫ్జలుద్దౌలా) అయిదో అసఫ్ జా బిరుదుతో రాజ్యాధికారానికి వచ్చాడు. 1857 తిరుగుబాటు ప్రభావం హైదరాబాద్‌పై కూడా పడింది. 1857 జూలై 17న సైన్యంలో జమేదారైన తుర్రేబాజ్ ఖాన్ 5000 మందిని పోగుచేసి హైదరాబాద్‌లోని బ్రిటిష్ రెసిడెంట్ కార్యాలయంపై దాడి చేశాడు. సాలార్‌జంగ్ సహాయంతో బ్రిటిష్ ప్రతినిధి కల్నల్ డేవిడ్‌సన్ ఈ తిరుగుబాటును అణచివేశాడు. తుర్రేబాజ్ ఖాన్‌ను కాల్చి చంపి సుల్తాన్ బజార్‌లో శవాన్ని వేలాడదీశారు. తుర్రేబాజ్ ఖాన్‌కు సహాయం చేసిన మౌల్వీ అల్లావుద్దీన్‌ను అరెస్ట్ చేసి అండమాన్ జైలుకు పంపించారు.

కౌలస జాగీర్దారు రాజా దీప్‌సింగ్ కొంత మంది జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, పటేల్, పట్వారీలను కూడగట్టి కౌలస కోటను గెరిల్లా శిక్షణ కేంద్రంగా చేసి బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాటు ప్రారంభించాడు. దీంతో రాజు కౌలస జాగీర్దార్‌ను రద్దు చేసి అతడికి మూడేళ్ల జైలు శిక్ష విధించాడు. కౌలస పట్వారీ రంగారావును అండమాన్‌కు పంపడంతో 1859 నాటికి ఈ తిరుగుబాటు పూర్తిగా సద్దుమణిగింది. 1857 తిరుగుబాటు సమయంలో బ్రిటిషర్లకు తోడ్పడినందుకుగాను అఫ్జలుద్దౌలాకు 'స్టార్ ఆఫ్ ఇండియా' బిరుదును ఇచ్చారు. రూ. 50 లక్షల అప్పు రద్దు చేసి ధారాశీవ్, ఉస్మానాబాద్ జిల్లాలను వెనక్కి ఇచ్చారు.

మహబూబ్ అలీఖాన్ (1869-1911)

ఇతడు మూడేళ్ల వయసులో రాజ్యానికి వచ్చాడు. ఇతడి ప్రతినిధిగా మొదటి సాలార్‌జంగ్ పరిపాలనా బాధ్యతలు చేపట్టారు. మహబూబ్ అలీఖాన్ కాలంలోనే సాలార్‌జంగ్ సంస్కరణలు తీసుకువచ్చాడు. 1884 ఫిబ్రవరి 5న మహబూబ్ అలీఖాన్ మేజర్ కావడంతో బ్రిటిష్ గవర్నర్ జనరల్ లార్డ్ రిప్పన్ స్వయంగా వచ్చి అధికారాన్ని అందజేశాడు. ఇతడి కాలంలో పర్షియన్ స్థానంలో ఉర్దూను రాజభాషగా చేశారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. వహాబీ ఉద్యమం ఎలాంటిది? (గ్రూప్-2, 2011)
ఎ) బ్రిటిష్ వ్యతిరేక బి) బ్రిటిష్ సానుకూల
సి) ముస్లిం వ్యతిరేక డి) ముస్లిం సానుకూల
2. తూర్పు ఇండియా వర్తక సంఘంతో సైన్య సహకార ఒప్పందానికి అంగీకరిస్తూ మొట్టమొదటగా సంతకం చేసిన స్వదేశీ సంస్థానం ఏది? (గ్రూప్-2, 2011)
ఎ) తంజావూర్ బి) అవధ్
సి) హైదరాబాద్ డి) మైసూర్

సమాధానాలు: 1) ఎ; 2) సి.

Rising rental rates force the middle class..

BANK EXAMS
GENERAL ENGLISH

Model Questions

Directions (Q. No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. As more and much people invest their money in savings certificates or money-market funds (1)/ in order to earn higher interest, (2)/ they are abandoning traditional low-interest investment havens (3)/ such as passbook accounts and life insurance policies. (4)/ No error. (5)
2. Rising rental rates force the middle class to use (1)/ far more than the standard 25 percent of their incomes (2)/ for housing, leaving them with know equity (3)/ or tax write-offs to offset the expenditures. (4)/ No error. (5)
3. Astronomers studying(1)/ the newly discovered star (2)/ said that it provides clues about (3)/ our galaxy's origin. (4)/ No error. (5)
4. According to some economists, (1)/ the June decrease in unemployment suggest (2)/ that the gradual improvement (3)/ in the job market is continuing. (4)/ No error (5)
5. The qualities of a great leader are (1)/ coolness in the face of danger, (2)/ an excellent sense of strategy, (3)/ and a ability to plan in minute detail. (4)/ No error. (5)

Directions: (Q. No. 6-10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase given *bold* in the sentence to make it grammatically correct? Mark (5) "No correction required" as your answer, If there is no error.

6. Aging **is a property** of all animals that reach a fixed size at maturity.
1) was a property
2) had been a property
3) was being a property
4) is being a property
5) No correction required
7. All-terrain vehicles have allowed vacationers to reach many previously inaccessible areas, but they **have been blamed** for causing hundreds of deaths.
1) have also been blamed
2) have been also blamed
3) have been blamed also
4) have been blaming
5) No correction required
8. Although fruit can no longer grow once it is picked, it continues for some time to respire, **taking in oxygen and giving often** carbon dioxide.
1) taking in oxygen and giving of
2) taking in oxygen and giving always
3) taking in oxygen and giving off
4) taking out oxygen and giving off
5) No correction required
9. Amateur astronomers with good telescopes **should been able** to see the comet within the next few weeks.
1) should be able
2) would be abled
3) should being able
4) should belonging
5) No correction required
10. As the price of oil rises, the prices of bread and livestock feed **sure to increases.**
1) are sure to increased
2) are sure to increasing
3) are sure to be increase
4) are sure to increase
5) No correction required

Directions (Q. No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. The coordination of monetary policy can help ____ the orderly financing of _____imbalances.
1) facilitate; existing
2) felicitate; exciting
3) fend; many
4) fetch; permanent
5) promote; promotional



12. __ the objects found in the excavated temple ___ small terra-cotta effigies left by supplicants.
1) Below; wear
2) Amongst; where
3) Between; below
4) Among; were 5) Above; was
13. An array of tax incentives ___ to a boom in the construction of new buildings.
1) have lead 2) has led
3) have been lead
4) has been leading 5) had leads
14. The yellow jacket can sting ____ without dying and ___ potent venom that can cause intense pain.
1) repeatedly; carries
2) repetition; carried
3) repeat; carry 4) repeats; carrier
5) repeating; career
15. As envisioned by researchers, commercial farming ____ lobsters will enable fisheries to sell the shellfish year ____.
1) from; threw 2) of; round
3) off; through 4) with; around
5) among; always

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. The purpose was twofold: political control and religious communication. Experts believe that there were three types of human sacrifice practiced by the Shang.
B. Finally, in internment sacrifices, young girls were sacrificed. Unlike the first two, they were buried in the standard burial position and their bodies were kept intact.
C. In pit sacrifices, young men were sacrificed. Their bodies were dismembered and they were buried without their personal possessions. In foundation sacrifices, children and babies were used.
D. The practice of human sacrifice was very common in ancient China, particularly during the Shang Dynasty-the first Chinese dynasty with written records.
E. Archaeological evidences show that these human sacrifices experienced violent deaths, and they too were buried without possessions.
F. In fact, archaeological evidence suggests that human sacrifice was practiced on a grand scale during the Shang dynasty.

16. What is the FIRST sentence after rearrangement?
1) C 2) B 3) D 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) C
18. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIFTH sentence after rearrangement?
1) B 2) C 3) D 4) E 5) F
20. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. No. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Dwarf planet Ceres continues to ___ (21) scientists as NASA's Dawn spacecraft gets closer to being captured into orbit around the object. The ___ (22) images from Dawn, taken nearly 29,000 miles (46,000 kilometers) from Ceres, reveal that a bright spot that stands out in previous images ____ (23) close to yet another bright area. As scientists receive better and _____ (24) views of the dwarf planet over the next 16 months, they hope to gain a deeper understanding of its origin and evolution _____ (25) studying its surface. The intriguing bright spots and other _____ (26) features of this captivating world will come into ____ (27) focus. Dawn visited the giant asteroid Vesta _____ (28) 2011 to 2012, delivering more than 30,000 images of the body along with many other measurements, and providing insights about its composition and geological history. Vesta has an average diameter of 326 miles (525 kilometers), while Ceres has an average diameter of 590 miles (950 kilometers). Vesta and Ceres are the ___ (29) most massive bodies in the asteroid belt, located _____ (30) Mars and Jupiter.

21. 1) puzzle 2) question 3) answer 4) doubt 5) propose
22. 1) later 2) latest 3) recently 4) frequently 5) presently
23. 1) lay 2) lain 3) lies 4) lays 5) laid
24. 1) batter 2) good 3) best 4) better 5) bought
25. 1) for 2) from 3) with 4) among 5) by
26. 1) interesting 2) annoying 3) disturbing 4) distributing 5) presently
27. 1) sharer 2) sharper 3) shaver 4) sharp 5) severe
28. 1) with 2) by 3) from 4) for 5) above
29. 1) to 2) too 3) toe 4) two 5) type
30. 1) beyond 2) besides 3) in front of 4) in addition to 5) between

Directions (Q. No. 31-35): Choose the word which is wrongly spelt from the five options given.

31. 1) misanthrope 2) misogynism 3) misappropriation 4) mismatch 5) mistake
32. 1) commission 2) apportion 3) succesion 4) concession 5) profession
33. 1) adjudicte 2) judicious 3) combat 4) demur 5) elope
34. 1) flamboyant 2) genuine 3) hinderance 4) innocuous 5) germane
35. 1) kiosk 2) lacerate 3) mirege 4) nocturnal 5) opulent

Directions (Q. No. 36-37): From the five options given in each question a set of words are either synonyms or antonyms, choose that set as your option and mark your answer.

36. 1) promiscuous; preposterous
2) oblivious; unaware
3) procrastinate; prominent
4) ponder; pamper
5) None of these
37. 1) drunk; sober 2) freeze; full
3) transparent; triumph
4) wax; vague 5) wealth; defeat

Directions (Q. No. 38): Each sentence given below has four parts, certain words in each part are given in bold to identify the mistake, and the mistake can be in the spelling or in usage. Identify the mistake and mark your answer. Mark (5) as your answer, if there is 'No error'.

38. **Alright** the stunt man (1)/ **had broken** both his legs, (2)/ he refused to **abandon his** ambulatory manner, (3)/ even if it meant he **had to crawl.** (4)

Answers

1) 1; 2) 3; 3) 3; 4) 2; 5) 4; 6) 5; 7) 1; 8) 3; 9) 1; 10) 4; 11) 1; 12) 4; 13) 2; 14) 1; 15) 2; 16) 3; 17) 1; 18) 2; 19) 4; 20) 5; 21) 1; 22) 2; 23) 3; 24) 4; 25) 5; 26) 1; 27) 2; 28) 3; 29) 4; 30) 5; 31) 2; 32) 3; 33) 1; 34) 3; 35) 3; 36) 2; 37) 1; 38) 1